సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 362

శనివారం 23-3-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'



చెన్నై శుభారంభం

ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో బెంగళూరుపై 6 వికెట్లతో విజయం. -13లో



చిరుతలు..

దుండగులపై చిరుత పులుల్లా విరుచుకుపడ్డారు ఆ తల్లీ కూతుళ్లు. -11లో

ఫ్లాష్.. ఫ్లాష్

రష్యాలో భారీ ఉగ్రదాడి 40 మంది మృతి

మాస్కో: రష్యా రాజధానిలో శుక్రవారం రాత్రి ఉగ్రవాదులు విరుచుకుపడ్డారు. మాస్కోలోని క్రోకస్ సిటీ కాన్సర్ట్ హాల్లోకి చొచ్చుకుని వచ్చిన పలువురు సాయుధులు బాంబులు విసురుతూ, కాల్పులు జరుపుతూ బీభత్సం సృష్టించారు. ఈ ఘటనలో 40 మంది మృతిచెందగా, 100 మందికిపైగా గాయపడినట్లు రష్యా ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ వెల్లడించింది. ఈ భవనంలో ఇంకా 100 మందికిపైగానే చిక్కుకున్నట్లు సమాచారం. నలుగురు సాయుధులు అక్కడున్న వారిపై అతి సమీపం నుంచి కాల్పులు జరిపిన వీడియోలు బయటికొచ్చాయి. ఘటనా ప్రాంతంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగుతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ దాడి ఘటనపై దేశ అత్యున్నత ఇన్వెస్టిగేటివ్ సంస్థ విచారణ ప్రారంభించింది. అయితే, ఈ దాడికి పాల్పడింది ఎవరో ఇప్పటిదాకా బాధ్యత వహించలేదు. పుతిన్ దేశాధ్యక్షుడిగా తిరిగి ఎన్నికై సంబరాలు జరుపుకుంటున్న వేళ ఈ దాడి జరగడం గమనార్హం.

సాగు చేస్తేనే 'భరోసా'!

సీజన్ ముందు కాకుండా మధ్యలో లేదా చివరిలో 'రైతు భరోసా' కింద ఆర్థిక సాయం

రాష్ట్ర ప్రభుత్వ సూత్రప్రాయ నిర్ణయం.. మార్గదర్శకాలపై వ్యవసాయ శాఖ కసరత్తు

- రైతులు ఎన్ని ఎకరాల్లో పంటలు వేశారనే వివరాల సేకరణ
- శాటిలైట్ రిమోట్ సెన్సింగ్, ఇతర మార్గాల ద్వారా పక్కాగా లెక్క తేల్చే యోచన
- ఇందుకు అనుగుణంగానే 'రైతు భరోసా'సాయం విడుదల
- ఇది కూడా ఐదెకరాలలోపు రైతులకే అందించే యోచన
- ప్రస్తుతం రెండు సీజన్లకు కలిపి 3.04 కోట్లకుపైగా ఎకరాలకు పెట్టుబడి సాయం
- ఇందులో పంటలు సాగయ్యేది 2.09 కోట్ల ఎకరాల్లోనే అంటున్న వ్యవసాయశాఖ
- మిగతా 98 లక్షల ఎకరాలకు పెట్టుబడి సాయం అందనట్టే!
- యాసంగిలో సగానికిపైగా విస్తీర్ణానికి పథకం వర్తించనట్టే!



సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో పంట పెట్టుబడి సాయం రూపుమారుతోంది. రైతులు పంట వేసినట్టు నిర్ధారణ అయిన భూములకే 'రైతు భరోసా' కింద ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. పంటలు సాగైన భూములపై పక్కాగా లెక్క తీశాకే సాయం విడుదల చేయాలని భావిస్తోంది. అది కూడా పంటల సాగుకు ముందుగాకుండా.. సీజన్ మధ్యలో లేదా చివరిలో సాయం సొమ్మును విడుదల చేయాలని కూడా యోచిస్తున్నట్టు సమాచారం. సీజన్‌కు ముందే ఎందరు రైతులు ఎంతమేర భూముల్లో పంటలు వేశారో తెలియదని వ్యవసాయ అధికారులు చెప్తున్నారు. అందుకే సీజన్ మధ్యలో సర్వే చేసి ఎన్ని ఎకరాల్లో సాగుచేశారో నిర్ధారించి, సాయం అందించే అవకాశం ఉందని అంటున్నారు. ఈ మేరకు 'రైతు భరోసా'మార్గదర్శకాలపై మిగతా 5వ పేజీలో ▶

పక్కాగా సాగు లెక్కలు తీసి..

శాటిలైట్ రిమోట్ సెన్సింగ్, ఇతర పద్ధతుల ద్వారా పక్కాగా సాగు లెక్క తేల్చాలని అధికారులు నిర్ణయించారు. ఇందులోనూ ఐదెకరాల్లోపు భూములున్న రైతులకే ఆర్థిక సాయం అందనుంది. ఆదాయ పన్ను చెల్లించే ఉద్యోగులు, ఇతర వర్గాలవారికి రైతుభరోసా నిలిపివేయనున్నారు. ఐదెకరాల వరకే సాయం ఇవ్వాలన్న ఆలోచనా అమలు చేస్తే.. నిధుల వ్యయం మరింతగా తగ్గుతుంది. ఇప్పటివరకు 1.52 కోట్ల ఎకరాలకు ఆర్థిక సాయం ఇచ్చినట్టుగా.. కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఎకరాకు రూ.15 వేల చొప్పున అమలు చేయాలంటే ఏడాదికి రూ.22,800 కోట్లు కావాలి. అయితే సాగుచేయని భూమిని తొలగించడం, ఐదెకరాలకు పరిమితం చేయడం, ఆదాయ పన్ను చెల్లించేవారు, ధనికులు, ప్రజాప్రతినిధులు, సినీ నటులు, వ్యాపారవేత్తలకు రద్దు చేయడం వంటివి అమలు చేస్తే.. దాదాపు రూ.10వేల కోట్ల వరకు ఆదా చేయవచ్చని అధికార వర్గాలు చెప్తున్నాయి.

నాగర్‌కర్నూల్ నుంచి ప్రవీణ్‌కుమార్ మెదక్ నుంచి వెంకట్రామిరెడ్డి



మరో ఇద్దరికి బీఆర్‌ఎస్ గ్రీన్‌సిగ్నల్

ఇప్పటివరకు మొత్తం 13 మంది ఖరారు

పెండింగ్‌లో నల్లగొండ, భువనగిరి, సికింద్రాబాద్, హైదరాబాద్ స్థానాలు

మెదక్ లోక్‌సభ నియోజకవర్గ నేతలతో కేసీఆర్ భేటీ

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసే మరో ఇద్దరు అభ్యర్థుల పేర్లను బీఆర్‌ఎస్ శుక్రవారం ప్రకటించింది. మెదక్ నుంచి ఎమ్మెల్సీ పరిపాటి వెంకట్రామిరెడ్డికి, నాగర్‌కర్నూల్ నుంచి ఇటీవలే బీఎస్పీ నుంచి చేరిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు పార్టీ అధినేత కేసీఆర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీనితో మొత్తంగా బీఆర్‌ఎస్ 13 మంది అభ్యర్థులను ఖరారు చేసినట్టయింది. మరో 4 సీట్లు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి.

వంటేరు పేరు వినిపించినా..

మెదక్ లోక్‌సభ స్థానం నుంచి రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేరును బీఆర్‌ఎస్ నెల రోజుల క్రితమే ఖరారు చేసినా.. వివిధ కారణాలతో ప్రకటన జాప్యం జరుగుతూ వచ్చింది. అయితే 2 రోజుల క్రితం కేసీఆర్‌ను కలిసిన వంటేరు ప్రతాప్‌రెడ్డి మిగతా 2వ పేజీలో ▶

వలస నేతలకు టికెట్లపై కాంగ్రెస్‌లో లొల్లి..!



ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యమివ్వడంపై నేతల ఆగ్రహం

రంజిత్‌రెడ్డి, దానం, సునీతా మహేందర్ రెడ్డిలకు టికెట్లు ఇవ్వడంపై అభ్యంతరం

పునఃసమీక్షించాలంటూ పార్టీఅధ్యక్షుడు ఖర్గేకు టీపీసీసీ నేత నిరంజన్ లేఖ

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ టికెట్ల కేటాయింపు వ్యవహారం కాంగ్రెస్ పార్టీలో లొల్లి రేపుతోంది. ఇప్పటివరకు 9 స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తే.. అందులో ముగ్గురు ఇటీవల ఇతర పార్టీల నుంచి వచ్చినవారికే టికెట్లు ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. సికింద్రాబాద్ ఎంపీ టికెట్ దానం నాగేందర్‌కు (ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే), చేవెళ్ల టికెట్ గడ్డం రంజిత్‌రెడ్డి (బీఆర్‌ఎస్ ఎంపీ)కి, మల్కాజ్‌గిరి టికెట్ పట్నం సునీతా మహేందర్‌రెడ్డి (వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్)లకు ఇవ్వడంపై పార్టీలో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. దీనిని పునః సమీక్షించాలని పలువురు నేతలు అంతర్గతంగా కోరుతుండగా, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ నేరుగా ఏఐసీసీ అధ్యక్షుడికి లేఖ రాశారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు టికెట్లు ఇవ్వడం ప్రజాభిప్రాయానికి మిగతా 3వ పేజీలో ▶

ఆరుగురు ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు..

కాంగ్రెస్ నుంచి ఇద్దరు, బీఆర్‌ఎస్ నుంచి ముగ్గురు, ఒక సీపీఐ ఎమ్మెల్యేకు జారీ

వారి ఎన్నికను సవాల్ చేస్తూ.. మూడు బెంచ్‌ల వద్ద ఏడు పిటిషన్ల విచారణ

కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశం.. వచ్చే నెలలో వేర్వేరుగా విచారణ

- వివరాలు 2లో

ఇదండీ సంగతి



'మత్తు' చుట్టూ చుట్టాలే

సంధ్యా ఆక్వా ఎండీ కోటయ్య చౌదరి టీడీపీ పెద్దలకు సన్నిహితుడు

దామచర్ల, రాయపాటి, లావు కుటుంబాలతో అత్యంత సాన్నిహిత్యం

- బాలయ్య చిన్నల్లుడు భరత్ కుటుంబంతో బంధం
- పురందేశ్వరి కుటుంబంతో వ్యాపార, స్నేహ బంధం.. దామచర్ల సత్య.. నారా లోకేష్‌కు ముఖ్య అనుచరుడు
- పొత్తు భరోసాతోనే డ్రగ్స్ దందాకు బరితెగింపు.. సమగ్ర విచారణకు వైఎస్సార్‌సీపీ డిమాండ్

సాక్షి, అమరావతి: విశాఖలో బట్టబయలైన డ్రగ్స్ దందాలో వేళ్లన్నీ టీడీపీవైపే చూపుతున్నాయి. బ్రెజిల్ నుంచి విశాఖ పోర్టుకు భారీగా డ్రగ్స్‌ను దిగుమతి చేసిన సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ చైర్మన్ కూనం వీరభద్ర చౌదరి, ఎండీ కూనం కోటయ్య చౌదరి టీడీపీలో ప్రముఖులైన నారా, నంద మూరి, రాయపాటి, ఆలపాటి, దామచర్ల, లావు కుటుంబాలకు అత్యంత సన్నిహితులన్నది బహి ర్గతమైంది. డ్రగ్స్ మాఫియా బండారం బట్ట బయలు కావడంతో బెంబేలెత్తిన టీడీపీ అధ్య క్షుడు చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం, వైఎస్సార్ సీపీపై దుష్ప్రచారానికి దిగి విషయాన్ని పక్కదారి పట్టించాలని కుట్ర పన్నారు. ఈ అంకంలో భాగంగా ఒకపక్క సీబీఐ అధికారుల సోదాలు కొనసాగుతుండగానే గురువారం రాత్రే చంద్రబాబు, లోకేశ్ వరుస ట్వీట్లు చేస్తూ టీడీపీ శ్రేణులతోపాటు టీడీపీ అనుకూల మీడియాకు సంకేతాలు ఇచ్చారు. ఆ వెంటనే టీడీపీ అను కూల మీడియా అవాస్తవాలు, అభూత కల్పనలు జోడిస్తూ దుష్ప్రచారానికి మిగతా 10వ పేజీలో ▶

క్లుప్తంగా...

ఇద్దరు ఎమ్మెల్సీలపై అనర్హత వేటు వేయాలి

పట్నం, కూచుకుంట్లపై అనర్హతకు పిటిషన్



మండలి చైర్మన్ గుత్తాకు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: శాసనమండలిలో తమ పార్టీ తరఫున ఎన్నికై కాంగ్రెస్‌లో చేరిన ఇద్దరు ఎమ్మెల్సీలను అనర్హులుగా ప్రకటించాలని బీఆర్ఎస్ కోరింది. ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, కూచుకుంట్ల దామోదర్‌రెడ్డిలపై అనర్హత వేటు వేయాలని పిటిషన్ సమర్పించింది. ఈ మేరకు పార్టీ ఎమ్మెల్సీలు ఎంఎస్ ప్రభాకర్‌రావు, యాదవరెడ్డి, శేరి సుభాష్ రెడ్డితో పాటు బీఆర్ఎస్ కార్యాలయ కార్యదర్శి ఎం.రమేశ్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని శుక్రవారం సాయంత్రం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసింది. మండలి చైర్మన్‌కు పిటిషన్‌తో పాటు పలు ఆధారాలను కూడా సమర్పించింది.

బీఆర్ఎస్ నుంచి వెళ్లే నేతలను ప్రజలే చెప్పులతో కొడతారు

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచి ఇతర పార్టీల్లోకి వెళ్తున్న నేతలను ప్రజలే చెప్పులతో కొడతారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నాయకులు ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలోకి వెళ్లడం శోచనీయమన్నారు. అక్రమాలు చేసేందుకే కొందరు బీఆర్ఎస్ నేతలు అధికార పార్టీలోకి వెళ్తున్నారని ఆరోపించారు. వారి అక్రమాలను బీఆర్ఎస్ పార్టీయే బయట పెడుతుందన్నారు. మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎస్టీ సెల్ విభాగంనేత రూప్‌సింగ్‌తో కలిసి పల్లా రాజేశ్వర్‌రెడ్డి శుక్రవారం మీడియాతో మాట్లాడారు. అకాల వర్షాలు, వడగండ్ల మూలంగా రాష్ట్రంలో 2 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, ఉత్తర తెలంగాణలో పంట నష్టం తీవ్రత ఎక్కువగా ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి రైతులను పరామర్శించలేదని, పంట నష్టాన్ని అంచనా వేయలేదని విమర్శించారు. పంట నష్టపోయిన రైతులకు తాము డబ్బులు విడుదల చేస్తే ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపి రైతుల ఖాతాల్లో డబ్బులు పడకుండా కాంగ్రెస్ నేతలు అడ్డుకున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వరి ధాన్యం కొనుగోలుకు రూ.500 బోనస్, రూ. 2 లక్షల రుణమాఫీ, సాగునీరు, తాగునీరు తదితరాలు ఇవ్వాలని పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు.


తెలంగాణ లేబర్ పార్టీ కాంగ్రెస్‌లో విలీనం

పార్టీ కండువా కప్పుకున్న అధ్యక్షుడు రమేశ్, పార్టీ కార్యకర్తలు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో తెలంగాణ లేబర్ పార్టీ విలీనమైంది. లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్‌తోపాటు ఇతర కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు శుక్రవారం కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ వీరిని గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ...సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీల సూచన మేరకు లేబర్ పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేసుకుంటున్నామని చెప్పారు. పార్టీలో వీరికి తగిన ప్రాధాన్యత, గౌరవం ఇస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడు తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితు లై లేబర్ పార్టీని విలీనం చేశారని అన్నారు.

ఒక్క ఎంపీ సీటూ ఇవ్వరా?

కాంగ్రెస్‌కు సీపీఐ నారాయణ ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: ఇతర పార్టీల నుంచి వస్తున్న నేతలకు సులభంగా సీట్లు కేటాయిస్తున్న కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమిలో ఉన్న సీపీఐకి మాత్రం ఒక ఎంపీ సీటు ఇవ్వడానికి ముందుకు రాకపోవడంపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అసహనం వ్యక్తం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పనిచేశామని ఆయన గుర్తు చేశారు. కాగా, బీజేపీని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ సీపీఐ, సీపీఎంలను కలుపుకొనిపోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సూచించారు. బీజేపీని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ సమర్థవంతమైన పాత్ర పోషించడం లేదని విమర్శించారు. తెలంగాణలో సీపీఐ, సీపీఎంలకు లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటుకు కూడా సర్దుబాటు జరగలేదని, తమిళనాడు రాష్ట్రాన్ని చూసైనా నేర్చుకోవాలని ఆయన రాష్ట్ర కాంగ్రెస్‌కు హితవు పలికారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయిందని, ఆ పార్టీ బతకబోదని కూనంనేని వ్యాఖ్యానించారు.

మూడంచెల 'సమన్వయం'

లోక్‌సభ ఎన్నికలపై అధికార కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి

- 14 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ప్రణాళిక.. పార్లమెంట్, అసెంబ్లీ, పోలింగ్ బూత్‌స్థాయిలో కమిటీలు
- బూత్ కమిటీల్లో కీలకంగా పనిచేసే వారికే ఇందిరమ్మ కమిటీల్లో ప్రాధాన్యం
- అందుబాటులో ఉన్న నేతలతో సమావేశమైన సీఎం రేవంత్



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో 14 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ వ్యూహాలు రచిస్తోంది. దీనికోసం మూడంచెల్లో సమన్వయం చేసుకునే విధంగా ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయనుంది. లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల వారీగా, పోలింగ్ బూత్‌స్థాయిలో ఈ కమిటీలను నియమించి, సమన్వయంతో ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం అందుబాటులో ఉన్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమై దిశానిర్దేశం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ముఖ్య నాయకులందరూ కలిసికట్టుగా పనిచేయాలని, బాధ్యతలు పంచుకోవడంతో పాటు కార్యకర్తలకు వెన్నంటి నిలవాలని సూచించారు. గత ఎన్నికల్లో విజయతీరాన్ని చేర్చిన మల్కాజిగిరి మోడల్‌ను రాష్ట్రమంతటా అనుసరించాలని నిర్దేశించారు.

ఒకట్రెండు రోజుల్లో కమిటీలు

లోక్‌సభ ఎన్నికల్లో మూడు స్థాయిల్లో నియమించనున్న కమిటీలను ఒకట్రెండు రోజుల్లో పూర్తి చేయనున్నట్టు గాంధీభవన్ వర్గాలు వెల్లడించారు. ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో ఏఐసీసీ పరిశీలకులతో పాటు ఆ నియోజకవర్గంలోని ముఖ్యనేతలు సభ్యులుగా ఉంటారు. ఆ సెగ్మెంట్ పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో ఎమ్మెల్యే, లేదంటే నియోజకవర్గ ఇన్‌చార్జ్, మండలాల వారీగా ముఖ్యనేతలు ఉంటారు. ఇక, పోలింగ్‌బూత్ స్థాయిలో నియమించే కమిటీల్లో ప్రతి బూత్ నుంచి ఐదుగురు చురుకైన కార్యకర్తలకు అవకాశం కల్పిస్తారు. ఈ కమిటీ సభ్యులకే ఓట్లు వేయించే బాధ్యత కూడా అప్పగిస్తారు. ప్రతి బూత్‌లో వచ్చే ఓట్లను బూత్ కమిటీ సభ్యుల పనితీరుకు ప్రాతిపదికగా తీసుకొని త్వరలో నియమించే ఇందిరమ్మ కమిటీల్లో వారికి ప్రాధాన్యం ఇస్తారు. గ్రామస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక పర్యవేక్షణ బాధ్యతలను ఈ ఇందిరమ్మ కమిటీలకే అప్పగిస్తారు. ఈ నేపథ్యంలో పోలింగ్ బూత్‌స్థాయిలో నియమించే ఐదుగురు సభ్యుల పనితీరు కీలకం కానుంది.

సన్నాహక సమావేశాలు

లోక్‌సభ ఎన్నికలకు సన్నాహక సమావేశాలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ సమావేశాలు వచ్చే వారంలో ప్రారంభమవుతాయి. ఈ సమావేశాల్లో ఆయా పార్లమెంట్ నియోజక వర్గాలకు ఇన్‌చార్జ్‌లుగా ఉన్న మంత్రులతోపాటు అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, నామినేటెడ్ పదవులు పొందిన నాయకులు, జిల్లా పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు, పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లు పాల్గొంటారు. ఈ సమావేశాల్లోనే పార్లమెంట్ స్థాయిలో అనుసరించాల్సిన ఎన్నికల వ్యూహం నిర్ణయిస్తారు.

నాగర్‌కర్నూల్ నుంచి ప్రవీణ్‌కుమార్..

▶ మొదటి పేజీ తరువాయి

తనకు పోటీచేసే ఉద్దేశం లేదని చెప్పినట్టు సమాచారం. దీంతో ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న వెంకట్రామిరెడ్డి పేరు తెరపైకి వచ్చింది. గతంలో ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో జాయింట్ కలెక్టర్‌గా, సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల కలెక్టర్‌గా వెంకట్రామిరెడ్డి పనిచేశారు. బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి మెదక్ లోక్‌సభ నియోజకవర్గం పార్టీకి కంచుకోటగా ఉంది. 2014లో పార్టీ అధినేత కేసీఆర్ మెదక్ ఎంపీగా గెలిచినా రాష్ట్రంలో బీఆర్ఎస్ విజయం సాధించడంతో రాజీనామా చేసి సీఎం పదవి చేపట్టారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో మెదక్‌లో గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కేసీఆర్.. ఆర్థిక బలం కలిగిన వెంకట్రామిరెడ్డి వైపు మొగ్గుచూపినట్టు సమాచారం.

పెండింగ్‌లో మరో నాలుగు సీట్లు

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి 11 సీట్లలో అభ్యర్థులను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇంతకు ముందే ప్రకటించారు. తాజాగా ప్రకటించిన ఇద్దరితో కలసి బీఆర్ఎస్ అభ్యర్థులను ఖరారు చేసిన స్థానాల సంఖ్య 13కు చేరింది. రాష్ట్రంలోని మొత్తం 17 లోక్‌సభ సీట్లకుగాను ఇంకా నాలుగు సీట్లు హైదరాబాద్, సికింద్రాబాద్, భువనగిరి, నల్లగొండ స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉంది. సికింద్రాబాద్ నుంచి ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ పేరు ఖరారైనట్టు ప్రచారం జరుగుతోంది. మిగతా స్థానాలకు కసరత్తు కొనసాగుతోందని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. పెండింగ్ సీట్లకు రెండు మూడు రోజుల్లో అభ్యర్థులను ఖరారు చేసే అవకాశం ఉందని తెలిపాయి.

బీఆర్ఎస్‌లోనే కొనసాగుతా: వంటేరు

మెదక్ లోక్‌సభ అభ్యర్థిగా వెంకట్రామిరెడ్డి పేరును కేసీఆర్ ఖరారు చేసిన నేపథ్యంలో.. గజ్వేల్ నియోజకవర్గ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడతారనే ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తల్లో ఏ మాత్రం నిజం లేదని, బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం పనిచేస్తానని వంటేరు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గతంలో టీడీపీ, కాంగ్రెస్ పార్టీలలో పనిచేసిన ప్రతాప్‌రెడ్డి.. ఆ సమయంలో రేవంత్‌రెడ్డి, మైనంపల్లి హన్మంతరావులతో సన్నిహితంగా ఉండేవారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై 2014లో టీడీపీ తరఫున, 2018లో కాంగ్రెస్ తరఫున వంటేరు ప్రతాప్‌రెడ్డి పోటీ చేశారు. తర్వాత బీఆర్ఎస్‌లో చేరి అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు.

30 వరకు నియోజకవర్గ స్థాయి సమావేశాలు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుక్రవారం మెదక్ లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన పార్టీ శ్రేణులతో ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో భేటీ అయ్యారు. పార్టీ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్‌రెడ్డి, మదన్‌రెడ్డి, ముఖ్య నేతలు వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, భూంరెడ్డి, వేలేటి రాధకృష్ణశర్మ తదితరులు దీనికి హాజరయ్యారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తిరుమలకు వెళ్లడంతో భేటీకి రాలేదు. ఈ సందర్భంగా ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు మెదక్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించాలని నేతలను కేసీఆర్ ఆదేశించారు. ఆలోగా అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలోని మండలాల వారీగా కార్యకర్తల సమావేశాలను పూర్తి చేయాలని పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులకు సూచించారు. మెదక్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో రెండు లేదా మూడు ఎన్నికల ప్రచార సభలు నిర్వహించేందుకు షెడ్యూల్ తయారు చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావుకు సూచించారు.

సత్సంబంధాలున్నాయి: వెంకట్రామిరెడ్డి

మర్కూక్ (గజ్వేల్): తనను మెదక్ అభ్యర్థిగా ప్రకటించడం పట్ల కేసీఆర్, హరీశ్‌రావులకు వెంకట్రామిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఐఏఎస్ అధికారిగా ఏడున్నరేళ్లు ఈ జిల్లాలో పనిచేశానని, తనకు ప్రజలతో సత్సంబంధాలు ఉన్నాయని చెప్పారు. కేసీఆర్ దీనిని గుర్తించి తనకు అవకాశం ఇవ్వడం గర్వంగా ఉందన్నారు.

కేజ్రీవాల్ అరెస్టు ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజు

● మాజీ సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు దేశ ప్రజాస్వామిక చరిత్రలో మరో చీకటి రోజు అని బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ అరెస్టును ఖండిస్తూ శుక్రవారం కేసీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. 'ప్రతిపక్షాన్ని నామరూపాలు లేకుండా చేయాలనే ఏకైక సంకల్పంతో కేంద్రంలోని అధికార బీజేపీ వ్యవహరిస్తోంది. ఇటీవలి కాలంలో జరిగిన జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్టు ఘటనలు దీన్ని రుజువు చేస్తున్నాయి. ప్రతిపక్ష నేతల అరెస్టు కోసం ఈడీ, సీబీఐ, ఐటీ తదితర కేంద్ర దర్యాప్తు సంస్థలను కేంద్ర ప్రభుత్వం పావులుగా వాడుకుంటోంది. ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులా పరిణమిస్తున్న బీజేపీ ప్రభుత్వ చర్యలను బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోంది. కేజ్రీవాల్ అరెస్టు రాజకీయ ప్రేరేపితమైంది. అక్రమ కేసులను వెనక్కి తీసుకొని, అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రజలకు ఎలా చేరువయ్యామో చెప్పండి

టీపీసీసీ ప్రచార కమిటీ ● మధుయాష్కీ అధ్యక్షతన భేటీ



సాక్షి, హైదరాబాద్: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుతో ఎలా చేరువయ్యామో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ప్రజలకు చెప్పాలని టీపీసీసీ ప్రచార కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అధ్యక్షతన శుక్రవారం గాంధీభవన్‌లో జరిగిన భేటీలో నిర్ణయించింది. ఈ సమావేశానికి ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి కూడా హాజరయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన ప్రచార వ్యూహంపై సమావేశంలో చర్చించిన నేతలు.. కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని ఓట్ల రూపంలోకి మార్చుకోవాలని, మెజార్టీ సీట్లలో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా రోహిత్‌చౌదరి మాట్లాడుతూ ప్రచార కమిటీ పనితీరుపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పై ప్రజల్లో మంచి విశ్వాసం ఉందని, సీఎం రేవంత్‌తో పాటు మంత్రుల పనితీరుతో ఈ విశ్వాసం పెరిగిందని తెలిపారు. తెలంగాణతో పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రజలకిచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ఓట్ల రూపంలోకి మార్చుకోవాలని సూచించారు. మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో ప్రచార కమిటీ పాత్ర కీలకమైందని చెప్పారు. వంద రోజుల ప్రజాపాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రచార కార్యక్రమాలు రూపొందించాలని కమిటీ సభ్యులకు సూచించారు. సమావేశంలో వార్‌రూం చైర్మన్ పవన్ మల్లాది, సోషల్‌మీడియా ఇన్‌చార్జి మన్నె సతీశ్, గాంధీభవన్ సీపీఆర్వో కప్పర హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగలను రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నారు

- మంద కృష్ణ బీజేపీ ముసుగులో మాట్లాడారు
- ఏఐసీసీ కార్యదర్శి సంపత్



సాక్షి, హైదరాబాద్: ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మాదిగలకు రిజర్వేషన్ల విషయంలో కుట్ర జరుగుతోందని, రాజ్యాంగ బద్ధమైన మాదిగల హక్కులను రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నారని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎస్.సంపత్‌కుమార్ అన్నారు. మాదిగల వర్గీకరణ విషయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే ముందడుగు పడిందని, ఈ విషయాన్ని మందకృష్ణ మాదిగనే చెప్పారని గుర్తు చేశారు. రాష్ట్రంలోని బీఆర్ఎస్, కేంద్రంలోని బీజేపీలు పదేళ్ల పాటు తెలంగాణ మాదిగలకు అన్యాయం చేశాయని, అప్పుడు తనతో పాటు ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి మాదిగల పక్షాన గొంతు వినిపించామని పేర్కొన్నా రు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చారగొండ వెంకటేశ్, అధికార ప్రతినిధి జ్ఞానసుందర్‌లతో కలసి మీడి యాతో మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణ కోసం వేసిన అన్ని కమిషన్లు కాంగ్రెస్ హయాంలోనివేనని చెప్పారు. కానీ, మంద కృష్ణ మాదిగ మాత్రం ద్రోహులతో కలసి మాదిగ సామాజిక వర్గానికి అన్యాయం చేస్తున్నారని, ఆయన బీజేపీ ముసుగులో ఉండి మాట్లాడుతున్నారని ఆరోపించారు. మాదిగల ప్రయోజనాలను మోదీ కాళ్లముందు తాకట్టు పెట్టారని విమర్శించారు. బీజేపీ అగ్రకుల పార్టీ అయితే కాంగ్రెస్ బడుగు, బలహీన వర్గాల పార్టీల అని సంపత్ అన్నారు.

నాకు టికెట్ ఇవ్వకపోయినా బాధ లేదు

నాగర్‌కర్నూల్ పార్లమెంటు స్థానం నుంచి తనకు పోటీ చేసే అవకాశం ఇవ్వకపోయినా బాధ లేదని సంపత్ చెప్పారు. తనకు కాంగ్రెస్ పార్టీయే గాడ్‌ఫాదర్ అని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా సామాజిక స్పృహతో పనిచేస్తున్నారని అన్నారు. కానీ, మాదిగ జాతికి అన్యాయం జరిగితే జాతి ప్రయోజనాల కోసం ఎప్పుడైనా అధిష్టానానికి లేఖ రాస్తానని ఆయన స్పష్టం చేశారు.

జీహెచ్ఎంసీ మేయర్‌కు కాంగ్రెస్ ఆహ్వానం

- కార్యకర్తలతో చర్చించాకే నిర్ణయం చెబుతా: గద్వాల విజయలక్ష్మి
- కె.కేశవరావు ఇంట్లో కలిసిన కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ



కేశవరావు ఇంటికి వెళ్తున్న దీపాదాస్ మున్షీ

బంజారాహిల్స్ (హైదరాబాద్): 'రెండుసార్లు కార్పొరేటర్‌గా బంజారాహిల్స్ డివిజన్ ప్రజలు గెలిపించారు. దీపాదాస్ మున్షీ మా ఇంటికి వచ్చి కాంగ్రెస్ పార్టీలోకి రావాల్సిందిగా ఆహ్వానించారు. మా డివిజన్ ప్రజలు, కార్యకర్తలు, కార్పొరేటర్లతో చర్చించిన తర్వాతనే నా నిర్ణయం ప్రకటిస్తాను' అని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డిలు బంజారాహిల్స్‌లోని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ కేశవరావు ఇంటికి వెళ్లారు. అక్కడే జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, కేశవరావులతో గంటపాటు చర్చించారు. కాంగ్రెస్‌లోకి రావాల్సిందిగా, పార్టీని బలోపేతం చేయాల్సిందిగా దీపాదాస్ వారిని ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో విజయలక్ష్మి రాజకీయ భవిష్యత్‌పై భరోసా ఇచ్చినట్టు సమాచారం.

నేడు మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు

వామపక్ష పార్టీల ప్రకటన..
కేజ్రీవాల్ అరెస్ట్‌కు ఖండన



సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీలపై బీజేపీ ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తూ, ప్రజా స్వామ్య హక్కులను కాల రాస్తోందని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.బాలమల్లేశ్, ఎస్.వీరయ్య మండిప డ్డారు. వామపక్ష పార్టీల సమావేశం శుక్రవారం ఎంబీ భవన్‌లో జరిగింది. కేంద్రంలోని మోదీ ప్రభుత్వ నిరంకుశ ధోరణులను సమావేశం తీవ్రంగా ఖండించింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించింది. అందులో భాగంగా శనివారం ఉద యం 11 గంటలకు హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో నిరసన కార్యక్రమం ఉంటుందని తెలిపా రు. స్వచ్ఛందంగా పనిచేసే ఈడీ, ఐటీ, సీబీఐలను తమ జేబు సంస్థలుగా కేంద్రం వాడుకుంటోందని మండిపడ్డారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో చట్ట ఉల్లంఘనలు జరుగుతున్నా పట్టించుకోకుండా, బీజేపీయేతర రాష్ట్రాల్లో మాత్రం కక్షపూరితంగా వ్యవహరిస్తూ ప్రతిపక్ష పార్టీల నా యకులను భయభ్రాంతులకు గురిచేస్తోందని విరుచుకు పడ్డారు. అందులో భాగంగానే ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌తోపా టు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితలను అరెస్టు చేసిందన్నారు. మరోవైపు ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ అకౌంట్లను సీజ్ చేసి ఎన్నికల్లో దెబ్బతీయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర నాయకులు డీజీ నరసింహారావు, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు రమ, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు గోవర్ధన్, ఎంసీపీఐ(యు) నాయకులు వనం సుధాకర్, ఎస్ యూసీఐ(యు) నాయకులు తేజ, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు కోటేశ్వరరావు, సీపీఐ (ఎంఎల్) నాయకులు ప్రసాద్ పాల్గొన్నారు.

లిక్కర్ పాలసీ కేసులో కాంగ్రెస్, రేవంత్ చెరోదారి

మాజీ మంత్రి హరీశ్‌రావు

- సీఎం రేవంత్ బీజేపీకి బీ టీమ్ లీడర్‌గా వ్యవహరిస్తున్నారని ధ్వజం



సాక్షి, హైదరాబాద్: మద్యం పాలసీ కేసులో ఈడీ, సీబీఐ వ్యవహరిస్తున్న తీరుపై కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ వైఖరికి పూర్తి వ్యతిరేకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. రేవంత్ కాంగ్రెస్ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నట్లు ఏ కోశానా కనిపించడం లేదని, బీజేపీకి బీ టీమ్ లీడర్‌గా ఆయన వైఖరి కనిపిస్తోందని అన్నారు. ఖర్గే, రాహుల్ నాయకత్వంలో రేవంత్ పనిచేయడం లేదని, కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా బీజేపీకి, మోదీకి అనుకూలంగా పనిచేస్తున్నారని మరోసారి స్పష్టమైందని పేర్కొన్నారు. 'మద్యం పాలసీ కేసు విషయంలో ఇన్నాళ్లుగా మేము చెపుతున్న విషయాలనే తాజాగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ముఖ్య నేత రాహుల్ గాంధీ చెప్తున్నారు. మోదీ ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలను తమకు అనుకూలంగా మార్చుకుంటోంది. వాటిని అడ్డుపెట్టుకుని లిక్కర్ స్కామ్ పేరుతో రాజకీయ వేధింపులకు పాల్పడుతోందని మేము చెప్తూ వస్తున్నాం. ఇన్నాళ్లుగా మే ము చేస్తున్న వాదనను ఏఐసీసీ కూడా బలపరిచింది. లిక్కర్ స్కామ్ పూర్తిగా కల్పితమని, కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను ఉపయోగించి రాజకీయ ప్రత్యర్థులపై తప్పుడు కేసులు పెడుతూ అక్రమ అరెస్టులు చేస్తోందని స్వయంగా ఖర్గే, రాహుల్ గాంధీ ఆరోపించారు. కానీ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మాత్రం ఏఐసీసీ వైఖరికి విరుద్ధంగా మాట్లాడుతున్నారు' అని హరీశ్ అన్నారు. 'రేవంత్ రెడ్డి కాంగ్రెస్ మనిషి కాదని, ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్న మోదీ మనిషి అని మేము ముందు నుంచీ చెప్తున్నాం. రేవంత్ చేస్తున్న వ్యాఖ్యలు ప్రస్తుతం మా విమర్శలను నిజమని రుజువు చేస్తున్నాయి. కాంగ్రెస్‌లో ఉన్నాననే విషయం కూడా మరచిపోయి బీఆర్ఎస్‌ను రాజకీయంగా ఇబ్బంది పెట్టేందుకు రేవంత్‌రెడ్డి బీజేపీ తరఫున వకాల్తా పుచ్చుకున్నారు' అని హరీశ్‌రావు విమర్శించారు.

'పార్లమెంట్'కు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలి

ఎన్నికల కమిటీలకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దిశానిర్దేశం



సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావడంలో భాగంగా.. పార్టీప రంగా ఏర్పాటు చేసిన కమిటీలన్నీ ఇప్పటినుంచే క్రియాశీలకంగా పనిచేయ డం మొదలుపెట్టాలని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి సూచించారు. ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన మేని ఫెస్టో, చార్జిషీటు, మీడియా, లీగల్, ప్రింటింగ్, టూర్స్ తదితర కమిటీలు తమ తమ పరిధుల్లో చురుకుగా వ్యవహరించాలని చెప్పారు. 17 ఎంపీ సీట్ల పరిధిలో ఎక్కడికక్కడ రోజు వారీ కార్యక్రమాల పర్యవేక్షణతో పాటు, స్థానిక సమస్యలు.. ఇతరత్రా అంశాలపై అప్రమత్తంగా వ్యవహరించాలని కమి టీల సభ్యులను కోరారు. ప్రతీ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఒక ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన 'ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ' భేటీ సందర్భంగా ఆయా కమిటీలకు సంబంధించిన వివిధ విషయాలపై చర్చించారు.

బీజేపీ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు

మాట వినని వారిని లొంగదీసుకునేందుకు సీబీఐ, ఈడీ, ఐటీ దాడులు

- ఎన్డీఏ పదేళ్ల పాలనలో దేశవ్యాప్తంగా 2,954 దాడులు
- ఢిల్లీలో బీఆర్ఎస్ ఎంపీలు నామా, సురేశ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వద్దిరాజు



మీడియా సమావేశంలో ఎంపీలు వద్దిరాజు, సురేశ్‌రెడ్డి, నామా, శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఎక్కడ ఎన్నికలు ఉంటే అక్కడ ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలతో దాడులు చేయిస్తూ ఎన్డీఏ ప్రభుత్వం ప్రాంతీయ పార్టీలను, నేతల్ని లొంగదీసుకునే రాజకీయాలు చేస్తోందని బీఆర్ఎస్ ఎంపీలు ఆరోపించారు. దేశంలో జరుగుతున్న దాడులను ప్రజలంతా గమనిస్తున్నారని, త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. గత యూపీఏ హయాంలో కంటే ఎక్కువ దాడులు ప్రస్తుత ఎన్డీఏ హయాంలో జరిగాయని ఎంపీలు నామా నాగేశ్వరరావు, కేఆర్ సురేశ్‌రెడ్డి, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్రలు చెప్పారు. ఢిల్లీ ప్రభుత్వం తీసుకున్న పాలసీలో అవినీతి జరిగిందని, ఆధారాల్లేకుండా ఎమ్మెల్సీ కవితను రాత్రికి రాత్రి అరెస్టు చేయడం అప్రజాస్వామికమని నామా నాగేశ్వరరావు అన్నారు. ప్రాంతీయ పార్టీలను బలహీనపరిచేందుకే కవిత అరెస్టు చేశారని ఆరోపించారు. ఢిల్లీ ప్రభుత్వం తెచ్చిన లిక్కర్ పాలసీ లాంటి ఎన్నో పాలసీలను కేంద్ర ప్రభుత్వం సైతం ప్రవేశపెట్టిందన్నారు.

ఎన్డీఏ హయాంలో 2,954 దాడులు

టీవీ సీరియల్ మాదిరిగా సాగదీసిన కేసులో ఎన్నికలు వచ్చేసరికి ఈడీ హుటాహుటిన కవితను అరెస్టు చేయడం ఎంత అక్రమమో తెలుస్తోందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. యూపీఏ పదేళ్ల కాలంలో ఈడీ 200 కేసులు నమోదు చేస్తే.. ఎన్డీఏ పాలనలో 2,954 కేసులు బనాయించిందని ఆరోపించారు. ఇలా సీబీఐ, ఈడీ, ఐటీ సంస్థలతో దాడులు చేయిస్తూ నేతలను బెదిరింపులకు గురిచేస్తూ లొంగదీసుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. లిక్కర్ కేసులో కవిత బాధితురాలే తప్ప.. బాధ్యురాలు, నిందితురాలు కాదన్నారు. ఏ రాష్ట్రంలో ఎన్నికలు ఉంటే ఆ రాష్ట్రంలో దాడులు చేయించడం బీజేపీకి పరిపాటిగా మారిందని ఎంపీ సురేశ్ రెడ్డి అన్నారు. కవితకు డబ్బు ముట్టినట్లుగా గానీ, ఆమె ఇచ్చినట్లుగా గానీ ఎక్కడా ఆధారాలు లేవని పేర్కొన్నారు. ఓ పక్క శక్తి అంటూ మాట్లాడుతున్న ప్రధాని మోదీ మహిళలపై దాడులు చేయించడం ఎంతవరకు సమంజసమంటూ ప్రశ్నించారు. మోదీ తెలంగాణ, ఢిల్లీపై దాడి చేయిస్తూ ఇటు కవితను, అటు కేజ్రీవాల్‌ను దొంగల్లా అరెస్టు చేయించారని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. న్యాయస్థానాలపై తమకు నమ్మకం ఉందని ఈ వ్యవహారంపై ఎందాకైనా పోరాడతామన్నారు. కవిత కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ఎంపీలు ధీమా వ్యక్తం చేశారు.

ఆరుగురు ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు..

- కాంగ్రెస్ నుంచి ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి ముగ్గురు, ఒక సీపీఐ ఎమ్మెల్యేకు జారీ
- వారి ఎన్నికను సవాల్ చేస్తూ.. మూడు బెంచ్‌ల వద్ద ఏడు పిటిషన్ల విచారణ
- కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశం.. వచ్చే నెలలో వేర్వేరుగా విచారణ

సాక్షి, హైదరాబాద్: శాసనసభ్యులుగా ఎన్నిక చెల్లదంటూ దాఖలైన పలు పిటిషన్లకు సంబంధించి కాంగ్రెస్ నుంచి గెలిచిన ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి గెలిచిన ముగ్గురు, ఒక సీపీఐ ఎమ్మెల్యేకు హైకోర్టు శుక్రవారం వేర్వేరుగా నోటీసులు జారీ చేసింది. వారంతా వచ్చే నెలలోగా స్పందించి కౌంటర్ దాఖలు చేయాలని పేర్కొంది. తదుపరి విచారణను వచ్చేనెల 16, 18, 19 తేదీలకు వాయిదా వేసింది.

అఫిడవిట్లలో తప్పుడు సమాచారం ఇచ్చారంటూ..

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్ (బీఆర్ఎస్), జూబ్లీహిల్స్ నుంచి మాగంటి గోపీనాథ్ (బీఆర్ఎస్), ఆసిఫాబాద్ నుంచి కోవ లక్ష్మి (బీఆర్ఎస్), మహబూబ్‌నగర్ నుంచి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి (కాంగ్రెస్), దేవరకద్ర నుంచి జి.మధుసూదన్‌రెడ్డి (కాంగ్రెస్), కొత్తగూడెం నుంచి కూనంనేని సాంబశివరావు (సీపీఐ) విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో ఓడిన ప్ర త్యర్థులు కొందరు వీరి ఎన్నికను సవాల్ చేస్తూ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వారు ఎన్నికల అఫిడవిట్లలో తప్పుడు సమాచారం ఇచ్చారని వాటిలో పేర్కొన్నారు. ఆ ఎమ్మెల్యేల ఎన్నికను కొట్టివేయాలని కోరారు. ఈ పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ సూరేపల్లి నందా తదితరులతో కూడిన వేర్వేరు ధర్మాసనాలు శుక్రవారం విచారణ చేపట్టాయి. ప్రతివాదులకు నోటీసులు జారీచేశాయి.

ఎవరెవరిపై పిటిషన్లు..?: మహబూబ్‌నగర్ నుంచి కాంగ్రెస్ తరఫున గెలిచిన యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికను సవాల్ చేస్తూ బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిటిషన్ వేశారు. జూబ్లీహిల్స్ నుంచి బీఆర్ఎస్ నేత మాగంటి గోపీనాథ్ ఎన్నిక చెల్లదంటూ కాంగ్రెస్ అభ్యర్థి అజారుద్దీన్, నవీన్ యాదవ్ కొత్తగూడెం నుంచి సీపీఐ నేత కూనంనేని సాంబశివరావు ఎన్నికను సవాల్ చేస్తూ కొత్తగూడెం పట్టణానికి చెందిన నందూలాల్ అగర్వాల్, ఆసిఫాబాద్ నుంచి బీఆర్ఎస్ నేత కోవ లక్ష్మి ఎన్నికను రద్దు చేయాలంటూ కాంగ్రెస్ అభ్యర్థి అజ్మీరా శ్యామ్, ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ తరఫున గెలిచిన దానం నాగేందర్ (ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్నారు) ఎన్నికను సవాల్ చేస్తూ కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డి, దేవరకద్ర నుంచి కాంగ్రెస్ తరఫున విజయం సాధించిన జి.మధుసూదన్‌రెడ్డి ఎన్నిక రద్దు కోరుతూ బీఆర్ఎస్ అభ్యర్థి ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పిటిషన్లు దాఖలు చేశారు.

భారీగా పెరిగిన టెట్ ఫీజు

- ఒక్కో పేపర్‌కు రూ.1,000.. గతంలో అయితే రూ.300
- సర్వీస్ టీచర్లకూ టెట్ అవకాశం
- జూన్ 12న ఫలితాలు
- టెట్ సమగ్ర నోటిఫికేషన్ విడుదల చేసిన విద్యాశాఖ



సాక్షి, హైదరాబాద్: ఈసారి టెట్ ఫీజు భారీగా పెరిగింది. 2023లో అయితే టెట్‌కు ఎన్ని పేపర్లు రాసినా రూ.300 ఫీజు మాత్రమే ఉండేది. ఇప్పుడు ఏకంగా ఈ ఫీజును ఒక్కో పేపరుకు రూ.వెయ్యి, రెండు పేపర్లు రాస్తే రూ.2 వేలకు పెంచారు. విద్యాశాఖ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) సమగ్ర నోటిఫికేషన్ శుక్రవారం రాత్రి విడుదల చేసింది. పరీక్షకు కావాల్సిన అర్హతలు, పరీక్ష విధానం ఇందులో పేర్కొంది.

ఫీజుల పెంపుపై అసంతృప్తి

అధిక ఫీజులు లేకుండా పోటీ పరీక్షలు నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొని, ఇప్పుడిలా పెద్ద మొత్తంలో ఫీజులు పెంచిందని టెట్‌కు హాజరయ్యేవారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులు కూడా ఈ టెట్‌కు హాజరయ్యే వెసులుబాటు కల్పిస్తున్నట్టు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. టెట్ అర్హత మార్కులు సాధారణ అభ్యర్థులకు 50, రిజర్వేషన్ కేటగిరీలకు 45గా నిర్ణయించారు.

15 రోజులు..

టెట్ మే 20 నుంచి జూన్ 3వ తేదీ వరకూ కంప్యూటర్ బేస్డ్ పద్ధతిలో నిర్వహిస్తున్నట్టు విద్యాశాఖ పేర్కొంది. ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 10 వరకూ ఆన్‌లైన్ విధానంలో ఫీజు చెల్లించి, దరఖాస్తు చేసుకోవచ్చు. బీఈడ్, డీఎడ్ ఉత్తీర్ణులు ఈ పరీక్షకు అర్హులు. మే 15వ తేదీన హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పరీక్ష సమయం ఉదయం 9 నుంచి 11.30 వరకూ, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 4.30 వరకూ ఉంటుంది. టెట్ ఫలితాలు జూన్ 12వ తేదీన విడుదల చేయనున్నట్టు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

దక్షిణాదికి మరిన్ని ఇంజనీరింగ్ సీట్లు!

- అఖిల భారత సాంకేతిక విద్యామండలి నిర్ణయం... ఇదే జరిగితే తెలంగాణకు ఈ ఏడాది మరో 10 వేల సీట్లు
- ఉత్తరాది రాష్ట్రాల్లో బీటెక్‌పై అయిష్టత
- కొత్త సీట్లకు కాలేజీల దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది దక్షిణాది రాష్ట్రాలకు ఇంజనీరింగ్ సీట్లు పెరగనున్నాయి. అఖిలభారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ఈ మేరకు వెసులుబాటు కల్పిస్తోంది. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఏపీ నుంచి వస్తున్న డిమాండ్‌ను ఏఐసీటీఈ పరిగణనలోకి తీసుకున్నట్టు అధికారవర్గాలు చెబుతున్నాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో ఇంజనీరింగ్‌పై విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీంతో అక్కడ మేనేజ్‌మెంట్ కోర్సుల పెంపునకు అనుమతి ఇవ్వాలని భావిస్తున్నారు. ఇదే జరిగితే తెలంగాణవ్యాప్తంగా 10 వేల ఇంజనీరింగ్ సీట్లు పెరుగుతాయని రాష్ట్ర అధికారులు అంచనా వేస్తున్నారు. కంప్యూటర్ కోర్సుల్లోనే సీట్లు పెంచాలని ఇంజనీరింగ్ కాలేజీలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో ఈ ఏడాది కూడా సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ బ్రాంచ్‌లలో సీట్లకు కోత పడొచ్చు.గత ఏడాది 7 వేల సీట్లు ఈ బ్రాంచ్‌లలో తగ్గాయి. వీటి స్థానంలో కంప్యూటర్ కోర్సుల్లో పెంచారు. దీంతోపాటు మరో 7 వేల వరకూ కంప్యూటర్ బ్రాంచ్‌ల్లో సీట్లు పెరిగాయి.

మారుతున్న ట్రెండ్

కొన్నేళ్లుగా దక్షిణ, ఉత్తరాది రాష్ట్రాల మధ్య కోర్సుల ఎంపికలో తేడా కనిపిస్తోందని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, ఏఐసీటీఈ గుర్తించాయి. తమిళనాడు, ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ (బీటెక్), ఎంబీఏ, ఎంసీఏల్లో ఎక్కువగా చేరుతున్నారు. కానీ ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, పంజాబ్ సహా ఉత్తరాది రాష్ట్రాల్లో విద్యార్థులు ఎక్కువగా



సంప్రదాయ డిగ్రీ కోర్సులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులు ఇంజనీరింగ్ తర్వాత ఎంఎస్‌కు విదేశాలకు వెళ్లేందుకు, లేదా సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లోని విద్యార్థులు డిగ్రీ తర్వాత సివిల్స్, ఇతర పోటీ పరీక్షల వైపు దృష్టి పెడుతున్నారు. ఈ డిమాండ్‌ను బట్టే ఎక్కువ ఇంజనీరింగ్ సీట్లు దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉంటున్నాయి.

- దేశవ్యాప్తంగా 12,47,667 బీటెక్ సీట్లు అందుబాటులో ఉంటే, వీటిల్లో 6,74,697 (54 శాతం) సీట్లు దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉన్నాయి.
- ఎంసీఏలో 70,065 సీట్లు ఉంటే, 30,812 (44 శాతం) దక్షిణాదిలో ఉన్నాయి.
- ఎంబీఏ, పీజీడీఎం వంటి మేనేజ్‌మెంట్ కోర్సులకు సంబంధించిన సీట్లు 3,39,405 దేశవ్యాప్తంగా ఉంటే, దక్షిణాదిన 1,57,632 సీట్లున్నాయి.
- రానురాను బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ సీట్లు దక్షిణాదిలోనే పెరగడానికి ఇదే కారణమని ఏఐసీటీఈ భావిస్తోంది.
- 2015–16లో దక్షిణాది రాష్ట్రాల్లో 48.77 బీటెక్ సీట్లు ఉంటే, కేవలం ఆరేళ్లలో అవి 5.3 శాతం పెరిగాయి. ఇప్పుడిది 7 శాతానికి చేరొచ్చని అంచనా వేస్తున్నారు.

నైపుణ్యంపై దృష్టి

ఇంజనీరింగ్ విద్యలో కొత్త కోర్సులు వస్తున్నా, విద్యార్థుల్లో నైపుణ్యం ఉండటం లేదని పలు సర్వేలు చెబుతున్నాయి.

దక్షిణాది రాష్ట్రాల్లో బీటెక్, ఎంసీఏ, ఎంబీఏ కాలేజీలు ఇలా...

రాష్ట్రం	కాలేజీల సంఖ్య	సీట్ల సంఖ్య
తమిళనాడు	489	2,48,552
ఆంధ్రప్రదేశ్	280	1,48,952
తెలంగాణ	189	1,10,808
కర్ణాటక	195	1,08,812
కేరళ	152	50,493
పుదుచ్చేరి	15	7,080
మొత్తం	1,320	6,74,697

దీనిని దృష్టిలో ఉంచుకొని ఇంజనీరింగ్‌లో మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇంజనీరింగ్ రెండో ఏడాది నుంచే ప్రాక్టికల్‌గా అవసరమైన నైపుణ్యం పొందేలా ప్రాజెక్టులు రూపొందిస్తున్నారు. తరగతిగది కన్నా, నైపుణ్యం పొందే పారిశ్రామిక సంస్థల్లో పనిచేసేలా చేయాలని ఏఐసీటీఈ సూచిస్తోంది.

టెక్నాలజీలో దక్షిణాది ముందంజ

దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులు బీటెక్ చదవడానికే ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఈ ట్రెండ్ రానురాను పెరుగుతోంది. తక్షణ ఉపాధితో పాటు, నైపుణ్యం పెంచే విధంగా ఇంజనీరింగ్‌లో వస్తున్న మార్పులూ ఇందుకు కారణమే. అందుకే తెలంగాణ సహా దక్షిణాది రాష్ట్రాల్లో ఇంజనీరింగ్ సీట్ల పెంపు అనివార్యమవుతోంది. గణితం నేపథ్యం విద్యార్థులూ ఉత్తరాది కన్నా, దక్షిణాదిలో ఎక్కువగా ఉంటున్నారు. ఇది కూడా బీటెక్ సీట్ల డిమాండ్‌కు కారణమవుతోంది.
– ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి, ఉన్నత విద్య మండలి చైర్మన్

భువనగిరి ఎంపీ టికెట్ అడగడం లేదు

- కోమటిరెడ్డి బ్రదర్స్ అంటే గిట్టని వారు తప్పుడు ప్రచారం చేస్తున్నారు... కొంత ఆలస్యమైనా నాకు మంత్రి పదవి వస్తుంది
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు: భువనగిరి ఎంపీ టికెట్ తన భార్య లక్ష్మికి అడుగుతున్నట్టు వస్తున్న వార్తలు అవాస్తవమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన నల్లగొండ జిల్లా మునుగోడులో విలేకరులతో మాట్లాడారు. కొన్ని రోజులుగా సోషల్ మీడియా, వివిధ పత్రికలు, టీవీ చానళ్లలో వస్తున్న వార్తలు నిజం కాదని, కోమటిరెడ్డి బ్రదర్స్ అంటే గిట్టనివారు తప్పుడు కథనాలు రాయిస్తున్నారని ఆరోపించారు. భువనగిరి ఎంపీ టికెట్ బీసీలకు ఇస్తే బాగుటుందని తాను పలుమార్లు చెప్పానని, ఇదే విషయాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దృష్టికి కూడా తీసుకెళ్లానన్నారు. కోమటిరెడ్డి కుటుంబం పదవుల కోసం పాకులాడదని, తన భార్య లక్ష్మి కూడా పోటీచేసేందుకు సుముఖంగా లేదని చెప్పారు. ప్రభుత్వం చేయిస్తున్న సర్వేల్లో.. తమ కుటుంబం నుంచి పోటీచేస్తేనే గెలుస్తామని రిపోర్టు వస్తే..అధిష్టానం పోటీచేయాలని పట్టుబడితే అప్పుడు ఆలోచించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

కోమటిరెడ్డి బ్రదర్స్ మధ్య ఎప్పుడూ విభేదాలు ఉండవు

తన సోదరుడు మంత్రి వెంకట్‌రెడ్డికి, తన మధ్య విభేదా లు ఉన్నట్టు కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని, తమ మధ్య ఏ ఒక్క రోజూ ఎడబాటు ఉండదన్నారు. ఇద్దరం కలిసి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రెండు ఎంపీ స్థానాలను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని చెప్పారు. మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి అనవసరంగా నోరు పారేసుకుంటున్నాడని, తాను సూర్యాపేటకు వెళ్తే.. ఒక్క రోజు కూడా బయట తిరగలేడన్నారు. ఆలస్యమైనా తనకు మంత్రి పదవి వస్తుందని, ఆ నమ్మకం ఉందని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో చౌటుప్పల్, నారాయణపురం ఎంపీపీలు తాడూరి వెంకట్ రెడ్డి, గుత్తా ఉమాదేవి, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

వలస నేతలకు టికెట్లపై కాంగ్రెస్‌లో లొల్లి..!

▶ మొదటి పేజీ తరువాయి

విరుద్ధమని పేర్కొన్నారు. మరోవైపు రెండు ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గాల్లోనూ మాల సామాజిక వర్గానికి చెందినవారికే టికెట్ ఇవ్వ డం పట్ల మాదిగ సామాజికవర్గం నేతలు ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు.బహిరంగంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయకపోయినా.. పార్టీ నేతల వద్ద తీవ్ర అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. ఇక బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల విజయలక్ష్మితోపాటు 10 మంది కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైంది.

కాంగ్రెస్ కేడర్‌ను అవమానపరిచినట్టే!

ఇటీవలే పార్టీలో చేరినవారికి కాంగ్రెస్ లోక్‌సభ టికెట్లు కేటాయించడం కాంగ్రెస్ కార్యకర్తలను అవమానపర్చినట్టేనని, వారిని నైతికంగా దెబ్బతీస్తుందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు లేఖ రాశారు. ''తెలంగాణలో మార్పు కోరుకున్న ప్రజలు గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడించారు. ఆ పార్టీ నుంచి వచ్చిన వారికి టికెట్లు ఇవ్వడం ప్రజాభిప్రాయానికి విరుద్ధం. ఇలాంటి నిర్ణయాలు రాష్ట్ర ప్రజలకు, కేడర్‌కు ఎలాంటి సంకేతాలు పంపుతాయనేది కూడా పరిగణనలోకి తీసుకోవాలి. మీరు తీసుకున్న నిర్ణయాన్ని పునఃసమీక్షించండి. ఎలాంటి పరిస్థితుల్లోనైనా పార్టీకి విధేయులుగా ఉండేవారికి టికెట్లు ఇవ్వండి'' అని లేఖలో కోరారు.

రిజర్వుడ్ సీట్ల వ్యవహారంలోనూ..

ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గాల్లో టికెట్ల కేటాయింపు వ్యవహారం కూడా కాంగ్రెస్‌లో అంతర్గత చర్చకు దారితీస్తోంది. ఇప్పటివరకు ప్రకటించిన పెద్దపల్లి, నాగర్‌కర్నూల్ సీట్లను మాల సామాజిక వర్గానికి చెందిన వారికే ఇవ్వడంపై మాదిగ సామాజికవర్గ నేతలు అసంతృప్తి వ్య క్తం చేస్తున్నారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చారగొండ వెంకటేశ్, తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి వంటి మాదిగ సామాజిక వర్గం నేతలు ఈసారి లోక్‌సభ టికెట్లను ఆశించారు. కానీ వారికి ఇవ్వకుండా ఇద్దరు మాల సామాజికవర్గ నేతలకు ఇవ్వడంపై వారు నిరాశలో ఉన్నారని సమాచారం. ఇక నాగర్‌కర్నూల్ టికెట్ పొందిన సీనియర్ నేత మల్లు రవి శుక్ర వారం హైదరాబాద్‌లోని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ నివాసానికి వెళ్లారు. తనకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. టికెట్ దక్కిన మల్లు రవిని అభినందించిన సంపత్.. మంచి మెజార్టీతో నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ విజయం సాధించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తర్వాత మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ ఇద్దరినీ తీసుకుని సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు వెళ్లారు. వీరితో చాలా సేపు సమావేశమైన రేవంత్.. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై దిశానిర్దేశం చేశారు.

28 తర్వాతేనా?

కాంగ్రెస్ ఇంకా ఖమ్మం, భువనగిరి, హైదరాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, వరంగల్ లోక్‌సభ స్థానాలకు అభ్యర్థుల ను ప్రకటించాల్సి ఉంది. దేశవ్యాప్తంగా అభ్యర్థుల ఖరారుపై పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) ఈనెల 28 తర్వాత ఢిల్లీలో భేటీకానుంది. సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీఈసీ సభ్యుడి హోదాలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆ భేటీలో పాల్గొంటారు. రాష్ట్రంలో మిగిలిన 8 లోక్‌సభ స్థానాలకు ఆ భేటీలో అభ్యర్థులను ఖరారు చేస్తారని తెలిసింది.

ఈఏపీసెట్‌లో మార్పులు

- మే 9కి బదులు 7 నుంచే పరీక్ష
- టీఎస్ ఐసెట్ జూన్ 4కు బదులు 5 నుంచి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీఎస్ ఈఏపీసెట్) తేదీల్లో స్వల్ప మార్పులు చేశారు. మే 9వ తేదీన నిర్వహించాల్సిన సెట్‌ను మే 7 నుంచే నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి తెలిపారు. ఇదే విధంగా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే టీఎస్ఐసెట్ పరీక్ష తేదీలను జూన్ 4 నుంచి కాకుండా, 5వ తేదీకి మార్చినట్టు తెలిపారు. మే 13వ తేదీన పార్లమెంట్ సాధారణ ఎన్నికల పోలింగ్ ఉన్న నేపథ్యంలో ఈ మార్పులు అనివార్యమయ్యాయని లింబాద్రి పేర్కొన్నారు.

కొత్త టైమ్‌టేబుల్ ఇలా..

తేదీ	పరీక్ష
7–8.5.2024	అగ్రికల్చర్, ఫార్మసీ
9–11.5.2024	ఇంజనీరింగ్
5–6–06.2024	టీఎస్ఐసెట్

గ్రూప్స్ పరీక్షలకు టీ-శాట్ క్రాష్ కోర్స్ ప్రసారాలు: సీఈవో వేణుగోపాల్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ నిర్వహిస్తున్న గ్రూప్–1, 2, 3 పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం టీ-శాట్ నెట్‌వర్క్ ద్వారా ఆన్‌లైన్ ఓరియంటేషన్ లైవ్ క్లాసులు అందిస్తున్నట్లు టీ-శాట్ సీఈఓ బి.వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రాష్ కోర్స్ కూడా అందిస్తున్నట్లు చెప్పారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిపుణ చానల్‌లో గంట పాటు మొదటి అవగాహన కార్యక్రమం బయాలజీ సబ్జెక్టుతో ప్రసారమవుతుందని వెల్లడించారు. టీ-శాట్ విద్య చానల్‌లో ఈనెల 24న ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు ఈ కార్యక్రమం పునఃప్రసారం అవుతుందన్నారు. పోటీ పరీక్షలకు సంబంధించి లైవ్ క్రాష్ కోర్స్ ఏప్రిల్ మొదటివారం వరకు కొనసాగుతుందని వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. క్రాష్ కోర్స్ ప్రసారాలు టీ-శాట్ నెట్‌వర్క్ విద్య, నిపుణతో పాటు యాప్, యూట్యూబ్‌లోనూ ప్రసారమవుతాయన్నారు. ఈ అవకాశాన్ని పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఏవైనా సందేహాలుంటే 040-23540326,726 ఫోన్ నంబర్ లేదా టోల్‌ఫ్రీ 1800-425-4039 నంబర్లకు కాల్ చేయాలని పేర్కొన్నారు.

చట్టాన్ని అమలు చేసేది ఇలాగేనా?

తెలంగాణ పోలీసుల తీరుపై సుప్రీంకోర్టు అసంతృప్తి



సాక్షి, న్యూఢిల్లీ: చట్టాన్ని అమలుచేసే క్రమంలో తెలంగాణ పోలీసులు అనుసరించిన విధానాన్ని సుప్రీంకోర్టు మరోసారి తప్పుపట్టింది. ముందస్తు నిర్బంధ చట్టం అమలు చేయడంలో తగిన కసరత్తు చేయడం లేదని అసంతృప్తి వ్యక్తంచేసింది. మరోసారి తెలంగాణ పోలీసులు కోర్టు వాఖ్యలు చేసే అవకాశం ఇవ్వరని భావిస్తున్నట్లు పేర్కొంది. నేనావత్ బుజ్జి, నేనావత్ చందులు దాఖలు చేసిన క్రిమినల్ అప్పీలును సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం గురువారం విచారించి ఆదేశాలు జారీ చేసింది. ఆ ఉత్తర్వులను శుక్రవారం వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాలను పక్కనపెడుతూ నిర్బంధంలో ఉన్నవారికి స్వేచ్ఛ కల్పించింది. దోపిడీలు/చైన్ స్నాచింగ్ లాంటి నేరాలకు పాల్పడుతూ స్థానికులను విపరీతమైన భయాందోళనలకు గురిచేస్తున్నారంటూ నేనావత్ రవి తదితరుల్ని రాచకొండ కమిషనరేట్ పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను రవి తరపున నేనావత్ బుజ్జి, మున్నావత్ చందు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ప్రాథమిక హక్కులను పరిగణనలోకి తీసుకోకుండా వ్యక్తులను నిర్బంధించడానికి నిర్బంధ అధికారాలను ఉపయోగించారని పేర్కొంది. నిందితులకు బుద్ధి చెప్పకుండా రొటీన్ పద్ధతిలో డిటెన్షన్ ఆర్డర్ ఇవ్వడాన్ని సీరియస్‌గా పరిగణిస్తున్నట్లు తెలిపింది. చైన్ స్నాచింగ్ కేసులో మహిళల్లో భయాందోళనలు సృష్టిస్తూ ప్రజా శాంతిని ప్రభావితం చేస్తున్నారని ఆరోపించడాన్ని ధర్మాసనం ప్రధానంగా పరిశీలించింది. కస్టడీలో ఉన్న వ్యక్తి వల్ల పబ్లిక్ ఆర్డర్‌కు ఎలాంటి విఘాతం కలగలేదంటూ నిర్బంధ ఉత్తర్వులను రద్దు చేసింది. గతేడాది అమీనా బేగం కేసులోనూ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొంది. ఐదేళ్లలో ఈ తరహా కేసులను సుప్రీంకోర్టు ఐదింటిని కొట్టివేసిందని, తెలంగాణ హైకోర్టు పది ఆర్డర్లను తోసిపుచ్చిందని గుర్తుచేసింది. 'హైకోర్టు ఇచ్చిన తీర్పు, ఉత్తర్వులు పక్కన పెడుతున్నాం. నిర్బంధం రద్దు చేస్తున్నాం. ఏదైనా ఇతర సందర్భంలో అవసరం లేకుంటే నిర్బంధంలో ఉన్న వ్యక్తికి స్వేచ్ఛ ఇస్తున్నాం. ఈ తీర్పు కాపీని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోం శాఖ ముఖ్య కార్యదర్శికి వీలైనంత త్వరగా పంపాలి'అని ధర్మాసనం పేర్కొంది.

కవితకు దక్కని ఊరట

- బెయిల్ కోసం ట్రయల్‌కోర్టుకు వెళ్లాలన్న సుప్రీంకోర్టు... బెయిల్ పిటిషన్ త్వరితంగా విచారించాలని సూచన
- రాజకీయనేత ప్రమేయం కాబట్టి చట్టబద్ధ పరిష్కారాలు దాటవేయలేమన్న ధర్మాసనం



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఈడీ కస్టడీలో ఉన్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టులో ఊరట దక్కలేదు. తన అరెస్టు అక్రమమంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు బెయిల్ కోసం కింది కోర్టుకు వెళ్లాలని సూచించింది. కేసులో రాజకీయ నేత ప్రమేయం ఉన్న కారణంగా చట్టబద్ధమైన పరిష్కారాలు దాటవేయలేమని వ్యాఖ్యానించింది. పిటిషన్‌లో లేవనెత్తిన రాజ్యాంగ ఉల్లంఘనలకు సంబంధించిన అంశాలు మాత్రమే విచారిస్తామని స్పష్టం చేసింది. కవిత పిటిషన్ శుక్రవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ బేలా ఎం. త్రివేదిలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు ప్రారంభిస్తూ.. హైకోర్టుకు వెళ్లాలని సూచించొద్దని, అనుకూలమైనా, ప్రతికూలమైనా సుప్రీంకోర్టు నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో ఏం జరుగుతోందో గమనించాలని, కవితకు వ్యతిరేకంగా ఒక్క ఆధారం కూడా లేదని, ఒక అప్రూవర్ ఇచ్చిన స్టేట్‌మెంట్ కారణంగా అరెస్టు చేశారని, ఇలా చేయడం కోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకమని చెప్పారు. అయితే, బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లాలని జస్టిస్ సంజీవ్ ఖన్నా సూచించారు. దీంతో, 'హేమంత్ సోరెన్ కేసులో ట్రయల్ కోర్టులో ఏమైందో చూశామని, ఇది జరిగే పని కాదని సిబల్ పేర్కొన్నారు. రాజకీయ వ్యక్తి ప్రమేయం ఉన్నందున చట్టబద్ధమైన పరిష్కారాలు దాటవేయలేమని బెంచ్ అభిప్రాయపడిందని జస్టిస్ సంజీవ్‌ఖన్నా తెలిపారు. ఒకసారి సాక్షిగా, మరోసారి నిందితురాలిగా కవితకు సమన్లు జారీ చేశారని సిబల్ చెప్పగా, అయినప్పటికీ ఆర్టికల్ 32 ప్రకారం బెయిల్ ఇవ్వలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. రాజ్యాంగ ఉల్లంఘనకు సంబంధించిన అంశాలు లేవనెత్తిన కారణంగా ఇప్పటికే విచారణలో ఉన్న విజయ్ మదన్‌లాల్ కేసుకు జత చేస్తామని పేర్కొంది. దీనిపై ఈడీకి నోటీసులు జారీ చేస్తూ ఆరు వారాల్లో సమాధానం చెప్పాలని ఆదేశించింది. ఆ తర్వాత రెండు వారాల్లో రిజాయిండర్ దాఖలు చేయాలని పేర్కొంది. 'నోటీసులు జారీ చేస్తున్నాం. ట్రయల్ కోర్టు లేదా ఇతర మార్గాల ద్వారా పరిష్కారానికి పిటిషనర్‌కు స్వేచ్ఛ కల్పిస్తున్నాం. బెయిల్ అప్లికేషన్‌ను ట్రయల్ కోర్టు త్వరితంగా పరిష్కరించాలి'అని ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. విచారణ సందర్భంగా సిబల్ వ్యాఖ్యల్ని గమనించిన జస్టిస్ సంజీవ్ ఖన్నా భావోద్వేగాలకు గురికావొద్దని సూచించారు. కోర్టు ఆదేశాల అనంతరం ఇది స్వర్ణయుగం కాదన్న సిబల్ వ్యాఖ్యలకు జస్టిస్ ఖన్నా స్పందిస్తూ.. వేచి చూద్దామని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు విజయ్ మదన్‌లాల్ కేసు విచారణను జూలైలో చేపట్టనుంది. ఈ నేపథ్యలో ఇదే కేసుకు కవిత పిటిషన్ జత చేయడంతో తదుపరి విచారణ జూలైలోనే జరగనుంది.

నేటితో ముగియనున్న కస్టడీ

కవితకు రౌజ్ అవెన్యూ కోర్టు ఇచ్చిన ఈడీ కస్టడీ ఆదేశాలు శనివారంతో ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు కవితను కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. కాగా, ఈడీ కస్టడీలో ఉన్న కవితతో శుక్రవారం సాయంత్రం ఆమె కుమారుడు ఆర్య, మరదలు అఖిల, స్నేహితురాలు వినూత ములాఖత్ అయ్యారు. మరోవైపు, ఈడీ అధికారులు ఆరో రోజూ కవితను సుదీర్ఘంగా విచారించారు.

భయపెడుతున్న భౌ..భౌ

నిర్మల్ జిల్లా కుబీర్ మండలం జామ్ గ్రామానికి చెందిన ద్రుపద-సాహెబ్‌రావు దంపతుల కుమారుడు ఈశ్వర్(15) జనవరి 27న ఓ కుక్క కరిచింది. స్థానికంగా ఉన్న పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స చేసి యాంటీ రేబిస్ టీకాలు వేయించారు. అయితే కొద్ది రోజులకు వ్యాధి మళ్లీ బయటపడింది. మెరుగైన చికిత్సకు ఫిబ్రవరి 11న నిర్మల్‌కు, అటు నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఫిబ్రవరి 14న మరణించాడు. తమ కొడుకును బతికించుకోవడానికి ఎంతో శ్రమించినా ప్రాణాలు దక్కలేదని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఇలా రాష్ట్రంలో ఈఏడాది కుక్కకాటుతో ఆరుగురు మరణించారు.

- ఏటా పదుల సంఖ్యలో మరణాలు
- మృతుల్లో చిన్నారులు, మహిళలే ఎక్కువ
- గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో అందుబాటు లోని ఇంజెక్షన్లు
- బల్దియాల్లో శునక సంతతి నియంత్రణ చర్యలు అంతంతే

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రేబిస్ ప్రాణాంతక వ్యాధి. దీనికి మందు ఉన్నా, రేబిస్ సోకిన కుక్కలు కరిచి మరణాలు సంభవించడం ఆందోళన కలిగిస్తోంది. కుక్క కరిచిన వెంటనే రేబిస్ ఇమ్యూనో గ్లోబ్యులిన్ (ఆర్ఐజీ) ఇంజెక్షన్లు తీసుకుంటే వారిప్రాణాలు కాపాడవచ్చని డాక్టర్లు చెబుతున్నారు. కానీ, కుక్కకాటు వల్ల మరణించిన కేసుల్లో అధికశాతం తల, మెడ, ముఖం, ఛాతీ ప్రాంతాల్లో కరిచినప్పుడు వైరస్ వేగంగా మెదడుకు వ్యాపించి మరణం సంభవించే అవకాశాలు ఉన్నాయని, కండ తెగేలా, లోతుగా గాయాలైన ఘటనల్లోనూ ఆర్ఐజీ వైరల్ లోడు పెరగకుండా నివారించి, ప్రాణాలు కాపాడుతుందని, చాలా అరుదైన కేసుల్లోనే ప్రాణాలు పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్ఐజీ ఇంజెక్షన్లు కేవలం జిల్లా కేంద్రాలు, పట్టణాలలో మాత్రమే లభిస్తున్నాయి. మారుమూల, గ్రామీణ ప్రాంతాల్లో కుక్కలు బలంగా కరిచిన ఘటనల్లో మరణాలు సంభవించడానికి కారణం అక్కడ ఈ ఇంజెక్షన్లు అందుబాటులో లేకపోవడమే.

సంతతి నియంత్రణ అంతంతే.. వేసవిలో తిక్క ప్రవర్తన

ప్రతీ ఆడకుక్క 8 నుంచి 10 నెలలకు ఎదకు వస్తుంది. ఏడాదికి రెండుసార్లు పిల్లలకు జన్మనిస్తుంది. ప్రతీసారీ నాలుగు నుంచి ఎనిమిది పిల్లలు పెడుతుంది. ఏటా కుక్కల నియంత్రణకు రూ.కోట్లు ఖర్చు పెట్టి చేపడుతున్న కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, వ్యాక్సినేషన్ పూర్తిస్థాయిలో సత్ఫలితాలు ఇవ్వడం లేదు. ఇక వేసవిలో శునకాలు దాహం, ఆహార కొరతతో ఇబ్బంది పడతాయి. నీరు, తిండి దొరక్క, ఎండలకు తిక్కగా ప్రవర్తిస్తాయి. అకారణంగా కరుస్తాయి. గుంపులుగా తిరిగే కుక్కలు చిన్నారులను లక్ష్యంగా చేసుకుంటుంటాయి. అందుకే, శునకాలకు కుటుంబ నియంత్రణ, వ్యాక్సినేషన్ నిరంతరం ప్రక్రియగా కొనసాగించాలని పశు వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

స్రావాలతోనూ రేబిస్, కరిచి ఏడాదైనా మృతే..

పెంపుడు కుక్కలను కొందరు మితిమీరి ప్రేమిస్తుంటారు. వాటిని మూతులను ముద్దాడుతుంటారు. పొరపాటున ఆ కుక్కలకు రేబిస్ ఉంటే.. దాని లాలాజలం ద్వారా మన దేహంపై ఉన్న గాయాలపై పడితే.. రేబిస్ వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కుక్క కరిచినా పట్టించుకోరు. తమకేమీ కాలేదని తాపీగా ఉంటారు. రోగనిరోధకశక్తి అధికంగా ఉన్న వారిలో ఏడాది అనంతరం రేబిస్ బయటపడిన సందర్భాలు అనేకమున్నాయని వైద్యులు గుర్తుచేస్తున్నారు.



రాష్ట్రవ్యాప్తంగా కుక్కకాటు కేసులు ఇలా

సంవత్సరం	కుక్కకాటు	మరణించినవారు
2018	14,327	12
2019	20,984	08
2020	15,285	10
2021	20,586	11
2022	20,966	16
2023	25,515	14

పెంపుడు కుక్కలు ఉన్నవారు వాటికి వ్యాక్సిన్ వేయించాలని, కుక్క కరిచినప్పుడు పూర్తి కోర్సు ఇంజెక్షన్లు వేసుకోవాలని చెబుతున్నారు. మహిళల్లో రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటం వల్ల వ్యాక్సిన్ వేసుకున్నా, ఒక్కోసారి వైరస్‌తో పోరాటంలో ఓడిపోతారు.

పూర్తి కోర్సు తీసుకోవాలి

చిన్నారుల ఎత్తు తక్కువగా ఉండటం వల్ల మెడ, తల భాగాల్లో కుక్కలు ఎక్కువగా కరుస్తాయి. వీరికి రోగనిరోధక శక్తి తక్కువ. దీనితో రేబిస్ వేగంగా మెదడుకు చేరి మరణం సంభవిస్తుంది. కాటుకు గురైనవారు రెండు వారాల నుంచి మూడేళ్లలోపు చనిపోయే ప్రమాదం ఉంది. ఈలోపు టీకాలు వేసుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు. కుక్క కరిచినప్పుడు పూర్తి కోర్సు ఇంజెక్షన్లు వేసుకుంటే ఎటువంటి సమస్య ఉండదు.
– డాక్టర్ ప్రమోద్‌కుమార్, పెద్దపల్లి డీఎంహెచ్‌ఓ

డ్రగ్స్ తెచ్చింది మీ చుట్టాలే

- బాబు, లోకేష్‌పై పేర్ని నాని ధ్వజం
- డ్రగ్స్ రాకెట్‌లో టీడీపీ నేతల సన్నిహితుల పాత్రపై సీఈవోకు ఫిర్యాదు



సాక్షి అమరావతి: విశాఖలో డ్రగ్స్ పట్టుబడ్డ వ్యవహారంలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, నారా లోకేశ్ పాత్రపై క్షుణ్ణంగా విచారణ జరపాలని మాజీ మంత్రి పేర్ని నాని డిమాండ్ చేశారు. 'డ్రగ్స్ తెచ్చినవారు మరిదికి, వదినకి చుట్టాలైతే వారిద్దరూ వైఎస్సార్‌సీపీపై విషం చిమ్మడం ఎక్కడి న్యాయం? ఎన్నికల్లో మద్యం పంచే స్థాయి నుంచి డ్రగ్స్ పంచే స్థాయికి టీడీపీ ఎదిగిపోయిందా? ఈ ఓడ వెనుక మరో ఓడ ఉండే అవకాశంతోపాటు ఇలాంటి ఓడలు మరో మార్గంలో వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. డ్రగ్స్ దందాలో బయట పడ్డ పేర్లలో ఒక్కరు కూడా రెడ్డి, కాపు లేరు. మరి మీ చుట్టాలు తెప్పిస్తే మాపై, సీఎం జగన్‌పై విషం చిమ్ముతారా?' అని పేర్ని నాని మండిపడ్డారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు పేర్ని నాని, మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ నేతలు మలసాని మనోహర్‌రెడ్డి, మూర్తి తదితరులు శుక్రవారం కలిశారు. వైజాగ్ డ్రగ్ రాకెట్‌లో చంద్రబాబు, లోకేశ్, పురందేశ్వరి, టీడీపీ నేతల కుటుంబ సభ్యుల పాత్రపై సీఈవోకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల్లో అసాంఘిక శక్తులను ప్రోత్సహించేందుకే టీడీపీ నేతలు డ్రగ్స్ తరలించినట్లు పేర్కొన్నారు. చంద్రబాబు అవాస్తవాలతో వైఎస్సార్ సీపీపై ట్వీట్ చేయడంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఓ దేవగణాల్లారా! మా శరీరాలు, వాటిలోని సర్వాంగాలూ సుదృఢంగా ఉండేట్లు, అలాంటి దేహాలతో మా జీవితాలు భగవంతుని స్తుతించడానికి, దేవుని కార్యాలు నిర్వహించడానికే వెచ్చించేట్లు దీవించండి.

– ప్రశ్నోపనిషత్తు

సాక్షి

శనివారం, 23 మార్చి 2024

ఈడీ చెరలో కేజ్రీవాల్!

పీఠం ఎక్కింది మొదలు కేంద్రం కంట్లో నలుసులా మారిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కటకటాల వెనక్కి వెళ్లక తప్పింది కాదు. గురువారం రోజంతా జరిగిన డ్రామాకు పతాకస్థాయిగా రాత్రి 9.45 గంటల ప్రాంతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తునకు హాజరు కావాలంటూ తొమ్మిది దఫాలు ఈడీ పంపిన సమన్లను ఆయన బేఖాతరు చేస్తూ రాగా, పదోసారి నేరుగా ఈడీ అధికారులే కేజ్రీవాల్ అధికార నివాసంలో సోదాలు నిర్వహించి అరెస్టు చేస్తున్నట్టు ప్రకటించటంతో దాదాపు రెండేళ్లుగా సాగుతున్న ఈ వ్యవహారం కీలకమలుపు తిరిగింది. మొన్న జనవరి 31న జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను భూకుంభకోణంలో ఈడీ అరెస్టు చేయగా, ఆ వరసలో అరెస్టయిన రెండో ముఖ్యమంత్రి కేజ్రీవాల్. అవినీతికి వ్యతిరేకంగా పుష్కరకాలం క్రితం అన్నా హజారే నాయకత్వాన ఢిల్లీలో రగిలిన నిరసనోద్యమంలో కీలకపాత్ర పోషించిన నాయకుడు చివరకు అలాంటి ఆరోపణల్లోనే చిక్కుకుని అరెస్టు కావటం ఒక వైచిత్రి. అప్పటి యూపీఏ ప్రభుత్వం 2జీ స్పెక్ట్రమ్ కేటాయింపుల్లో రూ. 1.76 లక్షల కోట్ల అవినీతికి పాల్పడిందని అవినీతి వ్యతిరేక ఉద్యమ నాయకులు ఆరోపించారు. ఆ కేసులో సీబీఐ సరైన సాక్ష్యాధారాలు చూపలేకపోయిందని ప్రత్యేక కోర్టు అభిప్రాయపడి 2017లో నిందితులందరినీ నిర్దోషులుగా ప్రకటించింది. ఆ తీర్పుపై 2018 మార్చిలో సీబీఐ దాఖలు చేసిన అప్పీల్‌ను ఆరేళ్ల తర్వాత శుక్రవారం ఢిల్లీ హైకోర్టు విచారణకు స్వీకరించింది.

ఐఆర్‌ఎస్ కొలువుకు రాజీనామా చేసి ఉద్యమంలోకొచ్చిన కేజ్రీవాల్‌ను ఆదినుంచీ వివాదాలు చుట్టుముడుతూనే వున్నాయి. అవినీతి వ్యతిరేకోద్యమం చల్లారి దాన్లోని ప్రముఖులంతా తెరమరుగవుతున్న రోజుల్లో కేజ్రీవాల్ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) స్థాపించటం ఆయన సహచరులకు మింగుడు పడలేదు. ఉద్యమాన్ని స్వలాభానికి వాడుకుంటున్నాడంటూ అనేకులు విరుచుకుపడ్డారు. తొలుత ఆయనతో చేతులు కలిపిన కేంద్ర మాజీ న్యాయ మంత్రి శాంతి భూషణ్, ఆయన కుమారుడు, సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తదితరులు కొద్దికాలంలోనే కేజ్రీవాల్‌పై ఆరోపణలు చేస్తూ వైదొలిగారు. అధికారంలోకొచ్చాక ఆయనపై దాదాపు డజనుసార్లు దుండగులు దాడిచేశారు. ఇంకుతో, కోడిగుడ్లతో, కర్రలతో, రాడ్లతో ఈ దాడులు జరిగాయి. ఒకసారైతే దుండగుడు పాదాభివందనం చేస్తున్నట్టు నటించి ముఖంపై కారం జల్లాడు. అవినీతి వ్యతిరేకోద్యమంలో కీలక పాత్ర పోషించిన అనేకమంది మాదిరే కేజ్రీవాల్ కూడా సంఘ్ పరివార్ సంస్థలతో సన్నిహితంగా మెలిగినవారే. అందుకే ఆప్ స్థాపన వారికి నచ్చలేదంటారు. 2013లో స్వల్ప ఆధిక్యతతో తొలిసారి అధికారం చేపట్టినప్పుడు నాటి యూపీఏ సర్కారుతో పేచీ తప్పలేదు. ఆ తర్వాత ఎన్‌డీఏ అధికారంలోకొచ్చినా ఏదో ఒక అంశంపై ఘర్షణ కొనసాగుతూనేవుంది. లెఫ్టినెంట్ గవర్నర్లుగా వచ్చినవారు ప్రభుత్వ నిర్ణయాలకు అడ్డుపుల్లలేయటం, కొన్నిసార్లు న్యాయస్థానాల జోక్యంతో ఆయన విజయం సాధించటం రివాజైంది. నిజానికి కేజ్రీవాల్ కార్యక్షేత్రం చిన్నది. ఆయన ప్రభావం ఢిల్లీకి పరిమితం. పంజాబ్‌లో సైతం ఆప్ ప్రభుత్వాన్ని స్థాపించగలిగినా అది నిలకడగా వుండగలదా అన్నది ప్రశ్నార్థకం. మతం, కశ్మీర్ తదితర అంశాల్లో కేజ్రీవాల్ వైఖరి బీజేపీకి భిన్నమేమీ కాదు. అందువల్ల ఆయనపై అస్త్రాలు సంధించి బలహీనపరచటం బీజేపీకి సాధ్యంకావటం లేదు. చిత్రమేమంటే అటు కాంగ్రెస్ సైతం ఆయన బలపడితే తమకే ముప్పని భావించి కేజ్రీవాల్‌ను తగినంత దూరంలో వుంచింది. దేశవ్యాప్తంగా వేరే పార్టీలు పెద్ద బలంగా లేవు. ఏతావాతా తమ నేతల అరెస్టుపై ఆప్‌ది ఒంటరి పోరాటమే కావొచ్చు.

ఇంతకూ కేజ్రీవాల్ అవినీతికి పాల్పడ్డారన్నది వాస్తవమేనా? అది ఎన్ని దశాబ్దాలకు తేలుతుందో ఎవరూ చెప్పలేరు. ఆయన సర్కారు ఢిల్లీ మద్యం విధానంలో మార్పులు చేయటం ద్వారా కొన్ని వర్గాలకు లాభం చేకూర్చి వందకోట్ల రూపాయల మేర ముడుపులు తీసుకుందన్నది ఈడీ ఆరోపణ. ఈ కేసులో ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, ఆ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ ఏడాదిన్నరగా జైల్లో వున్నారు. బీఆర్‌ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవితను ఇటీవలే అరెస్టు చేశారు. కొందరు అప్రూవర్లుగా మారారు. కేసులోని నిజానిజాలేమిటన్న సంగతలావుంచి సీబీఐ, ఈడీ వ్యవహార శైలిపై యూపీఏ సర్కారుకాలం నుంచీ అనుమానాలున్నాయి. ఆ సంస్థల నిర్వాకాన్ని అడపా దడపా న్యాయస్థానాలు ప్రశ్నిస్తున్న ఉదంతాలు లేకపోలేదు. అయినా వాటి తీరుతెన్నులు మారిన దాఖలా లేదు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జరిగిన ఈ అరెస్టుల వెనక రాజకీయ ప్రమేయం, ప్రయోజనం లేవని ఎవరూ అనుకోలేరు. నిజానికి సుప్రీంకోర్టు పుణ్యమా అని బయటపడిన ఎలక్టోరల్ బాండ్ల ఆనుపానులు, కార్యకారణ ప్రమేయాలు గమనిస్తే ఈ మద్యం కుంభకోణం పిపీలిక ప్రాయం అనిపిస్తుంది. అవినీతి కేసుల విషయంలో ఈమధ్య పార్టీల పరస్పర ఆరోపణలు వింతగా వుంటున్నాయి. కవితను అరెస్టు చేయకపోవటంవల్లే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడామని బీజేపీ నేతలు ఖేదపడగా... బీజేపీ, బీఆర్‌ఎస్‌లు కుమ్మక్కు కావటంవల్లే ఆమె అరెస్టు జరగలేదని అప్పట్లో కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. అదే కాంగ్రెస్ ఇప్పుడు ఆప్ తమ కూటమిలో వుంది గనుక కేజ్రీవాల్ అరెస్టును తప్పుబడుతున్నది. ఈ అష్టావక్ర రాజకీయాలవల్ల బీజేపీ ఎడాపెడా లాభపడుతోంది. ఏదేమైనా అగ్రనాయకత్వం అరెస్టుతో సైన్యాధిపతిలేని సేనలా తయరైన ఆప్ ఈ సార్వత్రిక ఎన్నికలనూ, వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలనూ ఎలా ఎదుర్కొంటుందో చూడాలి.

రైతును మరిచి రాజకీయమా?

అభిప్రాయం



తన్నీరు హరీశ్ రావు

కాంగ్రెస్ ప్రభుత్వ ఖడ్గం మొదటి వేటు రైతన్న మీదనే పడ్డది. ఘనత వహించిన కాంగ్రెస్ సోకాల్డ్ ప్రజా పాలనలో రైతన్నల బతుకులు గాలిలో దీపాలు అయిపోయినయి. రాష్ట్రంలో ఎక్కడికి పోయినా అన్నదాతల ఆక్రందనలు, ఆర్తనాదాలే వినిపిస్తున్నయి. మొన్నటి దాకా పొలాల్లో నీళ్లు పారితే, ఇప్పుడు రైతుల కళ్లల్లో కన్నీళ్లు కారుతున్నయి. మూడు నెలల్లోనే పరిస్థితి ఎందుకు తలకిందులైంది? బీఆర్‌ఎస్ పరిపాలనలో ఆత్మవిశ్వాసంతో మెరిసి పోయిన రైతన్నల ముఖాల్లో ఎందుకు ఇప్పుడు నిస్సహాయత, ఆందోళన కనిపిస్తున్నది? అటు ఎండిపోయి దెబ్బతిన్న పంటలకు, ఇటు వడగండ్లతో నష్టపోయిన పంటకు ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలి. ఆరు గ్యారెంటీల్లో చెప్పిన 13 అంశాలను చిత్తశుద్ధితో త్వరగా అమలు చేయాలి.

నీళ్లు లేక పంటలు ఎండిపోతున్న బాధలు ఒకవైపు, కొద్దోగొప్పో పండిన పంట వడగండ్ల వానకు సర్వనాశనమై పోయిన ఘోష మరొకవైపు... రైతన్న బతుకు మూలిగే నక్క మీద తాటిపండు పడ్డ చందంగా అయిపోయింది. వడగండ్ల వాన దెబ్బకు రాష్ట్రంలో వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయంటే పరిస్థితి తీవ్రతను అంచనా వేయొచ్చు. నేల రాలిన పంటను చూసి రైతులు భోరుభోరున ఏడుస్తున్న దృశ్యాలు హృదయాలను కలచి వేస్తున్నాయి. అంత దుఃఖంలోనూ కేసీఆర్ ఉండగా, మా పరిస్థితి ఇంత అగాథంగా లేకుండేనని చెబుతూ మరి కంటతడి పెట్టుకుంటున్నారు.

ఇంత జరుగుతున్నా ప్రభుత్వంలో చలనమే లేదు. ఏమీ జరగనట్లుగానే ఎన్నికల ప్రచారాల్లో, రాజకీయ ప్రసంగాలను దట్టించి కొడుతున్నరు కాంగ్రెస్ పాలకులు. రైతు గుండె చీరుకపోయి విలవిలలాడుతుంటే, ముఖ్యమంత్రి గారు మాత్రం పక్క పార్టీ నాయకుల చేరికల మీద పూర్తి దృష్టిని కేంద్రీకరించారు. ప్రాజెక్టుల గేట్లు ఎత్తే సౌభాగ్యం లేని సర్కారు, పార్టీ గేట్లు ఎత్తి నాయకులను చేర్చుకుంటున్నారు. స్వయంగా ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో తాగునీరు గతిలేక మహిళలు ఖాళీ బిందెల ప్రదర్శనలు చేశారు. ముఖ్యమంత్రి అటువైపు తొంగి చూసిన పాపాన కూడా పోలేదు. పేగులు మెడలో వేసుకుంటా అనే రాక్షస వ్యాఖ్యలే తప్ప, పొలాలకు నీళ్లు మలుపుతా, ప్రజల గొంతు తడుపుతా అనే మానవీయ వ్యాఖ్యలు ఈ ముఖ్యమంత్రి నోటి వెంట రావడం లేదు.

రైతులు విధిలేని పరిస్థితుల్లో వేల రూపాయలు ఖర్చు పెట్టి ట్యాంకర్లతో పొలాలకు నీళ్లు పెట్టుకుంటున్నరు. సాగునీళ్లు లేక, కరెంట్ సరిగా రాక రాష్ట్రంలో లక్షలాది ఎకరాల్లో పంట ఎండిపోయింది. ఎండిన పంట చేలల్లో పశువులను మేపుతున్న దీనస్థితి కనిపిస్తున్నది. తెలంగాణ పల్లెల్లో మాయమైన బోరు బండ్లు మళ్లా దర్శనమిస్తున్నవి. పూడిక తీసే క్రేన్లకు గిరాకీ పెరిగింది. లో ఓల్టేజీ కరెంట్‌తో మోటార్లు కాలిపోతున్నయి. ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతున్నయి. మోటారు వైండింగ్ మెకానిక్‌ల షాపులు కళకళలాడుతుంటే, మునుపటి కాంగ్రెస్ రాజ్యం మళ్లా కళ్లకు కడుతున్నది. బీఆర్‌ఎస్ పరిపాలనలో ఎండాకాలంలో సైతం చెరువు, చెక్ డ్యాంకులు మత్తళ్లు దుంకిన మంచిరోజులను ప్రజలు పదే పదే గుర్తు చేసుకుంటున్నరు. ఆ రోజు నిండుగా పారిన కాల్వలు ఈ రోజు ఎండిపోయి ఎక్కిరిస్తున్నయి. బీఆర్‌ఎస్ 24 గంటల కరెంట్‌తో రైతు ఇంట్ల కాలు మీద కాలేసుకొని కూర్చొన్నా పొలం పారింది. నేడు అర్ధరాత్రి కరెంట్ పెట్టేందుకు బాయి కాడికి పోవాల్సిన బాధ మళ్లా మొదలైంది. బీఆర్‌ఎస్ పరిపాలనలో రైతులు నిరందిగ ఉన్నరు. ఇప్పుడు కరెంట్ కోత మళ్లా ఒక సమస్యగా వ్యవసాయం వాకిట్లో నిలిచింది. బీఆర్‌ఎస్ పరిపాలనలో స్థిరపడ్డ వ్యవసాయం కాంగ్రెస్ పుణ్యమా అని మెల్లమెల్లగా చెదిరిపోతున్నది. ఇప్పటి వరకు అందుతున్న లెక్కల ప్రకారం, కాంగ్రెస్ తెచ్చిన ఇందిరమ్మ రాజ్యం మూడు నెలల వ్యవధిలో 180 మంది రైతుల ఉసురు తీసింది.



ఇటీవల కురిసిన వడగండ్ల వాన పంట నష్టాన్ని అంచనా వేసే పని కూడా కాంగ్రెస్ ఇప్పటికీ ప్రారంభించలేదు. అదే పనిగా బీఆర్‌ఎస్ వెంట పడితే, అప్పుడు సోయి తెచ్చుకొని అయిష్టంగానే ఎకరాకు రూ. 10 వేల పంట నష్టపరిహారం ఇస్తామని గాలి మాటలు చెబుతున్నరు. అధికారంలోకి వచ్చిన వెంటనే డిసెంబర్ 9న ఒకే విడతలో 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి, అధికారానికి రాగానే మాట మార్చారు. వంద రోజులు దాటినా రుణమాఫీ ఊసెత్తకుండా కాలం గడిపేస్తున్నారు. నమ్మి రుణాలు తెచ్చుకున్న రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. రైతు బంధును రైతు భరోసాగా మార్చి, ఎకరాకు ఇచ్చే పెట్టుబడిని రూ. 15 వేలకు పెంచుతామని బడాయిలు చెప్పిన ప్రభుత్వం, పెంచడం మాట అటుంచి అసలు పెట్టుబడి సాయం ఇప్పటికీ ఎంతోమంది ఖాతాల్లో జమ చేయనేలేదు. పెంచేదెప్పుడో చెప్పడం లేదు. రైతు బంధు సాయాన్ని కౌలు రైతులకు కూడా అందిస్తామని అబద్ధపు హామీలు గుప్పించారు. అసలు ఇప్పటి వరకు కౌలు రైతులను ఎలా గుర్తిస్తారో, వాళ్లకు పెట్టుబడి సాయం ఏ విధంగా చేస్తారో మార్గదర్శకాలు రూపొందించే పనికి కూడా పూనుకోవడం లేదు. ఇగ రైతులను, కౌలు రైతులను మోసగించిన కాంగ్రెస్ పార్టీ, రైతు కూలీలను మాత్రం విడిచి పెడుతుందా? వాళ్లకు ఇచ్చిన హామీకి అదే గతి పట్టిచ్చింది. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వ్యవసాయ కూలీలకు 12 వేలు అందించే పథకం ప్రారంభిస్తామని చెప్పి, ఆ పథకం అమలు గురించిన ప్రస్తావన కూడా చేయడం లేదు. అంటే రైతు కూలీలకు ఇచ్చిన హామీకి కూడా ఎగనామం పెట్టిందనే అనుమానాలకు తావిస్తున్నారు. ఈ పథకం అమలు కోసం బడ్జెట్‌లో కేటాయింపులే లేకపోవడం ఈ అనుమానాలను మరింత బలపర్చుతుంది. రాతపూర్వకంగా ఇచ్చిన గ్యారెంటీలకే దిక్కు లేకుండా పోతుంటే, పంట నష్టం పదివేలు ఇస్తాననే నోటి మాటకు విలువెక్కడిది?

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇదే విధంగా అకాల వర్షాలతో పంట నష్టపోతే ముఖ్యమంత్రి కేసీఆర్ గారు స్వయంగా పంటలు దెబ్బతిన్న ఊర్లు పర్యటించారు. అప్పటికప్పుడు ఎకరాకు రూ. 10 వేల నష్టపరిహారాన్ని ప్రకటించి, వేగంగా అమలు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అటువంటి ప్రయత్నమేది కనిపించడం లేదు. అసలు కాంగ్రెస్ అంటేనే ఒక చెడగొట్టు వాన లాంటిదని రైతులు మాట్లాడుకుంటున్నరు.

సమైక్య పాలనలో విధ్వంసమైపోయిన తెలంగాణ వ్యవసాయాన్ని తిరిగి నిలబెట్టడానికి బీఆర్‌ఎస్ ఎంతో శ్రమించింది. పదేండ్లలో వ్యవసాయాన్ని పండుగగా మార్చింది. సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించింది. 24 గంటలు నాణ్యమైన ఉచిత కరెంట్ సరఫరా చేసింది. కొత్త ప్రాజెక్టులు నిర్మించి నీటిని ఎత్తిపోసి చెరువులు, కుంటలు నింపింది. భారీ రిజర్వాయర్లు నిర్మించి నిండుగా నింపింది. వాగుల్లోకి, వంకల్లోకి నీళ్లు వదిలితే భూగర్భ జలాలు మిక్కుటంగా పెరిగినయి. దుక్కి దున్ని నాటిన నుంచి పంట కొనుగోళ్ల దాకా అడుగడుగునా రైతుకు అండగా నిలిచింది. రైతు బంధుతో పెట్టుబడికి పైకమిచ్చింది. పండిన పంటనంతా మద్దతు ధరనిచ్చి కొనుగోలు చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీన్ రివర్స్ పోయింది. ఎండాకాలం రాకముందే చెరువులు ఎండిపోయినయి. భూగర్భ జలాలు పడిపోయినయి. బోర్లు ఎత్తి పోయినయి. రైతు బతుకు దిగజారడం మొదలైంది. ఇదీ కాంగ్రెస్ పార్టీ తెచ్చిన మార్పు. మార్పు మార్పు అని చెప్పి రైతుల బతుకుల్లో మంట పెట్టిన్రు.

రైతులు హాహాకారాలు చేస్తుంటే, భ్రష్ట రాజకీయాలతో పొద్దు పుచ్చడం ప్రమాదకరం. కాంగ్రెస్ ప్రభుత్వ నైజాన్ని ప్రజలు గుర్తిస్తున్నారు. ఆదిలోనే హంసపాదులా తయారైన విధానాన్ని తిట్టుకుంటున్నారు. ఇకనైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కళ్లు తెరవాలి. అటు ఎండిపోయి దెబ్బతిన్న పంటలకు, ఇటు వడగండ్లతో నష్టపోయిన పంటకు ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలి. చిత్తశుద్ధితో ఆరు గ్యారెంటీల్లో చెప్పిన 13 అంశాలను త్వరగా అమలు చేయాలి. ధైర్యం కోల్పోతున్న రైతు గుండెల్లో భరోసాను నింపాలి. రాక్షస వ్యాఖ్యలు చేయడం మాని రైతులను రక్షించుకునే విధానాన్ని చేపట్టాలి. లేని పక్షంలో తెలంగాణ రైతాంగం ప్రయోజనాల కోసం బీఆర్‌ఎస్ మరొక మహోద్యమానికి శ్రీకారం చుట్టడం ఖాయం.

వ్యాసకర్త మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మొదటికే మోసం



అఫ్గానిస్తాన్ మీద పాకిస్తాన్ విధాన పరిణామం (2001-2024): మేము తాలిబన్లకు మద్దతివ్వము – మేము మంచి తాలిబన్లకు మద్దతివ్వడం ద్వారా భారత ప్రభావాన్ని ఎదుర్కొంటున్నాం – యూఎస్‌ను బయటికి పోయేలా ఒత్తిడి చేయడం ద్వారా తాలిబన్లు బానిస సంకెళ్లను తెంచారు– తాలిబన్లు మా భద్రతకు ప్రమాదకరంగా మారారు.

– హుసేన్ హక్కానీ, పాకిస్తాన్ మాజీ రాయబారి

గట్టి చర్యలు ముఖ్యం



పారిశ్రామిక విప్లవం నుంచి సమస్యేమిటో జనాలకు తెలిసినా దాన్ని మరిచిపోవడమో, లేదా పట్టించుకోకపోవడమో జరిగిందని వాతావరణ సంక్షోభం మనకు మళ్లీ గుర్తుచేస్తోంది. మనం పర్యావరణానికి కీడు కలిగిస్తే మనకు మనం కీడు చేసుకున్నట్టే. మన ఉమ్మడి భవిష్యత్ తప్ప, మనకు విడి భవిష్యత్ అనేది లేదు. పైపై చర్యలతో లాభం లేదు.

– టెడ్రోస్ అడినోమ్ గెహ్‌బ్రియేసుస్, ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్

కాపాడుకుందాం!



నా 'క్లైమేట్ ఫాస్ట్' 17వ రోజు ప్రారంభం: ప్రపంచ జల దినోత్సవ శుభాకాంక్షలు. హిమాలయ మంచుదిబ్బలు వేగంగా కరిగిపోతున్నాయి. లద్దాఖ్‌లోని మన కృత్రిమ మంచుదిబ్బలు ఈ సమస్యను పరిష్కరించలేవు. కానీ మీ వల్ల అవుతుంది. ('సేవ్ లద్దాఖ్' పేరుతో సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ దీక్ష చేస్తున్నారు.)

– సోనమ్ వాంగ్‌చుక్, యాక్టివిస్ట్

అందుకేనా?



జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే 2024 ఎన్నికల్లో బీజేపీ గెలవదని నమ్ముతున్నవాళ్లు కేవలం బీజేపీవాళ్లే అనిపిస్తోంది.

– బోయెట్ డేనియల్, జర్నలిస్ట్

చదవకూడదా?



ఆంత్రోపాలజీ, జర్నలిజం, ఫిలాసఫీ, రిలిజియస్ స్టడీస్, మ్యూజిక్‌తో పాటుగా... కెంట్ విశ్వవిద్యాలయం (యూకే)లోంచి ఆర్ట్ హిస్టరీ సబ్జెక్టును దశలవారీగా తొలగించనున్నారని దృఢ పడింది. ఎంత దారుణమైన నష్టం!

– ఎమిలీ గెరీ, ఆర్ట్ హిస్టారియన్

ఇన్ బాక్స్

సోషలిజం భావనకు కేంద్ర బిందువు

రాం మనోహర్ లోహియా... దేశానికే కాదు, ప్రపంచానికీ అన్ని కాలాల్లో అవసరమైన నాయకుల్లో ఒకరు. దేశ ప్రపంచ పరిస్థితులను క్షుణ్ణంగా అర్థం చేసుకున్న గొప్ప వ్యక్తుల్లో ఒకరు. ఆయన అభిప్రాయాలూ, సిద్ధాంతాలూ, ఆచరణలూ ఎప్పటికీ విశ్వజనీనాలే. రాజకీయ పార్టీలంటే వాటికి విస్పష్టమైన సిద్ధాంతాలుంటాయనీ, ఆ పార్టీల్లో ఆ సిద్ధాంతాలకు కట్టుబడిన వారుంటారనీ... వారు కూడా నిరాడంబరులు, నిజాయితీపరులు, మనవతావాదులై ఉంటారనీ భావించేవారికి లోహియా ఒక స్ఫూర్తి. ప్రజాసేవకు పదవులు అడ్డు వస్తాయనీ, అధికారంలో ఉంటే సర్దుబాటు రాజకీయాలకు తల ఒగ్గవలసివస్తుందనీ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ప్రజల తరఫున పోరాడటం సాధ్యమౌతుందనీ భావించే అరుదైన రాజకీయ నాయకుల్లో లోహియా అగ్రభాగాన ఉంటారు.

స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న సోషలిస్ట్ సిద్ధాంతకర్త లోహియా. స్వాతంత్ర్యానంతరం భారత్‌లో ప్రజాస్వామ్యం, సామ్యవాదాల స్థాపన కోసం కృషి చేసి ఆదర్శ నేత. 1910 మార్చి 23న జన్మించిన లోహియా విద్యార్థి దశ నుండే జాతీయ ఉద్యమంలో పాల్గొన్నారు. సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా చేపట్టిన విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహించారు. ''మార్చ్ 23 అంటే మీకు గుర్తు రావలసింది నా జన్మదినం కాదు, దేశం కోసం అమరులైన భగత్ సింగ్ లాంటి వీరులు'' అని చెప్పిన సిసలైన దేశభక్తుడు. స్వయంగా సోషలిస్ట్ పార్టీ స్థాపించారు. పౌరస్వేచ్ఛకు బలమైన రక్షణతో సామాజిక, రాజకీయ సంస్కరణలు రావాలని సూచించారు. 1963లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. భారత రాజకీయాలలో సోషలిజం భావనకు, సమానత్వానికి లోహియా కేంద్ర బిందువుగా నిలిచారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని లోహియా సంబరపడిపోలేదు. మహాత్మగాంధీ మాదిరే మనకు స్వరాజ్యం వచ్చింది కానీ, సురాజ్యం రాలేదని విశ్వసించారు. లోహియాను కొన్ని విషయాల్లో గాంధీకి వారసుడంటారు. కుల వివక్షకు వ్యతిరేకంగా స్వదేశంలోనే కాదు, విదేశాల్లో కూడా పోరాడారు.



రాం మనోహర్ లోహియా

కేరళలో రైతు ఆందోళనలపై కాల్పులు జరిపి ఐదుగురిని పొట్టనబెట్టుకున్న సొంత సోషలిస్టు పార్టీ ప్రభుత్వాన్నే రద్దు చేయాలన్న డిమాండ్ ఆయన ఆదర్శ రాజకీయాలకు నిదర్శనం. కమ్యూనిస్టులు, మార్క్సిస్టుల సోషలిజానికీ, లోహియా సోషలిజానికీ తేడా ఉంది. అలాగే సోషలిజాన్ని సాధించే మార్గంలో తేడా వుంది. ఫ్రెంచ్ సోషలిస్టుల నుంచి ప్రేరణ పొంది భారత దేశ నిర్దిష్ట పరిస్థితులకు అనుకూలంగా రూపొందింది లోహియా సోషలిజం.

లోహియాపై గాంధీ ప్రభావం ఉంది. అందుకే తాను నిర్మించాలనుకున్న వ్యవస్థ కోసం సాయుధ తిరుగుబాటు కాకుండా శాసనోల్లంఘన మార్గాన్ని చూపించారు. సిద్ధాంతాలు, విధానాలలో సారూప్యతలున్న కారణంగా సోషలిస్టు పార్టీలో చేరాలని అంబేడ్కర్‌ను ఆహ్వానించారు. లోహియా స్వతహాగా నాస్తికుడు. కానీ లౌకికత కోసం పాటుపడ్డారు. ఈయన సోషలిస్టు పార్టీ కారణంగానే 1967 నాటికే వెనుకబడిన సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తులు ముఖ్యమంత్రులు కాగలిగారు. ప్రోస్టేట్ గ్రంథికి సంబంధించిన అనారోగ్యంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన ఆయన 1967 అక్టోబర్ 12న కన్నుమూశారు.

– నందిరాజు రాధాకృష్ణ, వెటరన్ జర్నలిస్ట్ । 98481 28215

(నేడు రాం మనోహర్ లోహియా జయంతి)

'వై నాట్ 175?' నినాదం స్ఫూర్తితో...

అభిప్రాయం



డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి

ఎట్టకేలకు ఎన్నికల నగార మోగింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 4 'సిద్ధం' సభల ద్వారా తమ సత్తా ఏంటో చాటుకుంది. అభ్యర్థులను అన్ని పార్టీల కన్నా ముందే ప్రకటించి ఎన్నికల శంఖారావాన్ని పూరించింది. మొత్తం 175 అసెంబ్లీ నియోజక వర్గాలు, 25 ఎంపీ స్థానాలకు సామాజిక న్యాయాన్ననుసరించి అభ్యర్థులను నిర్ణయించారు వైఎస్సార్‌సీపీ వారు. బీసీలకు అసెంబ్లీ, పార్లమెంటుకు కలిపి మొత్తం 59 టికెట్లు ఇచ్చారు. ఆశ్చర్యమేమిటంటే వీరిలో చాలామంది అతిపేదలు. ఇది రాజకీయానికి ఒక కొత్త నిర్వచనంగా చెప్పవచ్చు. మరోపక్క అప్పటికప్పుడు సూట్‌కేసులతో విమానాలు దిగిన పెద్దలకు మాత్రమే చంద్రబాబు సీట్లు కేటాయిస్తున్నారు. అందులోనూ స్వజాతి పక్షులే ఎక్కువ. సీనియర్లు దిక్కుతోచక దిక్కులు చూస్తున్నారు.

ఇదిలావుంటే 'గండస్యోపరిపిటకవత్' అనే సామెత (గోడదెబ్బ – చెంపదెబ్బ)గా ఇష్టంలేని పొత్తుల వల్ల టీడీపీ – జనసేన కార్యకర్తలు బాహాబాహీ యుద్ధానికి దిగుతున్నారు. ఇక అసలు నాయకుడు ఎన్డీయే పొత్తుకోసం నాలుగు సంవత్సరాలుగా ఎదురు చూసి, చూసి రాయబారాలు పంపీ, పంపీ ఎట్టకేలకు వదినగారి దయతో చేరిపోయారు. తన జన్మధన్య మైందనుకుంటూ రాష్ట్రానికి తిరిగి వచ్చి సీట్ల పంపిణీ ప్రారంభిస్తే... అది పూర్తిగా బెడిసికొట్టి సిగపట్ల వ్యవహారం సీరియస్‌గా సాగుతున్నది. పోనీ సభల ద్వారా వాటిని కవర్ చేసుకుందామంటే వెయ్యి రూపాయలు, క్వార్టర్ బాటిల్, బిర్యానీ ఇచ్చినా తినేసి పోతున్నారు కానీ సభదాకా రావడంలేదు.

'రామేశ్వరం పోయినా శనేశ్వరం పోదనట్లు' మోసాలు, అడ్డదారులు తప్ప నిఖార్సయిన రాజకీయం తెలియని ఈ అబద్ధాల కోరును భరించలేమని జనాలు 2019లోనే అధికారం నుండి తోసేస్తే, అదేమీ గుర్తించకుండా తనకుతానే గొప్పనాయకుడిని అనుకుంటూ మతిలేని ఉపన్యాసాలు ఇస్తున్న ఇతనికి తోడు దత్తపుత్రుడొకరు. రాసిచ్చిన డైలాగులు ఆవేశంలో వూగిపోతూ చదవటం తప్ప సొంత ఆలోచన లేదు పవన్ కల్యాణ్‌కు. ఇక అసలు పుత్రుడిని చూద్దామంటే అతని పేరెత్తితేనే పార్టీ పారిపోతున్నది. ఇప్పుడు చంద్రబాబు కూడా అదేదారిలో ఉన్నాడు. అతడికి సర్టిఫికెట్స్ తప్ప ఏ భాషా రాదు. కొత్తగా వచ్చిన మరో తోడు వదినగారు. ప్రస్తుతం తన ఒక్కసీటు గెలిస్తే చాలు వచ్చే ఎన్డీయే ప్రభుత్వంలో ఎలాగయినా మంత్రిపదవి దక్కించుకోవాలని సొంత పార్టీనే తాకట్టు పెడుతున్నారు.

ఈ నలుగురు ఇలా నడుస్తుంటే... వీళ్ళకేదరు మాత్రం నియోజకవర్గాల్లో తన్నుకోవడంలో యమ బిజీగా ఉన్నారు. సిద్ధాంత బలం లేక రాష్ట్ర ప్రయోజనాల గురించి ఒక్కమాట మాట్లాడలేక పోతున్నారు. కానీ జగన్‌ను తిట్టడానికి మాత్రం ఒకేదారిలో నడుస్తున్నారు. వాళ్ళకున్న సిద్ధాంతమల్లా జగన్ ఓడిపోవాలి. ఎందుకంటే సమాధానం లేదు. వీళ్ళ ఎజెండాలో కులగర్జనలు, మతాల పూత్కా రాలు, ముఖ్యమంత్రి మీద విష ప్రచారాలు నిరంతరం వినిపిస్తూనే ఉన్నాయి. అదుపు తప్పిన కట్టుబాట్లతో, అబద్ధపు రాతలే తమ ధ్యేయ మన్నట్లు కుల అహంకారంతో పిచ్చిరాతలు రాస్తున్నాయి పచ్చ పత్రికలు. ఒక అవినీతిపరుడి కొమ్ముకాస్తూ అవి ఏనాడో విలువల్ని పోగొట్టుకున్నాయి. మరోవైపు మరో దత్తపుత్రిక వచ్చి చేరింది.



అశేష జనవాహిని మధ్య ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి

కుటుంబ వ్యవస్థను నాశనం చేసే విద్యలో ఎన్నో డిగ్రీలు పొందిన చంద్రబాబు మరో కుటుంబ వినాశనానికి పూనుకున్నాడు. ఎన్టీఆర్ కుటుంబాన్ని చీల్చి ఇంటి పెద్దను నాశనం చేసిన ఇతడు, పచ్చగా, సమష్టిగా కష్టాలను సమైక్యంగా ఎదుర్కొని, ఎన్నో ఇబ్బందులను అధిగమించి అధికారాన్ని సాధించుకున్న వైఎస్సార్ కుటుంబం మీద తన వక్రదృష్టి సారించాడు. ఫలితంగా అదికూడా చీలిపోయింది.

ఈ దురాశాపరులు అభివృద్ధిలో నడుస్తున్న ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును నాశనం చెయ్యటానికి కంకణం కట్టుకున్నారు. సామాజిక సహజీవనంతో సౌభ్రాతృత్వంగా వర్ధిల్లుతున్న ఆంధ్రుల ప్రశాంతతను చెరపటానికి ఈ కూటమి ప్రయత్నిస్తున్నది. కానీ ఆంధ్రులు అమాయకులు కాదు. స్వాతంత్ర్య పోరాటం నుండి ఇప్పటి వరకు ఎన్నో రాజకీయాలను, ఎందరో నాయకులను చూసిన అనుభవం వారిది. అందుకే ఈ దుష్టగ్రహ కూటమి సభలకు వెళ్ళకుండా తమ నిరసన తెలియజేస్తూనే ఉన్నారు. వారి ఏ సభ చూసినా, ఖాళీ కుర్చీలే. వీరి పతనం చివరిదశకు చేరిందనటానికి ఇవన్నీ సంకేతాలే.

రాజనీతిజ్ఞుడు, అనుభవజ్ఞుడు అయిన మోదీ ఈ పొత్తుకు సుముఖంగా లేరనే విషయం వారి ప్రవర్తన, ప్రసంగధోరణి చెప్పకనే చెప్పాయి. జగన్ గురించి ఏమీ విమర్శించక పోవటం, వైరి గుండెల్లో గునపాలు గుచ్చినట్లే వుంది. పక్క రాష్ట్రాలయిన తెలంగాణ కర్ణాటక, చెన్నై సభల్లో అక్కడి ముఖ్యమంత్రులను ఏకిపారేశారు మోదీ. ఆ ప్రసంగాలతో పోల్చి చూస్తే ఏపీ ముఖ్యమంత్రిని, ఆయన పాలనను ప్రధాని మెచ్చినట్లే కనిపించింది. ఇంకో విషయం కొంచెం లోతుగా ఆలోచిస్తే అర్థమవుతుంది. అది జగన్ పట్ల వారికున్న అభిమానం. ప్రధానమంత్రి కంటే ఐదు నిమిషాల ముందు ప్రసంగించిన చంద్రబాబు జగన్‌ను విమర్శిస్తూ 'తల్లిని, చెల్లిని చూసుకోలేనివాడు ఈ రాష్ట్రంలో ఆడవాళ్ళ కెలా మేలుచేస్తాడు...' అంటూ తన లేకితనాన్ని ప్రదర్శించుకున్నాడు.

కానీ మోదీ ఆ వ్యాఖ్యల్ని ఖండిస్తున్నట్లుగా 'అన్నా, చెల్లి ఒకటే. ఇది కాంగ్రెస్–వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎత్తుగడ' అంటూ చంద్రబాబు గొప్పగా ప్రయోగించాలనుకున్న షర్మిల అస్త్రాన్ని ఉపసంహరించారు. ప్రైమ్ మినిస్టర్ ముందు జగన్‌ను పెద్ద విలన్‌గా చూపించాలనుకున్న వీళ్ళ ఎత్తుగడను ఆయన చిత్తుచేసి ప్రజల్ని ఒక అయోమయంలో ఉంచి వెళ్ళిపోయారు. 'ఎంకి పెళ్ళి సుబ్బి చావుకొచ్చిందన్నట్లు' ఈ సభ ద్వారా తన బలాన్ని నిరూపించుకోవాలనుకున్న చంద్రబాబుకు, పవన్ కల్యాణ్‌లకు అవమానాలే మిగిలాయి. లక్షల్లో వస్తారన్న జనం రాలేదు. వచ్చిన ప్రధానమంత్రి వీరి పేరయినా ఎత్తలేదు. మరో పక్క పొత్తుకు గండికొడుతున్నాడని బీజేపీ సీనియర్లు అధిష్టానానికి లేఖ రాశారు. ఆ పొత్తు చివరిదాకా వుంటుందో లేదో తెలియదు. జనసైన్యం అసలు సహకరించటం లేదు. ఇక ఓట్లు షేర్ చేసుకునే దెప్పుడు?

'కత్తితో చంపేవాడు ఆ కత్తితోనే చస్తాడు' అన్నట్లు అవగాహన, రాజకీయ సంస్కారం లేని ముఠాలను తయారుచేసుకున్న దత్తపుత్రుడి సైన్యం తమ నాయకుల మీదే తిరుగుబాటు చేస్తోంది. ఎటుచూసినా పంచకూళ్ళ కూటమికి గందరగోళంలా తయారయ్యింది పరిస్థితి. కలసినా ఒకళ్ళనొకళ్ళు ఓడించుకుంటారు.

మరోవైపు జగన్ ఒక్కడే తన సైన్యంతో ముందుకు దూసుకుపోతున్నాడు. అతని ఆయుధం ప్రజాబలం. అతని నినాదం పేదల సంక్షేమం. అతని సైన్యం ఐకమత్యంతో నాయకుడిని అనుసరించే పార్టీ. ఇప్పుడు చెప్పండి – ముఖ్యమంత్రి జగన్ అన్నట్లుగా 'వైనాట్-175?' సాధించి చూపెడదాం – ఆదర్శ రాజ్యాన్ని నిలబెడదాం.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ ఛైర్‌పర్సన్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.త్రయోదశి ఉ.7.24 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** పుబ్బ పూర్తి (24 గంటలు), **వర్జ్యం:** ప.1.38 నుండి 3.22 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.04 నుండి 7.43 వరకు, **అమృతఘడియలు:** రా.12.11 నుండి 2.04 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.07, **సూర్యాస్తమయం:** 6.07.

కాంగ్రెస్ ఖాతాలోకి హాలియా, నందికొండ మున్సిపాలిటీలు

- హాలియా, నందికొండ మున్సిపల్ చైర్‌పర్సన్లుగా అనుపమారెడ్డి, అన్నపూర్ణ

నాగార్జునసాగర్/హాలియా: నల్లగొండ జిల్లా హాలియా, నందికొండ మున్సిపాలిటీలు కాంగ్రెస్ పార్టీ వశమయ్యాయి. హాలియా మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ పార్టీకి చెందిన యడవెల్లి అనుపమారెడ్డి, వైస్‌చైర్‌పర్సన్‌గా పిల్లి చంద్రకళ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నందికొండ మున్సిపల్ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీకి చెందిన తిరుమలకొండ అన్నపూర్ణ, వైస్‌చైర్‌పర్సన్‌గా ఆదాసు నాగరాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హాలియా మున్సిపాలిటీలో 12 వార్డులుండగా మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ 6, బీఆర్‌ఎస్ 6 స్థానాలు గెలిచాయి. ఎమ్మెల్యే ఎక్స్‌అఫీషియో ఓటుతో బీఆర్‌ఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకుంది. అనంతరం రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఇద్దరు బీఆర్‌ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు అన్నెపాక శ్రీనివాస్, ప్రసాద్‌నాయక్ కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కాంగ్రెస్ కౌన్సిలర్ల సంఖ్య ఎనిమిదికి చేరింది. చైర్మన్, వైస్‌చైర్మన్‌పై ఫిబ్రవరి 29న ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో శుక్రవారం చైర్మన్, వైస్ చైర్మన్ కోసం ఎన్నిక నిర్వహించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీకి చెందిన 8 మంది కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లతో పాటు ఎక్స్‌అఫీషియో సభ్యుడైన సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి సమావేశానికి హాజరయ్యారు. కాంగ్రెస్‌కు చెందిన 2వ వార్డు కౌన్సిలర్ యడవెల్లి అనుపమా నరేందర్‌రెడ్డి చైర్‌పర్సన్‌గా 7వ వార్డు కౌన్సిలర్ పిల్లి చంద్రకళ ఆంజనేయులు వైస్ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక నందికొండ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై ఫిబ్రవరి 15న కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో శుక్రవారం నూతన చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిల్‌లో మొత్తం 12 మంది కౌన్సిలర్లు ఉండగా ఒకరు మృతి చెందారు. 11 మంది కౌన్సిలర్లకు గాను 8 మంది సమావేశానికి హాజరై మద్దతు తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కర్ణ అనూషారెడ్డి, మందా రఘువీర్‌కుమార్ అలియాస్ బిన్ని, నిమ్మల ఇందిర సమావేశానికి హాజరుకాలేదు. ఎన్నికైన వారికి ఎన్నికల అధికారి, మిర్యాలగూడ ఆర్డీఓ శ్రీనివాస్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

బీజేపీ నేతృత్వంలో ప్రజాస్వామ్యం ఖూనీ


మహేశ్‌కుమార్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: దేశంలో బీజేపీ నేతృత్వంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ, బి.మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాలుగు బ్యాంకుల్లోని 11 ఖాతాలను స్తంభింపజేయడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎలక్టోరల్ బాండ్ల విషయంలో పెద్ద కుంభకోణానికి పాల్పడిన బీజేపీ.. ఇప్పుడు ప్రజల దృష్టి మరల్చేందుకు కాంగ్రెస్ పార్టీ ఖాతాలను స్తంభింపజేసిందని ఆరోపించారు. దర్యాప్తు సంస్థలను గుప్పిట్లో పెట్టుకుని బీజేపీ దౌర్జన్యానికి పాల్పడుతోందన్నారు.

బ్యారేజీల వైఫల్యం తర్వాత చేసిందేంటి?

డ్యామ్ సేఫ్టీ యాక్ట్ అనుసరించి చర్యలు తీసుకున్నారా?

- లోపాలున్నా నాణ్యత సర్టిఫికెట్లు ఎలా జారీ చేశారు ?
- ఎస్డీఎస్‌ఓ, ఓ అండ్ ఎం, క్వాలిటీ కంట్రోల్‌పై అయ్యర్ కమిటీ ప్రశ్నల వర్షం
- ముగిసిన అయ్యర్ కమిటీ మూడు రోజుల పర్యటన
- అడిగిన సమాచారమిచ్చాకే అత్యవసర పనులను సిఫారసు చేస్తామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సీపేజీలు ఏర్పడిన తర్వాత డ్యామ్ సేఫ్టీ యాక్ట్ ప్రకారం తీసుకున్న చర్యలేంటి? ఏమైనా కమిటీలు వేసి, విచారణ జరిపారా? వైఫల్యానికి కారణాలను నిర్ధారించారా?.. అని స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎస్డీఎస్‌ఓ)ను చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ ప్రశ్నించింది. మూడు రోజుల రాష్ట్ర పర్యటనలో భాగంగా చివరి రోజు శుక్రవారం నిపుణుల కమిటీ ఎస్డీఎస్‌ఓ, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) అధికారులతో సమావేశమై బ్యారేజీల రక్షణకు తీసుకున్న చర్యలపై ఆరా తీసింది. 2024 ముగిసే వరకు బ్యారేజీల నిర్వహణ నిర్మాణ సంస్థల చేతుల్లోనే ఉండటంతో వార్షిక మరమ్మతులపై ఎలాంటి నివేదికలు తమకు అందలేదని, బ్యారేజీల్లో లోపాలు ఉన్నట్లు క్షేత్రస్థాయి సిబ్బందీ నివేదించలేదని అధికారులు బదులిచ్చినట్టు తెలిసింది. బ్యారేజీల నిర్మాణంలో పాలుపంచుకున్న అధికారులను కమిటీ ప్రశ్నించింది. డిజైన్లు, డ్రాయింగ్స్‌ను అనుసరించి పనులు చేశారా? మధ్యలో ఏమైనా మార్పులు చేశారా? అని కమిటీ అడగ్గా, డిజైన్ల ప్రకారమే నిర్మించినట్టు అధికారులు బదులిచ్చారు. బ్యారేజీల నిర్మాణం పూర్తయిన తర్వాత తొలి వరదలకే మూడు బ్యారేజీల కింద సీసీ బ్లాకులు కొట్టుకుపోయి అప్రాన్ దెబ్బతిన్నా నాణ్యత సర్టిఫికెట్లు ఎలా జారీ చేశారని కమిటీ ప్రశ్నించింది. ఐఎస్ కోడ్ ప్రకారమే నిర్మాణ పనులు జరిగినట్లు గుర్తించి, సర్టిఫికెట్లు ఇచ్చామని క్వాలిటీ కంట్రోల్ అధికారులు బదులిచ్చారు. కాగా, రాజేంద్రనగర్‌లోని తెలంగాణ ఇంజనీరింగ్ రీసెర్చ్ లేబొరేటరీని అయ్యర్ కమిటీ సందర్శించి కాళేశ్వరం బ్యారేజీలకు సంబంధించిన నమూనా బ్యారేజీల పనితీరును పరిశీలించింది.



అత్యవసర రక్షణ చర్యలు సూచించండి

వర్షాకాలం ప్రారంభానికి ముందే బ్యారేజీల రక్షణకు అత్యవసరంగా తీసుకోవాల్సిన చర్యలను సిఫారసు చేయాలని అయ్యర్ కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీ (జనరల్) జి.అనిల్ కుమార్ కమిటీతో సమావేశమై ఈ అంశంపై చర్చించారు. మంగళవారంలోగా తాము అడిగిన మొత్తం సమాచారాన్ని అందిస్తే అత్యవసర పనులను సిఫారసు చేస్తామని అయ్యర్ వారికి హామీ ఇచ్చారు. బ్యారేజీల రక్షణకు తీసుకోవాల్సిన అత్యవసర పనులను ఈఎన్సీ అనిల్‌కుమార్ కమిటీకి ప్రతిపాదించి అభిప్రాయాన్ని కోరగా, పరిశీలించి చెప్తామని కమిటీ బదులిచ్చింది. ఆ పనులు ఇలా ఉన్నాయి..

- ఒరిజినల్ డిజైన్లకు అనుగుణంగా బ్యారేజీలను పునరుద్ధరించేలా.. సంబంధిత ఇండియన్ స్టాండర్డ్ (ఐఎస్) కోడ్స్ ప్రకారం నిర్వహణ, పర్యవేక్షణ పనులను నిర్మాణ సంస్థలు చేపట్టాలి.
- బ్యారేజీల పునాదుల (ర్యాఫ్ట్) కింద ఇసుక కొట్టుకుపోయి ఏర్పడిన ఖాళీలను ప్రెజర్ గ్రౌటింగ్ ద్వారా భర్తీ చేసేందుకు తగిన పద్ధతులను అవలంబించాలి.
- బ్యారేజీలు పూర్తిగా నిండి ఉన్నప్పుడు గేట్లను తక్కువగా ఎత్తి స్వల్ప పరిమాణంలో నీళ్లను విడుదల చేసినప్పుడు తీవ్ర ఉధృతితో వరద బయటకు పొంగివస్తుంది. దీంతో బ్యారేజీల దిగువన భారీ రంధ్రాలు పడుతున్నాయి. ఇలా జరగకుండా స్వల్ప మోతాదుల్లో నీళ్లను విడుదల చేసేందుకు బ్యారేజీల్లో అనువైన చోట కొత్తగా రెగ్యులేటర్లను నిర్మించాలి.
- 3డీ మోడల్ స్టడీస్ ఆధారంగా బ్యారేజీల ఎగువన, దిగువన ప్రవాహాలకు అడ్డంగా ఉండే రాళ్లను తొలగించాలి.
- బ్యారేజీలకి ఎగువ, దిగువన పేరుకుపోయిన ఇసుకను నీటిపారుదల శాఖ పర్యవేక్షణలో శాస్త్రీయంగా తొలగించాలి.
- వానాకాలంలో గేట్లన్నీ తెరిచే ఉంచాలి.
- మేడిగడ్డ బ్యారేజీ 7వ బ్లాక్‌లో జామ్ అయిన గేట్లను తొలగించాలి. ఈ బ్లాక్‌కు స్టీల్ షీట్ పైల్స్‌ను అదనంగా ఏర్పాటు చేయాలి.

సమాచారం అందిన తర్వాతే స్పష్టత: చంద్రశేఖర్ అయ్యర్

కాళేశ్వరం బ్యారేజీలపై లోతుగా అధ్యయనం చేయాల్సి ఉందని, అన్ని పత్రాలు పరిశీలించిన తర్వాతే బ్యారేజీల వైఫల్యాలపై ఒక అంచనాకు రాగలమని చంద్రశేఖర్ అయ్యర్ స్పష్టం చేశారు. పర్యటన ముగిసిన తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. మరికొంత సమాచారాన్ని కోరామని, అందిన తర్వాతే స్పష్టత వస్తుందన్నారు.

'దేశ' ముదుర్లు

- కాంగ్రెస్ ఖాతాలోకి సీఎం రమేశ్ రూ. 30 కోట్లు..
- చెప్పినట్టల్లా ఆడటానికి కాంగ్రెస్‌కు ప్యాకేజీ పంపిన బాబు

(సాక్షి, అమరావతి): తెలుగుదేశం పార్టీ... కాంగ్రెస్ వేరు వేరు కాదని, రాష్ట్రంలో కాంగ్రెస్‌ను చంద్ర బాబే డబ్బులిచ్చి మరీ నడిపిస్తున్నారని మరోసారి స్పష్టంగా ఆధారాలతో సహా బయటపడింది. అవసరాల కోసం, కేసుల నుంచి రక్షణ కోసం చంద్రబాబు నాయుడు ప్రస్తుతం బీజేపీతో పొత్తు పెట్టుకున్నా... అధికారికంగా జనసేనతోను, అనధికారికంగా కాంగ్రెస్‌తోను అంటకాగుతూనే ఉన్నారని స్పష్టంగా వెల్లడయింది. ఇందుకోసం చంద్రబాబు తన నమ్మిన బంటు సీఎం రమేశ్ ద్వారా... కాంగ్రెస్ పార్టీకి భారీ ప్యాకేజీ అందజేసినట్లు నేరుగా ఎలక్టోరల్ బాండ్లే వెల్లడించాయి. అది కూడా తెలంగాణలోను, కాంగ్రెస్‌లోను ఎన్ని కలకు ముందు ఏకంగా 30 కోట్ల రూపాయలను అధికారికంగా పార్టీ ఫండ్ కింద చంద్రబాబు నాయుడు పంపించినట్లు వెల్లడయింది. ఇక అనధికారికంగా ఎంత ముట్టజెప్పారన్నది ఊహించటం కష్టమే. వీటన్నిటికీ తోడు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని ఎలా మోశారో... కాంగ్రెస్ కోసం తన పార్టీని ఎన్నికల్లో పోటీ చేయించకుండా ఎలా కట్టడి చేశారో తెలియనివేమీ కావు. నిజానికి కడప జిల్లాకు చెందిన సీఎం రమేశ్ ఇపుడు బీజేపీలో ఉన్నా... నూటికి నూరుపాళ్లూ టీడీపీ మనిషి. చంద్రబాబు సీఎంగా ఉన్నపుడే ఆయన రిత్విక్ ప్రాజెక్ట్స్ సంస్థను ఆరంభించి... భారీ కాంట్రాక్టులు పొందారు. సింగపూర్, మారిషస్‌ల నుంచి నిధులు తెచ్చుకుని చాలా తక్కువ కాలంలోనే వేల కోట్లకు ఎదిగాడు. అందుకే... 2019లో తాను ఓడిపోగానే సీఎం రమేశ్‌ను బీజేపీలోకి పంపించేశాడు చంద్రబాబు. ఇక అప్పటి నుంచి బీజేపీలో ఉంటూనే... నారా వారి ప్రయోజనాల కోసం సకల కార్యాలూ చక్కబెట్టడం మొదలెట్టాడు సీఎం రమేశ్. అలాంటి రమేశ్... బీజేపీలో ఉంటూ బీజేపీకి ఒక్క పైసా కూడా అధికారికంగా ఇవ్వకపోయినా... రూ.30 కోట్లను మాత్రం బీజేపీకి బద్ధ శత్రువైన కాంగ్రెస్ ఖాతాలో వేయటం అందరినీ ఆశ్చర్యపరిచేదే.

జగన్ టార్గెట్‌గా బాబు పావులు..: 2019లో ప్రజా క్షేత్రంలో దారుణంగా ఓడిపోయినప్పటి నుంచీ చంద్రబాబు ఎన్ని పాచికలు వేసినా పారటం లేదు. ఆ తరవాత జరిగిన స్థానిక ఎన్నికలతో సహా ప్రతి ఎన్నికలోనూ ఘోరమైన ఓటమి పాలవుతుండటంతో వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డిని నేరుగా ప్రజాక్షేత్రంలో ఢీకొనటం కష్టమని తెలుసుకుని మాయోపాయాలకు దిగాడు. వైఎస్ వివేకా హత్య కేసును ఆసరాగా చేసుకుని ఆయన కుటుంబీకుల్లో చిచ్చు పెడితే వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డిని ఇబ్బంది పెట్టవచ్చనే నిర్ణయానికి వచ్చి.. ఆ దిశగా పావులు కదిపాడు. హత్య కేసులో తన భర్త పాత్ర బయటపడి ఇరుక్కుంటామేమోనని భయపడు తున్న సునీతను చేరదీయటంతో పాటు అధికారం ఆశ చూపించి వైఎస్ షర్మిలనూ తమ వైపు తిప్పుకున్నారు. వారు గనక తెలుగుదేశంలో నేరుగా చేరితే తమ మాట లెవరూ నమ్మరన్న ఉద్దేశంతో... తన సన్నిహితుడు రేవంత్‌రెడ్డి ద్వారా కాంగ్రెస్‌లో ఆమె పార్టీని విలీనం చేయించటం వంటి కార్యక్రమాలను చేయించాడు. ఇదే సమయంలో ఈ కార్యక్రమాలన్నీ చేయటానికి కాంగ్రెస్‌కు తన బంటు సీఎం రమేశ్ ద్వారా రూ.30 కోట్లను ఎలక్టోరల్ బాండ్ల ద్వారా అందజేశారు. నిజానికి ఎలక్టోరల్ బాండ్ల విషయంలో చాలా కంపెనీలు 2019 ఎన్నికల ముందు కొనుగోలు చేసి ఆయా పార్టీలకు అందజేశాయి. సీఎం రమేశ్ మాత్రం 2023లోనే తన రిత్విక్ ప్రాజెక్ట్ ద్వారా రూ.45 కోట్ల మేర ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేసి, అందులో రూ.30 కోట్లను కాంగ్రెస్ ఖాతాలోకి, రూ.5 కోట్లను తెలుగుదేశం ఖాతాలోకి, మరో 10 కోట్లను కర్ణాటకకు చెందిన జనతాదళ్ (ఎస్) ఖాతాలోకి వేశారు.

కాంగ్రెస్‌లో మారిన పరిణామాలు..: తెలుగుదేశం తరపున రాజ్యసభకు ఎన్నికై బీజేపీలో కొనసాగుతూ... కాంగ్రెస్‌కు భారీగా నిధులిచ్చిన సీఎం రమేశ్... ఇటీవల చంద్రబాబును ఢిల్లీలో బీజేపీ పెద్దలు కలవటానికి కూడా ఇష్టపడనప్పుడు మొత్తం వ్యవహారాన్ని వెనక ఉండి నడిపించారు. మొత్తానికి బీజేపీ పెద్దల అపాయింట్‌మెంట్లు సంపాదించి బాబును వారితో భేటీ అయ్యేలా చేశారు. ఇక వాళ్లేం చెబితే అది చేస్తానని చంద్రబాబు సాగిలపడటంతో వారు కూడా పొత్తుకు సరేనన్న విషయం బహిరంగ రహస్యమే. ఆ విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా నేరుగానే చెప్పారు. బాబుకు బుద్ధొచ్చింది కనకనే తిరిగి తమ వద్దకు వచ్చాడని ఆయన చెప్పగా... గతంలో చంద్రబాబుజీ... నాయుడుజీ అన్న ప్రధాన మంత్రి మోదీ... ఇటీవల చిలకలూరిపేట సభలో మాత్రం నేరుగా చంద్రబాబు అని మాత్రమే... అదికూడా ఒక్కసారే సంబోధించడం గమనార్హం. బాబు మాత్రం మోదీజీ అంటూ అతివినయం ప్రదర్శించటం ఎవ్వరి దృష్టినీ దాటిపోలేదు కూడా. కాకపోతే సీఎం రమేశ్ కాంగ్రెస్ పార్టీకి నిధులిచ్చాక పరిణామాలు వేగంగా మారాయి. కాంగ్రెస్‌లో షర్మిల పార్టీని విలీనం చేయటంతో పాటు ఆమెను కాంగ్రెస్ పార్టీ ఏపీ అధ్యక్షురాలిగా నియమించారు. నాటి నుంచీ ఆమె నేరుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే టార్గెట్‌గా చేసుకుని విమర్శలు చేస్తున్నారు. వైఎస్ వివేకా కుమార్తె సునీతకు కూడా తాను అండగా ఉన్నానని చెబుతూ... వివేకా హత్య విషయంలో కూడా జగన్‌మోహన్ రెడ్డిపై విమర్శలకు దిగారు. ఒక దశలో వివేకా భార్యను గానీ, సునీతను గానీ కడపలో పోటీ చేయించాలని భావించి.. ఇపుడు మాత్రం చంద్రబాబు సూచనలతో నేరుగా తానే పోటీకి దిగే ప్రయత్నాలూ చేస్తున్నారు. కాకపోతే ఇప్పటిదాకా ఈ వ్యవహారాలపై ఎన్ని విమర్శలొచ్చినా కాంగ్రెస్‌తో తమకేం సంబంధమంటూ చంద్రబాబు దాటవేశారు. కాకపోతే సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎన్నికల కమిషన్ ఎలక్టోరల్ బాండ్ల మొత్తం వివరాలన్నీ బయట పెట్టింది. ఎవరు కొన్నారు? ఏ పార్టీకి ఇచ్చారు? ఎంత ఇచ్చారు? అనే వివరాలన్నీ వెల్లడించటంతో.. సీఎం రమేశ్ సంస్థ కాంగ్రెస్ పార్టీకి 30 కోట్లు ఇచ్చిన వ్యవహారం బట్టబయలయి.. దొంగలు రెడ్ హ్యాండెడ్‌గా దొరికారు.

ఏప్రిల్ 1 నుంచి యాసంగి కొనుగోళ్లు

- 75.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- రాష్ట్రవ్యాప్తంగా 7,149 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్.చౌహాన్



సాక్షి, హైదరాబాద్: ఏప్రిల్ 1వ తేదీ నుంచే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. యాసంగి సీజన్ ధాన్యం సేకరణకు రాష్ట్రవ్యాప్తంగా 7,149 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ సీజన్‌లో 75.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు రాష్ట్ర పౌర సరఫరాలశాఖ కమిషనర్ డీఎస్.చౌహాన్ వెల్లడించారు. యాసంగి ధాన్యం సేకరణపై రాష్ట్రంలోని ఆయా జిల్లాల అదనపు కలెక్టర్లు, వివిధ శాఖ అధికారులతో కమిషనర్ హైదరాబాద్‌లో శుక్రవారం సమీక్షించారు. యాసంగి ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచులు, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తేమ యంత్రాలు, కాంటాలు సమకూర్చటం తదితర మౌలిక వసతుల ఏర్పాట్లు, ఇతర కార్యాచరణ ప్రణాళికపై ఈ సమావేశంలో చర్చించారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ధాన్యం సేకరణ ప్రారంభించి సెప్టెంబరు 30 తేదీ వరకు మిల్లింగ్ ప్రక్రియ పూర్తిచేసి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

బకాయి సీఎంఆర్‌పై సీరియస్

సీఎంఆర్ పాత బకాయిలు 30 లక్షల మెట్రిక్ టన్నులు ఉండటంపై కమిషనర్ చౌహాన్ సీరియస్ అయ్యారు. నెలలు, ఏళ్ల తరబడి సీఎంఆర్ బకాయిలు ఎందుకు ఉంటున్నాయని అడిషనల్ కలెక్టర్లు, డీఎంలు, డీఎస్‌ఓలను ప్రశ్నించారు. బ్యాంకుల్లో అప్పులు తీసుకొని రైతుల నుంచి ధాన్యం సేకరిస్తున్నప్పుడు సకాలంలో సీఎంఆర్ ఇస్తేనే సర్కార్‌కు భారం ఉండదని, అప్పులు, వడ్డీల భారం నుంచి ప్రభుత్వానికి విముక్తి లభిస్తుందన్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి ప్రారంభమయ్యే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైస్‌మిల్లర్లు, రేషన్ డీలర్లు, ఇతరత్రా ప్రైవేట్ వ్యక్తులెవరూ కనిపించవద్దని హెచ్చరించారు. కేవలం ప్రభుత్వ సిబ్బంది మాత్రమే సెంటర్లలో ఉండాలని ఆదేశాలు జారీచేశారు. తాను స్వయంగా వచ్చి కొనుగోలు కేంద్రాల్లో తనిఖీలు నిర్వహిస్తానని చెప్పారు. ఎఫ్‌సీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ధాన్యం సేకరణ చేయాలని, ఇష్టారాజ్యంగా తరుగు తీయొద్దని, రైతులను ఇబ్బంది పెట్టొద్దని అధికారులకు సూచించారు. గతేడాదికి సంబంధించి 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని టెండర్ల ప్రక్రియలో విక్రయించామని, తక్షణమే మిల్లుల నుంచి ధాన్యం ఖాళీ చేయించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఎక్కువ రోజులు నిల్వ ఉంటే ధాన్యం రంగు మారుతుందని, నాణ్యత దెబ్బతింటుందని, కొత్తగా వచ్చే ధాన్యానికి స్థలం లేకుండా పోతుందని చెప్పారు. పాత ధాన్యం నిల్వలు ఎక్కడైనా ఉండి... నాణ్యత ఉంటే మిల్లింగ్ చేసిస్తే తీసుకుంటామని, ఆసిఫాబాద్, కరీంనగర్‌లో తనిఖీలు నిర్వహించి, స్టాక్ పరిశీలించి మిల్లింగ్‌కు ఆదేశాలు ఇచ్చినట్లు కమిషనర్ తెలిపారు. ఈ సీజన్‌లో రాష్ట్రంలో 66 లక్షల ఎకరాల్లో వరి సాగైందని. 121 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాలు ఉన్నాయని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు 75 లక్షల మెట్రిక్ టన్నుల పైచిలుకు ధాన్యం వస్తుందని రావొచ్చని ఆయన తెలిపారు.

ఎన్‌కౌంటర్లన్నీ పోలీస్ హత్యలే

- రేపటి రాష్ట్రబంద్‌ను జయప్రదం చేయండి
- మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): కోళ్లమర్క అటవీ ప్రాంతంలో ఈ నెల 19న జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) పేర్కొంది. ఎన్‌కౌంటర్లన్నీ పోలీసు హత్యలేనని, దీనికి నిరసనగా ఈ నెల 24న తెలంగాణ రాష్ట్ర బంద్‌కు ఆ పార్టీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ శుక్రవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. గడ్చిరోలి జిల్లా అహేరీ తాలూకా కోళ్లమర్క అడవిలో డీవీసీఎంలు మంగు, వర్గేశ్, పీఎంలు రాజు, బుద్రామ్‌లకు విషం పెట్టి ప్రాణాలతో పట్టుకుని క్రూరంగా హింసించి ఉదయం 6 గంటలకు కాల్చిచంపి ఎదురుకాల్పుల కట్టుకథ అల్లారని, మృతదేహాలను కూడా చూపించలేకపోయారని ఆరోపించారు. మృతదేహాలకు రీపోస్టుమార్టం చేయాలని, ఈ ఎన్‌కౌంటర్‌పై హైకోర్టు న్యాయమూర్తితో వెంటనే విచారణ జరిపించి బాధ్యులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని, బూటకపు ఎన్‌కౌంటర్‌లో అశువులు బాసిన అమర వీరుల ఆశయాలను కొనసాగిస్తామని, వారి లక్ష్యసాధనకు పోరాడుతూ నిజమైన నివాళి అర్పిస్తామని పేర్కొన్నారు.

భూమి రికార్డుల్లో నమోదు కాలేదని..

- మనస్తాపంతో రైతు ఆత్మహత్య
- భూమిని రికార్డుల్లో ఎక్కించడానికి డబ్బులు తీసుకున్న రెవెన్యూ అధికారులు
- తర్వాత చేతులెత్తేసిన వైనం

బచ్చన్నపేట: జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పడమటికేశ్వాపూర్‌కు చెందిన కొమ్మాట రఘుపతి (45) అనే రైతు శుక్రవారం తన వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యమే కారణమని మృతుని కుటుంబ సభ్యులు తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రఘుపతికి కొన్నె గ్రామ శివారులో 75, 76 సర్వేనంబర్లలో కలిపి మూడు ఎకరాల 10 గుంటల భూమి ఉంది. అందులో వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. అయితే 76 సర్వే నంబర్‌లోని ఎకరం 20 గుంటల భూమి రికార్డుల్లో లేకపోవడంతో ఏడాదిన్నర క్రితం భూమిని కొలవడానికి ఫీజు చెల్లించగా.. సర్వేయర్ కె.రవీందర్ భూమిని కొలతవేసి.. ఈ భూమి నీదేనని రికార్డులో ఎక్కించడానికి రూ.6 లక్షలు అవుతాయని చెప్పి, సీనియర్ అసిస్టెంట్ కొలిపాక సుమన్‌ను కలవాలని సలహా ఇచ్చాడు. ఆ మేరకు రఘుపతి.. సుమన్ వద్దకు వెళ్లి రూ.4.50 లక్షలు ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకుని ఒకసారి రూ.2 లక్షలు, మరోమారు రూ.2.50 లక్షలు సర్వేయర్ రవీందర్ ద్వారా చెల్లించాడు. అయితే భూమి నమోదుకోసం రఘుపతి 14 నెలలుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. ఈ క్రమంలో 15 రోజుల క్రితం 'ఆ భూమి వేరే వ్యక్తుల పేరున రికార్డు అయింది.. నీ పేరు మీదకు రావడం కష్టం'అని సుమన్, రఘుపతికి చెప్పాడు. దీంతో తాను ఇచ్చిన డబ్బులు తిరిగివ్వాలని అడగ్గా పై అధికారులకు ముట్టాయంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. వారం రోజుల క్రితం మళ్లీ వెళ్లినా ఫలితం దక్కలేదు.


రఘుపతి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఆర్థిక ఇబ్బందులతో..

రఘుపతి గత ఏడాది కూతురు వివాహం చేశాడు. ఇందుకు పలువురి వద్ద అప్పు తీసుకున్నాడు. వాళ్ల డబ్బులు అడగడంతో పది రోజుల క్రితం తనకున్న రూ.3 లక్షల విలువైన మూడు పాడి ఆవులు, గేదెలను రూ.1.10 లక్షలకు విక్రయించాడు. దీనికితోడు రెవెన్యూ అధికారులకు ఇచ్చిన డబ్బులు తిరిగి రావన్న మనస్తాపంతో శుక్రవారం తన వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరి వేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు రఘుపతి మృతదేహాన్ని తీసుకువచ్చి గ్రామస్తులతో కలసి రెవెన్యూ కార్యాలయం ఎదుట రెండు గంటల పాటు ధర్నా చేశారు.

సాగు చేస్తేనే 'భరోసా'!

▶ మొదటి పేజీ తరువాయి

కసరత్తు జరుగుతున్నట్టు ఒక ఉన్నతాధికారి తెలిపారు.

రైతుల నుంచి వ్యతిరేకత వస్తే ఎలా?

రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకునేందుకు, దుక్కుల సమయంలో అయ్యే ఖర్చుల కోసం సీజన్ కన్నా ముందే పెట్టుబడి సాయం అందించేలా గత ప్రభుత్వం 2018లో 'రైతు బంధు'పథకాన్ని తెచ్చింది. పంటలు సాగు చేసినా, చేయకున్నా.. సాగుభూముల కింద నమోదై ఉన్న అన్ని భూములకు 'రైతుబంధు' సాయం అందించింది. అలాంటిది ఇప్పుడు పంటల సాగు మొదలయ్యాక, చివరిలో ఆర్థిక సాయం ఇస్తే రైతులకు ఇబ్బంది అవుతుందని అధికారులు తర్జనభర్జన పడుతున్నట్టు సమాచారం. ఈ క్రమంలో సీజన్‌కు ముందే ఆర్థిక సాయం చేసి, ఒకవేళ ఎవరైనా రైతులు సాగుచేయనట్టు తేలితే.. వారికి తదుపరి సీజన్‌లో ఆర్థిక సాయానికి కోత పెట్టే ప్రతిపాదనలు కూడా వచ్చినట్టు తెలిసింది. కానీ దీనిపై రైతుల నుంచి వ్యతిరేకత రావొచ్చన్న సందేహాలు నెలకొన్నాయి. దీనితో మార్గదర్శకాల రూపకల్పన కత్తిమీద సాములా మారినట్టు అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

యాసంగిలో సగానికిపైగా తగ్గనున్న సాయం!

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఏటా ఎకరానికి రూ.15 వేల చొప్పున 'రైతు భరోసా'ఇస్తామని ప్రకటించింది. ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టిన తర్వాత.. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ సందర్భంగా 'రైతుబంధు'ను పునఃసమీక్షిస్తామని ప్రకటించింది. వచ్చే వానాకాలం సీజన్ నుంచి కొత్త మార్గదర్శకాల ప్రకారం రైతు భరోసా పథకం అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో పంటలు సాగుచేసే భూములకే రైతుభరోసా ఇస్తే పెట్టుబడి సాయం వ్యయం భారీగా తగ్గుతుందని అంచనా. ఉదాహరణకు గత వానాకాలం సీజన్‌లో 1.52 కోట్ల ఎకరాలకు రైతుబంధు సాయం అందగా.. అప్పుడు సాగైన భూమి 1.26 కోట్ల ఎకరాలే. ఇకపై ఇలా పంటలు వేయని 26 లక్షల ఎకరాలకు రైతుభరోసా సొమ్ము అందదు. ఇక ప్రస్తుత యాసంగిలో ఇప్పటివరకు 66.30 లక్షల ఎకరాల్లో పంటలు సాగుచేశారు. కొత్త సర్కారు నిర్ణయం మేరకు.. వీటికి మాత్రమే ఆర్థిక సాయం అందుతుంది. మిగతా 85.70 లక్షల ఎకరాలకు సంబంధించి రైతులకు సొమ్ము అందే పరిస్థితి ఉండదు. రెండు సీజన్లకు కలిపి గతంలో సుమారు 3.04 కోట్ల ఎకరాలకు రైతు బంధు సాయం అందగా.. ఇప్పుడు దాదాపుగా 2.09 కోట్ల ఎకరాలకే పరిమితం కానుందని అంచనా వేస్తున్నారు. అంటే 98 లక్షల ఎకరాలకు రైతుభరోసా అందదని పేర్కొంటున్నారు.

పరిమితం చేసేందుకే మొగ్గు

బీఆర్‌ఎస్ సర్కారు రైతుబంధు పథకం మొదలుపెట్టిన నాటి నుంచి గత వానాకాలం సీజన్ వరకు మొత్తంగా రైతులకు రూ.72,815 కోట్లు అందజేసింది. ఇందులో గత వానాకాలంలో 1.52 కోట్ల ఎకరాలకు సంబంధించి 68.99 లక్షల మంది రైతులకు రూ.7,625 కోట్లు అందజేసింది. యాసంగి సీజన్ కొనసాగుతున్న సమయంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు.. ఈ సీజన్‌కు సంబంధించి గతంలో మాదిరే రైతులకు ఆర్థిక సాయం ఇస్తామని ప్రకటించింది. అంటే 1.52 కోట్ల ఎకరాలకు సంబంధించి రూ.7,625 కోట్లు విడుదల చేయాలి. అయితే ఇప్పటివరకు నాలుగైదు ఎకరాల మేర భూమి ఉన్న రైతులకే ఆర్థిక సాయం అందిందని వ్యవసాయశాఖ వర్గాలు చెప్తున్నాయి. గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఐదెకరాల వరకే రైతుబంధు ఇస్తున్నట్టు చెప్పారు. అంటే యాసంగికి సంబంధించి కూడా ఐదెకరాల వరకు ఉన్న భూములకే ఆర్థిక సాయం పరిమితం కానుంది. రాష్ట్రంలో ఐదెకరాల లోపు భూమి ఉన్న రైతుల సంఖ్య 62.34 లక్షల మంది కాగా.. వారి చేతిలో కోటి ఎకరాల భూమి ఉంది. అంటే రైతుబంధు అందుకుంటున్న రైతుల్లో ఐదెకరాల్లోపు రైతులే 90.36 శాతం ఉన్నారని వ్యవసాయ వర్గాలు చెప్తున్నాయి.

ఆమ్ ఆద్మీ భవితవ్యం ఏమిటీ?

- కేజ్రీ అరెస్టును తట్టుకుని నిలిచేనా!
- పార్టీలో ఆయన స్థానాన్ని భర్తీ చేసే నేతలేరీ?
- ఇప్పటికే జైలుపాలైన సిసోడియా తదితరులు
- లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీ, పంజాబ్‌ల్లో భారీ దెబ్బే



'ఆమ్ ఆద్మీ పార్టీకి జరగకూడని వేళ, జరగకూడనంతటి భారీ నష్టం'

ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఆప్ జాతీయ సమన్వయకర్త, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టుపై సర్వత్రా వ్యక్తమవుతున్న అభిప్రాయమిది. రాజకీయ నిపుణుల నుంచి సామాన్య ప్రజల దాకా ఇదే భావన నెలకొని ఉందంటే అతిశయోక్తి కాదు. కాంగ్రెస్‌తో పాటు దేశవ్యాప్తంగా పలు విపక్షాల భవితవ్యాన్ని తేల్చేస్తాయని భావిస్తున్న అత్యంత కీలకమైన లోక్‌సభ ఎన్నికల వేళ జరిగిన ఈ అరెస్టు ఆప్‌కు నిజంగా కోలుకోలేని దెబ్బే. ఎందుకంటే ఆ పార్టీకి సర్వం కేజ్రీవాలే. ఆయన స్థాయిలో ఓటర్లను ప్రభావితం చేయగల నాయకులెవరూ లేరు. కాస్తో కూస్తో జనాకర్షణ ఉన్న మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా ఇప్పటికే ఇదే కేసులో జైల్లో మగ్గుతున్నారు. దాంతో సహజంగానే పార్టీ సారథిగా, సీఎంగా కేజ్రీవాల్ స్థానాన్ని తాత్కాలికంగా భర్తీ చేయగల స్థాయి ఉన్న నేతలెవరూ ఆప్‌లో కన్పించడం లేదు. కేజ్రీయే సీఎంగా కొనసాగుతారని, అవసరమైతే జైలు నుంచే పాలన కొనసాగిస్తారని ఆ పార్టీ నేతలు చేస్తున్న ప్రకటనల అంతర్యమూ అదే. చట్టపరంగా అందుకు అడ్డంకులేమీ లేకపోయినా జైలునుంచి సీఎంగా కొనసాగడం అసాధ్యమేనన్న అభిప్రాయం సర్వత్రా విన్పిస్తోంది. అందులో ఇమిడి ఉన్న రాజ్యాంగపరమైన సవాళ్లను ఎత్తిచూపుతూ రాష్ట్రపతి పాలనకు లెఫ్టినెంట్ గవర్నర్ సిఫార్సు చేస్తారని, చివరికి ఢిల్లీ రాష్ట్రపతి పాలనలోకి వెళ్లవచ్చని రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అదే జరిగితే ఆప్ పరిస్థితి మూలిగే నక్కపై తాటిపండు చందమే అవుతుంది. సమస్యలు కూడా రెట్టింపవుతాయి. ఏదేమైనా 12 ఏళ్ల ఆ పార్టీ ప్రస్థానంలో ఎన్నడూ లేనంత అతి పెద్ద సమస్యను ప్రస్తుతం ఎదుర్కొంటోంది. జాతీయ పార్టీగా మారడమే గాక పంజాబ్‌లోనూ అధికారం చేజిక్కించుకుని, దేశవ్యాప్తంగా మరింతగా విస్తరించే ప్రయత్నాల్లో ఉన్న ఆప్, ఏకంగా తన ఉనికికే సవాలుగా మారిన ఈ పెను గండం నుంచి బయట పడగలదా అన్నది వేచి చూడాల్సిన అంశమే.

చాలాకాలం జైల్లోనే...?

ఆప్ నేతలు సిసోడియా, సత్యేంద్ర జైన్, సంజయ్ సింగ్ తరహాలోనే కేజ్రీవాల్ కూడా ఇప్పట్లో జైలు నుంచి బయటికొచ్చే అవకాశాలు కన్పించడం లేదు. అదే జరిగితే ఆప్ మనుగడే ప్రమాదంలో పడవచ్చు. ఢిల్లీలోని 7 లోక్‌సభ స్థానాలకు ఆరో విడతలో మే 25న, పంజాబ్‌లోని 13 స్థానాలకు జూన్ 1న ఏడో విడతలో పోలింగ్ జరగనుంది. కీలకమైన రెండు నెలలూ ఆప్‌ను అనుక్షణం నాయకత్వ లేమి వేధించనుంది. ఢిల్లీ, పంజాబ్‌లో కేజ్రీవాల్ ప్రచారంపైనే పార్టీ ప్రధానంగా ఆధారపడింది. ప్రస్తుత ఆప్ నేతల్లో గట్టిగా విన్పించే పేర్లు ఆతిషి మర్లేనా, రాఘవ్ చద్దా, సౌరభ్ భరద్వాజ్ మాత్రమే. వీరిలో ఎవరికీ పాలనపరమైన అనుభవం లేదు. రాజకీయంగా కూడా కేజ్రీవాల్ స్థాయిలో బీజేపీని ఢీకొనగల సత్తా కూడా అంతంతమాత్రమే.

హస్తినలో అస్తవ్యస్తమే!

ఆప్, కేజ్రీవాల్ హవా ఎంతగా ఉన్నా గత పదేళ్లుగా లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలో బీజేపీ హవాయే కొనసాగుతూ వస్తోంది. ఆప్ ఆవిర్భావం తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లోనూ అక్కడ బీజేపీ ఏకపక్ష విజయం సాధించింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఘనవిజయం కట్టబెడుతున్నా లోక్‌సభకు వచ్చేసరికి కాషాయ మంత్రం జపించడం ఢిల్లీ ఓటర్లకు ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈసారి ఎలాగైనా దీన్ని మార్చి సత్తా చూపాలని కేజ్రీవాల్ కృతనిశ్చయంతో ఉన్నారు. 'లోక్‌సభలోనూ కేజ్రీవాల్, ఢిల్లీలో మరింత ప్రగతి', 'గుజరాత్‌లోనూ కేజ్రీవాల్' అంటూ ఆప్ ఎన్నికల నినాదాలు కూడా పూర్తిగా ఆయనను కేంద్రంగా చేసుకునే రూపొందాయి. ఇలాంటి సమయంలో ఆయన జైలుపాలవడంతో ఒక్కసారిగా ఆప్ లోక్‌సభ ఎన్నికల ప్రణాళికే తలకిందులైపోయింది. ఇదిక్కడితో ఆగకపోవచ్చని, వచ్చే ఏడాది జరగనున్న కీలకమైన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలపైనా ప్రభావం చూపవచ్చని భావిస్తున్నారు. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆప్ ఘనవిజయం సాధించడం తెలిసిందే. ప్రాంతీయ పార్టీల నేతల్లో మమత వంటి దిగ్గజాలే మోదీ సర్కారు ధాటికి వెనుకంజ వేసినా కేజ్రీవాల్ మాత్రం ప్రధానితో నిత్యం ఢీ అంటే ఢీ అంటున్నారు. అలా పదేళ్లుగా బీజేపీకి కంట్లో నలుసుగా మారారు. ఈ నేపథ్యంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌కు ఎలాగైనా ముకుతాడు వేయాలని బీజేపీ గట్టి పట్టుదలతో ఉంది. కేజ్రీ గైర్హాజరీలో డీలా పడ్డ ఆప్ నేతలను నయానో భయానో లొంగదీసుకుని ఆ పార్టీ ఉనికే లేకుండా చేసేందుకు అన్ని ప్రయత్నాలూ చేయడం ఖాయమంటున్నారు.

సానుభూతి కష్టమే...?

అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమించడం ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన కేజ్రీవాల్ అవినీతి కేసులో జైలుపాలు కావడాన్ని సమర్థించుకోవడం ఆప్ నేతలకు కష్టంగానే కన్పిస్తోంది. ఆ పార్టీ వాదన ఎలా ఉన్నా ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం వాస్తవమేనన్న అభిప్రాయం ప్రజల్లో గట్టిగా ఉంది. కనుక కేజ్రీవాల్‌కు, ఆయన అరెస్టు విషయంలో ఆప్‌కు పెద్దగా సానుభూతి లభించే అవకాశాలు లేవంటున్నారు. ఆప్ వర్గాలను మరింతగా కలవరపరిచే అంశమిది. మద్యం ఆదాయంపై అత్యాశ వద్దని తానెంత చెప్పినా కేజ్రీ విన్లేదంటూ ఆయనకు గురుతుల్యుడైన సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే చేసిన తాజా వ్యాఖ్యలు ఆప్‌కు మరింత చేటు చేసేవే.

'ఇండియా' కూటమి డీలా

ఇప్పటికే జనాకర్షక నాయకుల కొరత ఉన్న కాంగ్రెస్ సారథ్యంలోని విపక్ష ఇండియా కూటమి కూడా కేజ్రీవాల్ అరెస్టుతో మరింతగా డీలా పడింది. జేడీ(యూ) చీఫ్ నితీశ్‌కుమార్, తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ వంటి అగ్ర నేతలు ఇప్పటికే కూటమిని వీడారు. దాంతో సోనియా, రాహుల్, ఖర్గే తర్వాత కేజ్రీవాల్ మినహా దేశవ్యాప్త ఆదరణ ఉన్న నాయకులు కూటమిలో పెద్దగా లేరు. ఖాతాల స్తంభన తదితరాలతో ఇప్పటికే నిధుల కొరతతో కిందా మీదా అవుతున్న కాంగ్రెస్‌ను ఈ పరిణామం మరింతగా నిస్తేజపరుస్తోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

కేజ్రీవాలే అసలు కుట్రదారు

ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఆయనే కీలక సూత్రధారి: ఈడీ

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను ఆరు రోజులపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కస్టడీకి అప్పగిస్తూ రౌజ్‌అవెన్యూ కోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కేజ్రీవాల్‌ను ఈ నెల 28వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు మళ్లీ కోర్టులో ప్రవేశపెట్టాలని ఈడీని ప్రత్యేక జడ్జి కావేరీ బవేజా ఆదేశించారు. మద్యం కుంభకోణంలో విచారణ కోసం కేజ్రీవాల్‌ను 10 రోజులపాటు తమ కస్టడీకి ఇవ్వాలని ఈడీ విజ్ఞప్తి చేయగా, న్యాయస్థానం కేవలం ఆరు రోజులపాటు కస్టడీకి అనుమతించింది. కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు గురువారం రాత్రి కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆయనను శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో పటిష్టమైన భద్రత మధ్య ఢిల్లీ కోర్టులో ప్రవేశపెట్టారు. ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు వాదనలు వినిపించారు. ఢిల్లీ మద్యం కుంభకోణం వెనుక ఉన్న అసలు కుట్రదారు, కీలక సూత్రధారి అరవింద్ కేజ్రీవాలేనని తేల్చిచెప్పారు. ఆయనతో పాటు పలువురు ఢిల్లీ మంత్రులు, ఆమ్ ఆద్మీ పార్టీలు నేతలు ఈ కేసులో భాగస్వాములేనని స్పష్టం చేశారు. ఢిల్లీలో 2021–22లో నూతన లిక్కర్ పాలసీని రూపొందించి, అమలు చేసినందుకు గాను 'సౌత్ గ్రూప్' నుంచి కేజ్రీవాల్ కోట్లాది రూపాయలు ముడుపులుగా స్వీకరించారని ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా దృష్టికి తీసుకొచ్చారు. సౌత్ గ్రూప్‌కు చెందిన కొందరు నిందితుల నుంచి రూ.100 కోట్ల మేర వసూలు చేశారని వెల్లడించారు. నాలుగు హవాలా మార్గాల్లో అందిన రూ.45 కోట్లను గోవా అసెంబ్లీ ఎన్నికల్లో ఖర్చు చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పేర్కొన్నారు. మిగిలిన సొమ్ము ఆమ్ ఆద్మీ పార్టీ కీలక నేతలకు నగదు రూపంలో అందిందని తెలిపారు. నిందితులు, సాక్ష్యుల కాల్ డిటైల్ రికార్డులు(సీడీఆర్), స్టేట్‌మెంట్లు ఇదే విషయాన్ని నిరూపిస్తున్నాయని తెలియజేశారు. అవినీతి కోసం కేజ్రీవాల్ తన పదవిని వాడుకున్నారని పేర్కొన్నారు. లిక్కర్ స్కామ్‌లో కేజ్రీవాల్‌ను ప్రశ్నించి, మరింత సమాచారం రాబట్టాల్సి ఉందని, అందుకే ఆయనను 10 రోజులపాటు ఈడీ కస్టడీకి అప్పగించాలని న్యాయస్థానానికి ఎస్.వి.రాజు విజ్ఞప్తి చేశారు. అరవింద్ కేజ్రీవాల్ తరఫున సీనియర్ అడ్వొకేట్ అభిషేక్ మనూ సింఘ్వీ హాజరయ్యారు. ''సిట్టింగ్ సీఎంను అరెస్టు చేయడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి. ఈ కేసులో ఆయనను అరెస్టు చేయాల్సిన అవసరమే లేదు. కేజ్రీవాల్ తప్పు చేశారనేందుకు ఎలాంటి సాక్ష్యాలూ లేవు'' అని వాదించారు.

సుప్రీంకోర్టులో పిటిషన్ ఉపసంహరణ

మద్యం కుంభకోణం కేసులో ఈడీ అరెస్టు చేయకుండా ఆదేశాలివ్వాలంటూ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారం ఉపసంహరించుకున్నారు. దీనిపై విచారణ చేపడతామని ఉదయమే సుప్రీంకోర్టు వెల్లడించగా పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు కేజ్రీవాల్ తరఫున అభిషేక్ సింఘ్వీ మధ్యాహ్నం కోర్టుకు తెలిపారు. ఇదే కేసులో నిందితురాలైన బీఆర్ఎస్ నేత కవిత బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు నిరాకరించిన కాసేపటికే కేజ్రీవాల్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడం గమనార్హం. ట్రయల్ కోర్టులో విచారణ తర్వాత మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని సింఘ్వీ చెప్పారు.

జైల్లో ఉన్నా సీఎంగా కొనసాగుతా

తన జీవితం దేశ సేవకే అంకితమని అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. శుక్రవారం కోర్టు నుంచి బయటికొచ్చాక ఆయన మీడియాతో మాట్లాడారు. జైలు బయట ఉన్నా, లోపలున్నా సీఎంగా కొనసాగుతానని స్పష్టం చేశారు.

'లిక్కర్'కు దూరంగా ఉండాలని హెచ్చరించా: అన్నా హజారే

ముంబై: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుకు ఆయన చర్యలే కారణమని ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే చెప్పారు. మద్యం పాలసీకి సంబంధించిన అంశాలకు దూరంగా ఉండాలని కేజ్రీవాల్‌ను చాలా సందర్భాల్లో హెచ్చరించానని అన్నారు. మహారాష్ట్రలోని తన స్వగ్రామం రాలేగావ్ సిద్ధిలో అన్నా హజారే శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ''మద్యం మనిషి ఆరోగ్యానికి హానికరమని చిన్న పిల్లలకు కూడా తెలుసు. లిక్కర్ పాలసీకి దూరంగా ఉండాలని కేజ్రీవాల్‌కు చాలా సార్లు చెప్పాను. లిక్కర్ పాలసీని రూపొందించడం మన ఉద్యోగం కాదని వివరించా. అయినా వినలేదు. పాలసీని రూపొందించి అమలు చేశారు. కేజ్రీవాల్ తప్పు చేయకపోతే అరెస్టై ఉండేవారే కాదు. మరింత ఎక్కువ డబ్బు సంపాదించడానికే మద్యం పాలసీని కేజ్రీవాల్ తయారు చేసి ఉంటారు. మద్యానికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో నాతో కలిసి పనిచేసిన కేజ్రీవాల్ అదే మద్యం పాలసీకి సంబంధించిన వ్యవహారంలో అరెస్టు కావడం బాధ కలిగిస్తోంది'' అని అన్నా హజారే పేర్కొన్నారు. అవినీతికి వ్యతిరేకంగా దశాబ్దం క్రితం జరిగిన ఉద్యమంలో అన్నా హజారే, అరవింద్ కేజ్రీవాల్ క్రియాశీలకంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే.

రాత్రంతా లాకప్‌లో..

న్యూఢిల్లీ: ఆప్ సారథి, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఈడీ కస్టడీలో తొలి రాత్రి భారంగా గడిచింది. లాకప్ రూములో ఉంచి మంచం లేకుండా పరుపు, దుప్పటి మాత్రం ఇచ్చారు. ఏసీ సదుపాయం కల్పించారు. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో గురువారం సాయంత్రం నుంచి కేజ్రీవాల్‌ను ఆయన నివాసంలో గంటల తరబడి ప్రశ్నించిన ఈడీ అధికారులు, రాత్రి 11 గంటల ప్రాంతంలో అరెస్టు చేయడం తెలిసిందే. రాత్రి భోజనం అనంతరం ఆయనను ఈడీ ప్రధాన కార్యాలయానికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం కేజ్రీని లాకప్ గదికి తరలించారు. అక్కడ ప్రత్యేక సదుపాయాలేవీ కల్పించలేదు. కేజ్రీవాల్ పెద్దగా నిద్ర పోకుండా భారంగానే గడిపినట్టు సమాచారం. శుక్రవారం ఉదయం చాయ్, అల్పాహారం అందించారు. మధుమేహంతో బాధపడుతున్న కేజ్రీవాల్ ఇన్సులిన్ తీసుకునేందుకు ఏర్పాటు చేశారు. కాసేపటికి కాఫీ ఇచ్చారు. తర్వాత కోర్టులో హాజరు పరిచారు.

నిర్బంధంలో సీఎం కుటుంబం: ఆప్ మంత్రుల ధ్వజం

కేజ్రీవాల్ కుటుంబాన్ని కలిసేందుకు ఆయన నివాసంలోనికి పోలీసులు అనుమతించడం లేదంటూ ఆప్ ఎమ్మెల్యేలు మండిపడ్డారు. ''సీఎం కుటుంబాన్ని గృహ నిర్బంధంలో ఉంచారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తండ్రిని, అరెస్టుతో కుంగిపోయిన కుటుంబాన్ని ఓదార్చనివ్వరా? ఇందుకు ఏ చట్టం అనుమతినిచ్చింది? హౌజ్ అరెస్టును ఆపేయండి'' అంటూ నినదించారు.

అధికారం కోసమే అరెస్టు: కేజ్రీవాల్ భార్య

తన భర్తను అక్రమంగా అరెస్టు చేసి ఢిల్లీ ప్రజలకు మోదీ ప్రభుత్వం ద్రోహం చేసిందని కేజ్రీవాల్ భార్య సునీత మండిపడ్డారు. ఢిల్లీలో అధికారం దక్కించుకోవాలన్న ఆరాటంతోనే అరెస్టు చేశారంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రశ్నించేవారిని అణచివేయాలని చూస్తున్నారని ఆరోపించారు.

ఆందోళనలు, అరెస్టులు

కేజ్రీవాల్ అరెస్టుతో ఢిల్లీలో ఉద్రిక్తత.. అదుపులోకి మంత్రులు, కార్యకర్తలు

న్యూఢిల్లీ: ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ నేతలు, ఢిల్లీ రాష్ట్ర మంత్రులు బీజేపీకి వ్యతిరేకంగా చేస్తున్న ఆందోళనలు, నిరసనలతో ఢిల్లీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఢిల్లీలో ఆందోళనకు దిగిన ఆప్ నేతలను పోలీసులు అరెస్ట్‌చేశారు. శుక్రవారం ఢిల్లీలో ఆప్, బీజేపీ ప్రధాన కార్యాలయాలు ఉన్న పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ మార్గ్ సమీప ఐటీఓ ఇంటర్‌సెక్షన్ కూడలి వద్దకు ఆప్ నేతలు, కార్యకర్తల పెద్ద సంఖ్యలో చేరుకుని మోదీ సర్కార్ వ్యతిరేక నినాదాలు చేశారు. 'అరవింద్ మీరు సంఘర్షణను కొనసాగించండి. మేం మీకు తోడుగా ఉంటాం' అని నినదించారు. ట్రాఫిక్ స్తంభించడంతో ధర్నాకు దిగిన వారిని పోలీసులు చెదరగొట్టే ప్రయత్నంచేశారు. అక్కడే ఆందోళనకు దిగిన ఢిల్లీ రాష్ట్ర మంత్రులు ఆతిశీ, సౌరభ్ భరద్వాజ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని బస్సుల్లో వేరే చోట్లకు తరలించారు. దీంతో తమ నేతలను విడుదలచేయాలంటూ మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యకర్తలు నినాదాలుచేశారు. పంజాబ్ విద్యాశాఖ మంత్రి హర్‌జోత్ సింగ్ బైన్స్ సహా మరికొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆందోళనలను అదుపులోకి తెచ్చేందుకు పారామిలటరీ సిబ్బందిని రంగంలోకి దింపారు. ఆ ప్రాంతంలో 144 సెక్షన్‌ను విధించారు. ఐటీవో స్టేషన్‌ను సాయంత్రందాకా ఢిల్లీ మెట్రో రైల్ మూసేసింది. ఈడీ ప్రధాన కార్యాలయం, బీజేపీ ఆఫీస్‌ల వద్ద భారీగా బలగాలను మోహరించారు. ''తప్పుడు కేసులతో నిన్న సీఎంను అరెస్ట్‌చేశారు. ఈరోజు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిని అరెస్ట్ చేస్తున్నారు. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే'' అంటూ మంత్రులు ఆతిశీ, సౌరభ్ మండిపడ్డారు.

కస్టడీలో కేజ్రీవాల్‌కు రక్షణేది: ఆతిషి

ధర్నాకు ముందు మంత్రి ఆతిషి పత్రికాసమావేశంలో మాట్లాడారు. ''సీఎం హోదాలో కేజ్రీవాల్ చుట్టూ నిరంతరం జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఉండేది. ఇప్పుడు ఈడీ కస్టడీలో కేంద్రం ఆయనకు అంతటి భద్రత కల్పిస్తోందా? ఆయన భద్రతకు జవాబుదారీ ఎవరు? ఈడీ ఆఫీస్ లాకప్‌లోకి ఎవరెవరు వస్తున్నారు? అక్కడ ఉన్న భద్రతా ఏర్పాట్లపై కేంద్రం ప్రకటన చేయాలి' అని ఆతిషి డిమాండ్ చేశారు.



కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ శుక్రవారం ఢిల్లీలో ఆప్ కార్యకర్తలు, మంత్రి ఆతిషి ఆందోళన

ఎలక్షన్ బీట్

మాణిక్కం ఠాగూర్ వర్సెస్ రాధిక

విరుధునగర్ లోక్‌సభ స్థానంలో ఆసక్తికర పోరు

సాక్షి, న్యూఢిల్లీ: డీఎంకేతో పొత్తులో భాగంగా తమిళనాడులో పోటీ చేస్తున్న తొమ్మిది స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై కసరత్తును కాంగ్రెస్ వేగవంతం చేసింది. శుక్రవారం జరిగిన సెంట్రల్ ఎలక్షన్ కమిటీ భేటీలో విరుధునగర్ సహా నాలుగు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేశారు. విరుధునగర్ నుంచి కాంగ్రెస్ పార్టీ సిట్టింగ్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ మరోసారి బరిలో దిగుతున్నారు. మరోవైపు ఈ స్థానాన్ని సినీ నటి రాధికా శరత్‌కుమార్‌కు కేటాయిస్తూ బీజేపీ కూడా శుక్రవారమే నిర్ణయం తీసుకుంది! దాంతో ఇక్కడ పోటీ ఆసక్తికరంగా మారింది. 2009లో కూడా ఇక్కడ మాణిక్కం నెగ్గారు. 2014లో డీఎంకే, కాంగ్రెస్ విడిగా పోటీ చేయడంతో అన్నాడీఎంకే అభ్యర్థి టి.రాధాకృష్ణ భారీ గెలుపొందారు. 2019లో కాంగ్రెస్, డీఎంకే కలిసి పోటీ చేయడంతో మాణిక్కం ఠాగూర్ మరోసారి నెగ్గారు. డీఎంకే మద్దతుతో ఈసారీ సునాయాసంగా నెగ్గుతామని కాంగ్రెస్ భావిస్తోంది.

ఒడిశాలో బీజేపీ ఒంటరి పోరు

భువనేశ్వర్: ఒడిశా రాష్ట్రంలో జరగబోయే లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే బరిలో దిగుతుందని ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ శుక్రవారం ప్రకటించారు. ''డబుల్ ఇంజన్ ప్రభుత్వాలుంటే ఆ రాష్ట్రంలో అభివృద్ధి ఉరకలెత్తుతుందని ఆశించాం. కానీ బీజేడీ అధికారంలో ఉన్న ఒడిశాలో కేంద్ర పథకాలు చివరి లబ్ధిదారు దాకా చేరడం లేదు'' అని ఆరోపించారు. రాష్ట్రంలో పొత్తుపై అధికార బిజూ జనతాదళ్ (బీజేడీ), బీజేపీ మధ్య కొద్దిరోజుల క్రితం చర్చలు జరగడం తెలిసిందే. బీజేడీతో పొత్తుపై బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటారని గత వారమే కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. అంతలో ఇలా ఒంటరిపోరు ప్రకటన వెలువడింది. తాము కూడా అన్ని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల్లో పోటీకి దిగుతున్నట్లు బీజేడీ శుక్రవారం ప్రకటించింది. 1998–2009 మధ్య రెండు పార్టీలు 11 ఏళ్ల కూటమిగా ఉన్నాయి. మూడుసార్లు లోక్‌సభ, రెండు సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీచేశాయి.

లోక్‌సభ బరిలో లాలూ ఇద్దరు కుమార్తెలు?

పట్నా: రాష్ట్రీయ జనతాదళ్(ఆర్‌జేడీ) పార్టీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ తన ఏడుగురు కుమార్తెల్లో ఇద్దరిని రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయించేందుకు రంగం సిద్ధమయింది. ఆర్‌జేడీ టిక్కెట్‌పై మిసా భారతిని పాటలీపుత్ర నుంచి, రోహిణీ ఆచార్యను సరన్ నుంచి బరిలోకి దించుతారని వార్తలు వస్తున్నాయి. పాటలీపుత్ర నియోజకవర్గంలో ఆర్‌జేడీ టిక్కెట్‌పై పోటీ చేసేందుకు ఇప్పటికే రితలాల్ యాదవ్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగానే పట్నాలోని మాజీ సీఎం రబ్రీదేవి నివాసానికి పలు పర్యాయాలు వచ్చినట్లు కూడా మీడియా అంటోంది. దీంతో, పాటలీపుత్ర నుంచి ఇద్దరిలో ఎవరిని పోటీకి నిలపాలనే విషయంలో కొంత సందిగ్ధం కొనసాగుతున్నట్లు సమాచారం.


నగదు లావాదేవీల సమాచారమివ్వండి: ఈసీ

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ..అక్రమ డబ్బు రవాణాను అరికట్టేందుకు కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ) బ్యాంకులకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఖాతాదారులు ఎవరైనా రూ.లక్ష కంటే ఎక్కువ డిపాజిట్, విత్ డ్రా చేస్తే జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం ఇవ్వాలని సూచించింది. ఏదైనా బ్యాంకు ఖాతా నుంచి రూ.10 లక్షలకు పైగా నగదును ఖాతాదారుడు తీసుకున్నా జిల్లా ఎన్నికల అధికారికి, ఆదాయపు పన్ను శాఖ నోడల్ అధికారికి తెలపాలని ఆదేశించింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ఎన్నికల ఖర్చు కోసం తన పేరుతో లేదా ఏజెంట్ పేరుతో కలిపి బ్యాంకు, పోస్టాఫీసుల్లో ప్రత్యేకంగా అకౌంట్ లేదా ఉమ్మడి అకౌంట్ తెరవవచ్చని సూచించింది. ఇందుకోసం ప్రత్యేక కౌంటర్లు తెరవాలని అన్ని బ్యాంకులకు ఈసీఐ ఆదేశాలు జారీ చేసింది.

మోదీకి భూటాన్‌లో అరుదైన గౌరవం

45 కి.మీ. రోడ్డుకిరువైపుల నిలబడి ప్రజల స్వాగతం

- అత్యున్నత పౌర పురస్కారం ప్రదానం
- రైల్వే అనుసంధానం సహా పలు ఒప్పందాలు



మోదీకి పౌర పురస్కారం అందజేస్తున్న భూటాన్ రాజు

థింపూ: భూటాన్‌లో ప్రధాని నరేంద్ర మోదీకి అపూర్వ స్వాగతం లభించింది. రెండు రోజుల పర్యటనకు శుక్రవారం ఉదయం భూటాన్ రాజధాని థింపూ చేరుకున్న మోదీకి ప్రధాని త్సెరింగ్ టొబ్‌గే స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి థింపూ దాకా 45 కిలోమీటర్ల మేర ప్రజలు రోడ్డుకు రెండువైపులా నిలబడి భారత్, టిబెట్ పతాకాలతో స్వాగతం పలికారు. కొందరు యువకులు మోదీ స్వయంగా రాసిన పాటకు భారత సంప్రదాయ దుస్తుల్లో గర్బా నృత్యం చేశారు. దాన్ని మోదీ ఆద్యంతం ఆసక్తిగా తిలకించారు.

రాజు వాంగ్‌చుక్‌తో భేటీ

భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నంగ్యేల్ వాంగ్‌చుక్, ప్రధాని త్సెరింగ్‌లతో మోదీ సమావేశమయ్యారు. భూటాన్ అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ద్రుక్ గ్యాల్పో'ను తొలిసారిగా మోదీకి రాజు ప్రదానం చేశారు. భారత్, భూటాన్ ప్రజల అనుబంధం ద్వైపాక్షిక సంబంధాన్ని మరింత ప్రత్యేకంగా మారుస్తోందని మోదీ అన్నారు. భూటాన్ ప్రజల గుండెల్లో భారత్ ఉంటుందన్నారు. ఈ సుందర దేశంలోకి ఎప్పటికీ గుర్తుండిపోయేలా స్వాగతం పలికిన భూటాన్ ప్రజలకు, ముఖ్యంగా యువతకు ధన్యవాదాలని 'ఎక్స్'లో పేర్కొన్నారు. భారత్, భూటాన్ మైత్రి మరిన్ని శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. 'మా పెద్దన్న మోదీ జీకి భూటాన్‌లోకి స్వాగతం' అని త్సెరింగ్ టొబ్‌గే 'ఎక్స్'లో పేర్కొన్నారు. అనంతరం ప్రధానుల సమక్షంలో ఇంధనం, వాణిజ్యం, కనెక్టివిటీ, అంతరిక్షం, వ్యవసాయం వంటి రంగాల్లో పలు ఒప్పందాలు, ఎంవోయూలపై అధికార ప్రతినిధులు సంతకాలు చేశారు. రెండు దేశాల నడుమ కొక్రాఝర్– గెలెపు, బనార్హట్–సంత్సెల మధ్య రైల్వే లైనుపై ఎంవోయూకు తుదిరూపం ఇచ్చారు. 21, 22వ తేదీల్లోనే మోదీ భూటాన్‌లో పర్యటించాల్సి ఉండగా ప్రతికూల వాతావరణం వల్ల ఒక రోజు వాయిదా పడింది. ద్వైపాక్షిక, ప్రాంతీయ విషయాలపై భాగస్వామ్యాన్ని మరింత విస్తరించుకోవడానికి ప్రధాని పర్యటన ఉపయోగపడుతుందని విదేశాంగ శాఖ తెలిపింది.

నేడు డిజొంగ్ మఠ సందర్శన

భూటాన్‌లోని శక్తిమంతమైన తషిఛో డిజొంగ్ బౌద్ధ మఠాన్ని మోదీ శనివారం సందర్శించనున్నారు. థింపూలో భారత్ సహకారంతో ఏర్పాటైన అత్యాధునిక మాతా శిశు ఆస్పత్రిని ప్రారంభిస్తారు. గత వారం భూటాన్ ప్రధాని త్సెరింగ్ భారత్‌లో ఐదు రోజుల పాటు పర్యటించిన విషయం తెలిసిందే.

హెచ్–1బీ రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపు

వాషింగ్టన్: హెచ్–1బీ వీసా నమోదు గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) తెలిపింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 22వ తేదీతోనే రిజిస్ట్రేషన్ల గడువు ముగియాల్సి ఉంది. అయితే, సాంకేతిక సమస్యల కారణంగా దరఖాస్తుదారులు రిజిస్ట్రేషన్ చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెల్లడించింది. హెచ్–1బీ రిజిస్ట్రేషన్లకు అవసరమైన జీ–28 ఫారంలో కొందరి సంతకాలు కనిపించకుండా పోతున్నట్లు చెబుతున్నారు. దీంతో, నమోదును 25వ తేదీ వరకు కొనసాగిస్తామని వివరించింది. ఈ ఏడాది సుమారు 3.50 లక్షల మంది హెచ్–1బీ నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని యూఎస్‌సీఐఎస్ అంచనా వేస్తోంది.ఎంపికైన దరఖాస్తుదారుల పేర్లను మార్చి 31వ తేదీన ప్రకటిస్తామని యూఎస్‌సీఐఎస్ తెలిపింది.

హిమాచల్‌లో ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు రాజీనామా

సిమ్లా: హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు చెందిన సీఎం సుఖూ ప్రభుత్వాన్ని కష్టాలు చుట్టుముడుతున్నాయి. ఇటీవలి రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చెందిన ఆరుగురితోపాటు సుఖూ ప్రభుత్వానికి మద్దతు తెలిపిన ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు బీజేపీకి ఓటేయడం సంచలనం రేపింది. బీజేపీకి ఓటేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆరుగురు అనర్హత వేటుకు గురికాగా, ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు తాజాగా పదవులకు రాజీనామా చేశారు. బీజేపీలో చేరి, ఆ పార్టీ టిక్కెట్‌పై మళ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తామని వీరు తెలిపారు. శుక్రవారం బీజేపీ నేతలతో కలిసి వెళ్లి అసెంబ్లీలో రాజీనామా పత్రాలను అందజేశారు.

పుష్పక్.. తగ్గేదేలే!

ఆర్‌ఎల్‌వీ ఎల్‌ఈఎక్స్–02 ప్రయోగం విజయవంతం

సాక్షి బెంగళూరు/సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): అంతరిక్ష ప్రయోగాల ఖర్చును తగ్గించేందుకు వినూత్న పద్ధతులను అనుసరిస్తున్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఈ విషయంలో మరో మైలురాయిని అధిగమించింది. పుష్పక్ రాకెట్ ల్యాండింగ్ ప్రక్రియను శుక్రవారం విజయవంతంగా నిర్వహించింది. ఉపగ్రహాలను అంతరిక్షంలోకి మోసుకెళ్లే లాంచింగ్ వెహికల్స్ (రాకెట్లు)ను మళ్లీ వినియోగించుకోవడమే ఈ ప్రయోగం లక్ష్యం. రీయూజబుల్ లాంచింగ్ వెహికల్‌ను ఇస్రో తయారు చేయడమే కాకుండా ముద్దుగా 'పుష్పక్' అని పేరు పెట్టుకుంది. ఈ పుష్పక్‌కు సంబంధించి తొలి దఫాలో గతేడాది నిర్వహించిన ఆర్‌ఎల్‌వీ ఎల్‌ఈఎక్స్–01 మిషన్ పరీక్ష విజయవంతమైంది. తాజాగా రెండో దఫాలో పుష్పక్ ల్యాండింగ్ ప్రయోగం సైతం విజయవంతమైంది. శుక్రవారం ఉదయం 7.10 గంటలకు కర్ణాటక చిత్రదుర్గలోని ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్(ఏటీఆర్) నుంచి ఆర్‌ఎల్‌వీ ఎల్‌ఈఎక్స్–02 మిషన్ పరీక్ష నిర్వహించారు. నింగిలోకి పంపిన రాకెట్‌కు స్వయంగా ల్యాండింగ్ సామర్థ్యం ఉందా లేదా అనేది పరీక్షించారు. పుష్పక్‌ను భారత వైమానిక దళానికి చెందిన చినూక్ హెలీకాప్టర్ ఆకాశంలో 4.5 కిలోమీటర్ల ఎత్తుకు తీసుకెళ్లి కిందకు వదిలేసింది. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, స్వతహాగా డిజైన్ చేసిన ప్రోగ్రామ్ ప్రకారం రన్‌వే మీద పుష్పక్ సురక్షితంగా దిగింది. బ్రేక్ పారాచ్యూట్, ల్యాండింగ్ గేర్ బ్రేక్స్, నోస్‌వీల్ సిస్టమ్ సాయంతో పుష్పక్ తనంతట తానే వచ్చి నిలిచిపోవడం గమనార్హం. పుష్పక్ ల్యాండింగ్ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించిన శాస్త్రవేత్తల బృందాన్ని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ అభినందించారు.



పుష్పక్‌ను 4.5 కిలోమీటర్ల ఎత్తు నుంచి జారవిడుస్తున్న హెలికాప్టర్



రన్‌వేపై దిగుతున్న పుష్పక్



క్వింటాల్ పత్తి రూ.7,700

జమ్మికుంట: స్థానిక పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర గరిష్టంగా రూ.7,700 పలికింది. యార్డుకు శని, ఆది, సోమవారం సెలవులు ఉంటాయని కార్యదర్శి రెడ్డినాయక్ తెలిపారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శని (సా॥)	సహర్ ఆది (ఉ॥)
కరీంనగర్	6.27	4.48
పెద్దపల్లి	6.34	4.56
రాజన్న సిరిసిల్ల	6.34	4.56
జగిత్యాల	6.34	4.55

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.0/23.0

జిల్లాలో ఈరోజు వాతావరణం సాధారణంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఉక్కపోత ఉంటుంది. రాత్రిపూట కాస్త చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పన్ను కట్టలేదని మంచినీళ్లు బంద్

శంకరపట్నం: ఇంటిపన్ను చెల్లించడం లేదని మంచినీళ్లు బంద్ చేశారు. ఓ కాలనీ మొత్తం మంచినీళ్లు లేక రెండు రోజులుగా అల్లాడుతోంది. ఈ సంఘటన కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం ధర్మారం ఎస్సీ కాలనీలో చోటుచేసుకుంది. గ్రామంలోని ఎస్సీ కాలనీలో కొంతమంది ఇంటిపన్ను చెల్లించలేదు. దీంతో గ్రామపంచాయతీ సిబ్బంది వారికి రెండు రోజుల నుంచి నీటి సరఫరా నిలిపివేశారు. తాగునీటితో పాటు ఇతర అవసరాలకు నీరు లేకపోవడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. ఇంటి పన్ను చెల్లించకుంటే నీటి సరఫరా నిలిపివేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై గ్రామపంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా గ్రామపంచాయతీకి పన్ను చెల్లించకపోవడంతో ఎస్సీకాలనీలో కొన్ని ఇళ్లకు నీటి సరఫరా నిలిపివేసినట్లు వెల్లడించారు.

బండి సంజయ్ ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలి



మాట్లాడుతున్న అంజన్‌కుమార్

కరీంనగర్ కార్పొరేషన్: ఎంపీ బండి సంజయ్‌కు వేల కోట్ల రూపాయలు ఎలా వచ్చాయో శ్వేత పత్రం విడుదల చేయాలని పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ కార్యాలయంలో మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి ఎందుకు తొలగించారో చెప్పాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేస్తే, సంజయ్ సమాధానం చెప్పలేక వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కరీంనగర్ ఎంపీగా ఉన్నప్పుడు పొన్నం ప్రభాకర్ చేసిన అభివృద్ధి, ఇప్పుడు ఎంపీగా బండి సంజయ్ చేసిన అభివృద్ధిపై టవర్‌సర్కిల్ వద్ద బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎంపీగా ఉన్న సమయంలో పొన్నం ప్రభాకర్ తిరుపతికి రైలు, మాతాశిశు సంరక్షణ కేంద్రం, పాస్‌పోర్ట్ కేంద్రం, కేంద్రీయ విద్యాలయాలు, బీడీ కార్మికుల ఆసుపత్రి, ఎఫ్ఎం రేడియో స్టేషన్ తదితర ఎన్నో అభివృద్ధి పనులు చేశారని తెలిపారు. ఎంపీగా బండి సంజయ్ ఏం చేశారో వెల్లడించాలన్నారు. నాయకులు అబ్దుల్ రెహమాన్, రోళ్ల సతీశ్, ఇమ్రాన్, మహమ్మద్ అమీర్, అరుణ్ కుమార్, హరీశ్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన



విద్యార్థికి నియామక పత్రం అందజేస్తున్న సురేశ్, ప్రిన్సిపాళ్లు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌లోని మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాల బాలుర-1లో ఎంఎస్ఎన్ లాబోరేటరీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఎంపీసీ, బైపీసీలో ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు సుమారుగా 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇంటర్వ్యూలో 25 మందిని ఎంపిక చేసి, నియామక పత్రాలు అందజేశారు. ఉమ్మడి జిల్లా మైనారిటీ గురుకులాల సమన్వయకర్త కే.సురేశ్, ప్రిన్సిపాళ్లు వీర్ల మహేష్, చంద్రమోహన్, పిడిశెట్టి సంపత్, జిల్లా అకడమిక్ కో ఆర్డినేటర్ మీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ ప్రకారం ఉద్యోగాలివ్వాలి



మంత్రికి విన్నవిస్తున్న గురుకులం అభ్యర్థులు

కరీంనగర్: గురుకుల పాఠశాలల్లో ఇటీవల జరిగిన ఉద్యోగ నియామకాల్లో ఒకే అభ్యర్థి రెండు, మూడు ఉద్యోగాలకు అర్హత సాధించారని, వారు కోరుకున్న పోస్టు ఇచ్చాక మెరిట్ ఆర్డర్ ప్రకారం మరో అభ్యర్థికి అవకాశం కల్పించేలా చొరవ చూపాలని అభ్యర్థులు కోరారు. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఇటీవల జరిగిన పరీక్షల్లో కొందరు రెండు, మూడు, నాలుగు ఉద్యోగాలకు ఎంపికయ్యారని, వీరి స్థానంలో మెరిట్ ప్రకారం తదుపరి అభ్యర్థికి అవకాశమిచ్చేలా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరా రు. 9వేల పైచిలుకు పోస్టుల్లో 4వేల పోస్టులు బ్యాక్‌లాగ్ అయ్యాయని, మరోసారి పరీక్షలు పెట్టాల్సిన అవసరం లేకుండా తదుపరి మెరిట్ సాధించిన అభ్యర్థులకు అవకాశం ఇవ్వాలని కోరారు.

వసూల్.. సవాల్

- పన్ను వసూళ్లకు మిగిలింది మరో ఏడు రోజులే
- లక్ష్యానికి బల్దియా రూ.14 కోట్లు దూరం
- మరో రూ.3.50 కోట్లు వసూలైతేనే ఆర్థిక సంఘం నిధులు



2023- 24 ఆర్థిక సంవత్సరం నగర పాలకసంస్థ ఆస్తి పన్ను వసూలు వివరాలు

ఆస్తి పన్ను డిమాండ్	రూ.43.28 కోట్లు
ఇప్పటివరకు వసూళ్లు	రూ.28.79 కోట్లు
వసూలు కావాల్సింది	రూ.14.49 కోట్లు
పర్సంటేజీ	67.46 శాతం

కరీంనగర్ కార్పొరేషన్ :

నగరపాలకసంస్థకు ఆస్తి పన్ను వసూలు సవాల్‌గా మారింది. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు కేవలం ఏడు రోజులు మాత్రమే గడువు మిగలగా, వందశాతం లక్ష్యానికి బల్దియా చాలా దూరంలో ఉంది. 15వ ఆర్థిక సంఘం నిధులు నగరపాలకసంస్థకు రావాలంటే కూడా ఇంకా సుమారు రూ.3.50 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. దీంతో చివరి అస్త్రంగా అధికారులు, ఉద్యోగులు అనే తేడా లేకుండా నగరపాలకసంస్థ ఉద్యోగులు మూకుమ్మడిగా పన్ను వసూళ్లకు తిరుగుతున్నారు.

వసూళ్లు 67.46 శాతం

2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ నగరపాలక సంస్థ రూ.43.28కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం బృందాలుగా బిల్‌కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో వసూళ్లు చేపట్టారు. వసూళ్లు మందకొడిగా సాగుతుండడంతో, పలుమార్లు కలెక్టర్ పమేలా సత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సమీక్ష సమావేశాలు నిర్వహించి హెచ్చరికలు జారీ చేశారు. దీంతో నగరపాలకసంస్థ కమిషనర్ బి.శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి, రెవెన్యూ అధికారి ఆంజనేయులు తదితరులు ఆస్తిపన్ను వసూళ్లలో వేగం పెంచారు. రూ.లక్షల్లో బకాయిలు పడ్డ దుకాణసముదాయాలు, ప్రైవేట్ ఆసుపత్రులు, పాఠశాలలకు స్వయంగా వెళ్లి పన్ను చెల్లించేలా ఒత్తిడి పెంచుతూ వచ్చారు. ఇప్పటివరకు 67.46శాతం మాత్రమే వసూళ్లు అయ్యాయి. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు కేవలం ఏడు రోజులే గడువు ఉండగా, ఈ వారం రోజుల్లో వందశాతం చేరుకోవడం సాధ్యమేనా అనేది అధికారులకు సవాల్‌గా మారింది. శుక్రవారం నాటికి రూ.28.79 కోట్లు మాత్రమే వసూలు అయ్యాయి. దీనితో మరో సుమారు రూ.14.49 కోట్లు వసూలైతేనే వందశాతం లక్ష్యం చేరే అవకాశం ఉంది.

మరో రూ.3.50 కోట్లు వసూలైతేనే నిధులు

నగరపాలకసంస్థకు వచ్చే ఆర్థిక సంఘం నిధులకు ఆస్తి పన్ను వసూళ్లు ముడిపడి ఉండడం ఇప్పుడు అధికారులకు చిక్కొచ్చి పడింది. 15వ ఆర్థిక సంఘం నిధులు నగరపాలకసంస్థకు విడుదల కావాలంటే, ఇంకా సుమారు రూ.3.50 కోట్లు వసూలు కావాల్సి ఉంది. మొత్తంగా 28.79 కోట్లు వసూలు కాగా, మరో రూ.3.50 కోట్లు వసూలైతే ఆర్థిక సంఘం నిధులకు అర్హత రానుంది.

వందశాతం నెరవేరేనా

వారం రోజులే ఉండడంతో పన్ను వసూళ్లు అధికారులకు సవాల్‌గా మారాయి. ఈ గడువులో సుమారు రూ.14.49 కోట్లు వసూలు ఎలా సాధ్యమనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. నగరపాలకసంస్థ అధికారులు ఇటీవల ఆస్తి పన్ను వసూళ్లను వేగవంతం చేశారు. అయితే ముందునుంచి ఈ వేగం ఉంటే మరింత ప్రయోజనం ఉండేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నగరంలోని పేరున్న ప్రైవేట్ ఆసుపత్రులు, ప్రైవేట్ విద్యాసంస్థలు, వస్త్ర దుకాణాలు, ఇతరత్రా వాణిజ్యసముదాయాలు లక్షల రూపాయల్లో ఆస్తి పన్ను బకాయిపడ్డారు. వీటితో పాటు కొన్ని ప్రభుత్వ సంస్థలు కూడా లక్షల్లో బకాయిలు పడగా, వాటి వసూళ్లకు కూడా అధికారులు రంగంలోకి దిగారు. ఏదేమైనా గడువు తక్కువగా ఉండడంతో, వందశాతం లక్ష్యం చేరుకునేందుకు అధికారులు ప్రయాసపడుతున్నారు.

రూ.86 లక్షలు చెల్లించిన ఆర్టీసీ



ఆర్టీసీ అధికారుల నుంచి రూ.86 లక్షల చెక్కు అందుకుంటున్న కమిషనర్ శ్రీనివాస్

నగరపాలకసంస్థకు బాకాయి పడ్డ ఆస్తి పన్ను రూ.86,07,972ను ఆర్టీసీ శుక్రవారం చెల్లించింది. రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను వడ్డీపై 90 శాతం రాయితీ ఇస్తుండడంతో, ఇటీవల నగరపాలక సంస్థ అధికారులు ఆర్టీసీ అధికారులను సంప్రదిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్‌కు ఆర్టీసీ అధికారులు రూ.86,07,972 చెక్‌ను అందచేశారు. 90 శాతం వడ్డీ రాయితీని వినియోగించుకొని ఆస్తి పన్ను మొత్తం చెల్లించిన ఆర్టీసీ అధికారులకు ఈ సందర్భంగా కమిషనర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా 90 శాతం వడ్డీ మాఫీని ఉపయోగించుకొని ఆస్తి పన్ను చెల్లించాలని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, నగరవాసులను కమిషనర్ కోరారు.

ప్రభుత్వ కొలువులే టార్గెట్



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

- పరిశ్రమల్లో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన
- వారధి సమావేశంలో కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: ప్రైవేటు పరిశ్రమలు, విద్యాసంస్థల్లో నిరుద్యోగ యువతీ, యువకులకు వారధి సొసైటీ ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్లో వారధి సొసైటీ సర్వసభ్య సమావేశం జరిగింది. నిరుద్యోగ యువతకు కల్పించిన ఉద్యోగ అవకాశాలు, ప్రభుత్వ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ, పలు అంశాలపై కలెక్టర్ చర్చించారు. రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. జిల్లాలో అనేక పరిశ్రమలు, విద్యాసంస్థలతో పాటు ఐటీ టవర్ ఉందని, పరిశ్రమల జీఎం, వారధి సొసైటీ కలిసి నిరుద్యోగ యువతకు పరిశ్రమల్లో ఉపాధి కల్పించే అంశంపై దృష్టిసారించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా ప్రైవేటు ఉద్యోగాలపై యువత దృష్టిసారించాలని సూచించారు. పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని, సమగ్రంగా శిక్షణ అందించాలని, ఉద్యోగాలు సాధించేలా కృషి చేయాలని అన్నారు. ఇందుకు అనుగుణంగా మరోచోట లైబ్రరీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఔట్‌సోర్సింగ్ ద్వారా ఉద్యోగాల నియామకం కోసం జిల్లాస్థాయిలో అదనపు కలెక్టర్ చైర్మన్‌గా, కన్వీనర్‌గా జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సారథ్యంలో ఐదుగురు సభ్యులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వారధి సొసైటీ మెంబర్ సెక్రటరీ ఆంజనేయులు, జెడ్పీ సీఈవో శ్రీనివాస్, డీఈవో జనార్దన్ రావు, డీఐసీ జీఎం నవీన్ కుమార్, మెప్మా పీడీ రవీందర్, డీఆర్‌డీఓ శ్రీధర్, ఎస్సీ డెవలప్‌మెంట్ డీడీ నతానియల్, బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అనిల్ ప్రకాష్ కిరణ్, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ దేవేందర్ రావు, ఎస్ఆర్ఆర్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, స్పోర్ట్స్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ హయాంలో అభివృద్ధి శూన్యం

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్



ఎస్సారార్ మైదానంలో మార్నింగ్ వాక్ చేస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్న వినోద్‌కుమార్

కరీంనగర్: ప్రజలకు అండగా ఉంటా.. పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతునవుతా.. ఒక్కసారి ఆలోచించి, తనకు ఓటు వేయాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎస్సారార్ కళాశాల మైదానంలో శుక్రవారం మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్ సతీశ్, బీఆర్ఎస్ నాయకులతో కలిసి మార్నింగ్ వాక్ చేశారు. పలువురిని ఆత్మీయంగా పలుకరించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. తాను 2019లో ఎంపీగా ఓటమి చెందినా.. కరీంనగర్‌లోనే నివాసం ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉన్నానని అన్నారు. బండి సంజయ్ ఎంపీ అయ్యాక ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో లేరని అన్నారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసే దమ్ము తనకుందని, బండి సంజయ్ ఎంపీ అయ్యాక నయాపైసా తేలేదని అన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్‌కు వెయ్యి కోట్లతో స్మార్ట్‌సిటీ, కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్ తెచ్చానని గుర్తు చేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఎంపీగా గెలిపిస్తే ట్రిబుల్‌ఐటీ, పరిశ్రమలు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానని వెల్లడించారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్, జక్కుల నాగరాజు, సాయి, వెంకట్, యాదగిరి శేఖర్‌రావు, ఏనుగు తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

కలెక్టరమ్మా.. కరుణించరూ



నగరానికి చెందిన ఈమె గూళ్ల కవిత. కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో భర్త చనిపోయాడు. ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2017లో వారధి సంస్థ ద్వారా జిల్లాకేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో స్కావెంజర్‌గా నియామకమైంది. ఏనాటికైనా క్రమబద్ధీకరిస్తారనే ఆశతో రూ.5వేల వేతనం నుంచి ప్రస్తుతం రూ.9500కు ఐదేళ్లుగా పనిచేస్తోంది. ఏమైందో ఏమో కానీ గత నెల 27న అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో కుక్, అసిస్టెంట్ కుక్, క్లీనింగ్ పర్సన్, నైట్ వాచ్‌మెన్ పోస్టులకు నోటిఫికేషన్ వేశారు. ఫిబ్రవరి 2న ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈనెల 13న నియామకపత్రాలు అందజేశారు. అన్ని అర్హతలు, అనుభవం ఉన్న కవిత సైతం దరఖాస్తు చేసింది. ఇంటర్వ్యూలో సిక్స్‌మెన్ కమిటీ నిర్లక్ష్యంగా వ్యవహరించి అనర్హులను ఎంపికచేసి, అన్ని అర్హతలున్న తనను ఎంపిక చేయలేదని కవిత మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్, డీఈవోతో పాటు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.



ఈమె మ్యాక కావేరి. భర్త కోవిడ్‌తో చనిపోయాడు. ఇద్దరు పిల్లల పోషణకు జిల్లాకేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్‌స్కూల్‌లో కుక్‌గా నియామకమైంది. కావేరీకి ప్రస్తుతం ఐదు నెలల వేతనం ప్రభుత్వం నుంచి అందాల్సి ఉంది. ఇటీవల ఇచ్చిన నోటిఫికేషన్‌లో కుక్‌పోస్టుకు దరఖాస్తు చేసుకున్న కావేరీని కాదని జిల్లా విద్యాశాఖలో పనిచేసే ఓ అధికారి తన బంధుమిత్రులకు కుక్, క్లీనింగ్ పర్సన్ పోస్టులను ఇప్పించుకున్నాడంటూ ప్రజావాణిలో మొరపెట్టుకుంది.

- ఐదేళ్లుగా చేసిన పనికి ప్రతిఫలం ఇదేనా..?
- ఔట్‌సోర్సింగ్‌లో అనర్హులకు అందలం
- వితంతువులను కాదని.. బంధుమిత్రులకు పోస్టింగ్‌లు
- సిక్స్‌మెన్ కమిటీ పేరిట తీరని అన్యాయం
- మంత్రి పొన్నంకు, కలెక్టర్‌కు ఫిర్యాదు

కరీంనగర్: జిల్లా విద్యాశాఖ పరిధిలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్(గర్ల్స్ జూనియర్ కళాశాల)లో ఔట్‌సోర్సింగ్ విధానంలో గూళ్ల కవిత, మ్యాక కావేరీ వారధి సొసైటీ ద్వారా పనిచేస్తున్నారు. ఐదేళ్లకోసారి నియామకాల్లో భాగంగా కొత్తగా నోటిఫికేషన్ వేశారు. అన్ని అర్హతలున్న వీరిని కాదని అనుభవం లేని వారికి ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇచ్చారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇద్దరికి భర్తలు చనిపోవడం, ఇద్దరేసి పిల్లలు ఉండటం, ఏనాటికైనా ఉద్యోగం క్రమబద్ధీకరణవుతుందనే ఆశతో పనిచేస్తే ఉన్న ఉద్యోగం ఊడగొట్టారని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. సిక్స్‌మెన్ కమిటీ పేరిట కలెక్టర్ చైర్మన్‌గా, డీఈవో, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్, లేబర్ ఆఫీసర్, సెక్టోరియల్ ఆఫీసర్, ఎంఈవోలతో ఏర్పాటు చేసిన కమిటీ పూర్తిస్థాయిలో పనిచేయకుండానే కిందిస్థాయి సిబ్బంది ఇచ్చిన నివేదిక ఆధారంగానే తమకు అన్యాయం చేశారన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి జోక్యం చేసుకుని, నిబంధనలు పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో నియామకాలపై తగిన విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

తిమ్మాపూర్: ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణాసంస్థ ఆధ్వర్యంలో ఏప్రిల్ 15 నుంచి ఫొటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీలో పురుషులు, ఏప్రిల్ 18 నుంచి సీసీటీవీ ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీసింగ్‌పై పురుషులకు శిక్షణ ప్రారంభిస్తున్నట్లు డైరెక్టర్ డి.సంపత్ తెలిపారు. ఆసక్తిగల ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణకాలంలో ఉచిత భోజనం,వసతి కల్పిస్తామని, టూల్‌కిట్, యూనిఫాం, శిక్షణ ధ్రువీకరణ పత్రం అందిస్తామన్నారు. అభ్యర్థుల వయసు 18 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలని, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, టెన్త్ మెమో జిరాక్స్‌తోపాటు 5 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు మహాత్మానగర్‌లోని ఎస్‌బీఐ శిక్షణ కేంద్రంలో లేదా 9949448157లో సంప్రదించాలన్నారు.

ట్యాంకర్ వస్తేనే నీళ్లు



చింతకుంట శాంతినగర్‌లో ట్యాంకర్ ద్వారా మంచినీటి సరఫరా

చింతకుంట శాంతినగర్‌లో దాహం.. దాహం

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- అందని మిషన్ భగీరథ నీరు
- రానున్న రోజుల్లో పెరగనున్న నీటి కటకట

కొత్తపల్లి: నగర శివారులోని గ్రామాల్లో మంచినీటి కటకట ఏర్పడుతోంది. జలాశయాలు అడుగంటుతుండడం, మిషన్ భగీరథ నీరు అందకపోవడంతో ట్యాంకర్ నీళ్లే దిక్కవుతున్నాయి. కొత్తపల్లి మండలం చింతకుంట పరిధిలోని పలు కాలనీల ప్రజలు తాగునీటికి తండ్లాడుతున్నారు. భగీరథ నీరు అందడం లేదు. ప్రత్యామ్నాయంగా గతంలో గ్రామ పంచాయతీ తవ్వించిన బావుల్లో నుంచి ఎండ తీవ్రతకు నీటి సరఫరా కష్టంగా మారింది. దీంతో ఒక్కో కాలనీకి రెండు, మూడు రోజులకోసారి నీటి సరఫరా చేస్తున్నారు.మూడ్రోజుల క్రితం శాంతినగర్‌లోని బావిమోటార్ చెడిపోవడంతో స్థానికులు తీవ్ర మంచినీటి సమస్యను ఎదుర్కొగా.. సుమారు 1500ఇండ్లకు గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. ఎక్కువ మొత్తంలో ఇళ్లకు సకాలంలో నీరు అందడం లేదు. ట్యాంకర్ ద్వారా వచ్చిన నీటిని డ్రమ్ములు, బకెట్లలో నిల్వ చేసుకుంటున్నప్పటికీ ఒకే రోజుకు సరిపోవడంతో మరుసటిరోజు ట్యాంకర్ కోసం ఎదురుచూపులు తప్పడం లేదు.

అందని భగీరథ నీరు

కరీంనగర్ శివారులోని చింతకుంట గ్రామంలో 2011 లెక్కల 4,500జనాభా ఉండగా ప్రస్తుతం 20 వేలకు చేరింది. దీంతో గతంలో రూపొందించిన మంచినీటి ప్రణాళికలు ప్రస్తుత జనాభాకు సరిపోవడం లేదు. మిషన్ భగీరథకు పూర్వం 40 చేతిబోర్లు, సుమారు పది 1 హెచ్‌పీ మోటర్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవి మనుగడలో లేకపోవడంతో నీటి తీవ్రత పెరిగింది. చింతకుంట ప్రజల మంచినీటి అవసరాలను తీర్చేందుకు రాజీవ్ నగర్, గాంధీనగర్, రాజేంద్రనగర్‌లలో మంచినీటి ట్యాంక్‌లు నిర్మించగా..7 మంచినీటి బావులను తవ్వారు. లీకేజీల మూలంగా ట్యాంకుల్లోకి నీరు చేరడం లేదు. ఇక అత్యధిక జనాభా కలిగిన శాంతినగర్‌కు ఇప్పటి వరకు మిషన్ భగీరథ నీరు రాకపోగా బావి ద్వారా సరఫరా చేస్తున్నారు. మోటార్ రిపేరింగ్‌లో ఉండటంతో స్థానికులు మంచినీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు.

సమస్య తీర్చండి



శాంతినగర్‌లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. మిషన్ భగీరథ నీరు రాక, బోరుబావి మోటార్ చెడిపోయి ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తుండటంతో అవి సరిపోవడం లేదు. మూడు, నాలుగురోజులకొకసారి నీరు అందిస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీరు సరఫరా చేయాలి.

– నజ్మా, మాజీ వార్డు సభ్యురాలు

ప్రత్యామ్నాయం చూపాలి



చింతకుంటలో నెలకొన్న మంచినీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. ఆ లోపు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. లేకుంటే ప్రజలు తిరగబడే ప్రమాదం ఉంది. గతంలోని చేతి పంప్‌లు, మోటార్లను రిపేరింగ్ చేయించాలి. ముఖ్యంగా మిషన్ భగీరథ, జీపీ పంప్ ఆపరేటర్ల మధ్య సమన్వయం కొరవడి నీటిని విడుదల చేయడంతో నిర్లక్ష్యం జరుగుతోంది. ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలి.

– భూక్య తిరుపతినాయక్, వైస్ ఎంపీపీ

నారసింహ నామం.. పోటెత్తిన జనం



ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మూడోరోజు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక క్యూలైన్ల ద్వారా స్వామివారలను దర్శించుకున్నారు. స్థానిక ఓల్డ్ టీటీడీ కల్యాణ మండపంలో రైస్‌మిల్లర్స్, ఆర్యవైశ్యులు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం శ్రీలక్ష్మీనృసింహస్వామి ఊరేగింపు సేవను ఘనంగా నిర్వహించారు. ఆలయం నుంచి పట్టణ పురవీధుల గుండా మేళతాళాల మధ్య స్వామివార్లను ఊరేగింపుగా తీసుకెళ్లారు. దారి పొడవున మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

క్లుప్తంగా

పోలీసుల అదుపులో దొంగ

చందుర్తి(వేములవాడ): ఇంట్లో చొరబడి నగదు ఎత్తుకెళ్లిన దొంగను మూడు రోజుల్లో చందుర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. దొంగ నుంచి నగదు రికవరీ చేశారు. చందుర్తి ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు. మండలంలోని కాతుబండు రాజు ఇంట్లో ఈనెల 9న రూ.1.36 లక్షలు దొంగతనానికి గురయ్యాయి. బాధితుడు రాజు ఫిర్యాదుతో ఎన్గల్‌లో శుక్రవారం విచారణకు వెళ్తుండగా.. పోలీసుల వాహనాన్ని చూసి పరుగులు పెడుతున్న బోరుగాయ అజయ్‌ని పట్టుకున్నారు. విచారించగా కాతుబండ రాజు ఇంట్లో దొంగతనం చేశానని ఒప్పుకున్నాడు. దొంగతనం చేసిన రూ.1.36 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అజయ్‌ని రిమాండ్‌కు తరలించనట్లు వివరించారు.

'శాతవాహన ఆరోహణ-2024'లో ప్రతిభ



కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయం నిర్వహించిన 'శాతవాహన ఆరోహణ-2024' పోటీలో కొత్తపల్లి మండలంలోని చింతకుంట ఎస్ఆర్ఎం ఎంబీఏ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కళాశాల చైర్మన్ ఎం.తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ సి.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1,000 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ ఫైనాన్స్ ఈవెంట్‌లో తమ విద్యార్థులు పి.దేవరాజ్, కె.ఆదర్శ్ మొదటి స్థానం కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు. రోల్ ప్లేలో జె.అమృత మొదటి స్థానంలో నిలిచిందన్నారు. వీరు వర్సిటీ అధికారుల చేతులమీదుగా శుక్రవారం బహుమతి అందుకున్నట్లు తెలిపారు.

ఎస్సారెస్పీ కాలువలో గుర్తు తెలియని మృతదేహం

చొప్పదండి: పట్టణ శివారులోని ఎస్సారెస్పీ ప్రధాన కాలువలో శుక్రవారం గుర్తు తెలియని మహిళా మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాలు... రోజువారీ విధుల్లో భాగంగా స్థానిక లష్కర్ విధులకు వెళ్లగా డీ–86 రెగ్యులేటర్ వద్ద మహిళా మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు కాలువ నుండి మృతదేహం బయటకు తీయించారు. 30 నుంచి 40 ఏళ్ల వయసున్న మహిళ వారం రోజుల క్రితమే కాలువలో పడటంతో శరీరం గుర్తుపట్ట లేని విధంగా తయారైందని, ఒంటిపై మెరూన్ కలర్ ఫుల్‌టాప్, గోధుమ కలర్ చున్ని ఉందని, లష్కర్ బద్దెనపల్లి కనకయ్య ఫిర్యా దు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఉపేంద్రాచారి తెలిపారు.

లక్ష్యం.. ఆరోగ్య బాల్యం

- అతితక్కువ బరువున్న పిల్లలపై ప్రత్యేక దృష్టి
- కరీంనగర్ జిల్లాలో గర్భిణులు, బాలింతలతో కలిపి 63,692 మంది
- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పంపిణీ
- 31 వరకు 'పోషణ పక్వాడా'



చిన్నారులకు పోషకాహారం తినిపిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: నేటి బాలలే రేపటి పౌరులు.. వారు ఆరోగ్యంగా ఉండటం ముఖ్యం. ఇదే ఉద్దేశంతో ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోంది. చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రాధాన్యం ఇస్తోంది. దీన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నా పోషణలోపంతో సతమతమవుతున్న పిల్లలు ఇప్పటికీ ఉన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన జిల్లా యంత్రాంగం పరిస్థితిలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే పోషణ పక్షోత్సవాల్లో భాగంగా పోషణ పక్వాడా కార్యక్రమాన్ని మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 31వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తోంది.

4 ఐసీడీఎస్ ప్రాజెక్టులు..

కరీంనగర్ జిల్లాలో కరీంనగర్‌రూరల్, అర్బన్, హుజూరాబాద్, గంగాధర ఐసీడీఎస్ ప్రాజెక్టులు, 752 మెయిన్, 25 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో గర్భిణులు 4,544, బాలింతలు 14,689, ఏడాదిలోపు పిల్లలు 5,021, మూడేళ్లలోపు పిల్లలు 19,449, మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలు 19,989 మొత్తం 63,692 మంది అనుబంధ పోషకాహార లబ్ధిదారులు ఉన్నారు. వయసుకు తగ్గట్టుగా బరువు లేనివారు 8,963 మంది ఉండగా.. 1,830 మంది అతి తక్కువ బరువు ఉన్నట్లు గుర్తించారు. 5,630 మంది చిన్నారులు ఎత్తుకు తగ్గ బరువు లేరు. 2,108 మంది ఎత్తుతో పోల్చితే అతి తక్కువ బరువుతో ఇబ్బంది పడుతున్నట్లు తేల్చారు.

తల్లిపాలు పట్టడమే శ్రేయస్కరం..

తల్లి పాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుంది. పుట్టిన వెంటనే పాలు పట్టడం తల్లీబిడ్డలిద్దరికీ శ్రేయస్కరం. 6 నెలల వయసు వరకు అవసరాన్ని బట్టి తల్లిపాలే పట్టించాలి. ఇందులో బిడ్డకు సరిపోయే విటమిన్లు, మినరల్స్ ఉండటం వల్ల శారీరక, మానసిక వికాసం వేగంగా అభివృద్ధి చెందుతుందని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుత ఉరుకులు పరుగుల జీవితంలో కొందరు తల్లులకు తమ చిన్నారులకు పాలుపట్టే సమయం ఉండటం లేదు. డబ్బా పాలు పట్టడం ద్వారా పిల్లల్లో ఎదుగుదల లోపిస్తోంది. ఇది ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. తల్లిపాల ప్రాధాన్యంపై తల్లులకు అవగాహన కల్పిస్తే సత్ఫలితాలు ఉంటాయి.

ఇదీ కార్యాచరణ..

- పోషణ లోపంతో వయసుకు, ఎత్తుకు తగ్గ బరువు లేని చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల వారీగా గుర్తించారు. ఆయా కేంద్రాల్లో వారి తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి, పిల్లల ఆరోగ్య పరిస్థితిని తెలియజేస్తారు.
- అతి తక్కువ బరువున్న పిల్లలు, వారి తల్లిదండ్రులను ప్రభుత్వ ఆస్పత్రుల్లోని పోషణ సలహా, చికిత్స కేంద్రానికి తరలిస్తారు. అవసరమైన మందులు, సలహాలు అందేలా చూస్తారు.
- ఇంట్లోనే పౌష్టికాహారం తయారు చేసుకునే విధానాన్ని వివరిస్తారు. పౌష్టికాహారలోపం వల్ల ఆరోగ్యపరంగా తలెత్తే ఇబ్బందులను తెలియజేస్తారు.
- అవసరమైన చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అదనపు పౌష్టికాహారంతోపాటు ఆయా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పెరటితోటల్లో పండించిన కూరగాయలను ఉచితంగా ఇస్తారు.
- బాలామృతం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించడం, పోషకాలపై అవగాహన కల్పిస్తారు.

పోషకాహారం తీసుకోవాలి



మహిళలు బాగుంటేనే దేశం బాగుంటుంది. గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి. చిన్నారులు ఆరోగ్యంగా ఎదగాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. ఏటా మార్చి, సెప్టెంబర్ నెలల్లో పోషణ్ అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా పెరటి తోటల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నాం. న్యూట్రిషన్ ఫుడ్ తీసుకోవాలని సూచిస్తున్నాం.

– సరస్వతి, డీడబ్ల్యూవో, కరీంనగర్

సిరిసిల్లలో మహిళ హత్య

- పరారీలో హంతకులు
- అడ్డా కూలీలపైనే అనుమానాలు
- దర్యాప్తు చేస్తున్న సిరిసిల్ల పోలీసులు



రమ (ఫైల్)



వివరాలు సేకరిస్తున్న సీఐ రఘుపతి

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల ఉలిక్కిపడింది. కార్మికుల అడ్డా హత్యోదంతంతో తెల్లారింది. మద్యంమత్తులో ఓ మహిళను కొందరు అత్యంత కిరాతకంగా హతమార్చిన సంఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో శుక్రవారం కలకలం సృష్టించింది. స్థానికులు తెలిపిన వివరాలు. సిరిసిల్ల పట్టణంలోని అనంతనగర్‌లో బిహార్‌కు చెందిన కొందరు కూలీలు ఒక ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. బీహార్ చెందిన రాంభిక్షు సదా, రుడల్‌సదా ఉండేవారు. వీరు స్థానిక లేబర్ అడ్డా వద్ద రోజువారీ కూలీలుగా, భవనం నిర్మాణ పనులు చేసుకునేవారు. ఈక్రమంలోనే వేములవాడ అర్బన్ మండలం కొడిముంజకు చెందిన అలకుంట రమ కూలీ పని కోసం నిత్యం సిరిసిల్ల లేబర్ అడ్డాకు వచ్చేది. పనిస్థలంలో బిహార్‌కు చెందిన కూలీలతో రమకు పరిచయం ఏర్పడింది. మద్యం అలవాటు ఉండడంతో పనులు ముగిసిన తర్వాత పలుమార్లు మద్యం తాగినట్లు స్థానికుల ద్వారా తెలిసింది. అందరూ కూలి పనులు చేసుకునే సమయంలో ఏర్పడిన చనువుతో రమ బిహార్ కూలీలు ఉంటున్న గదికొచ్చినట్లు సమాచారం. మద్యం మత్తులో రాత్రి ఆమెపై అఘాయిత్యానికి పాల్పడి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హత్యాస్థలంలో మద్యం బాటిళ్లు, మృతురాలి ఒంటిపై బట్టలు లేకపోవడం వారి అనుమానాలకు బలం చేకూరుస్తుంది. సంఘటన స్థలాన్ని పరిశీలించిన సీఐ రఘుపతి హత్యకు పాల్పడింది ఎంత మంది అనే దానిపై స్పష్టత లేదన్నారు. మూడు రోజుల క్రితం హత్య జరిగి ఉంటుందని, గది నుంచి దుర్వాసన రావడంతో హత్య విషయం వెలుగుచూసినట్లు వివరించారు. హంతకులు పరారీలో ఉన్నారని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి ముగ్గురు కూతుళ్లు ఉండగా ఇద్దరి పెళ్లిళ్లు జరిగాయి. చాలా ఏళ్ల క్రితం భర్త చనిపోయినట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధురాలి మెడలోని పుస్తెల తాడు చోరీ



రోదిస్తున్న నర్సమ్మ

వెల్గటూర్ (ధర్మపురి): ఓ వృద్ధురాలి మెడలోని పుస్తెల తాడును దుండగుడు చోరీ చేశాడు. స్థానికుల వివరాల ప్రకారం.. వెల్గటూర్ మండల కేంద్రానికి చెందిన గుమ్ముల నర్సమ్మ రోజూ మాదిరిగా శుక్రవారం ఉదయం 5 గంటలకు లేచి, ఇంటి పనులు చేస్తోంది. ఆ సమయంలో వెనక నుంచి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమెపై దాడి చేసి, పుస్తెల తాడు లాక్కొని పారిపోయాడు. అరతులం పుస్తెలు దొరకగా, రెండు తులాల తాడు ఎత్తుకెళ్లాడని బాధితురాలు విలపించింది. అతను నీలం రంగు టీషర్ట్ వేసుకున్నాడని, ముఖానికి గుడ్డ కట్టుకొని వచ్చినట్లు తెలిపింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ బృందాలను రప్పించారు. నర్సమ్మతో మాట్లాడి, వివరాలు తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జగిత్యాలలో తాళం వేసిన ఇంట్లో..

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బీరయ్య గుడి ప్రాంతానికి చెందిన రాజేశం ఇంట్లో దొంగలు పడి, బంగారం, నగదు ఎత్తుకెళ్లినట్లు జగిత్యాల పట్టణ ఎస్సై నరేశ్ తెలి పారు. ఆయన వివరాల ప్రకారం.. రాజేశం ఈ నెల 19న ఇంటికి తాళం వేసి, ఎండపల్లిలో ఎల్లమ్మ బోనాలకు వెళ్లాడు. గురువారం రాత్రి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి పరిశీలించి, నాలుగు తులాల బంగారం, రూ.5 వేలు చోరీ అయినట్లు తెలిపాడు. బాధితుడు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఒలింపియాడ్‌లో 'అల్ఫోర్స్' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): పోటీ పరీక్షల సంస్థ ఓఎంఎస్ అకాడమీ నిర్వహించిన జాతీయ స్థాయి మ్యాథ్స్, సైన్స్ ఒలింపియాడ్‌లో కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో పి.మయాంక్‌రెడ్డి, ఎ.విహాన్‌కృష్ణ(3వ తరగతి), రహమాన్, ఆరాధ్య, క్రిషిక్ ప్రిన్స్ (4వ తరగతి) తదితరులు ర్యాంకులు సాధించి, బహుమతులు గెలుచుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్, టీచర్లు పాల్గొన్నారు.

స్వగ్రామం వచ్చిన మరుసటి రోజే

- గోదావరి నీటి మడుగులో పడి ఒకరు మృతి



గంగారాం మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై కిరణ్‌కుమార్

మల్లాపూర్(కోరుట్ల): గోదావరి నదీ తీరంలో గేదెలను మేపడానికి వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నీటి మడుగులో పడి, మృతిచెందాడు. ఈ సంఘటన మల్లాపూర్ మండలంలోని వాల్గొండలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. పాతదాంరాజుపల్లికి చెందిన పుట్ట గంగారాం (55) తన కుటుంబసభ్యులతో కలిసి నిర్మల్ జిల్లా సోన్ మండలం మాదాపూర్‌కి వెళ్లి, కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో గురువారమే స్వగ్రామం తిరిగి వచ్చి, వాల్గొండలో గేదెలను మేపడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. శుక్రవారం గంగారాం, అతని కుమారుడు సురేశ్ గేదెలను తోలుకొని గోదావరి నదీ తీరానికి వెళ్లారు. అక్కడ ప్రమాదవశాత్తు కాలుజారి, గంగారాం నీటి మడుగులో పడి, ఊపిరాడక మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై కిరణ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని, గంగారాం మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

యువకుడి బలవన్మరణం

హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధిలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. బోర్నపల్లికి చెందిన గంట కుమారస్వామి(26) మద్యానికి బానిసై, తరచూ భార్యతో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి ఇంట్లోనే ఉరేసుకున్నాడు. మృతుడికి ఒక కూతురు ఉంది. కుమారస్వామి తండ్రి సారయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ధర్మపురిలో గుండెపోటుతో భక్తుడు మృతి



నరహరి మృతదేహం

ధర్మపురి: స్థానిక శ్రీలక్ష్మీనృసింహుని బ్రహ్మోత్సవాలకు వచ్చిన ఓ భక్తుడు గుండెపోటుతో మృతిచెందినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలంలోని నాగంపేటకు చెందిన రటపు నరహరి(55) గురువారం ధర్మపురి నారసింహుని కల్యాణ వేడుకలకు వచ్చాడు. రాత్రి గోదావరి మంగళిగడ్డ ఘాట్ వద్ద నిద్రిస్తుండగా గుండెపోటు రావడంతో మృతిచెందాడు. ఎస్సై శుక్రవారం సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం బంధువులకు అప్పజెప్పారు.

వ్యవసాయ బావిలో పడి మహిళ..

ఇల్లందకుంట(హుజూరాబాద్): వ్యవసాయ బావిలో పడి ఓ మహిళ మృతిచెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. మొగుళ్లపల్లి మండలంలోని పర్లపల్లికి చెందిన జోరుక రమ(40) ఇల్లందకుంట మండలం సీతంపేటలోని బంధువుల ఇంట్లో జరిగే వివాహానికి వచ్చింది. ఆమెకు మతిస్థిమితం సరిగా లేదు. ఈ క్రమంలో శుక్రవారం స్థానిక వ్యవసాయ బావిలో పడి, మృతిచెందింది. మృతురాలి భర్త రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు..

జమ్మికుంట(హుజూరాబాద్): వ్యవసాయ బావిలో పడిన ఓ రైతు చికిత్స పొందుతూ మృతిచెందాడు. జమ్మికుంట టౌన్ సీఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని శాయంపేటకు చెందిన లింగంపల్లి జగ్‌భూపాల్‌రావు(70) ఈ నెల 18న తన వ్యవసాయ బావిలో పూడిక తీయించాడు. ఆ సమయంలో నీళ్లు వచ్చాయా అని తొంగి చూస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో పడిపోయాడు. ఈ ఘటనలో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. లోపల పని చేస్తున్న కూలీలు బయటకు తీసుకువచ్చి, కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్య విజయ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఆయన బంధువు పొల్సాని సంపత్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఎండలో పని చేసి.. అస్వస్థతకు గురై అన్నదాత..



జగన్ (ఫైల్)

మానకొండూర్: మానకొండూర్ మండలం పెద్దూర్‌పల్లి గ్రామానికి చెందిన పంది జగన్ (57) రైతు వ్యవసాయ పనులకు వెళ్లి అస్వస్థతకు గురై మృతి చెందాడు. శుక్రవారం జగన్ వ్యవసాయపొలంలో ఆడ, మగ వరిపూత దులిపేందుకు వెళ్లాడు. అక్కడే అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు ఓ ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, కొడుకు ఉన్నారు.

'అక్షయ'లో అలరించిన ఫేర్‌వెల్ డే



జ్యోతిప్రజ్వలన చేస్తున్న చైర్మన్ రవీందర్‌రెడ్డి, నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్‌లోని అక్షయ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులకు శుక్రవారం ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ఓ గార్డెన్‌లో 'విద్యై సమారోహ–2024' పేరిట జరిగిన వేడుకలను కళాశాల చైర్మన్ వి.రవీందర్ రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి, ప్రారంభించారు. విద్య ఆయుధం లాంటిదని, ఉన్నత విద్య కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ప్రిన్సిపాల్ జి.శైలజ, ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, లెక్చరర్లు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని రైతు దుర్మరణం

- ఇద్దరికి తీవ్ర గాయాలు



రాజిరెడ్డి (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బైక్ డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఓ రైతు మృతిచెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన చందుపట్ల రాజిరెడ్డి (51) భార్య రేణుక, మనవరాలు ఊరెళ్లి, శుక్రవారం రాత్రి స్థానిక బస్టాండ్‌లో దిగారు. ఆయన వారిని బైక్‌పై కిష్టంపల్లి మీదుగా ఇంటికి తీసుకెళ్తున్నాడు. రాచర్ల గొల్లపల్లి శివారులో వాహనం అదుపుతప్పి, డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో రాజిరెడ్డి తలకు బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతా ఇద్దరికి తీవ్ర గాయాలవడంతో స్థానికులు 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. వారి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. రాజిరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

కమాన్‌పూర్(మంథని): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి మండలంలోని రంగాపూర్‌కు చెందిన కాశెట్టి వెంకటేశ్(45) అవివాహితుడు. కమాన్‌పూర్ మండలం గుండారంలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. గురువారం అర్ధరాత్రి నడుచుకుంటూ రంగాపూర్ వస్తుండగా గుండారం రాజేంద్రనగర్ వద్ద మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తమ్ముడు సతీశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రేకుర్తి కంటి ఆస్పత్రికి బస్సు అందజేత



తాళం చెవి ఇస్తున్న ఎల్ఐసీ అధికారులు

కరీంనగర్: ఎల్ఐసీ కరీంనగర్ డివిజన్ తరఫున రేకుర్తి కంటి ఆస్పత్రికి శుక్రవారం రూ.25 లక్షల విలువైన బస్సును అందజేశారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.జగన్నాథ్ మాట్లాడుతూ.. ఎల్ఐసీ కేవలం బీమా సంస్థనే కాకుండా తన సామాజిక బాధ్యతలో భాగంగా అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. తమ గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ కార్యక్రమంలో భాగంగా పేషెంట్లను చేరవేసేందుకు రేకుర్తి కంటి వైద్యశాలకు 25 సీట్లున్న బస్సును అందించినట్లు తెలిపారు. జోనల్ మేనేజర్ శ్యాంసుందర్ మాట్లాడుతూ.. ఎల్ఐసీ సమాజంపై బాధ్యతతో 2006లో రూ.100 కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసి, ఇప్పటి వరకు రూ.150 కోట్ల విలువైన కార్యక్రమాలు నిర్వహించిందని పేర్కొన్నారు. అనంతరం బస్సు తాళం చెవి అందుకున్న లయన్ కొండ వేణుమూర్తి మాట్లాడుతూ.. ఎల్ఐసీ అందించిన ఈ గొప్ప కానుకను పేద ప్రజలకు వినియోగిస్తామని తెలిపారు. సంస్థ సీనియర్ డివిజినల్ మేనేజర్ ప్రసాద్‌రావు, చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరావు, మార్కెటింగ్ మేనేజర్ ఎంఆర్‌కె.శ్రీనివాస్, సేల్స్ మేనేజర్ రాజేశ్ ఖన్నా, క్లాస్–1 అధికారుల సంఘం నాయకులు చలం రాజనరేందర్, సత్యనారాయణ, వాసుదేవరెడ్డి, సత్యనారాయణ, శివప్రసాద్, రవీంద్రనాథ్, వామన్‌రావు, రామ్మోహన్‌రావు, బసవేశ్వర్, రఘువీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానం రద్దు చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కరీంనగర్: బీజేపీ అధికారంలోకి వచ్చాక విద్యను పేద విద్యార్థులకు అందని ద్రాక్షగా మారుస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ ఆరోపించారు. నూతన విద్యావిధానం–2022ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం కరీంనగర్ మంకమ్మతోటలో జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. నూతన విద్యా విధానం ద్వారా విద్యలో మతోన్మాదాన్ని, కులాన్ని చొప్పించే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ఎంపీ బండి సంజయ్ కరీంనగర్‌కు ఒక్క ట్రిపుల్‌ఐటీ, నవోదయ, జిల్లా కేంద్రంలో ఉన్న శాతవాహన యూనివర్సిటీకి అధిక నిధులు తీసుకురావడంతో విఫలమయ్యారని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, సహాయ కార్యదర్శి వినయ్, నాయకులు నితిన్, అనిల్, కల్యాణ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో హోలీ సందడి





- జోరుగా సామగ్రి అమ్మకాలు

విద్యానగర్(కరీంనగర్): ఫాల్గుణ పౌర్ణమి నాటికి పచ్చని సింగారాలతో హొయలు పోయే ప్రకృతి పండుగ హోలీ. వసంత కాలంలో వచ్చే ఉత్సవం కాబట్టి వసంతోత్సవంగా ప్రజాదరణ పొందింది. వయోభేదాలకు అతీతంగా ఆనందోత్సాహాలతో జరుపుకునే పండుగ ఇది. సోమవారం రంగుల పండుగ సందర్భంగా నగరంలోని ప్రధాన కూరగాయల మార్కెట్, టవర్ సర్కిల్, శాస్త్రీరోడ్, ఆఫీస్ రోడ్ రంగులు, వాటర్ కేన్ల కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. స్వీట్ల కోసం ముందుగానే ఆర్డర్లిస్తున్నారు.

అమ్మకాలు బాగున్నాయి



రెండు సంవత్సరాలు కరోనాతో హోలీ వేడుకలు ఘనంగా జరగలేదు. అందరు కరోనా భయంతో వేడుకలకు దూరంగా ఉన్నారు. ఈసారి అలాంటి భయం లేదు. అందుకే వాటర్ కేన్లు, రంగుల అమ్మకాలు బాగున్నాయి. పిల్లలు, మహిళలు వాటర్ కేన్లను ఎక్కువగా కొంటున్నారు.

– ఈశ్వర్, గణేశ్ జనరల్ స్టోర్, శాస్త్రీరోడ్, కరీంనగర్

సామాజిక న్యాయం పాటించాలి



మాట్లాడుతున్న సముద్రాల అజయ్

విద్యానగర్(కరీంనగర్): సీట్ల కేటాయింపు, నామినేటెడ్ పోస్టుల భర్తీలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయాన్ని పాటిస్తూ అన్ని వర్గాల వారికి తగిన ప్రాధాన్యమివ్వాలని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ ప్రెస్ భవన్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల కన్నా కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యానికి ఎక్కువ ప్రాధాన్యమిస్తుందన్నారు. తొలి నుంచి మాదిగలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటున్నారని అన్నారు. జనాభాపరంగా మాలల కంటే మాదిగలే ఎక్కువగా ఉన్నా.. మాదిగలకు సీట్ల కేటాయింపు విషయంలో కాంగ్రెస్ అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో మూడు తరాలుగా గడ్డం వెంకటస్వామి కుటుంబమే రాజకీయంగా లబ్ధి పొందుతోందన్నారు. ప్రజా, అంబేడ్కర్ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల కాంతంకు పెద్దపల్లి పార్లమెంట్ టికెట్ కేటాయించాలని అన్నారు. రాష్ట్ర ప్లానింగ్ కమిటీ చైర్మన్ గజ్జెల ఆనందరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల లక్ష్మణ్, మహిళా జిల్లా అధ్యక్షురాలు కొండ్రా స్వరూప, నాయకులు కాసారపు కిరణ్, కన్నం లక్ష్మణ్, కన్నం ఆనంద్, మీసాల సాయిలు, చామనపల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సామాజిక రుగ్మతలపై అవగాహన పెంచుకోవాలి



కొత్తపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న హేమలత

కొత్తపల్లి: బాలికలు సామాజిక రుగ్మతలపై అవగాహన పెంచుకోవాలని హేమలత ఫౌండేషన్ అధ్యక్షురాలు సమాజసేవిక, అడ్వకేట్ మెతుకు హేమలతపటేల్ అన్నారు. కొత్తపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలికా సాధికారత క్లబ్ ఆధ్వర్యంలో బాలిక సంరక్షణ, సామాజిక సమస్యలపై జరిగిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో మహిళలు ముఖ్యంగా బాలికలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటన్నింటిని అధిగమించేందుకు ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. అన్ని రంగాల్లో మహిళలు అభివృద్ధి సాధిస్తున్నా.. లింగవివక్ష తప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు సాధికారత వైపు దృష్టి సారించినప్పుడే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మాదేవి, కరాటే శిక్షకురాలు భానుతేజ, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఏఎస్‌ఐ అంత్యక్రియల్లో పాల్గొన్న ఏఆర్ అడిషనల్ డీసీపీ



అంత్యక్రియల్లో పాల్గొన్న అనోక్ జైన్

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మార్కొండ కిషన్ బుధవారం గుండెపోటుతో మృతిచెందగా.. శుక్రవారం అతడి అంత్యక్రియల్లో ఏఆర్ అడిషనల్ డీసీపీ అనోక్ జైన్ పాల్గొన్నారు. తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లికి భౌతికకాయాన్ని తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. అడిషనల్ డీసీపీ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రిజర్వు ఇన్‌స్పెక్టర్(వెల్ఫేర్) శ్రీధర్‌రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



మాట్లాడుతున్న సిద్ధాంత్ లోహియా

మానకొండూర్: రైతుల బంగారు భవిష్యత్‌కు ఆయిల్‌పామ్ సాగు ఎంతో ఉపయోగపడుతుందని ఇండోనేషియా అగ్రగామి శాస్త్రవేత్త విజయన్, లోహియా ఎడిబుల్ ఆయిల్స్ సీఈవో సిద్ధాంత్ లోహియా అన్నారు. మండలంలోని అన్నారం గ్రామంలో ఓ రైతు ఆయిల్‌పామ్ క్షేత్ర సందర్శన, రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో వాతావరణ పరిస్థితులకు అనువుగా ఉన్న డెలిలామే రకం వృద్ధి చేశామని, వీటిని లోహియా కంపెనీ దిగుమతి చేసుకుని రైతులకు పంపిణీ చేస్తుందని తెలిపారు. ఈ మొక్కలు నీటి ఎద్దడిని తట్టుకుంటాయని, మూడు నెలలకు ఒకసారి సిరాడ్ పామ్ ఎలిట్ బృందం ఇక్కడికి వచ్చి తోటలను పరిశీలించడం జరుగుతుందన్నారు. రైతులు పండించే ఆయిల్‌పామ్ గెలలను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. సాగునీటి యజమాన్య, మల్చింగ్ పద్ధతి, పంటలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యల గూర్చి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి, కంపెనీ సాంకేతిక సలహాదారు డాక్టర్ వైఎస్ రంగనాయకులు, ఎఫ్‌పీవో చైర్మన్ పాకాల పురుషోత్తంరెడ్డి, కేవీకే శాస్త్రవేత్త వేణుగోపాల్, లోహియా రీజినల్ మేనేజర్ కె. విజయ్‌భరత్, ఏఈవో శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బొట్ల కిషన్, పప్పు సమ్మయ్య, కిరణ్మయి, వికాస్, ఓరుగంటి రాజ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, వేణు, సూర్యక్రాంతి, వంశీ, శ్రావణ్, శ్రీనివాస్ రైతులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: సిరిసేడు గ్రామం రైతువేదికలో వరి, మొక్కజొన్న పంటల్లో యాజమాన్య పద్ధతులపై జిల్లా వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ బి.చత్రునాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వరిలో అగ్గితెగులు, మెడవిరుపు తెగుళ్ల నివారణకు చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులను గూర్చి వివరించారు. వ్యవసాయం అధికారులు సూచించిన మందులు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి.రజిత, వ్యవసాయ విస్తరణ అధికారి మమత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు ఉచిత కరెంట్ వర్తించదా..

- 200 యూనిట్ల పథకంలో ప్రభుత్వ పాఠశాలలను చేర్చాలంటున్న ఉపాధ్యాయులు
- పాఠశాల నిధుల నుంచే బిల్లులు చెల్లించాలని సూచన
- బిల్లులు పేరుకుపోతే కట్ చేస్తున్న వైనం
- ఆందోళనలో ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీలు



కరీంనగర్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత కరెంట్ వర్తించదా.. 200 యూనిట్ల లోపు కరెంట్ బిల్లు వస్తే బిల్లులు కట్టాల్సిన అవసరం లేదని ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత కరెంట్ పాలసీపై గందరగోళం నెలకొంది. ఇటీవల ప్రభుత్వ పాఠశాలలకు నిధులు విడుదల చేసిన ప్రభుత్వం.. కరెంట్ బిల్లులు కట్టాల్సిందేనని సూచించడంతో వచ్చిన నిధుల్లో నుంచి 60 శాతం కరెంట్ బిల్లుల చెల్లింపులకే పోతున్నాయని ఉపాధ్యాయులు, పేరెంట్స్ వాపోతున్నారు. అరకొరగా వస్తున్న పాఠశాల గ్రాంటు నుంచి కరెంట్ బిల్లులు చెల్లించాల్సిందేనని హుకుం జారీ చేయడంతో.. చేసేదేమి లేక బిల్లులు చెల్లింపుకే మొగ్గు చూపుతున్నారు. తరగతి, స్టాఫ్ గదుల్లో ట్యూబ్ లైట్లు, బల్బులు, ఫ్యాన్లు, తాగునీటి అవసరాలకు వాడుతున్న కరెంట్‌కు సంబంధించిన బిల్లులను సకాలంలో చెల్లించకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పాఠశాల గ్రాంటు సకాలంలో రాకపోవడంతో కొందరు హెచ్‌ఎంలు తమ జేబులో నుంచి తొలుత చెల్లించి తర్వాత ప్రభుత్వం అందించే నిధులతో సర్దుకుంటున్న పరిస్థితి నెలకొంది. జిల్లాలోని 16 మండలాల పరిధిలో ప్రభుత్వ విభాగంలోని అన్ని రకాల యాజమాన్య పాఠశాలలు 1,011 ఉండగా.. వాటిలో 44వేలకు పైగా మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలల నిర్వహణ నిమిత్తం కొంతకాలంగా ప్రభుత్వం స్కూల్ గ్రాంట్ అందజేస్తోంది. పాఠశాలలో 50 మంది లోపు విద్యార్థులుంటే రూ.10వేలు, 50 నుంచి 100 మంది లోపు ఉంటే రూ.25వేలు, 100 నుంచి 250 మందికి రూ.50వేలు, 250 నుంచి 300 మంది ఉంటే రూ.75వేలు ఇస్తున్నారు. కాగా ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో నుంచి స్టేషనరీ, రిజిష్టర్ల కొనుగోలు, జాతీయ పండుగల నిర్వహణ, చిన్నచిన్న మరమ్మతులు, నెట్ చార్జీలు, కంప్యూటర్లు, ల్యాబ్‌లు, తాగునీటి నిర్వహణ, విద్యుత్ బిల్లులను చెల్లిస్తున్నారు. అలాగే స్కావెంజర్లు, స్వీపర్లను నియమించుకొని పారిశుధ్య పనులు చేయించుకుంటున్నారు. విద్యుత్ బిల్లులకు సంబంధించిన ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. ప్రస్తుతం పాఠశాలలకు కేటగిరీ–7ఏ కింద కరెంట్ కనెక్షన్లు కొనసాగుతున్నాయి. 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించుకునే వారికి జీరో బిల్లులు అందజేస్తున్న ప్రభుత్వం.. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత కరెంట్ సరఫరా చేయాలని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. జిల్లావ్యాప్తంగా పలు పాఠశాలల్లో కరెంట్ బకాయిలు పేరుకుపోవడం, కొన్నిచోట్ల సరఫరా నిలిపివేయడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

గృహజ్యోతిలో చేర్చాలి



ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహజ్యోతి పథకం కింద ప్రభుత్వం 200 యూనిట్ల లోపు కరెంట్ వాడుకున్న వినియోగదారులకు జీరో బిల్లు ఇస్తున్న విషయం తెలిసిందే. దీంతో రాష్ట్రంలోని దాదాపు 60 శాతం మందికి జీరో బిల్లు అందుతోంది. ఈక్రమంలో ప్రభుత్వ పాఠశాలలకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేసి ఆదుకోవాలి. జిల్లాలోని 80 శాతం స్కూళ్లలో ప్రతినెలా 200 యూనిట్ల లోపే విద్యుత్ వినియోగం జరుగుతోంది. పథకాన్ని అమలు చేయడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు ఊతం ఇచ్చినట్లవుతుంది.

– పోరెడ్డి దామోదర్‌రెడ్డి, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ముగ్గురికి జైలు

కరీంనగర్ క్రైం: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురు వ్యక్తులకు కరీంనగర్ కోర్టు జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ కరీముల్లా ఖాన్ తెలిపారు. 10 మందిని శుక్రవారం కోర్టులో హాజరుపరిచామన్నారు. ముగ్గురికి జైలుశిక్ష, రూ.5,500 జరిమానా, ఏడుగురికి రూ.11,500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారని పేర్కొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈపై ఫిర్యాదు

శంకరపట్నం: చెట్టుకొమ్మలు అనుమతి లేకుండా నరికివేశారని ఆముదాలపల్లి సబ్‌స్టేషన్ ఏఈ కుమారస్వామిపై జీపీ కార్యదర్శి కేశవపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇటీవల డీపీఓ రవీందర్ వీణవంక వెళ్తుండగా ఆముదాలపల్లిలో చెట్టుకొమ్మలు నరికివేస్తున్నాడని గమనించి వెంటనే సంబంధితశాఖపై చర్యలు చేపట్టాలని సెక్రటరీని ఆదేశించారు. డీపీఓ ఆదేశాల మేరకు ఏఈపై శుక్రవారం గ్రామకార్యదర్శి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రికార్డులను పరిశీలించిన అధికారులు

శంకరపట్నం: తాగునీటి సరఫరాకు సంబంధించి ఏడు రికార్డులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు డీఈ హారిక, ఏఈ విజయ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. తాడికల్, వంకాయగూడెం, మొలంగూర్, పంచాయతీలలో నీటి సరఫరా, క్లోరినేషన్, ట్యాంకుల శుభ్రత, కొత్త కనెక్షన్లు, లీకేజీ పైపులు, బ్లీచింగ్ పౌడర్ తదితర రికార్డులను పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మొగిలి, జీపీ కార్యదర్శులు ఉన్నారు.

పొన్నంపై విమర్శలు అవివేకం

కరీంనగర్‌కార్పొరేషన్: రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బీజేపీ నాయకులు చేసిన విమర్శలు అవివేకంతో కూడినవని కాంగ్రెస్ అధికార ప్రతినిధి బాలబద్రి శంకర్ పేర్కొన్నారు. బడుగు, బలహీనవర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్న పొన్నంపై నోటికొచ్చినట్లు మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన ఒక ప్రకటనలో హెచ్చరించారు.

సహస్ర గాయత్రి మహాయజ్ఞం

కరీంనగర్‌రూరల్: తీగలగుట్టపల్లిలోని శ్రీశ్రీశ్రీ మహాయోగిని మాణికేశ్వరి మాతా ఓంకార ఆశ్రమంలో శుక్రవారం అత్యంత వైభవంగా సహస్ర గాయత్రి మహాయజ్ఞం నిర్వహించారు. అనంతరం అన్నదానం, భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ఆశ్రమ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

రామడుగు: ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం తక్షణం చెల్లించాలని బీకేఎంయూ రాష్ట్ర కార్యదర్శి కొయ్యాడ సృజన్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీల సమస్యలను తెలుసుకున్నారు. నాలుగు నెలల నుంచి కూలీ డబ్బులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, ఆధార్ లింక్ ఉన్న కూలీలకు డబ్బులు పడినట్లు మెసేజ్ వస్తున్నా ఖాతాలో నగదు జమ కావడం లేదని తెలిపారు. ఉపాధి కూలీలకు రోజువారీ కూలీల మాదిరిగా రూ.ఆరు వందల చొప్పున, రెండు వందల రోజులు పని కల్పించాలని కోరారు. నాయకులు రాజేశం, మల్లేష్, కనకయ్య, ఐలయ్య, రాజవ్వ పాల్గొన్నారు.

రేపటి నుంచి నాలుగో విడత ఇంటర్ మూల్యాంకనం

కరీంనగర్: ఇంటర్ పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ నాలుగోవిడతను ఆదివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు డీఐఈవో జి.జగన్మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని(ప్రభుత్వ, ప్రైవేటు, సాంఘిక సంక్షేమ, మహాత్మాజ్యోతిబాపూలే, ఆదర్శ, కేజీబీవీ, మైనార్టీ) జూనియర్ కళాశాలలో పనిచేసే ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు హాజరుకావాలని పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల(బాలికల)లో వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, చరిత్ర సబ్జెక్టులను మూల్యాంకనం చేయనున్నట్లు తెలిపారు. ఆయా మూల్యాంకన కేంద్రాలకు సకాలంలో హాజరుకావాలని పేర్కొన్నారు.

బత్తాయి రసం.. భలే గిరాకీ



కోర్టు చౌరస్తాలో బత్తాయి రసం బండి

కరీంనగర్: బత్తాయి రసం తీసుకుంటే జీర్ణశక్తి మెరుగుపడుతుంది. అలాంటి పండ్ల రసాన్ని ఎంతో రుచిగా తయారు చేసి రూ.20కే విక్రయిస్తున్నారు లక్నోవాసులు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోకు చెందిన సుమారు 50 మంది యువత నగరంలోని కోర్టు చౌరస్తా, మార్కెట్, డాక్టర్ స్ట్రీట్, బస్టాండ్, మంకమ్మతోట, కలెక్టరేట్ తదితర పలు ప్రధాన రహదారుల్లో చూడముచ్చటగా ఉండే యంత్రాలతో బత్తాయి రసం విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉప్పు, జీలకర్రతో కలిపిన బత్తాయి రసానికి విపరీతమైన ఆదరణ లభిస్తోంది. బత్తాయి ధరలు పెరిగినా, తగ్గినా ఒకే ధరకే బత్తాయి రసాన్ని విక్రయిస్తున్నారు. పెట్టుబడి పోనూ రోజుకు రూ.200 నుంచి 300 వరకు లాభం వస్తోందని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

రుచిగా ఉంది



బత్తాయి రసం రూ.20కే లభిస్తోంది. భలే రుచిగా ఉంది. చాయ్ తాగే బదులు రెండు గ్లాసులు బత్తాయి రసం తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మేలు. ఉప్పు, జీలకర్ర ఆరోగ్యానికి ఎంతో మంచిది.

– సత్తినేని శ్రీనివాస్, కరీంనగర్

ఇష్టంగా తాగుతా



ఎండాకాలంలో బత్తాయి రసం, కొబ్బరి బోండాలతో ఉపశమనం కలుగుతోంది. ఆరోగ్యానికి కూడా ఎంతో మంచిది. చాయ్, ఇతరత్రా వాటి వల్ల అరోగ్యానికి హానికరం. తోపుడు బండ్లపై దొరికే జ్యూస్‌లు, ఐస్‌క్రీమ్‌లు కల్తీ అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. బత్తాయి, కొబ్బరి బోండాలు ఇష్టంగా తాగుతా.

– సిరిసెట్టి రాజేశ్‌గౌడ్, కరీంనగర్

పౌష్టికాహారం తీసుకోవాలి



పాలంపల్లిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



సుందరగిరిలో..

తిమ్మాపూర్: మండలంలోని పాలంపల్లిలో శుక్రవారం పోషణ్ పక్వాడ నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. సమతుల ఆహారం పోషణ్ బీ, పడాయి బీ అనే అంశంలో భాగంగా సమతుల ఆహారం, చిరుధాన్యాలు, పూర్వ ప్రాథమిక విద్య అంశాలను వివరించారు. అనంతరం ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. నీటి ప్రాధాన్యత, భవిష్యత్ తరాలకు వాటిని అందించడానికి మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. నీటిని వృథా చేస్తే భవిష్యత్‌లో జీవరాశి మనుగడ ప్రశ్నార్థకమవుతుందన్నారు. వాననీరు భూమిలో ఇంకేలా ఇంకుడుగుంతలు తవ్వుకోవాలని సూచించారు. కార్య క్రమంలో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ముఖ్య అతిథులుగా హెచ్‌ఎం శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, కిరణ్ కుమార్ సూపర్‌వైజర్ పద్మ, ఏఎన్‌ఎం తిరుమల, వీవోలు అంగన్‌వాడీ టీచర్లు ఆశావర్కర్లు, టీచర్లు పాల్గొన్నారు.

చిగురుమామిడిలో..

చిగురుమామిడి మండలం సుందరగిరి, సీతారాంపూర్ గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ పక్వాడ నిర్వహించారు. గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాజశ్రీ, ఇందిరా, కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లుపాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు పుట్టినిల్లు

మానకొండూర్‌రూరల్: గర్భిణులు, బాలింతలు, పుట్టిన పిల్లలకు అంగన్‌వాడీ సెంటర్లు పుట్టినిల్లు వంటిదని సీడీపీవో సబిత అన్నారు. మండలంలోని వెల్ది అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం పోషణ్ పక్వాడ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీఓ హాజరై మాట్లాడారు. పిల్లలకు పోషకాహారం విలువ, ఆరోగ్యం గూర్చి వివరించారు. గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఏసీడీపీఓ అరవింద, హెచ్‌ఎం చంద్రమౌళి, సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, టీచర్లు పద్మ, కె.అరుణ, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని పోచమ్మవాడ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సామూహిక సీమంతం నిర్వహించారు. ఈసందర్భంగా హుజూరాబాద్ ఇన్‌చార్జి సీడీపీవో తిరుమల మాట్లాడుతూ.. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, ఆకుకూరలు, బెల్లం, కాయగూరలు పండ్లు తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు పాల్గొన్నారు.

‘బుర్ర’కు పురస్కారం అభినందనీయం



డాక్టర్ మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న లయన్స్ బాధ్యులు

కరీంనగర్‌కల్చరల్: ఇటీవల తెలుగు విశ్వవిద్యాలయ కీర్తి పురస్కారాన్ని అందుకున్న కాలమిస్టు, రచయిత, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డికి శుక్రవారం ఫిలింభవన్‌లో తెలంగాణ తెలుగు భాషా పరిరక్షణ సంఘం, శాతవాహన లయన్స్ క్లబ్, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సంకశాల మల్లేశ్ మాట్లాడుతూ.. పలు రంగాల్లో ప్రమాణాలు పాటిస్తూ, సమాజహిత కార్యక్రమాలు చేపడుతూ, మరోవైపు సంపాదకీయ వ్యాసాలు రాస్తున్న మధుసూదన్‌రెడ్డికి ఈ పురస్కారం దక్కడం అభినందనీయమన్నారు. కెమిస్ట్రీ అధ్యాపకుడిగా, ఎన్సీసీ కంపెనీ కమాండర్‌గా, సామాజిక కార్యకర్తగా, రచయితగా, కాలమిస్టుగా, లయన్స్ క్లబ్ సేవకుడిగా, వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా, తెలంగాణ తెలుగు భాషా సంఘం అధ్యక్షుడిగా, 57సార్లు రక్తదాతగా సమాజ సేవలో ఉన్న బహుముఖ ప్రజ్ఞ కలిగిన ఆయనకు ఈ పురస్కారం ఇవ్వడం సముచితమని అన్నారు. అనంతరం ఆయనకు పలు సంఘాల ఆధ్వర్యంలో సన్మానం జరిగింది. వారాల ఆనంద్, కోట మురళి, డాక్టర్ రామకృష్ణ, బొమ్మకంటి కిషన్, ఎస్.వేణుగోపాల్, జి.కృపాదానం, గాజుల రవీందర్, కాంతాకుమారి, నాగభూషణం, శ్రీనివాసరెడ్డి, సవ్యసాచి, దయాకర్, రామరాజు, చంద్రప్రభాకర్, లక్ష్మీరాజం, గణేశ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ‘కనకవ్వ’ ప్రయాణిస్తున్న కారు



సంఘటన స్థలంలో కనకవ్వ

కరీంనగర్‌క్రైం: ప్రముఖ గాయని గొట్టె కనకవ్వ ప్రయాణిస్తున్న కారు ఓ బైక్‌ను ఢీకొట్టింది. స్థానికుల వివరాల ప్రకారం.. కనకవ్వ శుక్రవారం వేములవాడ రాజన్న దర్శనానికి వెళ్తోంది. మధ్యాహ్నం తెలంగాణ చౌక్ వద్దకు చేరుకోగానే కారు ఓ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఇరువర్గాల మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. ట్రాఫిక్ పోలీసులు, ప్రయాణికులు కలగజేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది. తర్వాత అందరూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని తెలిసింది.

యువత క్రీడల్లో రాణించాలి



క్రికెట్ ఆడుతున్న సీఐ రాజ్‌కుమార్

మానకొండూర్: యువత క్రీడల్లో రాణించాలని మానకొండూర్ సీఐ రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని అన్నారం గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 17వ మెమోరియల్ క్రికెట్ లీగ్‌ను అంబేడ్కర్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. పట్టుదలతో ఆడితే విజయం సాధ్యమని, విజయాలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఈసందర్భంగా నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొట్ల కిషన్, ఉప సర్పంచ్ మూగల మహేందర్‌రెడ్డి, శంకరయ్య, బాబుమియా, బొద్దిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఆరెల్లి అంజనేయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని కేశవపూర్ గ్రామంలో పోలీసులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. ఓ వ్యక్తి నుంచి రూ.2,000 విలువ చేసే మద్యం పట్టుకొని సీజ్ చేసి కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరగంటి రవి తెలిపారు.

టీడీపీ మూడో జాబితా విడుదల

11 ఎమ్మెల్యే, 13 ఎంపీ సీట్లకు అభ్యర్థులను వెల్లడించిన చంద్రబాబు

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ మరో 11 అసెంబ్లీ స్థానాలు, 13 ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ఈ జాబితాను టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు శుక్రవారం విడుదల చేశారు. దీంతో ఇప్పటివరకు ఆ పార్టీ 139 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లయింది. పొత్తులో భాగంగా 144 స్థానాల్లో పోటీచేయాల్సి వుండగా ఇంకా ఐదు స్థానాలను పెండింగ్‌లో పెట్టారు. అలాగే, పొత్తులో 8 ఎంపీ స్థానాలు వదులుకోవడంతో 17 స్థానాలకుగానూ 13 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా మిగిలిన నాలుగు స్థానాలకు ఖరారు చేయాల్సి వుంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో వివాదంగా మారిన పెనమలూరు, మైలవరం సీట్లకు బోడె ప్రసాద్, వసంత కృష్ణప్రసాద్ పేర్లను ఖరారుచేశారు. మైలవరం సీటు కోసం ఫిరాయింపు ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, బొమ్మసాని సుబ్బారావులు గట్టిగా పోటీపడ్డారు. ఈ స్థానాన్ని నిలుపుకునేందుకు దేవినేని ఉమా గట్టిగా పట్టుబట్టినా ఇటీవలే టీడీపీలో చేరిన కృష్ణప్రసాద్ ధనబలంతో దాన్ని చేజిక్కించుకున్నట్లు చెబుతున్నారు. మైలవరం టికెట్‌ను ఫిరాయింపు నేతకు ఇస్తున్న నేపథ్యంలో పెనమలూరు సీటుకు దేవినేని ఉమా పేరును పరిగణలోకి తీసుకుని అక్కడికి పంపుతున్నట్లు హడావుడి చేశారు. అక్కడి ఇన్‌ఛార్జి బోడె ప్రసాద్‌ను పక్కనపెడుతున్నట్లు హంగామా చేసినా చివరికి ఆయనకే సీటు ఇచ్చారు. దీనివెనుకా భారీగా డబ్బు దండుకునే వ్యూహం అమలైనట్లు తెలుస్తోంది

టీడీపీ ఎంపీ అభ్యర్థులు వీరే..	
శ్రీకాకుళం	రామ్మోహన్ నాయుడు
విశాఖపట్నం	మాత్కుమిల్లి భరత్
అమలాపురం	గంటి హరీష్ మాధుర్
ఏలూరు	పుట్టా మహేష్ యాదవ్
విజయవాడ	కేశినేని శివనాథ్ (చిన్ని)
గుంటూరు	పెమ్మసాని చంద్రశేఖర్
నరసరావుపేట	లావు శ్రీకృష్ణదేవరాయలు
బాపట్ల	తెన్నేటి కృష్ణప్రసాద్
నెల్లూరు	వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి
చిత్తూరు	దగ్గుమళ్ల ప్రసాదరావు
కర్నూలు	బస్తిపాటి నాగరాజు
నంద్యాల	బైరెడ్డి శబరి
హిందూపురం	బీకే పార్థసారథి
ఎమ్మెల్యే అభ్యర్థులు..	
పలాస	గౌతు శిరీష
పాతపట్నం	మామిడి గోవిందరావు
శ్రీకాకుళం	గొండు శంకర్
ఎస్.కోట	కోళ్ల లలితకుమారి
కాకినాడ సిటీ	వనమాడి వెంకటేశ్వరరావు
అమలాపురం	అయితాబత్తుల ఆనందరావు
పెనమలూరు	బోడె ప్రసాద్
మైలవరం	వసంత కృష్ణప్రసాద్
నరసరావుపేట	డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు
చీరాల	ఎం. మాలకొండయ్య యాదవ్
సర్వేపల్లి	సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

తెలంగాణ బీజేపీ నేతకు బాపట్ల ఎంపీ సీటు..

సాక్షి, హైదరాబాద్: బాపట్ల ఎంపీ సీటును ఆశ్చర్యకరంగా తెలంగాణకు చెందిన బీజేపీ నేత, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి తెన్నేటి కృష్ణప్రసాద్‌కి ఇవ్వడం విశేషం. ఈ నిర్ణయంతో టీడీపీ శ్రేణులే అవాక్కయ్యాయి. ఆయన తెలంగాణ కేడర్ ఐపీఎస్ అధికారి కావడంతోపాటు పుట్టి పెరిగింది అంతా తెలంగాణలోనే. అలాంటి వ్యక్తికి చంద్రబాబు ఏపీలో సీటు ఇచ్చారు. బాపట్ల స్థానానికి అభ్యర్థి దొరక్క చంద్రబాబు చాలారోజులపాటు అన్వేషణ కొనసాగించారు. ఐఆర్‌ఎస్ అధికారి దగ్గుమళ్ల ప్రసాదరావుకు ఇవ్వాలని చూసినా ఆయనకు చిత్తూరు సీటు ఇచ్చి ఆఖరి నిమిషంలో కృష్ణప్రసాద్‌కు బాపట్ల సీటు ఇచ్చారు. నిజానికి.. వరంగల్ ఎంపీ సీటు కోసం బీజేపీ తరఫున పోటీచేసేందుకు కృష్ణప్రసాద్ ప్రయత్నించి విఫలమయ్యారు. ఈయనకు చంద్రబాబు అనూహ్యంగా ఏపీలో సీటు ఇవ్వడం గమనార్హం.

'మత్తు' చుట్టూ చుట్టాలే

▶ మొదటి పేజీ తరువాయి

తెరతీసింది. తద్వారా డ్రగ్స్ దందా వెనుక తాము ఉన్నామనే విషయాన్ని కప్పిపుచ్చవచ్చని చంద్రబాబు భావించారు. అయితే కూనం కోటయ్య చౌదరితో టీడీపీ నేతల వ్యాపార బంధం వెలుగు చూడటంతో బాబు కుట్ర బెడిసికొట్టింది. చంద్రబాబు వదిన, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కుటుంబంతో కూనం కుటుంబానికి ఉన్న వ్యాపార బంధం ఇప్పటికే వెలుగులోకి వచ్చింది. రాయపాటి, దామచర్ల, లావు కుటుంబ సభ్యులతో కూనం కోటయ్య చౌదరి కలసి ఉన్న ఫోటోలు తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కూనం వీరభద్ర చౌదరితో టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజాకు ఉన్న బంధాన్ని రుజువు చేసే వ్యాపార లావాదేవీల పత్రాలు కూడా సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలో టీడీపీ, బీజేపీ పొత్తు కుదురుతుందనే సంకేతాలు అందిన వెంటనే బ్రెజిల్ నుంచి భారీగా డ్రగ్స్ దిగుమతికి తెర తీసినట్లు ప్రాథమికంగా నిర్ధారణ కావడం గమనార్హం.

కింగ్ పిన్ కోటయ్య చౌదరి..

డ్రగ్స్ దందాలో కీలక పాత్రధారులైన సంధ్యా ఆక్వా కంపెనీ చైర్మన్ కూనం వీరభద్ర చౌదరి, ఎండీ కోటయ్య చౌదరి టీడీపీ పెద్దలకు అత్యంత సన్నిహితులని ఆధారాలతో సహా వెలుగులోకి వచ్చింది. ఆయన సన్నిహితులు, వ్యాపార భాగస్వాముల జాబితాను చూస్తే ఆ విషయం తేలిపోతోంది. దామచర్ల సత్యం (ఒంగోలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దామచర్ల జనార్ధన్ సోదరుడు), రాయపాటి జీవన్ (టీడీపీ మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు తమ్ముడు గోపాలకృష్ణ కుమారుడు), లావు శ్రీకృష్ణ దేవరాయలు (నరసరావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి)లకు ఆయన అత్యంత సన్నిహితుడు. వారంతా ఓ కోటరీగా పెద్ద ఎత్తున వ్యవహారాలు సాగించారన్నది వెల్లడైంది. వారు విదేశాల్లో అత్యంత సన్నిహితంగా తిరిగిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దామచర్ల సత్య టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు అత్యంత సన్నిహితుడు. చంద్రబాబుతోనూ సాన్నిహిత్యం ఉంది. సంధ్యా ఆక్వా కంపెనీ చైర్మన్ కూనం వీరభద్ర చౌదరితోపాటు టీడీపీ మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నేత ఆలపాటి రాజాకు వ్యాపార బంధం ఉంది. వారిద్దరూ సంతకాలు చేసిన పలు పత్రాలు ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. విశాఖ కేంద్రంగా వ్యవహారాలు సాగిస్తున్న సంధ్యా ఆక్వా కంపెనీకి నందమూరి కుటుంబంతోనూ సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు బయటపడింది. బాలకృష్ణ చిన్నల్లుడు, లోకేశ్ తోడల్లుడు, విశాఖ టీడీపీ ఎంపీ అభ్యర్థి ఎం.భరత్‌కు కూనం కోటయ్య చౌదరి అత్యంత సన్నిహితుడు. ఆయన కుటుంబం సహకారంతోనే విశాఖ కేంద్రంగా వ్యాపార కార్యకలాపాలు మొదలు పెట్టినట్టు తెలుస్తోంది. సంధ్యా ఆక్వా కంపెనీతో బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కుటుంబానికి వ్యాపార బంధం ఉందన్నది ఇప్పటికే బయటపడింది. పురందేశ్వరి కుమారుడు చెంచురామ్, వియ్యంకుడు భాగస్వాములుగా కూనం వీరభద్ర చౌదరి, కోటయ్య చౌదరి ఆక్వా వ్యాపారాన్ని ప్రారంభించారు. దీంతో డ్రగ్స్ దందాలో తీగ లాగితే చంద్రబాబు, దగ్గుబాటి పురందేశ్వరి కోటరీ అక్రమాల డొంకంతా కదులుతోంది.

ఢిల్లీ మద్యం కుంభకోణంలోనూ..

దేశంలో సంచలనం సృష్టించిన ఢిల్లీ మద్యం కుంభకోణంలోనూ సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ పాత్ర ఉన్నట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. ఢిల్లీలో మద్యం కుంభకోణానికి పాల్పడిన సిండికేట్‌లో ఆ కంపెనీ కూడా భారీగా పెట్టుబడులు పెట్టినట్లు తేలింది. ఆ కేసును కూడా సీబీఐ దర్యాప్తు చేస్తోంది. ఇప్పుడు విశాఖ డ్రగ్స్ దందాను కూడా కలిపి మొత్తంగా మద్యం, డ్రగ్స్ మాఫియా గుట్టును ఛేదించే పనిలో నిమగ్నమైంది.

పొత్తుతోనే బరితెగింపు..

ఎన్నికల్లో బీజేపీతో పొత్తు కోసం చంద్రబాబు ఎప్పుడో సిద్ధపడ్డారు. అందుకోసం కాళ్ల బేరానికి కూడా దిగజారతానని గతేడాదే స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. పొత్తును అవకాశంగా చేసుకుని భారీగా డ్రగ్స్ దందాకు పచ్చ మాఫియా బరితెగించింది. ఎన్నికల ముందు భారీగా డ్రగ్స్‌ను రాష్ట్రంలోకి తరలించేందుకు పథకం వేసింది. ఈ ఏడాది ప్రారంభంలోనే సంధ్యా ఆక్వా కంపెనీ ద్వారా బ్రెజిల్ నుంచి 25 వేల కిలోల ఈస్ట్ దిగుమతి ముసుగులో భారీగా డ్రగ్స్‌ను చేరవేసేందుకు ప్రణాళిక రూపొందించింది. రెండు నెలల్లో డ్రగ్స్ విశాఖ చేరుకునేలా అంతా సిద్ధమైంది. అటు దగ్గుబాటి ఇటు చంద్రబాబు కుటుంబాలు సహకారం ఉండటంతో తమ దందాకు అడ్డు ఉండదని భావించారు. డ్రగ్స్ మాఫియాపై అంతర్జాతీయ దర్యాప్తు సంస్థ ఇంటర్‌పోల్‌కు ఉప్పందడంతో ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయాన్ని అప్రమత్తం చేశారు. ఢిల్లీ నుంచి వచ్చిన సీబీఐ అధికారుల బృందం విశాఖ పోర్టులో నిర్వహించిన తనిఖీల్లో డ్రగ్స్ బాగోతం బట్టబయలైంది. పచ్చ కుట్ర బెడిసికొట్టింది.

ఎన్నికల కమిషన్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

చంద్రబాబు, టీడీపీ అనుకూల మీడియా దుష్ప్రచారంపై వైఎస్సార్‌సీపీ తక్షణమే ప్రతి స్పందించింది. డ్రగ్స్ దందాతో నారా, నందమూరి, దగ్గుబాటి కుటుంబాలకు ఉన్న బంధాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లింది. చంద్రబాబు, టీడీపీ అనుకూల మీడియా చేస్తున్న దుష్ప్రచారంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. నియమావళిని ఉల్లంఘిస్తూ చంద్రబాబు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆధారాలతో నివేదించింది. దీనిపై జాతీయ ప్రెస్ కౌన్సిల్‌కు కూడా ఫిర్యాదు చేయాలని నిర్ణయించింది. డ్రగ్స్ దందాపై సత్వరం సమగ్రంగా దర్యాప్తు చేయాలని సీబీఐని కోరింది. నిష్పక్షపాతంగా దర్యాప్తు నిర్వహించి పాత్రధారులతోపాటు సూత్రధారులను నిగ్గు తేల్చాలని విజ్ఞప్తి చేసింది.

కూనం కుటుంబం కథ...

విశాఖ డ్రగ్స్ వ్యవహారంలో ప్రధాన పాత్రధారులైన సంధ్యా ఆక్వా ఫుడ్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ అధినేతలు కూనం వీరభద్ర చౌదరి, కుమారుడు కూనం కోటయ్య చౌదరి స్వగ్రామం ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఈదుమూడి. ఆక్వా రంగంలో ఉత్థాన పతనాలను చూసిన వీరభద్ర చౌదరి డ్రగ్స్ వ్యాపారంలో కాలు మోపాడు. కాకినాడ ప్రధాన కేంద్రంగా ఆక్వా ఫుడ్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్, ప్రీ ప్రోసెసింగ్ ప్లాంట్ల ముసుగులో అక్రమ లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అటు టీడీపీ ఇటు రాష్ట్ర బీజేపీ అగ్రనేతల అండదండలతో తన కార్యకలాపాలను విస్తరించాడు. కూనం కుటుంబానికి ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో సంధ్యా ఆక్వా ప్రీ ప్రోసెసింగ్ ప్లాంట్లతో పాటు ఆక్వా కల్చర్ చెరువులు కూడా ఉన్నాయి. వీరి వ్యాపార లావాదేవీలు కొండపి, ఒంగోలు, కందుకూరు, పర్చూరు నియోజకవర్గాల్లోనూ సాగుతున్నాయి. ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ సోదరుడు దామచర్ల సత్యనారాయణ(సత్య)తో కూనం కుటుంబానికి వ్యాపార లావాదేవీలున్నాయి. టంగుటూరు టోల్ ప్లాజా సమీపంలో దామచర్ల సత్యకు చెందిన పొగాకు గోడౌన్‌లో సంధ్యా ఆక్వా పేరుతో ప్రీ ప్రాసెసింగ్ ప్లాంటు ఏర్పాటైంది. కూనం కుటుంబానికి విజయవాడకు చెందిన సొమ్ముడిగా పేరున్న ఓ టీడీపీ నేతతోనూ సంబంధాలున్నట్లు సమాచారం. కోటయ్య చౌదరి, టీడీపీ నేత తనయుడు తనయుడు విదేశాల్లో మంచి సన్నిహితులని తెలిసింది.

చీరాలకు లింకు?

డ్రగ్స్ దందాకు చీరాలతో కూడా లింకులు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. సంధ్యా ఆక్వా పేరుతో వాడరేవులో గత రెండేళ్లుగా కంపెనీ నడుస్తోంది. దీన్ని పురందేశ్వరి అల్లుడు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. గత పది రోజులుగా ఈ కంపెనీ కార్యకలాపాలు నిలిచిపోయాయని సమాచారం.

కాకినాడ తీరంలో కలకలం

డ్రగ్స్ తీగ లాగితే కాకినాడ జిల్లా కొత్తపల్లి తీరంలోని మూలపేటలో డొంక కదిలింది. మూలపేటలోని సంధ్య ఆక్వా కంపెనీలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు 10 మంది సీబీఐ అధికారులు స్థానిక పోలీసుల సహకారంతో సోదాలు జరిపారు. సీబీఐ ఇన్‌స్పెక్టర్ బల్వీందర్ సింగ్ ఆధ్వర్యంలో సీబీఐ బృందం ఈ తనిఖీలు చేసింది. జిల్లాలోని శంఖవరం మండలం కత్తిపూడి సమీపాన ఉన్న సంధ్య ఆక్వా సీడ్ తయారీ కంపెనీ, కృష్ణా జిల్లా పామర్రు తదితర ప్రాంతాల్లో ఉన్న సంధ్య ఆక్వా కంపెనీల్లో తనిఖీలు నిర్వహించినట్లు చెబుతున్నారు. కత్తిపూడి సమీపంలోని సంధ్య ఆక్వా సీడ్ కంపెనీని ఇటీవలే ప్రారంభించారు. దీనిలో ఆక్వా సీడ్ తయారీకి అవసరమైన ముడి సరుకును బ్రెజిల్ నుంచి దిగుమతి చేయడంతో ఆ సరకు నౌక ద్వారా విశాఖకు కంటైనర్లలో చేరింది. వాటిలో డ్రగ్స్ ఉన్నట్లు గుర్తించిన సీబీఐ అధికారులు సంధ్య కంపెనీలన్నింటిపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో మూలపేటలోని సంధ్య ఆక్వా కంపెనీని క్షుణ్ణంగా పరిశీలించి మందులు, ఇతర శాంపిల్స్ సేకరించారు. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకూ సంధ్య ఆక్వా కంపెనీని క్షుణ్ణంగా పరిశీలించిన సీబీఐ అధికారులు తిరిగి సోదాలు చేస్తామని తెలిపారు.

మూడోసారి 150 బ్యాగుల్లో శాంపిల్స్ పరీక్ష

డ్రగ్స్ కేసులో సీబీఐ దూకుడు పెంచింది. శుక్రవారం మరికొన్ని శాంపిల్స్‌ను పరీక్షించగా ఫలితాలు పాజిటివ్‌గా వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో న్యాయమూర్తి సమక్షంలో 25 వేల కేజీల సరుకుతో కూడిన కంటైనర్‌ను సీజ్ చేశారు. బ్రెజిల్‌లోని శాంటోస్ పోర్టు నుంచి రవాణా నౌక ద్వారా విశాఖకు వచ్చిన కంటైనర్‌లో డ్రగ్స్ ఉన్నట్లు ఇంటర్‌పోల్ ఇచ్చిన సమాచారంతో సీబీఐ అధికారులు తనిఖీలు చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 19, 20వ తేదీల్లో 49 బ్యాగుల్లో శాంపిల్స్‌ను పరీక్షించగా డ్రగ్స్ ఉన్నట్లు నిర్ధారణైంది. దీంతో ఈ నెల 21వ తేదీన సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేటు లిమిటెడ్‌పై సీబీఐ అధికారులు కేసు నమోదు చేశారు. తాజాగా శుక్రవారం మరోసారి వీసీటీపీఎల్‌కు వెళ్లి మూడోసారి 150 బ్యాగుల్లో శాంపిల్స్‌ను పరీక్షించారు. వాటి ఫలితాలు కూడా పాజిటివ్‌గా వచ్చినట్లు సమాచారం. న్యాయమూర్తి సమక్షంలో రికార్డులతో పాటు శాంపిల్స్‌ను సైతం పరిశీలించినట్లు తెలుస్తోంది. న్యాయమూర్తి సమక్షంలోనే బ్యాగులను సీజ్ చేశారు. మరికొన్ని సీబీఐ బృందాలు సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించాయి. ఈ నేపథ్యంలోమరిన్ని ఆధారాలతో సీబీఐ అధికారులు త్వరలోనే అరెస్టులకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

ఆలపాటి ఆర్థిక బంధం

విశాఖ డ్రగ్స్ కేసులో కీలక పాత్రధారి కూనం వీరభద్ర చౌదరితో మాజీ మంత్రి ఆలపాటి రాజాకు ఉన్న ఆర్థిక సంబంధాలు చర్చనీయాంశంగా మారాయి. ఆలపాటి రుణాలకు కూనం సెక్యూరిటీ ఇవ్వడంతోపాటు ఎన్‌ఆర్‌ఐ అకాడమీతో భాగం పంపిణీ చేసుకోవడం వంటి వ్యవహారాలు చోటు చేసుకున్నాయి. 2015 అక్టోబరు 31న ఆలపాటి రాజేంద్రప్రసాద్ గుంటూరు అరండల్‌పేట విజయా బ్యాంకు బ్రాంచ్‌లో రూ.2 కోట్లు రుణం (దస్తావేజు నంబరు 11158/2015) తీసుకున్నారు. అదే ఏడాది డిసెంబరు 9న మరో రూ.12 కోట్లు అదే బ్యాంకు నుంచి రుణాన్ని పొందారు. దీనికి ఆలపాటి రాజా భార్య ఆలపాటి మాధవితోపాటు కూనం వీరభద్రరావు, ఎన్‌ఆర్‌ఐ అకాడమీ ఆస్తులను (దస్తావేజు నంబరు 12521/2015) తనఖా పెట్టారు. 2021లో కూనం వీరభద్రరావుకు ఎన్నారై అకాడమికి సంబంధించి పార్టీషన్ దస్తావేజు కూడా నమోదైనట్లు తెలుస్తోంది. కూనం వీరభద్రరావు తమ ఆస్తులను తనఖా పెట్టి 2017లో బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు రుణాన్ని ఇప్పించారు (దస్తావేజు నంబరు 4581/2017). ఇదే దస్తావేజును 2021లో (నంబరు 12205/2021) రద్దు చేసుకున్నారు. దీంతోపాటు మరికొన్ని ఆర్థిక లావాదేవీలు కూడా వీరిద్దరి మధ్య జరిగినట్లు తెలుస్తోంది.









చకిరేవు కష్టాలు తీరేదెన్నడో..

నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని మారుమూల గిరిజన గ్రామం చారికేవు. ఇప్పటికీ ఈ గూడేనికి రోడ్డు లేదు, కరెంటు, తాగునీటి సౌకర్యం కల్పించలేదు. తాగునీటి కోసం రెండేళ్ల క్రితం గిరిజనులు పాదయాత్రగా కలెక్టరేట్‌కు వచ్చారు. మూడు రోజులు కలెక్టరేట్ ఎదుట వంటావార్పు చేపట్టారు. 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలకు నాటి గిరిజన మంత్రి సత్యవతిరాథోడ్ స్పందించారు. చాకిరేవును సందర్శించి సమస్యలు పరిష్కరించాలని నాటి కలెక్టర్ ముషరఫ్ అలీని ఆదేశించారు. దీంతో గ్రామాన్ని సందర్శించి బోరు వేయించారు. విద్యుత్ సౌకర్యం కోసం సోలార్ ప్లాంటు ఏర్పాటు చేయించారు. ఇప్పుడు ఒక్క చేతిపంపే తండా మొత్తానికి ఆధారం. గ్రామానికి మిషన్ భగీరథ నీరు అందడం లేదు. వేసవిలో ఉపాధి లేక గిరిజన మహిళలు ఖాళీగా ఉంటున్నారు. పిల్లలు ఐదు కిలోమీటర్ల దూరంలోని ధూందరి గ్రామంలోని పాఠశాలకు వెళ్తున్నారు. రేషన్, ఓటు వేసేందుకు కూడా ఆ గ్రామానికే వెళ్లాలి. ఇక అనారోగ్య సమస్య వస్తే 10 కిలోమీటర్లకుపైగా దూరం ఉన్న పెంబికి నడుచుకుంటూ వెళ్లాల్సిందే. అధికారులు మిషన్ భగీరథ నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

విద్యుత్ కేంద్రాన్ని సింగరేణికి అప్పగించొద్దు

- జెన్‌కో ఆధ్వర్యంలోనే స్థాపించాలి
- జెన్‌కో, ట్రాన్స్‌కో ఎనర్జీ సెక్రటరీకి ఉద్యోగ సంఘాల వినతి



ఎనర్జీ సెక్రటరీ రిజ్వీకి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగ సంఘాల ప్రతినిధులు

రామగుండం: స్థానిక బీ–థర్మల్ స్థలంలో నూతనంగా 800 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించతలపెట్టిన విద్యుత్ కేంద్రాన్ని సింగరేణికి అప్పగించేందుకు కసరత్తు చేస్తున్నట్లు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో సింగరేణికి అప్పగించొద్దని, జెన్‌కో ఆధ్వర్యంలోనే విద్యుత్ కేంద్రం స్థాపించాలని 26 ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం జెన్‌కో, ట్రాన్స్‌కో ఎనర్జీ సెక్రటరీ సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీని హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి, వినతిపత్రం అందజేశారు. జెన్‌కోలో అనుభజ్ఞులైన ఇంజినీర్లు ఉన్నారని, ఇంతటి నైపుణ్యం కలిగిన మ్యాన్‌పవర్‌ను తిరస్కరిస్తూ సింగరేణికి కట్టబెట్టడం సరికాదన్నారు. రామగుండానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 1.89 టీఎంసీల నీటిని వినియోగించుకునేందుకు ఆమోదం ఉందని, సమీపంలోనే బొగ్గు గనులు, రోడ్డు, రైలు మార్గం కనెక్టివిటీ ఉన్నాయని పేర్కొన్నారు. ఉద్యోగ నివాస కాలనీలు, యాష్‌పాండ్, విద్యుత్ కేంద్రానికి చెందిన 560 ఎకరాల భూమి అందుబాటులో ఉన్నాయన్నారు. ఒక మెగావాట్‌కు 0.7 ఎకరాల భూమి అవసరం కాగా, 800 మెగావాట్ల కేంద్రానికి 560 ఎకరాలు సంపూర్ణంగా సరిపోతుందని తెలిపారు. సమీప వనరులను సద్వినియోగం చేసుకొని, సింగరేణి కంటే జెన్‌కో ఆధ్వర్యంలో విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేస్తే తక్కువ ధరకు విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశం ఉంటుందన్నారు. దీనిపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకుంటే ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. సంఘాల జేఏసీ కన్వీనర్ పి.రత్నాకర్‌రావు, శ్రీధర్, బీసీరెడ్డి, ప్రతినిధులు అనిల్‌కుమార్, ఎంఏ.వజీర్, గోవర్దన్, శ్యామనోహర్, వెంకన్నగౌడ్, సుధాకర్ రెడ్డి, తులసీ నాగరాణి, కరుణాకర్‌రెడ్డి, నెహ్రూ, నాగరాజు, లోహిత్ ఆనంద్, సాయిబాబు, మురళి తదితరులు పాల్గొన్నారు.

తండ్రి కోసం జైలులోకి గంజాయి తెచ్చి..

- కటకటాల పాలైన కుమారుడు
- ఆదిలాబాద్‌లో ఘటన

ఆదిలాబాద్‌టౌన్: జైలులో ఉన్న తండ్రి కోసం కుమారుడు జైలు గోడపై నుంచి గంజాయి, బీడీ కట్టను విసిరి కటకటాల పాలైన ఘటన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. టూటౌన్ ఎస్సై జీపీ రమణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన బాబాఖాన్ ప్రస్తుతం జిల్లా జైలులో ఖైదీగా ఉన్నాడు. ఇటీవల ఈయన గంజాయి విక్రయిస్తూ పట్టుబడటంతో మావల పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. జైలులో ఉన్న తండ్రిని చూసేందుకు ఆయన కుమారుడు అర్షద్‌ఖాన్ ఇటీవల ములాఖాత్ కోసం వచ్చాడు. మరోసారి వచ్చినప్పుడు గంజాయి, బీడీ కట్ట తీసుకురావాలని తండ్రి అతడికి సూచించాడు. దీంతో గురువారం ములాఖాత్‌కు వెళ్లిన కుమారుడు తండ్రితో మాట్లాడాడు. ఆ తర్వాత జైలు గోడపై నుంచి తండ్రి కోసం పది గ్రాముల గంజాయి, బీడీ కట్టను విసిరాడు. గమనించిన వార్డెన్ రాజేశ్ ఉన్నతాధికారులకు సమాచారమందించాడు. జైలర్ సూర్యప్రకాశ్‌రెడ్డి టూటౌన్ పోలీసులకు సమాచారమివ్వగా ఎస్సై లాల్‌సింగ్ నాయక్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాబాఖాన్‌ను విచారించగా ఆయన వద్ద నుంచి మూడు ప్యాకెట్లు గంజాయి, బీడి కట్ట లభించింది. అక్కడే ఉన్న కుమారుడు అర్షద్‌ఖాన్‌ను విచారించగా ఆయన వద్ద రెండు ప్యాకెట్ల గంజాయి దొరికింది. పోలీస్ స్టేషన్‌కు తరలించగా టూ టౌన్ ఎస్సై రమణరెడ్డి కేసు నమోదు చేసి నిర్మల్ జిల్లా జైలుకు రిమాండ్‌కు పంపించారు.

ట్రిపుల్ ఐటీలో జల దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు

భైంసా: బాసర ట్రిపుల్ ఐటీలో సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. సీనియర్ సైంటిస్ట్ ప్రమోద్ మాట్లాడుతూ నీటి సంరక్షణ చర్యలను వివరించారు. నీటి నిర్వహణ ప్రాముఖ్యతను తెలిపారు. నీటి కొరత, కాలుష్య స్థిరత్వం చుట్టూ ఉన్న ముఖ్యమైన సమస్యలను అర్థం చేసుకోవడానికి వాటితో నిమగ్నమవ్వడానికి ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. నిర్మల్ జిల్లా గ్రౌండ్ వాటర్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌బాబు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులను ప్రపంచ నీటి దినోత్సవ కార్యక్రమాలలో పాల్గొనేలా చేయడం అభినందనీయమన్నారు. నీటి వనరుల నిర్వహణలో వినూత్న సాంకేతిక పద్ధతులను వివరించారు. ప్రపంచ నీటి వనరులను పర్యవేక్షించడంలో రిమోట్ సెన్సింగ్ జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్(ఏఐ) కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ సాంకేతికతలు నీటి వనరులు, భూగర్భజల స్థాయిలు నీటి నాణ్యతకు సంబంధించిన డేటాను విశ్లేషించడానికి ఉపయోగపడతాయని వివరించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ మెంబర్స్, ల్యాబ్ స్టాఫ్ సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో వెబినార్



వెబినార్ నిర్వహిస్తున్న దృశ్యం

భైంసా: బాసర ఆర్జీయూకేటీలో తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సహకారంతో ఐపీఆర్ ఆర్జీయూకేటీ సెల్ ఆధ్వర్యంలో మేధో సంపత్తి హక్కులపై శుక్రవారం వెబినార్ నిర్వహించారు. సీఎస్ఐ సీనియర్ సైంటిస్ట్ ఆర్.భువనేశ్వర్, డాక్టర్ టి.పవన్‌కుమార్ ఆర్య, సీఎస్ఐఆర్ న్యూఢిల్లీ సైంటిస్ట్ డాక్టర్ కపిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ పేటెంట్ హక్కుల ప్రాముఖ్యత వాటి రూపాలను ఉదాహరణలతో వివరించారు. సైక్లింగ్ చేస్తూ వాషింగ్ మెషిన్‌ను ఉపయోగించి పేటెంట్ పొందిన ఒక సాధారణ వ్యక్తి గురించి తెలియజేశారు. ఒక ఆలోచన వ్యక్తిని, సమాజాన్ని, దేశ అభివృద్ధిని ఏ విధంగా సాధించగలమో తెలియజేశారు. డాక్టర్ కపిల్ ఆర్య మాట్లాడుతూ మేధో సంపత్తి పత్రాలను పూరించి పేటెంట్ ఏ విధంగా పొందాలో సుదీర్ఘంగా విశ్లేషించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సృజన, ఆర్గనైజింగ్ మెంబర్ స్వాతి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో యూరియా ఉత్పత్తికి మూడేళ్లు పూర్తి

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): దేశీయంగా ఎరువుల ఉత్పత్తి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించిన రామగుండం ఎరువుల కర్మాగారం (ఆర్‌ఎఫ్‌సీఎల్)లో ఎరువుల ఉత్పత్తి ప్రారంభించి మూడు వసంతాలు పూరయ్యాయి. ప్రతిరోజూ 2,200 మెట్రిక్ టన్నుల అమ్మోనియా, 3,850 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి చేస్తున్నారు. ఉత్పత్తి అయిన యూరియాలో 50 శాతం తెలంగాణ రాష్ట్రానికి, 50 శాతం కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. మార్చి 10న 350 ర్యాకుల యూరియాను రైలు మార్గాల ద్వారా సరఫరా చేశారు.

11 లక్షల మెట్రిక్ టన్నులు

2023–24 ఆర్థిక సంవత్సరంలో వార్షిక లక్ష్యం 12.70 లక్షల మెట్రిక్ టన్నులు కాగా మార్చి 22 నాటికి 11 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను ఉత్పత్తి చేశారు. సుమారు రూ.415 కోట్ల వార్షిక ఆదాయాన్ని పొందారు. కర్మాగారం లాభాల బాటలో నడుస్తుండటంతో త్వరలో ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్రభావిత గ్రామాల్లో అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు సమకూరే అవకాశం ఉంది.

తగ్గిన దిగుమతుల భారం

దేశీయంగా ఎరువుల కొరత అధికంగా ఉండడంతో కేంద్ర ప్రభుత్వం దిగుమతి తగ్గించేందుకు దేశవ్యాప్తంగా మూతపడిన, నష్టాల్లో ఉన్న ఎరువుల కర్మాగారాలను పునరుద్ధరించింది. తెలంగాణలోని ఆర్‌ఎఫ్‌సీఎల్ (నాటి ఎఫ్‌సీఐ), గోరఖ్‌పూర్ (ఉత్తరప్రదేశ్), సింద్రీ (జార్ఖండ్), తాల్చేర్ (ఒడిశా) ఎరువుల కర్మాగారాలను పునరుద్ధరించారు. పునరుద్ధరణలో మొదటిగా తెలంగాణలోని రామగుండం ఫెర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారం ఎరువుల ఉత్పత్తి 2021 మార్చి 23న ప్రారంభమైంది.

సాంకేతిక పరిజ్ఞానంతో నూతన ఆవిష్కరణలు



ఇండియన్ కాంగ్రెస్ అసోసియేషన్ సదస్సులో అధికారులు

- ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ కె. సీతారాంబాబు

జగిత్యాల అగ్రికల్చర్: ప్రతి రంగంలో ఎప్పటికప్పుడు వస్తున్న శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం ఎన్నో నూతన ఆవిష్కరణలకు మూలమని ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ కె.సీతారాంబాబు అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ కళాశాలలో శుక్రవారం ఇండియన్ సైన్స్ కాంగ్రెస్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'సుస్థిర అభివృద్ధి సాధనలో సైన్స్ అండ్ టెక్నాలజీ పాత్ర' అంశంపై జాతీయస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి అంశం సైన్స్‌తో ముడిపడి ఉందని, మన జీవితంలో నిత్య భాగమైందన్నారు. ఎప్పటికప్పుడు వివిధ రంగాల్లోని శాస్త్రవేత్తలు నూతన టెక్నాలజీ అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, వ్యవసాయరంగంలో ఎప్పటికప్పుడు మారుతున్న వాతావరణం రైతులకు ఇబ్బందిగా ఉందన్నారు. టెక్నాలజీ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.కామాక్షిప్రసాద్ మాట్లాడుతూ, కంప్యూటింగ్ సిస్టమ్స్, అడ్వాన్సు సిస్టమ్ ఏ విధంగా సామాజిక ఆర్థిక వృద్ధిపై పనిచేస్తుందో వివరించారు. కోరుట్ల వెటర్నరీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. మాధవరావు మాట్లాడుతూ, జంతువుల సంరక్షణలో వస్తున్న నూతన ఒరవడి, టెక్నాలజీ, నూతన ఆపరేషన్ల గురించి వివరించారు. వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భారతీభట్ మాట్లాడుతూ, ఎప్పటికప్పుడు వస్తున్న టెక్నాలజీ వ్యవసాయ రంగానికి ఊతమిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆర్గనైజింగ్ సెక్రటరీలు నిర్వహించిన పదర్శనలో పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా ఆసుపత్రి సూపరిటెండెంట్ రాములు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సంపత్, ఎల్లాగౌడ్, ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
శనివారం ॥ 23-3-2024





పిచ్చుకా క్షేమమా

ఐ లవ్ స్పారోస్!!

మనిషి తన సౌకర్యం కోసం ప్రకృతి సమతుల్యతకు విఘాతం కలిగిస్తూనే ఉంటాడు. ప్రకృతి సహనంతో ఓర్చుకుంటూ, అప్పుడప్పుడూ విలయం రూపంలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉంటుంది. మొత్తంగా తనను తాను సమతుల్యం చేసుకోవడానికి ప్రయత్నం చేస్తూనే ఉంటుంది. 'మాయమైపోతున్నదమ్మ మనిషన్నవాడు'... అని పిచ్చుకలు ఆవేదన చెందుతున్న సమయంలో ప్రకృతిఓ అమ్మాయి మనసును కదిలించింది. ఆమె ఇప్పుడు పక్షి ప్రేమికురాలైంది. తన ఇంటిని పక్షులకు విలాసంగా మార్చింది. తాను పక్షి ప్రేమికురాలిగా మారిన సందర్భాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు మంచాల హరిణి.



హరిణి

అడవికి దాహం వేసింది!

''అప్పుడు నేను బీబీఏ ఫస్ట్ ఇయర్‌లో ఉన్నాను. అమ్మా నాన్న, నేను, అక్క అందరం ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న మా పెద్ద నానమ్మ వాళ్ల ఊరికి వెళ్తున్నాం. నిర్మల్ దాటి కడెం మీదుగా అడవిలో ప్రయాణిస్తున్నాం. మే నెల కావడంతో ఎండ తీవ్రంగా ఉంది. చెట్ల మొదళ్లు ఎండిపోయి వానల కోసం ఎదురు చూస్తున్నాయి. ఓ పక్షి మా కళ్ల ముందే చెట్టుకొమ్మ మీద నుంచి జారి నేల మీద పడింది. కొద్ది సెకన్లపాటు రెక్కలు కొట్టుకున్నాయి. కారాపి వెళ్లి చూశాం, పక్షిని చేతుల్లోకి తీసుకుని మా దగ్గరున్న నీటిని చల్లి, తాగించడానికి ప్రయత్నించాం. కానీ ఆ పక్షి అప్పటికే ప్రాణాలు వదిలేసింది. ఆ చిన్న ప్రాణికి ఎన్ని నీళ్లు కావాలి, ఆ గుక్కెడు నీళ్లు లేకనే కదా ప్రాణం పోయిందని చాలా బాధేసింది. ఆ దృశ్యం పదే పదే కళ్ల ముందు మెదలసాగింది. ఇలాగ ఒక్కో వేసవికి ఎన్ని పక్షులు ప్రాణాలు కోల్పోతున్నాయో కదా... అనిపించింది. ఏదైనా చేయాలనిపించింది. కానీ ఏం చేయాలనేది వెంటనే స్ఫురించ లేదు.

పిచ్చుకలు వచ్చాయి!

పక్షులకు నీటికోసం ఇంటిముందు చిన్న పాత్రలో నీటిని పెట్టడం మొదలు పెట్టాను. పావురాలు ఇతర పక్షుల కంటే పిచ్చుకలే ఎక్కువగా రాసాగాయి. దాంతో పర్మినెంట్ సొల్యూషన్ కోసం ఆలోచిస్తున్నప్పుడు పిచ్చుకల సైజ్‌ని కూడా దృష్టిలో పెట్టుకుని ఫీడర్ బాక్స్ డిజైన్ చేశాను. ఇందుకోసం ఇంటర్‌నెట్‌లో చాలా సెర్చ్ చేశాను. మహారాష్ట్ర, నాసిక్‌లోని ప్లాస్టిక్ వస్తువులను తయారు చేసే ఫ్యాక్టరీ వాళ్లతో మాట్లాడి నాక్కావలసిన డిజైన్‌ను వివరించాను. వాళ్లు రఫ్ తయారు చేసి వాట్సాప్‌లో పంపించేవారు.



'బర్డ్ ఫీడర్ బాక్స్' పంపిణీ చేస్తున్న హరిణి (కుడివైపు)

ప్లాస్టిక్ డబ్బాకు కిటికీల్లాగ ఓపెన్‌గా ఉంచి చిన్న ప్లాస్టిక్ రాడ్‌ను పెట్టించాను. పక్షి ఆ రాడ్ మీద నిలబడి, తెరిచి ఉన్న కిటికీలో ముక్కు పెట్టి గింజలను తింటుంది. నీటి కోసం డబ్బా కింద సాసర్ పెట్టించాను. నాకు సంతృప్తి కలిగే వరకు డిజైన్‌ను మారుస్తూ చేసిచ్చారు వాళ్లు. ఐదేళ్ల కిందట ఇదే తొలి డిజైన్. మొదట వంద పీస్‌లు చేయించి బంధువులు, స్నేహితులకిచ్చాను. తర్వాత అందరూ అడుగుతుండడంతో పెద్ద మొత్తంలో చేయిస్తున్నాం. తాతయ్య పేరుతో 'మంచాల శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్' ద్వారా అందరికీ పంచుతున్నాం. ఒక మంచి పని చేయడం, అది కూడా మా తాతయ్య పేరుతో చేయడం చాలా సంతోషంగా ఉంది. ఇప్పటికి రెండువేలకు పైగా ఇలాంటి డబ్బాలను పంచాను. ఇప్పుడు నేను యూఎస్‌లో పీజీ చేస్తున్నాను. నేను మొదలు పెట్టిన పనిని మా నాన్న కొనసాగిస్తున్నారు. మా చేతిమీదుగా ఈ బర్డ్ ఫీడర్ బాక్స్‌లు అటు ఆదిలాబాద్, నాందేడ్ వరకు, ఇటు హైదరాబాద్, సూర్యాపేట, గుంటూరుకు కూడా చేరాయి. ఈ బాక్స్ కావాలని ఎవరడిగినా వాళ్ల అడ్రస్ పంపిస్తే చాలు కొరియర్ చార్జ్‌లు కూడా మేమే భరించి ఉచితంగా పంపిస్తాం. వంద మాటలు చెప్పడం కంటే ఒక మంచి పని చేయడం మేలని నమ్ముతాను. ఐదేళ్ల నుంచి ఈ పని చేస్తున్నప్పటికీ నేను ఎక్కడా ప్రచారం చేసుకోలేదు. ఐ లవ్ స్పారోస్ అనేది ఈ ఏడాది వరల్డ్ స్పారో డే (మార్చి 20)సందర్భంగా ప్రపంచం ఇచ్చిన పిలుపు. కానీ నేను పిచ్చుకలను ప్రేమించడం ఎప్పుడో మొదలైంది. నేను అందరినీ కోరుకునేది ఒక్కటే. ఆ చిన్న ప్రాణుల కోసం రోజూ ఓ లీటరు నీటిని పెడదాం'' అన్నారు మంచాల హరిణి.

– వాకా మంజులారెడ్డి

చుక్క నీరుంటే చాలు!

గుప్పెట్లో పట్టుకుంటే నిండా గుప్పెడంత కూడా ఉండదు. పిచ్చుకంత ప్రాణం. రేడియేషన్ బారిన పడి అల్లాడిపోతోంది. అభివృద్ధి పేరుతో మనిషి చేసే అరాచకానికి భయపడిపోతోంది. మనిషి కంటపడకుండా పారిపోతోంది. ఏకంగా ఈ భూమ్మీద నుంచే మాయమైపోదామనుకుంటోంది. మనసున్న మనిషి కరవైన నేల మీద తనకు మనుగడ లేదని ఊరు వదిలి పారిపోయింది. అడవుల బాట పట్టి ఏ చెట్టుకొమ్మనో తనను తాను దాచుకుంటూ నీటిచుక్క కోసం వెతుక్కుంటోంది. మనిషి మనసులో ఆర్ద్రత, గుండెలో తడి ఉందని తెలిసిన పిచ్చుక మళ్లీ రెక్కలు టపటపలాడిస్తోంది. వందలాది బంధుగణంతో నిజామాబాద్‌లో మంచాల హరిణి ఇంటి ముందు కొలువుదీరింది. ఈ మాత్రం ఆలంబన దొరికితే చాలు... కిచకిచలతో ఊరంతటికీ వీనులవిందు చేస్తానంటోంది పిచ్చుక.

చిరుతలు

ధైర్యంగా ఉండమని చెప్పడం అందరూ చేసే పనే.
ధైర్యాన్ని ప్రదర్శించడం కొందరు చేసేది.
ప్రమాదంలోనూ ధైర్యాన్ని చూపడం అతి కొద్ది మందే చేస్తారు.
ఆ అతి కొద్దిమందిలోనూ మేటిగా నిలుస్తున్నారు
హైదరాబాద్‌లోని బేగంపేట వాసులైన ఈ తల్లీ కూతుళ్లు.
ఇంట్లోకి అకస్మాత్తుగా చొరబడిన ఆగంతకులపైకి
చిరుతపులుల్లా విరుచుకుపడ్డారు.
మారణాయుధాలతో బెదిరించినా ఆత్మస్థైర్యాన్ని బెదరనివ్వలేదు.
ఇద్దరు దుండగులను తరిమి తరిమి కొట్టిన తల్లి అమిత మెహోత్.
తల్లిని కాపాడుకునేందుకు దుండగులతో వీరోచితంగా పోరాడిన కూతురు బాబీ.



బాబీ



అమిత, బాబీలను సత్కరిస్తున్న డీసీపీ రోహిణీ ప్రియదర్శిని

దుండగులు ఎలా ఎప్పుడు ఎక్కడ నుంచి వస్తారో, ఎలా దాడి చేస్తారో మనం ఊహించలేం. అకస్మాత్తుగా ఎదురయ్యే ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలో తెలియక ధనాన్నే కాదు ప్రాణాలను సైతం కోల్పోయేవారెందరో. కానీ, ప్రాణాలను కూడా లెక్క చేయకుండా దుండగుల దుశ్చర్యను క్షణమాత్రంలోనే గుర్తించి, ఆ వెంటనే తమ స్థైర్యాన్ని చూపి నేడు ఎంతో మంది ప్రశంసలు అందుకుంటున్నారు అమిత, బాబీ. స్త్రీలు సబలలు అని నిరూపించిన ఈ వనితలు నేడు ఎంతోమందికి ప్రేరణగా నిలుస్తున్నారు.

''ఎప్పుడో ప్రాక్టీస్ చేసిన బాక్సింగ్‌తో పాటు 15 ఏళ్లుగా చేస్తున్న జిమ్ వ్యాయామాలు, వీటికి తోడు మార్షల్ ఆర్ట్స్‌పై అవగాహన.. ఇవన్నీ దుండగులు తుపాకీ గురి పెట్టినా ఏమాత్రం బెదరక ధైర్యంగా నిలబడేలా చేశాయి. దోచుకోవడానికి వచ్చిన వారిని తరిమి కొట్టేలా చేశాయి'' అని తెలిపింది నలభై ఆరేళ్ల అమిత. ఊహించని విధంగా ఆ తల్లీకూతుళ్ల నుంచి ప్రతిఘటన ఎదురవడంతో దుండగులు కాళ్లకు బుద్ధి చెప్పాల్సి వచ్చింది.

కొరియర్ బాయ్స్ వేషంలో..

ఆన్‌లైన్ అమ్మకాలు పెరిగాక కొరియర్ బాయ్స్ మన ఇళ్ల ముందుకు వస్తుంటారు. వారి గురించి మనకేవిధంగానూ తెలియదు. అలాగని, కొరియర్ వారంతా ప్రమాదకారులే అని మనం చెప్పలేం. కానీ, ఒక్కోసారి సమస్య ఈ విధంగానూ మనల్ని పలకరించవచ్చు అని గ్రహించాలి అనడానికి గురువారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటన మన కళ్లకు కడుతుంది. ''మా ఇంటి గుమ్మానికి, ప్రధాన గేటుకు 200 ఫీట్ల దూరం ఉంటుంది. కొరియర్‌బాయ్స్ ఎవరొచ్చినా గేటు బయటనే ఉండి పిలుస్తారు. గురువారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో బ్యాగ్‌తో ఇద్దరు వ్యక్తులు వచ్చారు. ఒకరు హెల్మెట్ ధరించి ఉండగా మరొకరు మాస్క్ ధరించి ఉన్నారు. నేను మొదటి అంతస్తులోనే ఉండి కొరియర్ వివరాలు అడిగాను. అమిత (నా పేరు), ఎన్‌కె జైన్ (నా భర్త) పేర్లు చెప్పి కొరియర్ వచ్చిందని చెప్పారు. అక్కడే ఉండాలని, వచ్చి తీసుకుంటామని చెప్పాను. నేను కిందికి వచ్చేసరికి గేటు లోపలి నుంచి గుమ్మం వద్దకు వచ్చేశారు.

ఎదుర్కొని .. కనిపెట్టి..

బ్యాగ్‌లో నుంచి కొరియర్ పార్శిల్ తీస్తున్నట్లుగా తీసి ఒకరు తపంచా (నాటు తుపాకీ)తో నాపై ఎక్కుపెట్టాడు. మరొకరు నన్ను తోసుకుంటూ లోపలికి వచ్చి కిచెన్‌లో ఉన్న పనిమనిషి మెడపై కత్తి పెట్టాడు. నా అరుపులకు మొదటి అంతస్తులో ఉన్న కుమార్తె కూడా వచ్చింది. మాపై అటాక్ చేస్తుండగా మేం కూడా తిరిగి అటాక్ చేశాం. ఇద్దరం కలిసి ఆ వ్యక్తి చేతులను గట్టిగా పట్టుకుని వెనక్కి తిప్పి, తపంచాను లాగేసుకున్నాం. దీంతో అచేతనుడైన ఆ వ్యక్తి వెంట తెచ్చుకున్న తాళ్లతో మమ్మల్ని కట్టేసేందుకు ప్రయత్నించగా, ఎదురుతిరిగాం. దాదాపు 20 నిమిషాల సేపు ఘర్షణ జరిగింది. చివరకు ఆ వ్యక్తి పారిపోయే ప్రయత్నం చేశాడు. మమ్మల్ని బలవంతంగా తోసుకుంటూ బయటకు వచ్చేసిన వ్యక్తిని పట్టుకునేందుకు మేము ఎంతగానో వెంబడించాం. ఆ వ్యక్తి పారిపోయాడని తెలుసుకుని కిచెన్‌లో ఉన్న మరో వ్యక్తి ఎక్కడ దొరికిపోతాడో అని ఆందోళనపడ్డాం. అతను కూడా పారిపోయేందుకు కత్తితో బెదిరిస్తూ బయటకు వచ్చాడు. మా అరుపులకు ఈ లోగా స్థానికులు రావడంతో అతన్ని పట్టుకోగలిగాం. తెలిసిన వారే అయ్యుంటారని మేం వారు ధరించిన హెల్మెట్, మాస్క్‌ను తీసేయడంతో వారెవరో కనిపెట్టగలిగాం. కిందటేడాది దీపావళి సమయంలో పది రోజులపాటు మా ఇంటి క్లీనింగ్ విషయంలో ఓ ఏజెన్సీని సంప్రదిస్తే, వారు పంపించిన వ్యక్తులే వీళ్లు. మా ఇంటిని క్లీన్ చేసే సమయంలో ఏయే వస్తువులు ఎక్కడ ఉన్నాయో గమనించి, ఇంట్లో ఆడవాళ్లం మాత్రమే ఉండే సమయం చూసి, ఇలా దొంగతనం చేయడానికి ప్లాన్ చేసుకున్నారని తెలిసింది. మేం ఎదురు తిరగడంతో వచ్చిన పని గురించి కాకుండా మేము తమ ముఖాలను చూడకుండా కాపాడుకునేందుకే ఎక్కువ ప్రయత్నం చేశారు.

ఆత్మరక్షణకై మెలకువలు అవసరం

మహిళలు ఆత్మరక్షణ దిశగా మెలకువలను నేర్చుకోవాలి. ఇప్పుడు నా జీవితంలో ఎదురైన అనుభవం లాగా ఎవరి జీవితాల్లోనూ రాకూడదని కోరుకుంటాను. ఒక వేళ వస్తే మాత్రం అందుకు సిద్ధంగా ఉండాలి. ధైర్యంగా ముందడుగు వేయాలి.

– అమిత



ఆ ధైర్యం ఎలా వచ్చిందంటే..

గతంలో ఐదేళ్ల బాక్సింగ్ ప్రాక్టీస్ చేశాను. రోజూ జిమ్‌కు వెళ్తుంటాను. మార్షల్ ఆర్ట్స్‌పై కూడా అవగాహన ఉంది. అవే నన్ను ధైర్యంగా ఉండేలా, సాహసం చూపేలా చేశాయి. ఎదురొచ్చిన విపత్తు నుంచి కాపాడేలా చేశాయి. ఒక తపంచా, రెండు కత్తులు, తాళ్ల సహాయంతో వారు మమ్మల్ని లొంగదీసుకునేందుకు చేయని ప్రయత్నమంటూ లేదు. వారి ప్రతి చర్యను తిప్పికొట్టగలిగామంటే బాక్సింగ్, ఫిట్‌నెస్‌లే కారణమని కచ్చితంగా చెప్పగలను'' అని తామ ఎదుర్కొన్న సంఘటనను వివరించారు అమిత.

ఈ తల్లీకూతుళ్లు దుండగులను ధైర్యంగా ఎదుర్కొన్న దృశ్యాలు సీసీటీవీలో రికార్డయ్యాయి. ఈ ఘటన తర్వాత అమిత, ఆమె భర్త, స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

డీసీపీ ప్రశంసలు.. సన్మానం..

అమిత, ఆమె కుమార్తె బాబీ ఇద్దరూ చూపిన ధైర్యసాహసాలు ఆదర్శప్రాయం అని నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. బేగంపేట పైగా కాలనీలోని అమిత నివాసానికి నేరుగా వచ్చిన డీసీపీ అమితతో పాటు ఆమె కుమార్తెనూ ప్రశంసించి, శాలువాతో సత్కరించారు. మైనర్ బాలిక అయినా ఆమె చూపిన తెగువ ఎంతో అభినందనీయమన్నారు.

– కోట కృష్ణారావు, సాక్షి, హైదరాబాద్

బ్యూటిప్స్

పార్లర్‌తో పని లేదు...

పార్లర్‌లో ఫేషియల్‌తో పనిలేకుండా, ఖరీదైన క్రీములు కొనకుండా ముఖం చక్కగా మెరవాలంటే ఇంట్లోనే టొమాటో ఫేషియల్‌ను ప్రయత్నించండి. పెళ్లికూతురులా మెరిసిపోతారు.





- టొమాటోను గుండ్రని ముక్కలుగా కోయాలి. ఒక ముక్కను తీసుకుని పైన టీస్పూను పంచదార, టీస్పూను కాఫీ పొడి వేసి ముఖంపైన అద్దాలి. తరువాత చేతులతో సున్నితంగా మర్దన చేసి కడిగేయాలి.
- ఇప్పుడు మరో టొమాటో ముక్కపై టీస్పూను అలోవెరా జెల్ వేసి ఐదు నిమిషాలు మర్దన చేయాలి. ఈ మర్దన అయిన వెంటనే మరో టొమాటో ముక్కపై రెండు టీస్పూన్ల పసుపు వేసి ఐదు నిమిషాలు మర్దన చేయాలి.
- పసుపు పూర్తిగా ఆరాక నీటితో కడిగేసి, తడి లేకుండా తుడిచి మాయిశ్చరైజర్ రాసుకోవాలి. ఈ టొమాటో ఫేషియల్‌లోని ప్రతి స్టెప్‌ను జాగ్రత్తగా అనుసరిస్తే ముఖం కాంతిమంతంగా మెరిసిపోతుంది.
- అరటిపండు గుజ్జులో కొద్దిగా కొబ్బరినూనె వేసి కలిపి ముఖానికి పట్టించాలి. ఇరవై నిమిషాల తరువాత మర్దన చేసి నీటితో కడిగేయాలి. ఇది మంచి క్లెన్సర్‌గా పనిచేయడమేగాక, చర్మానికి తేమనందిస్తుంది.

ఇంటిప్స్

సీలింగ్ ఫ్యాన్ ఇలా శుభ్రం

సాధారణంగా సీలింగ్ ఫ్యాన్‌లను ఎక్కువ ఎత్తులో అమర్చుతారు. అందువల్ల వాటిని తరచు శుభ్రం చేయడం చాలా కష్టం. అలాగని నెలల తరబడి అలాగే ఉంచేస్తే మురికి పేరుకుని పోయి అసహ్యంగా కనిపిస్తుంది. అటువంటి పరిస్థితుల్లో పాత పిల్లో కవర్ తీసుకుని టేబుల్ మీద ఎక్కి సీలింగ్ ఫ్యాన్ రెక్కలను కవర్ చేయాలి. కవర్ పైభాగం నుంచి మీ చేతులతో రుద్దాలి. అదేవిధంగా, మూడు రెక్కలను శుభ్రం చేయాలి. మట్టి కూడా కవర్‌లో పడిపోతుంది. ఇది మీ ఇంటిని కూడా మురికిగా చేయదు.

మరో పద్ధతి...

పాత షర్ట్, టీషర్ట్ లేదా ఏదైనా కాటన్ వస్త్రం సహాయంతో ఫ్యాన్‌ను శుభ్రం చేయవచ్చు. ఫ్యాన్ మీద పొడి దుమ్ము ఉంటే.. అది సులభంగా ఒక వస్త్రంతో శుభ్రం చేసుకోవచ్చు. ఒకవేళ వంటగదిలో ఉండే ఫ్యాన్‌ను క్లీన్ చేస్తున్నట్లయితే.. దానిపై నూనె, ధూళి పేరుకుపోయి ఉంటుంది. అటువంటి వాటిని సబ్బుతో కడగడం మంచిది. కాసేపు రెక్కలను స్క్రబ్ చేయాలి.



గుర్తుంచుకోవాల్సింది..

ఫ్యాన్‌ను క్లీన్ చేసినప్పుడల్లా కింద ఒక షీట్ లేదా వస్త్రాన్ని పరచాలి. దీంతో ఫ్యాన్ క్లీన్ అయిన తర్వాత మీకు పని పెరగదు. ఫ్యాన్ మురికి షీట్లో పడిపోతుంది.

ఫ్యాన్ శుభ్రం చేసేటప్పుడు గ్లాసెస్ లేదా సన్‌గ్లాసెస్ ధరించండి. ఇది చెత్తను కంట్లో పడకుండా చేస్తుంది. దీంతో అలర్జీ కూడా రాదు. సీలింగ్ ఫ్యాన్ శుభ్రం చేసేటపుడు ముక్కుకు మాస్క్ లేదా రుమాలు కట్టుకోవాలి.

హోలీ

రంగు పడే ఊళ్లు

తీర్థయాత్రలు చేస్తారు కొందరు. వర్ణయాత్రలు కొందరికి ఇష్టం. మన దేశంలో హోలి చాలా హుషారైన పండగ. బహుశా దీపావళి తర్వాత చిన్నా పెద్దా అందరూ కేరింతలతో పాల్గొనే పండగ ఇదే. రొటీన్ జీవితంలో రంగులను నింపుకోవడం బాగుంటుంది. అయితే కొందరికి ఇంట్లోనో, అపార్ట్‌మెంట్ ప్రాంగణంలోనో, వీధిలో, ఏరియా చౌరస్తాలోనో ఆడే హోలీ పెద్దగా ఆనదు. వారికి భారీ హోలి వేడుక చూడాలనిపిస్తుంది. అలాంటి వారి కోసం హోలి డెస్టినేషన్స్ ఉన్నాయి. మన దేశంలో. ఈ హోలీకి వెళ్లగలిగితే వెళ్లండి.

మధుర:

ఉత్తరప్రదేశ్‌లోని మధురలో హోలి వేడుకలు చూడటం అంటే కృష్ణ రాధలు ఆడే హోలిని చూసినట్టే. ఇక్కడి బర్సానాలో స్త్రీలు గోపికల్లా, పురుషులు గోపబాలురలా అలంకరించుకుని హోలి ఆడతారు. రంగులు చల్లడానికి వచ్చిన గోపబాలురను స్త్రీలు సరదాగా బడితెలతో బాది దూరం తరుముతారు. అందుకే దీనిని 'లాత్‌మార్ హోలి' అంటారు.





బృందావన్:

ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్‌కు వెళితే అక్కడి బన్‌కె బిహారి ఆలయంలో పూలు, రంగులు కలిపి చల్లుకుంటూ కోలాహలంగా హోలి నిర్వహిస్తారు. అందుకే దీనిని 'ఫూల్‌వాలోంకి హోలి' అంటారు. ఇక్కడ ఒకరోజు రెండు రోజులు కాదు... వారం రోజులపాటు హోలి వేడుకలు జరుగుతునే ఉంటాయి. చుట్టుపక్కల పల్లెలు రంగులతో తెల్లారి రంగులతో అస్తమిస్తాయి. ఈ అద్భుతమైన వేడుకలను చూడానికి టూరిస్ట్‌లు వస్తారు.

ఉదయ్‌పూర్:

ఇక రాచరికస్థాయిలో హోలి చూడాలంటే రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు వెళ్లాలి. అక్కడి సిటీ ప్యాలెస్‌లో రాజ వంశీకుల హాజరీలో అద్భుతమైన హోలి వేడుకలు జరుగుతాయి. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాజస్థానీ జానపద కళల ప్రదర్శన ఉంటుంది. టూరిస్ట్‌లు ఈ వేడుకలు చూడటానికి తెగబడతారు.



హంపి:

తుంగభద్ర నది ఒడ్డున రంగుల పండగ ఎలా ఉంటుందో చూడాలంటే హంపి వెళ్లాలి. ఇక్కడ హంపి సందర్భంగా భారీగా అలంకరించి నిర్వహించే రథయాత్ర చూడటానికి రెండు కళ్లూ చాలవు. ఈ సాంస్కృతిక క్షేత్రంలో హోలీ ఒక విచిత్ర భావన కలిగిస్తుంది. నగర ప్రజలు డోళ్లు మోగిస్తూ హోలి వేడుకల్లో విశేషంగా పాల్గొంటారు. విరూపాక్ష ఆలయం ఈ సందర్భంగా కళకళలాడిపోతుంది. దక్షిణాదివారు హోలీ సెలవు హంపిలో గడిపి ఆనందించవచ్చు.




శాంతినికేతన్:

పశ్చిమ బెంగాల్‌లోని శాంతినికేతన్‌లో హోలి అయితే నయనానందమూ శ్రవణానందమూ కూడా. ఎందుకంటే అక్కడ హోలి అంటే రంగులు చల్లుకోవడం మాత్రమే కాదు... నృత్యాలు, సంగీతం, కవిత్వం... అమ్మాయిలు అబ్బాయిలు కలిసి మనోహరంగా హోలి జరుపుకుంటారు. రవీంద్రనాథ్ ఠాగూర్ మొదలెట్టిన ఈ సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది. ఇక్కడకు వెళ్లి హోలి చూసినవారి హృదయం కచ్చితంగా రంగులతో నిండిపోతుంది.



ఆనంద్‌పూర్ సాహిబ్:

పంజాబ్‌లోని ఈ ఊళ్లో హోలీ రంగులకు కళ్లు చెదురుతాయి. నిహాంగ్ సిక్కులు ఇక్కడ హోలి సమయంలో యుద్ధ విద్యలు ప్రదర్శిస్తారు. ఉత్తుత్తి పోరాటాలు ఇరు జట్ల మధ్య జరుగుతాయి. డోళ్లు తెగ మోగుతాయి. ఆట పాటల అట్టహాసం చూడతగ్గది.





డయాబెటిస్‌కు సూపర్ ఫుడ్

ప్రస్తుత కాలంలో డయాబెటిస్ సమస్య అందరిలోనూ కనిపిస్తోంది. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ముఖ్యంగా జీవన శైలి, అనారోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వల్ల మధుమేహం సమస్య నానాటికి పెరిగిపోతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. మధుమేహం విషయంలో, రక్తంలో చక్కెర స్థాయిలను సాధారణంగా ఉండేలా చూసుకోవడం మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలి.

రక్తంలో చక్కెర స్థాయి ఎక్కువగా ఉంటే, దానిని తగ్గించుకోవడానికి కొన్ని సూపర్‌ఫుడ్‌ల సహాయం తీసుకోవచ్చు. అవేంటో చూద్దామా...

దాల్చిన చెక్క: రక్త ప్రవాహంలో చక్కెర కదలికను పెంచడం ద్వారా మధుమేహాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది.





సొరకాయ: సొరకాయలో 92% నీరు, 8% ఫైబర్ ఉంటుంది. దీనిలో గ్లూకోజ్, చక్కెర సంబంధిత సమ్మేళనాల పరిమాణం చాలా తక్కువగా ఉంటుంది. ఇది డయాబెటిక్ రోగులకు అద్భుతమైన కూరగాయగా పరిగణిస్తారు.



కాకరకాయ: రుచికి చేదుగా ఉండే కాకరకాయలో పాలీపెప్టైడ్-పి ఉంటుంది. ఇది ఇన్సులిన్ లాంటి హైపోగ్లైసిమిక్ ప్రోటీన్. ఇది కణాలలోకి గ్లూకోజ్‌ని తీసుకురావడంలో సహాయపడుతుంది.

మెంతులు: ఇవి ఫైబర్, ఇతర రసాయనాలను కలిగి ఉంటాయి. ఇవి జీర్ణక్రియను నెమ్మదిస్తాయి. శరీరంలోని కార్బోహైడ్రేట్లు, చక్కెరను గ్రహించడంలో సహాయపడతాయి. దీని కారణంగా రక్తంలో చక్కెర సాధారణంగా ఉంటుంది.



ఆకు కూరలు: ఈ కూరగాయలలో ఫైబర్, మెగ్నీషియం, విటమిన్ ఎ వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెరను తగ్గించడంలో సహాయపడతాయి.



జొన్నలు, రాగులు: జొన్నలు, రాగులు వంటి చిరుధాన్యాలలో డయాబెటిస్‌ను నియంత్రించే కారకాలు ఉంటాయి. రాగి జావ, జొన్న రవ్వతో చేసిన ఉప్మా, జొన్న రొట్టెలు, రాగి జావ, రాగి రొట్టెలు తీసుకోవడం డయాబెటిక్స్‌కు చాలా మంచిది.

మజ్జిగ తీసుకున్నారా?

వేసవి కాలం వచ్చేసింది. వాతావరణంలో వచ్చే మార్పులతో ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ వేసవి తాపానికి అల్లాడవలసిందే. వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం కొబ్బరి బొండాలు, చెరుకు రసం, పళ్లరసాలు, మజ్జిగ వంటి వాటిని తరచు తాగుతూ ఉంటాం. అయితే వీటన్నింటిలోనూ మజ్జిగ తీసుకోవడం వల్ల ఎక్కువ లాభాలున్నాయని అంటున్నారు పోషకాహార నిపుణులు. మజ్జిగను ఎలా తీసుకోవాలో తెలుసుకుందాం..



వేసవికాలంలో రోజూ రెండుసార్లు మజ్జిగ తాగడం వలన ఆరోగ్యానికి మంచిది. అయితే కొన్ని పదార్థాలను కలిపి తీసుకోవడం వల్ల మరిన్ని ప్రయోజనాలు కలుగుతాయి. అవేమిటో, వాటిని ఎలా పుచ్చుకోవాలో చూద్దాం...

మజ్జిగలో వేయించిన జీలకర్ర పొడి కలుపుకుని తాగడం వలన వేసవి తాపం నుంచి ఉపశమనం కలుగుతుంది.

వ్యాధినిరోధక శక్తిని పెంచే గుణం మజ్జిగలో పుష్కలంగా ఉంది. అంతేకాదు రోజూ మజ్జిగను తాగడం వలన జీర్ణక్రియ సాఫీగా సాగుతుంది.

మజ్జిగలో కరివేపాకు, నిమ్మరసం, ఉప్పు కలిపి తీసుకోవడం వలన దాహార్తి తీరుతుంది.

గ్లాసు పల్చటి మజ్జిగలో చిటికడు సొంఠి, చిటికడు సైంధవ లవణం కలుపుకుని తాగితే వేసవి నుంచి ఉపశమనం కలుగుతుంది.

మజ్జిగలో ఉప్పు, కొత్తిమీర, నిమ్మరసం, దబ్బాకులు, పచ్చిమిర్చి ముక్కలు వేసి సేవించడం వలన దాహార్తి తీరడమే కాదు.. శక్తి కూడా చేకూరుతుంది.

వేసవి వేడికి తిన్న ఆహారం అరగక ఒక్కోసారి వాంతులు అవుతుంటాయి. అలాంటప్పుడు చిటికడు జాజికాయ పొడిని మజ్జిగలో కలుపుకుని సేవించడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

మజ్జిగలో విటమిన్ బి12, పొటాషియం, ఫాస్ఫరస్, క్యాల్షియం ఉంటాయి. ఇవి శరీరానికి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి.

మజ్జిగ ఆరోగ్యకరమైన పానీయం. కనుక వేసవిలో కూల్ డ్రింక్స్ కంటే ఆరోగ్యంగా ఉండేందుకు రోజూ రెండుసార్లు మజ్జిగను తీసుకోండి.

చిప్స్

అలవాటు చేసేముందు ఆలోచించండి!

చిప్స్‌లో ఎక్కువ కాల నిల్వ ఉంచేందుకు ఇందులో సోడియంను ఎక్కువగా ఉపయోగిస్తారు. సోడియం ఎక్కువగా ఉండే ఫుడ్ తీసుకోవడం వల్ల రక్తపోటు వచ్చే అవకాశాలు పెరుగుతాయి. అలాగే వీటి తయారీలో ఉపయోగించే నూనె కూడా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. మరీ ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది.



చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ప్రతీ ఒక్కరూ ఇష్టపడి తినే స్నాక్స్‌లో చిప్స్ ఒకటి. రకరకాల రంగుల కవర్స్‌తో ఆకర్షణీయంగా ప్యాక్ చేసిన చిప్స్‌ను చిన్నారులు ఎంతో ఇష్టపడి తింటుంటారు. అయితే చిప్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలు తెలిస్తే మాత్రం ఇకపై వాటిని తినాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిందే. చిప్స్ తీసుకోవడం వల్ల కలిగే సైడ్ ఎఫెక్ట్స్ ఏంటో తెలుసుకుందాం..

- ఎక్కువ కాల నిల్వ ఉంచేందుకు చిప్స్‌లో సోడియంను ఎక్కువగా ఉపయోగిస్తారు. సోడియం ఎక్కువగా ఉండే ఫుడ్ తీసుకోవడం వల్ల రక్తపోటు వచ్చే అవకాశాలు పెరుగుతాయి. అలాగే వీటి తయారీలో ఉపయోగించే నూనె కూడా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. మరీ ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యాన్ని చిప్స్ క్రమంగా దెబ్బతీస్తాయి. చిప్స్‌లో ఉండే ట్రాన్స్ ఫ్యాట్ కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. ధమనుల్లో రక్త ప్రసరణను అడ్డుకుంటుంది. దీంతో ఇది గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతుంది.
- శరీరంలో అనారోగ్యకరమైన కొవ్వు పెరగడానికి గల కారణాలలో చిప్స్ ముఖ్య కారణం. దీని వల్ల బరువు పెరిగే అవకాశం ఉంటుంది. మరీ ముఖ్యంగా చిన్నారుల్లో ఊబకాయానికి చిప్స్ కారణమవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
- చిప్స్‌లో క్యాలరీలు ఎక్కువగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల శరీరం ఒక్కసారిగా బరువు పెరుగుతుంది. చిప్స్‌లో ఫైబర్ కంటెంట్ అనేది అస్సలు ఉండదు. దీంతో చిన్నారుల్లో ఇది మలబద్ధకానికి దారి తీస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇది మరెన్నో అనారోగ్య సమస్యలకు దారి తీస్తుందని నిపుణులు చెబుతున్నారు.
- చిప్స్‌ని ఎక్కువగా తీసుకోవడం వల్ల దీర్ఘకాలంలో క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అంతే కాదు.. వంధ్యత్వానికి దారి తీసే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. బరువు పెరుగుతారు. కడుపులో గ్యాస్, జీర్ణ సంబంధిత సమస్యలకు చిప్స్ కారణమవుతుందని చెబుతున్నారు. రోగ నిరోధక శక్తి బలహీన పడి వైరస్‌లు, బ్యాక్టీరియా దాడులు పెరుగుతాయని చెబుతున్నారు.
- అందువల్ల పిల్లలకు జంక్ ఫుడ్ ఇచ్చే విషయంలో పెద్దలు కాస్త జంకడం మంచిది. వీలయినంత వరకు వారికి పండ్లు, డ్రై ఫ్రూట్స్, మొలకెత్తిన గింజలతో చేసిన వంటకాలు, పచ్చి కూరగాయలతో చేసిన సలాడ్స్ వంటివి అలవాటు చేయడం మంచిది.

మీకు తెలుసా?

మీ పొట్ట పరిశుభ్రంగానే ఉందా?



పొట్ట శుభ్రంగా లేకపోతే మలబద్ధకం, అజీర్ణం, ఉబ్బరం, కడుపునొప్పి, గ్యాస్, అజీర్ణం, వాంతులు, వికారం లాంటి ఇబ్బందులు తలెత్తుతాయి. అంతే కాదు.. తలనొప్పి, అలసట, బరువు పెరగడం, అలసట లేదా బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తాయి.

- ఒక గ్లాసు గోరువెచ్చని నీరు, అర టీస్పూన్ నల్ల ఉప్పు, టీస్పూన్ నిమ్మరసం తీసుకుని బాగా కలపండి. ఈ పానీయం పొద్దున్నే ఖాళీ కడుపుతో తాగాలి
- రాత్రి పడుకునే ముందు ఒక గ్లాసు నీటిలో రెండు చెంచాల యాపిల్ వెనిగర్ మిక్స్ చేస్తే పొట్ట శుభ్రపడుతుంది. నైట్ నిద్రించే ముందు ఈ పానియం తాగండి
- దీనితో పాటు ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఇందుకోసం ఆహారంలో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటోన్యూట్రియెంట్స్ వంటి పోషకాలను చేర్చుకోవాలి.

హెల్త్ టిప్స్



- తలనొప్పి తగ్గాలంటే పది తులసి ఆకులు, పది నల్ల మిరియాలను నూరి అందులో టీ స్పూను తేనె కలిపి రోజుకు మూడుసార్లు తీసుకోవాలి.
- పెరుగులో మిరియాల పొడి, బెల్లం కలిపిన మిశ్రమాన్ని నిద్రించే ముందు తీసుకుంటే జలుబు తగ్గుతుంది
- బొప్పాయి కాయ లేదా ఆకుని మెత్తగా నూరి ఆ ముద్దని అరికాళ్ళ ఆనెల మీద పెట్టి, కట్టుకడితే అవి మెత్తబడతాయి.



సినిమా



● 'దేవర' సినిమా లొకేషన్‌లో..

గోవాలో ఆటా పాటా

గోవాలో ఆట పాటలతో సందడి చేస్తున్నాడు 'దేవర'. ఎన్టీఆర్ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'దేవర'. 'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ మూవీ తర్వాత ఎన్టీఆర్, డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం ఇది. ఈ మూవీతో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ తెలుగుకి పరిచయమవుతున్నారు. నందమూరి కల్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్స్‌పై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ .కె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. కాగా ఓ మాంటేజ్ సాంగ్ చిత్రీకరణ కోసం గోవా చేరుకుంది 'దేవర' యూనిట్. గోవాలో మొదలైన కొత్త షెడ్యూల్‌లో రాజు సుందరం మాస్టర్ నేతృత్వంలో ఓ మాంటేజ్ సాంగ్ తెరకెక్కిస్తున్నారు కొరటాల. ఈ సందర్భంగా 'దేవర' నుంచి ఓ వర్కింగ్ స్టిల్ విడుదల చేశారు. ఇందులో ఎన్టీఆర్‌తో పాటు కొరటాల శివ, రాజు సుందరం మాస్టర్ కనిపిస్తున్నారు. ''యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న చిత్రం 'దేవర'. ఇప్పటికే గోవాలో కొంత టాకీ పార్ట్ చిత్రీకరించాం. ఈ చిత్రంలో ఎన్టీఆర్ సరికొత్త మాస్ పాత్రలో కనిపిస్తారు. రెండు భాగాలుగా రూపొందుతోన్న ఈ చిత్రం మొదటి భాగాన్ని తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో దసరా సందర్భంగా అక్టోబర్ 10న రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు మేకర్స్. సైఫ్ అలీఖాన్, ప్రకాశ్‌రాజ్, శ్రీకాంత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రత్నవేలు.



దివంగత నటి శ్రీదేవి, నిర్మాత బోనీ కపూర్‌ల చిన్న కుమార్తె ఖుషీ కపూర్ 'ఉప్పెన' హిందీ రీమేక్‌లో నటించనున్నారని టాక్. వైష్ణవ్ తేజ్, కృతీ శెట్టి జంటగా బుచ్చిబాబు దర్శకత్వం వహించిన 'ఉప్పెన' (2021) తెలుగులో బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. కరోనా సమయంలో విడుదలైన ఈ మూవీ రూ. 100 కోట్ల వసూళ్లు సాధించి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఈ చిత్రంలో బేబమ్మగా తనదైన నటనతో అలరించిన కృతీ శెట్టి ప్రేక్షకుల మనసుల్లో బేబమ్మగా క్రేజ్ సంపాదించుకున్నారు. ఈ హిట్ మూవీని నిర్మాత బోనీ కపూర్ హిందీలో రీమేక్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆ విషయాన్ని పెద్ద కుమార్తె జాన్వీ కపూర్ తెలుగులో అంగీకరించిన రెండో చిత్రం సందర్భంగా చెప్పారట బోనీ. 'దేవర' (ఎన్టీఆర్ హీరో) మూవీతో తెలుగు చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టారు జాన్వీ. ఈ సినిమా షూటింగ్‌లో ఉండగానే రామ్ చరణ్‌తో నటించే క్రేజీ ఆఫర్

బేబమ్మగా ఖుషీ

సొంతం చేసుకున్నారీ బ్యూటీ. బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ప్రారంభోత్సవంలో జాన్వీ కపూర్‌తో పాటు ఆమె తండ్రి బోనీ కపూర్ కూడా పాల్గొన్నారు. అక్కడికి వచ్చిన అతిథులతో సరదాగా ముచ్చటించిన బోనీ కపూర్.. ''బుచ్చిబాబు తీసిన 'ఉప్పెన' సినిమా చూశాను. కథ నాకు బాగా నచ్చింది. ఈ సినిమాని హిందీలో రీమేక్ చేయాలనే ఆలోచన ఉంది. మా చిన్నమ్మాయి ఖుషీ కపూర్‌ని 'ఉప్పెన' మూవీ చూడమని చెప్పాను'' అన్నారట. దీంతో 'ఉప్పెన' బాలీవుడ్ రీమేక్‌లో హీరోయిన్‌గా ఖుషీ నటిస్తారనే ఊహాగానాలు మొదలయ్యాయి.

● ఖుషీ కపూర్



● 'తండేల్' సినిమా లొకేషన్‌లో..

హైదరాబాద్‌లో తండేల్

నాగచైతన్య హీరోగా నటిస్తున్న 'తండేల్' చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. 'ప్రేమమ్, సవ్యసాచి' వంటి చిత్రాల తర్వాత నాగచైతన్య, డైరెక్టర్ చందు మొండేటి కాంబినేషన్‌లో రూపొందుతోన్న మూడో చిత్రం 'తండేల్'. 'లవ్ స్టోరీ' వంటి హిట్ మూవీ తర్వాత నాగచైతన్యతో రెండోసారి 'తండేల్'లో నటిస్తున్నారు సాయి పల్లవి. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్‌పై 'బన్నీ' వాసు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా ఈ మూవీ తాజా షెడ్యూల్ చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సందర్భంగా షూట్ డైరీస్ పేరుతో సెట్స్‌లోని కొన్ని ఫొటోలను విడుదల చేశారు మేకర్స్. ''దేశభక్తి అంశాలతో కూడిన రస్టిక్ లవ్ స్టోరీ 'తండేల్'. ప్రస్తుతం నాగ చైతన్య, సాయి పల్లవితో పాటు ఇతర తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాం. పాత్రలకు అనుగుణంగా నాగచైతన్య–సాయిపల్లవి డీ -గ్లామర్‌గా కనిపిస్తారు. నటీనటుల గెటప్, క్యాస్ట్యూమ్స్, బాడీ లాంగ్వేజ్, యాసలతో సహా ప్రతిదీ పర్ఫెక్ట్‌గా కనిపించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు చందు మొండేటి'' అని చిత్రబృందం ప్రకటించింది. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, కెమెరా: శ్యామ్‌దత్.

అది నా అదృష్టం

- పృథ్వీరాజ్ సుకుమారన్

''సలార్' సినిమాలో వరద రాజ మన్నార్ అనే కింగ్ పాత్రలో ప్రేక్షకుల ముందుకు వచ్చాను. ఇప్పుడు 'ది గోట్ లైఫ్' సినిమాతో నజీబ్ అనే బానిసగా రాబోతున్నాను. 'ది గోట్ లైఫ్' నిజంగా జరిగిన కథ.'' అని పృథ్వీరాజ్ సుకుమారన్ అన్నారు. మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ది గోట్ లైఫ్' (మలయాళంలో 'ఆడు జీవితం'). బెన్యామిన్ రాసిన 'గోట్ డేస్' నవల ఆధారంగా బ్లెస్సీ దర్శకత్వంలో విజువల్ రొమాన్స్ బ్యానర్ నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ నెల 28న విడుదల కానుంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన ప్రెస్‌మీట్‌లో పృథ్వీరాజ్ సుకుమారన్ మాట్లాడుతూ– ''ఈ సినిమా కోసం 30 కేజీలు తగ్గాను. నజీబ్ పాత్ర నాకే రావడం నా అదృష్టం'' అన్నారు. ''150 రోజులు చిత్రీకరణ చేశాం'' అన్నారు దర్శకుడు బ్లెస్సీ. ''ఈ సినిమాను డిస్ట్రిబ్యూట్ చేస్తున్నందుకు గర్వంగా ఉంది'' అన్నారు నిర్మాత రవిశంకర్. ''ఇందులో ఇబ్రహీం ఖాద్రీగా నటించాను'' అన్నారు యాక్టర్ జిమ్మీ జీన్. మైత్రీ డిస్ట్రిబ్యూటర్ శశి మాట్లాడారు.



● జిమ్మీ జీన్, బ్లెస్సీ, రవిశంకర్, పృథ్వీరాజ్



● అభిషేక్ బచ్చన్

సెలబ్రేటింగ్ లైఫ్

'విక్కీ డోనర్', 'మద్రాస్ కేఫ్', 'పింక్', 'అక్టోబరు' 'సర్దార్ ఉద్దమ్' వంటి సినిమాలను తెరకెక్కించిన దర్శకుడు సూజిత్ సర్కార్ నెక్ట్స్ ఫిల్మ్ ఖరారైంది. ఈ చిత్రంలో అభిషేక్ బచ్చన్ హీరో. జానీ లీవర్, జయంత్ క్రిప్లానీ, అహిల్యబమ్రూ కీలక పాత్రధారులు. ''సెలబ్రేటింగ్ లైఫ్. నా కెరీర్‌లో ఈ సినిమా ప్రత్యేకమైనది'' అంటూ 'ఎక్స్'లో షేర్ చేశారు అభిషేక్ బచ్చన్. తండ్రీ కూతుళ్ల అనుబంధం నేపథ్యంలో ఈ చిత్రం సాగుతుంది. రైజింగ్ సన్ ఫిలింస్ సమర్పణలో రోనీ లాహిరి, శీల్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది క్రిస్మస్ పండగ సందర్భంగా డిసెంబరులో విడుదల కానుందనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది.

● సీలియన్ మర్ఫీ



సెప్టెంబరులో స్టార్ట్

క్రిస్టోఫర్ నోలన్ దర్శకత్వంలో వచ్చిన 'ఆపెన్ హైమర్' చిత్రంలో మంచి నటన కనబరచి 96వ ఆస్కార్ అవార్డ్స్‌లో ఉత్తమ నటుడిగా తొలి ఆస్కార్ అవార్డు అందుకున్నారు నటుడు సీలియన్ మర్ఫీ. దీంతో సీలియన్ తర్వాతి చిత్రాలపై హాలీవుడ్‌లో ఫోకస్ పెరిగింది. కాగా సీలియన్ నటించనున్న కొత్త చిత్రం సెప్టెంబరులో స్టార్ట్ కానున్నట్లు హాలీవుడ్ సమాచారం. హాలీవుడ్ హిట్ సిరీస్ 'పీకీ బ్లైండర్స్' ఆధారంగా ఓ సినిమా తీయాలనుకుంటున్నారు ఈ సిరీస్ రూపకర్త స్టీవెన్ నైట్. 'పీకీ బ్లైండర్స్' ఆధారంగా ఈ సినిమాను సెప్టెంబరులో స్టార్ట్ చేయాలనుకుంటున్నారు. 'పీకీ బ్లైండర్స్' సిరీస్‌లో థామస్ షేల్బీగా నటించిన సీలియన్ మర్ఫీ ఈ సినిమాలోనూ నటిస్తారన్నట్లుగా స్టీవెన్ ఇటీవల పాల్గొన్న ఓ కార్యక్రమంలో వెల్లడించారు. రెండో ప్రపంచయుద్ధం నేపథ్యంలో సాగే ఈ సినిమా 2025 చివర్లో విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

నా పేరు సుబ్రమణ్యం

రావు రమేశ్, ఇంద్రజ జంటగా నటించిన చిత్రం 'మారుతీనగర్ సుబ్రమణ్యం'. లక్ష్మణ్ కార్య దర్శకత్వంలో బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా నుంచి 'మారుతీ నగర్లో ఫేమస్ అంటే నేనేలే...అందరూ ఇదే మాట అంటారులే!' అంటూ మొదలై, 'నేనే సుబ్రమణ్యం... మై నేమ్ ఈజ్ సుబ్రమణ్యం' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు. కల్యాణ్ నాయక్ సంగీత సారథ్యంలో భాస్కరభట్ల సాహిత్యం అందించిన ఈ పాటను రామ్ మిరియాల పాడారు.



● రావు రమేశ్

మా జీవితాలను మలుపు తిప్పింది

- మారుతి



శ్రీనివాస్, రేష్మా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఈ రోజుల్లో..'. 2012లో విడుదలైన ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అయ్యారు మారుతి. ఎస్‌కేఎన్, శ్రేయాస్ శ్రీనివాస్ నిర్మించిన ఈ చిత్రం నేడు (శనివారం) రీ–రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ–''మా జీవితాలను మలుపు తిప్పిన సినిమా ఇది. మా జర్నీ సక్సెస్‌ఫుల్‌గా కంటిన్యూ అవుతోంది'' అన్నారు. ''ఈ 12 ఏళ్లలో మేం ఎంత ఎదిగామో మాకు గుర్తు చేసే తీపి గుర్తు ఈ చిత్రం'' అన్నారు ఎస్‌కేఎన్. ''అప్పట్లో కేవలం 50 లక్షల రూపాయలతో నిర్మించి సంచలన విజయం అందుకున్నాం'' అన్నారు శ్రేయాస్ శ్రీనివాస్.

సాక్షి బిజినెస్

శనివారం
23-3-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	191	72,832
నిఫ్టీ ▲	83	22,097

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	16,450	▲	50
డోజోన్స్	39,597	▽	184
ఎఫ్‌టీఎస్ఈ 100	7,931	▲	48
డాక్స్	18,215	▲	36
షాంఘై	3,048	▽	29
నికాయ్	40,888	▲	72

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	66,245 ▽	669
బంగారం (99.5 స్వచ్ఛత)	65,980 ▽	666
వెండి (కిలో)	73,787 ▽	1,256

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.88	83.90
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.10	106.66
€	యూరో	ఎస్‌బీఐ	89.19	91.57
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.43	55.65
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.52	55.42
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.46	64.27
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.31	22.94
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.79	23.64
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.41	12.51

డాక్టర్ రెడ్డీస్‌కు సెంథాక్విన్ ఔషధ హక్కులు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రాణాంతకమైన హైపోవోలెమిక్ షాక్ అనే అనారోగ్య సంబంధ చికిత్సలో ఉపయోగించే సెంథాక్విన్ ఔషధాన్ని భారత్‌లో మార్కెటింగ్, పంపిణీ చేసేందుకు డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ హక్కులు దక్కించుకుంది. ఇందుకోసం అమెరికాకు చెందిన బయోఫార్మా సంస్థ ఫార్మాజీతో లైసెన్స్ ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం ఈ ఔషధాన్ని లైఫాక్విన్ బ్రాండ్ పేరిట డాక్టర్ రెడ్డీస్ విక్రయించనుంది. ప్రతిగా ఫార్మాజీకు రాయల్టీలు మొదలైనవి చెల్లించనుంది. నేపాల్‌లోనూ లైఫాక్విన్‌ను మార్కెటింగ్ చేసే హక్కులు పొందినట్లు సంస్థ తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
23-3-2024	
విశాఖ	415-00
చిత్తూరు	478-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425-00
విజయవాడ	425-00
రిటైల్ ధర (డజను)	72.00
22-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	415-00
వరంగల్	417-00
రిటైల్ ధర	4.75

హిందుస్తాన్ జింక్ విభజనకు కేంద్రం నో...



న్యూఢిల్లీ: ప్రమోటర్ గ్రూప్.. వేదాంతా ప్రతిపాదిత హిందుస్తాన్ జింక్ కంపెనీ విభజనకు గనుల శాఖ నో చెప్పింది. హిందుస్తాన్ జింక్‌ను రెండు విభిన్న సంస్థలుగా విడదీసేందుకు వేదాంతా గ్రూప్ చేసిన ప్రతిపాదనను తిరస్కరిస్తున్నట్లు మైన్స్ సెక్రటరీ వీఎల్ కాంతారావు తాజాగా వెల్లడించారు. వాటాదారుగా కంపెనీ ప్రతిపాదన తమకు ఆమోదయోగ్యంగా లేదని తెలియజేశారు. వెరసి విభజన ప్రతిపాదనను అంగీకరించలేదని స్పష్టం చేశారు. కంపెనీలో ప్రభుత్వం 29.54 శాతం వాటాతో అతిపెద్ద మైనారిటీ వాటాదారుగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ)ను పెంచుకునే బాటలో జింక్, సిల్వర్‌సహా బిజినెస్‌లను రెండు ప్రత్యేక కంపెనీలుగా ఏర్పాటు చేసేందుకు హిందుస్తాన్ జింక్ ఇంతక్రితం ప్రతిపాదించింది. కాగా.. బిజినెస్‌ల విభజనకు సలహాదారు సంస్థను నియమించుకునే యోచనలో ఉన్నట్లు గతంలో హిందుస్తాన్ జింక్ ప్రకటించింది. కంపెనీ విలువను మెరుగుపరచేందుకు కార్పొరేట్ నిర్మాణాన్ని పూర్తిస్థాయిలో సమీక్షించేందుకు బోర్డు నిర్ణయించినట్లు కంపెనీ పేర్కొంది. జింక్, లెడ్, సిల్వర్, రీసైక్లింగ్ బిజినెస్‌లను రెండు చట్టబద్ధ కంపెనీలుగా ఏర్పాటు చేయనున్నట్లు ఇంతక్రితం నియంత్రణ సంస్థలకు తెలియజేసింది.

సీఎన్‌జీ బైక్‌పై బజాజ్ ఆటో కసరత్తు

జూన్‌లో మార్కెట్లోకి



పుణే: పర్యావరణ అనుకూల సీఎన్‌జీ ఇంధనంతో నడిచే మోటార్‌సైకిళ్ల తయారీపై ద్విచక్ర వాహనాల దిగ్గజం బజాజ్ ఆటో కసరత్తు చేస్తోంది. జూన్ కల్లా ఈ బైకు మార్కెట్లోకి రాగలదని కంపెనీ ఎండీ రాజీవ్ బజాజ్ తెలిపారు. మైలేజీని కోరుకునే కస్టమర్ల కోసం రూపొందిస్తున్న ఈ వాహనాన్ని వేరే బ్రాండ్ కింద ప్రవేశపెట్టనున్నట్లు వివరించారు. వచ్చే అయిదేళ్లలో కార్పొరేట్ సామాజిక బాధ్యతా కార్యక్రమాలపై (సీఎస్ఆర్) రూ. 5,000 కోట్లు వెచ్చించనున్నట్లు ప్రకటించిన సందర్భంగా ఆయన ఈ విషయం వెల్లడించారు. పెట్రోల్‌తో నడిచే మోటర్‌సైకిళ్లతో పోలిస్తే దీని ధర కొంత అధికంగా ఉండవచ్చని అంచనా. కస్టమర్ల సౌకర్యార్థం పెట్రోల్, సీఎన్‌జీ ఇంధనాల ఆప్షన్లు ఉండేలా ట్యాంకును ప్రత్యేకంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉండటం వల్ల తయారీ కోసం మరింత ఎక్కువగా వెచ్చించాల్సి రానుండటమే ఇందుకు కారణం. గ్రూప్‌నకు చెందిన అన్ని సీఎస్ఆర్, సేవా కార్యక్రమాలను 'బజాజ్ బియాండ్' పేరిట సంస్థ నిర్వహించనుంది. దీని కింద ప్రధానంగా నైపుణ్యాల్లో శిక్షణ కల్పించడంపై దృష్టి పెట్టనుంది.

రెడీ మిక్స్ కాంక్రీట్‌లోకి శ్రీ సిమెంట్





న్యూఢిల్లీ: సిమెంటు తయారీ దిగ్గజం శ్రీ సిమెంట్ తాజాగా రెడీ మిక్స్ కాంక్రీట్ (ఆర్ఎంసీ) విభాగంలోకి ప్రవేశించింది. తమ తొలి ప్లాంటును హైదరాబాద్‌లో ప్రారంభించింది. గంటకు 90 ఘనపు మీటర్ల సామర్థ్యంతో ఇది పని చేస్తుందని సంస్థ తెలిపింది. ఈ విభాగానికి సంబంధించి ఇప్పటికే స్టార్‌క్రీట్ సంస్థకు ముంబైలో ఉన్న అయిదు ప్లాంట్లను రూ. 33.5 కోట్లకు కొనుగోలు చేసినట్లు పేర్కొంది. మొత్తం మీద తమ సంస్థ ఆర్ఎంసీ సామర్థ్యాలు గంటకు 512 ఘనపు మీటర్లుగా ఉంటుందని శ్రీ సిమెంట్ ఎండీ నీరజ్ అఖోరి తెలిపారు. కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు మౌలిక సదుపాయాల అభివృద్ధిపై మరింతగా దృష్టి పెడుతుండటం, హౌసింగ్ రంగం పుంజుకుంటూ ఉండటం మొదలైన అంశాలు ఆర్ఎంసీ వ్యాపారానికి సానుకూలంగా దోహదపడగలవని ఆయన పేర్కొన్నారు.

మూడో రోజూ లాభాలు

సూచీలకు ఐటీసీ, ఎల్అండ్‌టీ, మారుతీ షేర్ల దన్ను



ముంబై: ఐటీసీ, ఎల్అండ్‌టీ, మారుతీ సుజుకీ షేర్ల రికార్డుల ర్యాలీతో పాటు ఈ ఏడాదిలో మూడు సార్లు వడ్డీరేట్ల తగ్గింపు ఉండొచ్చనే ఫెడ్ రిజర్వ్ సంకేతాలతో స్టాక్ సూచీలు మూడోరోజూ లాభాలు ఆర్జించాయి. సెన్సెక్స్ 191 పాయింట్లు పెరిగి 72,832 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 83 పాయింట్లు బలపడి 22,097 వద్ద నిలిచింది. ఉదయం భారీ నష్టాలతో మొదలైన సూచీలు జాతీయ, అంతర్జాతీయంగా నెలకొన్న సానుకూల సంకేతాల ప్రభావంతో వెంటనే లాభాల్లోకి మళ్లాయి. ఒక దశలో సెన్సెక్స్ 474 పాయింట్లు పెరిగి 73,115 వద్ద, నిఫ్టీ 169 పాయింట్లు ఎగసి 22,181 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. అయితే యాక్సెంచర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) ఆదాయ వృద్ధి అంచనాల తగ్గింపుతో ఐటీ, టెక్ షేర్లలో నెలకొన్న అమ్మకాల ఒత్తిడి సూచీల లాభాలను పరిమితం చేసింది. బీఎస్ఈ స్మాల్, మిడ్ ఇండెక్సులు వరుసగా 1.06%, 0.38% చొప్పున లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. రంగాల వారీగా బీఎస్ఈలో టెలికమ్యూనికేషన్ 2.28%, ఆటో 1.67%, రియల్టీ 1.40% కన్జూమర్ డిస్క్రిషనరీ 1.20%, ఇండస్ట్రీస్, మెటల్స్ 1.17%, ప్రభుత్వరంగ బ్యాంకులు 1% చొప్పున లాభపడ్డాయి.

ఐపీఓకు స్టాలియన్ ఇండియా ఫ్లోరోకెమికల్స్, శ్రీ తిరుపతి బాలాజీ ఆగ్రో ట్రేడింగ్...

కొద్ది రోజులుగా కళకళలాడుతున్న ప్రైమరీ మార్కెట్ల ప్రభావంతో తాజాగా రెండు కంపెనీలు ఐపీవో బాట పట్టాయి. ఇందుకు అనుమతించమంటూ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌లను దాఖలు చేశాయి. జాబితాలో మహారాష్ట్ర కంపెనీ స్టాలియన్ ఇండియా ఫ్లోరోకెమికల్స్, మధ్యప్రదేశ్ కంపెనీ శ్రీ తిరుపతి బాలాజీ ఆగ్రో ట్రేడింగ్ ఉన్నాయి.

జీవితకాల కనిష్టానికి రూపాయి



రూపాయి విలువ శుక్రవారం జీవితకాల కనిష్ట స్థాయి 83.61 వద్ద ముగిసింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని బలహీనతలు, డాలర్ బలోపేత ధోరణి, దేశీయ క్యాపిటల్ మార్కెట్ నుంచి విదేశీ పెట్టుబడులు తరలిపోవడం రూపాయి కోతకు కారణమయ్యాయని ట్రేడర్లు తెలిపారు. ఉదయం ఫారెక్స్ మార్కెట్లో డాలర్ మారకంతో పోలిస్తే 83.28 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో ఏకంగా 52 పైసలు క్షీణించి 83.65 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి 48 పైసలు కోల్పోయి జీవితకాల కనిష్టం 83.61 వద్ద ముగిసింది. కాగా, ఇప్పటి వరకూ డాలర్ మారకంలో రూపాయి కనిష్ట ముగింపు (2023 డిసెంబర్13) 83.40గా ఉంది.

వొడాఫోన్ ప్రత్యేక ఐపీఎల్ ఆఫర్లు

ముంబై: వొడాఫోన్ ఐడియా (వీఐ) తాజాగా ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. వీటితో డిస్కౌంట్లు, అదనపు డేటా పొందవచ్చని సంస్థ తెలిపింది. వీఐ యాప్ ద్వారా మాత్రమే ఈ ఆఫర్లు అందుబాటులో ఉంటాయి. వీటి ప్రకారం రూ. 1,449 ప్యాక్‌పై రూ. 50 మేర, రూ. 3,199 ప్యాక్‌పై రూ. 100 డిస్కౌంటు లభిస్తుంది. రూ. 181 ప్యాక్‌పై 50%, రూ. 75 ప్యాక్‌పై 25 శాతం అదనపు డేటా పొందవచ్చు.

అదానీ టోటల్ ఎనర్జీస్‌తో మహీంద్రా జట్టు

ముంబై: దేశీయంగా ఎలక్ట్రిక్ చార్జింగ్ సదుపాయాలను మరింత పెంచే దిశగా అదానీ టోటల్ ఎనర్జీస్‌తో ఎంఅండ్ఎం అవగాహన కుదుర్చుకున్నాయి. దీనితో చార్జింగ్ స్టేషన్ల డిస్కవరీ, లభ్యత, నావిగేషన్, లావాదేవీల నిర్వహణకు అవసరమైన ఈ-మొబిలిటీ సేవలు అందుబాటులో ఉంటాయని ఎంఅండ్ఎం ఆటోమోటివ్ డివిజన్ ప్రెసిడెంట్ నక్రా తెలిపారు. ఎక్స్‌యూవీ400 కస్టమర్లకు బ్లూసెన్స్‌ప్లస్ యాప్‌లో 1,100 పైచిలుకు చార్జర్లు అందుబాటులో ఉంటాయి.

విజయా డయాగ్నొస్టిక్స్ విస్తరణ ప్రణాళిక

ఏటా 10 సెంటర్స్ ఏర్పాటు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వైద్యపరీక్షల సేవల సంస్థ విజయా డయాగ్నొస్టిక్స్ ఏటా 8-10 కేంద్రాలను ఏర్పాటు చేసే యోచనలో ఉంది. ప్రస్తుతం వివిధ రాష్ట్రాల్లో మొత్తం 140 పైచిలుకు డయాగ్నొస్టిక్ సెంటర్స్ ఉండగా తెలుగు రాష్ట్రాల్లో అత్యధికంగా ఉన్నాయి. తమ డయాగ్నొస్టిక్ కేంద్రంలో ఫ్యూజిఫిల్మ్‌కి చెందిన అధునాతన ఓపెన్ ఎంఆర్ఐ మెషీన్‌ను ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా సంస్థ సీవోవో శేషాద్రి వాసన్ ఈ విషయాలు తెలిపారు. క్లోజ్డ్‌గా ఉండే ఎంఆర్ఐతో పోలిస్తే ఓపెన్‌గా ఉండే అపెర్టో లూసెంట్ మెషీన్.. పేషంట్లలో ఆదుర్దాను తగ్గించగలిగేలా ఉంటుందని ఫ్యూజి ఫిల్మ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (హెల్త్‌కేర్ విభాగం) చందర్ శేఖర్ సిబాల్ తెలిపారు. వచ్చే రెండేళ్లలో భారత్‌లోనూ తయారీ, అభివృద్ధి కార్యకలాపాలు ప్రారంభించే యోచనలో కంపెనీ ఉన్నట్లు వివరించారు. ఫ్యూజిఫిల్మ్ ఇండియా ఎండీ కోజీ వాడా తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



సాక్షి స్పోర్ట్స్

సత్యన్‌కు తొలి డబ్ల్యూటీటీ టైటిల్



భారత స్టార్ టేబుల్ టెన్నిస్ ప్లేయర్ సత్యన్ జ్ఞానశేఖరన్ 'డబ్ల్యూటీటీ ఫీడర్ సిరీస్‌'లో టైటిల్ సాధించిన తొలి భారత ఆటగాడిగా ఘనతకెక్కాడు. లెబనాన్‌లోని బీరుట్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో గురువారం అర్ధరాత్రి ఇద్దరు భారత ఆటగాళ్ల మధ్యే టైటిల్ పోరు జరిగింది. ఈ టోర్నీలో 11వ సీడ్‌గా బరిలోకి దిగిన సత్యన్ 3-1 (6-11, 11-7, 11-7, 11-4)తో సహచరుడు, తొమ్మిదో సీడ్ మానవ్ ఠక్కర్‌పై విజయం సాధించాడు. దాదాపు మూడేళ్ల తర్వాత సత్యన్ అంతర్జాతీయ ర్యాంకింగ్ ఈవెంట్‌లో విజేతగా నిలిచాడు. 2021 ఆగస్టులో జరిగిన ఐటీటీఎఫ్ చెక్ ఇంటర్నేషనల్ ఓపెన్‌లో అతను టైటిల్ గెలిచాడు. మరోవైపు భారత జోడీల మధ్యే జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో దియా చిటాలే-మానుష్ షా ద్వయం విజేతగా నిలిచింది. టైటిల్ పోరులో దియా-మానుష్ 3-1 (11-6, 10-12, 11-6, 11-6)తో అర్చన కామత్-మానవ్ ఠక్కర్‌లపై గెలుపొందారు. పురుషుల డబుల్స్ తుది పోరులో మానవ్ ఠక్కర్-మానుష్ జంట రన్నరప్‌తో సరిపెట్టుకుంది.

0-0

భారత్, అఫ్గానిస్తాన్ మ్యాచ్ 'డ్రా'

అబా (సౌదీ అరేబియా): 'ఫిఫా' ప్రపంచకప్ ఆసియా క్వాలిఫయర్స్‌లో బలహీన ప్రత్యర్థిపై గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్ పేలవ ఆటతీరు కనబర్చి 'డ్రా'గా ముగించింది. గ్రూప్ 'ఎ'లో భారత్, అఫ్గానిస్తాన్‌ల మధ్య గురువారం అర్ధరాత్రి జరిగిన మ్యాచ్... ఒక్క గోల్ అయినా నమోదు కాకుండా 'డ్రా' అయ్యింది. తొలి అర్ధ భాగంలో మన్‌వీర్ సింగ్ రెండు సార్లు గోల్స్ చేసేందుకు ప్రత్యర్థి గోల్‌పోస్ట్ వైపు దూసుకెళ్లాడు. కానీ గోల్ మాత్రం చేయలేకపోయాడు. రెండో అర్ధ భాగంలో విక్రమ్ ప్రతాప్ కూడా గోల్ కోసం విఫల యత్నాలు చేశాడు. మళ్లీ ఫినిషింగ్ లోపాలతో భారత్ ఖాతా తెరవలేకపోయింది. సులువైన ప్రత్యర్థి జట్టు డిఫెన్స్‌ను ఛేదించలేకపోవడంపై భారత కోచ్ ఇగర్ స్టిమాక్ అసహనం వ్యక్తం చేశారు. తాజా 'డ్రా'తో భారత్ ఈ గ్రూప్ 'ఎ'లో రెండో స్థానంలో ఉంది. మూడు మ్యాచ్‌లాడిన భారత్ ఖాతాలో 4 పాయింట్లున్నాయి. 3 మ్యాచ్‌ల ద్వారా 9 పాయింట్లు సాధించిన ఖతర్ అగ్ర స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో ఖతర్ 3-0తో కువైట్‌పై గెలుపొందింది.



సెమీఫైనల్లో శ్రీకాంత్

స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

బాసెల్ (స్విట్జర్లాండ్): స్విస్ ఓపెన్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. క్వార్టర్ ఫైనల్లో అతను 21-10, 21-14తో చియా హా లీ (చైనీస్ తైపీ)ని వరుస గేముల్లో కంగుతినిపించాడు. రెండు ఒలింపిక్ పతకాల విజేత పూసర్ల వెంకట సింధు, లక్ష్యసేన్‌లకు ప్రి క్వార్టర్ ఫైనల్లోనే చుక్కెదురైంది. పురుషుల ప్రిక్వార్టర్ ఫైనల్లో అన్‌సీడెడ్ శ్రీకాంత్ 21-16, 21-15తో మలేసియన్ టాప్ సీడ్ ప్లేయర్ లీ జీ జియాను వరుస గేముల్లో కంగు తినిపించాడు. కానీ ఏడో సీడ్ లక్ష్యసేన్ 17-21, 15-21తో చియా హా లీ (చైనీస్ తైపీ) జోరుకు నిలువలేకపోయాడు. మహిళల ప్రిక్వార్టర్స్‌లో నాలుగో సీడ్ సింధు 21-16, 19-21, 16-21తో జూనియర్ ప్రపంచ చాంపియన్, 17 ఏళ్ల టొమొకా మియజకి (జపాన్) చేతిలో పరాజయం చవిచూడగా, మహిళల డబుల్స్‌లో 8వ సీడ్ గాయత్రి-ట్రిసా జాలీ జంట 14-21, 15-21తో సెటియానా-ఎంజెలా యూ (ఆస్ట్రేలియా) జోడీ చేతిలో కంగుతింది. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో సిక్కిరెడ్డి-సుమిత్ రెడ్డి జంట 11-21, 14-21తో రాబిన్ టాబెలింగ్-సెలెనా పేక్ (నెదర్లాండ్స్) జోడీ చేతిలో ఓడింది.

చెన్నై జోరు





ముస్తఫిజుర్ బౌలింగ్‌లో గ్రీన్ క్లీన్‌బౌల్డ్

తొలి పోరులో ఘన విజయం	6 వికెట్లతో బెంగళూరు ఓటమి	ముస్తఫిజుర్‌కు 4 వికెట్లు

డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ సొంత మైదానంలో శుభారంభం చేసింది... ఐపీఎల్ కొత్త సీజన్ తొలి పోరులో సమష్టి ప్రదర్శనతో బెంగళూరు రాయల్ చాలెంజర్స్‌పై పైచేయి సాధించింది...ముందుగా బౌలింగ్‌లో పదునైన బంతులతో చెలరేగిన ముస్తఫిజుర్ బెంగళూరును సాధారణ స్కోరుకే పరిమితం చేశాడు. ఆపై ఛేదనలో ఎలాంటి ఆటంకం లేకుండా చెన్నై సులువుగా పని పూర్తి చేసింది. కెప్టెన్‌గా రుతురాజ్ తొలి పోరులో తన పేరిట విజయాన్ని నమోదు చేసుకోగా...ఐపీఎల్‌లో తన మొదటి మ్యాచ్‌లోనే రచిన్ రవీంద్ర ఆకట్టుకోవడం హైలైట్.

చెన్నై: ఐపీఎల్-2024ను సూపర్ కింగ్స్ దర్జాగా గెలుపుతో మొదలు పెట్టింది. శుక్రవారం జరిగిన పోరులో చెన్నై 6 వికెట్ల తేడాతో బెంగళూరును ఓడించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. అనూజ్ రావత్ (25 బంతుల్లో 48; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), దినేశ్ కార్తీక్ (26 బంతుల్లో 38 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. వీరిద్దరు ఆరో వికెట్‌కు 50 బంతుల్లోనే 95 పరుగులు జోడించారు. ముస్తఫిజుర్ రహమాన్ (4/29) ప్రత్యర్థిని దెబ్బ కొట్టాడు. అనంతరం చెన్నై 18.4 ఓవర్లలో 4 వికెట్లకు 176 పరుగులు చేసింది. శివమ్ దూబే (28 బంతుల్లో 34 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), రచిన్ రవీంద్ర (15 బంతుల్లో 37; 3 ఫోర్లు) రాణించారు.

భారీ భాగస్వామ్యం...

బెంగళూరు ఇన్నింగ్స్‌లో 11.4 ఓవర్లు ముగిసే సరికి స్కోరు 78/5...ఈ స్థితినుంచి జట్టు చెప్పుకోదగ్గ స్కోరు సాధించగలిగిందంటే రావత్, కార్తీక్ భాగస్వామ్యమే కారణం. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న తర్వాత డుప్లెసిస్ ధాటిగా ఆడటంతో బెంగళూరు ఇన్నింగ్స్ మెరుగ్గానే మొదలైంది. విరాట్ కోహ్లి (20 బంతుల్లో 21; 1 సిక్స్) పెద్దగా ప్రభావం చూపకపోయినా తొలి వికెట్‌కు 27 బంతుల్లో 41 పరుగులు వచ్చాయి. అయితే ముస్తఫిజుర్ చెలరేగడంతో పరుగు వ్యవధిలో 3 వికెట్లు కోల్పోయింది. రచిన్ చక్కటి ఫీల్డింగ్‌కు డుప్లెసిస్ వెనుదిరగ్గా, రహానే ఫీల్డింగ్ నైపుణ్యంతో కోహ్లి పెవిలియన్ చేరాడు. మ్యాక్స్‌వెల్ (0) తొలి బంతికే అవుట్ కాగా, గ్రీన్ (18)ను ముస్తఫిజుర్ బౌల్డ్ చేశాడు. ఇలాంటి సమయంలో 28 బంతుల పాటు ఒక్క బౌండరీ కూడా ఆర్‌సీబీ ఖాతాలో చేరలేదు! అయితే కుదురుకున్న తర్వాత రావత్, కార్తీక్ దూకుడు పెంచి బౌండరీలతో పరుగులు రాబట్టారు. తుషార్ వేసిన 18వ ఓవర్లో రావత్ 2 సిక్స్‌లు, ఫోర్ కొట్టగా, కార్తీక్ మరో సిక్స్ బాదడంతో మొత్తం 25 పరుగులు వచ్చాయి. ఆఖరి 5 ఓవర్లలో ఆర్‌సీబీ 71 పరుగులు సాధించింది.

సమష్టి ప్రదర్శన...

ఛేదనలో సీఎస్‌కే బ్యాటర్లు అంతా తలా ఓ చేయి వేశారు. కెప్టెన్‌గా తొలి మ్యాచ్‌లో రుతురాజ్ (15) విఫలమైనా...ఐపీఎల్ అరంగేట్ర మ్యాచ్‌లోనే రచిన్ చక్కటి షాట్లతో అలరిస్తూ బౌండరీలతో వేగంగా పరుగులు సాధించాడు. ఫలితంగా పవర్‌ప్లే ముగిసే సరికి స్కోరు 62 పరుగులకు చేరింది. ఆ తర్వాత రహానే (19 బంతుల్లో 27; 2 సిక్స్‌లు), డరైల్ మిచెల్ (18 బంతుల్లో 22; 2 సిక్స్‌లు) కీలక పరుగులతో జట్టును విజయం దిశగా నడిపించారు. వీరిద్దరు తక్కువ వ్యవధిలో వెనుదిరిగినా...దూబే, రవీంద్ర జడేజా (17 బంతుల్లో 25 నాటౌట్; 1 సిక్స్) కలిసి 8 బంతుల ముందే మ్యాచ్‌ను ముగించారు.

స్కోరు వివరాలు:

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (సి) రచిన్ (బి) ముస్తఫిజుర్ 21; డుప్లెసిస్ (సి) రచిన్ (బి) ముస్తఫిజుర్ 35; పటిదార్ (సి) ధోని (బి) ముస్తఫిజుర్ 0; మ్యాక్స్‌వెల్ (సి) ధోని (బి) చహర్ 0; గ్రీన్ (బి) ముస్తఫిజుర్ 18; రావత్ (రనౌట్) 48; కార్తీక్ (నాటౌట్) 38; ఎక్స్‌ట్రాలు 13; మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 173. వికెట్ల పతనం: 1-41, 2-41, 3-42, 4-77, 5-78, 6-173. బౌలింగ్: దీపక్ చహర్ 4-0-37-1, తుషార్ 4-0-47-0, తీక్షణ 4-0-36-0, ముస్తఫిజుర్ 4-0-29-4, జడేజా 4-0-21-0.

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (సి) గ్రీన్ (బి) దయాళ్ 15; రచిన్ (సి) పటిదార్ (బి) కరణ్ 37; రహానే (సి) మ్యాక్స్‌వెల్ (బి) గ్రీన్ 27; మిచెల్ (సి) పటిదార్ (బి) గ్రీన్ 22; దూబే (నాటౌట్) 34; జడేజా (నాటౌట్) 25; ఎక్స్‌ట్రాలు 16; మొత్తం (18.4 ఓవర్లలో 4 వికెట్లకు) 176. వికెట్ల పతనం: 1-38, 2-71, 3-99, 4-110. బౌలింగ్: సిరాజ్ 4-0-38-0, యశ్ దయాళ్ 3-0-28-1, జోసెఫ్ 3.4-0-38-0, కరణ్ శర్మ 2-0-24-1, డాగర్ 2-0-6-0, గ్రీన్ 3-0-27-2, మ్యాక్స్‌వెల్ 1-0-7-0.

అలరించిన ఆరంభ వేడుకలు



తొలి మ్యాచ్‌కు ముందు చిదంబరం స్టేడియంలో ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. దిగ్గజ సంగీత దర్శకుడు ఏఆర్ రహమాన్ నేతృత్వంలో గాయకులు సోనూ నిగమ్, మోహిత్ చౌహాన్, నీతి మోహన్ తమ పాటలతో అలరించారు. అంతకు ముందు నటులు అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్ ప్రదర్శన కూడా ఆకట్టుకుంది. దీంతో పాటు లేజర్ షోతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగియి. పెద్ద సైజు ఐపీఎల్ ట్రోఫీ రెప్లికాను ఈ సందర్భంగా మైదానంలో ప్రదర్శించారు.



ఐపీఎల్‌లో నేడు

పంజాబ్ X ఢిల్లీ
వేదిక: ముల్లన్‌పూర్
మధ్యాహ్నం 3: 30 గంటల నుంచి

కోల్‌కతా X హైదరాబాద్
వేదిక: కోల్‌కతా
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఇజ్రాయెల్ నుంచి ఎలా వచ్చాయి?

అత్యాధునిక ఉపకరణాల దిగుమతికి కేంద్రం అనుమతి తప్పనిసరి

- 'ఎస్ఐబీ సైన్యం' తీసుకుంది సక్రమమేనా?
- సమాచారం ఇవ్వకుంటే తీవ్ర పరిణామాలే!
- అక్రమ ట్యాపింగ్ వ్యవహారంలో కొత్త ట్విస్ట్
- ఆరో రోజు ముగిసిన మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావు విచారణ



సాక్షి, హైదరాబాద్: అప్పటి ఎస్ఐబీ చీఫ్ 'టి.ప్రభాకర్‌రావు అండ్ టీమ్'ఇజ్రాయెల్ నుంచి దిగుమతి చేసుకున్న అత్యాధునిక ఉపకరణాలకు కేంద్ర హోంమంత్రిత్వశాఖ (ఎంహెచ్ఏ) అనుమతి ఉందా? లేదా? అనే అంశం ఇప్పుడు తెరపైకి వచ్చింది. వీటిని ఖరీదు చేయడానికి ఏ బడ్జెట్ నుంచి నిధులు వెచ్చించారనేదిపై కూడా స్పష్టత లేదు. మరోపక్క సిట్ కస్టడీలో ఉన్న ఎస్ఐబీ మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావును అధికారులు ఆరో రోజైన శుక్రవారం ప్రశ్నించారు. ఈయన పోలీసు కస్టడీ గడువు శనివారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలోనే మరికొన్ని రోజుల కస్టడీ కోరాలా? వద్దా? అనే దానిపై ఉన్నతాధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతుంటాయి

ఉగ్రవాదులు, మావోయిస్టులపై నిఘా, ఆపరేషన్లు చేయడానికి ప్రతీరాష్ట్రం ప్రత్యేకంగా విభాగాలను ఏర్పాటు చేసుకుంటాయి. రాష్ట్రంలో మావోయిస్టులపై నిఘాకు ఎస్ఐబీ, ఉగ్రవాదుల కదలికలపై కన్నేసి ఉంచడానికి కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ పనిచేస్తుంటాయి. మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్లకు గ్రేహౌండ్స్, ఉగ్రవాదులపై పోరాడటానికి ఆక్టోపస్ ఉన్నాయి. ఈ విభాగాలు ఎప్పటికప్పుడు అప్‌డేట్, అప్‌గ్రేడ్ అవుతాయి. దీనికోసం దేశవిదేశాల్లో అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక పరికరాలు, ఉపకరణాలను ఖరీదు చేస్తాయి. కొన్నింటిని దేశంలోని వివిధ నగరాల్లో ఉన్న లైసెన్స్‌డ్ ఏజెన్సీల నుంచి, మరికొన్ని కన్సల్టెంట్స్ ద్వారా విదేశాల నుంచి కొనుగోలు చేస్తాయి. ఇది అన్ని విభాగాల్లోనే జరిగే నిరంతర ప్రక్రియే.

ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు, రియల్టర్లు తదితరులను టార్గెట్ చేయడానికి 2018లో ఎస్ఐబీ ఇజ్రాయెల్ నుంచి అత్యాధునిక ఉపకరణాల ఖరీదుకు ముందు కేంద్రం నుంచి అనుమతి, పోస్ట్ ఫ్యాక్టో సమాచారం ఇచ్చినట్టు ఎలాంటి ఆధారాలు లేవని అధికారులు చెబుతున్నారు. ఇలాంటివి ఏమీ లేకుండా అక్రమంగా ట్యాపింగ్ ఉపకరణాలను దిగుమతి చేసుకుంటే బాధ్యులపై ఎంహెచ్ఏ కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేస్తున్నారు. మరోపక్క వీటిని ఖరీదు చేయడానికి ఏ నిధులు వాడారు? ఎంత వెచ్చించారు? తదితర అంశాలను లోతుగా ఆరా తీస్తున్నారు. ఎం

నిధుల విషయంలో ఏదీ స్పష్టత

హెచ్ఏకు చెందిన ఓ మాజీ అధికారి 'సాక్షి'తో మాట్లాడుతూ 'సాధారణంగా ఇలాంటివి అక్రమంగానే దిగుమతి అవుతాయి. రాజకీయ పార్టీల ప్రోద్బలంతో విదేశాల్లో ఉన్న వారి సానుభూతిపరుల నుంచి నిధులు సమీకరిస్తారు. అలా వచ్చిన డబ్బుతో వీటిని కొంటారు. రాష్ట్రంలో ఉన్న డమ్మీ కంపెనీల పేర్లతో, వాటికి సంబంధించిన ఉపకరణాలని చెబుతూ దిగుమతి చేసుకుంటారు. వివాదాస్పదమైనప్పుడే వీటిపై దృష్టి పడుతుంది'అని వివరించారు.


అయితే అనుమతి లేదా సమాచారం

శాంతిభద్రతల పరిరక్షణ అనేది రాష్ట్రపరిధిలోని అంశమే. దీంతో భద్రతాపరమైన ఏర్పాట్లకు రాష్ట్ర పోలీసు, నిఘా విభాగాలు కొన్ని ఉపకరణాలను సమీకరించుకుంటాయి. అయితే వీటికి సంబంధించిన సమాచారం మొత్తం కేంద్ర హోం మంత్రిత్వశాఖకు తెలియాల్సిందే. ఈ విషయంలో రాష్ట్రాలు రెండు విధానాలను పాటిస్తాయి. అత్యవసరమైనప్పుడు దేశంలోని వివిధ ఏజెన్సీల నుంచి ఉపకరణాలను ఖరీదు చేస్తాయి. ఆపై పోస్ట్ ఫ్యాక్టో విధానం అనుసరిస్తూ కేంద్ర హోం మంత్రిత్వశాఖ (ఎంహెచ్ఏ)కు సమాచారం ఇస్తాయి. విదేశాల నుంచి ఏదైనా దిగుమతి చేసుకోవాలంటే దానికి కొంత సమయం ముందు నుంచే కసరత్తు మొదలవుతుంది. ఇది అత్యవసరంగా జరిగేది కాదు. దీంతో కచ్చితంగా ముందు అనుమతి తీసుకోవాల్సిందే. బ్యూరో ఆఫ్ పోలీసు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బీపీఆర్అండ్‌డీ) ద్వారా ఎంహెచ్ఏలో ఉండే స్పెషల్ సెక్రటరీ (ఇంటర్నల్ సెక్యూరిటీ) నుంచి అనుమతి పొందాలి. ట్యాపింగ్ వంటి ఉపకరణాలు, పరికరాలు విషయంలో ఇది తప్పనిసరిగా అమలు కావాల్సిందే.

మీడియా చానల్ అధినేత ఇంట్లో సోదాలు

ఎస్ఐబీ కేంద్రంగా జరిగిన అక్రమ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఉచ్చు ఓ మీడియా చానల్ అధినేతకు చుట్టుకుంది. మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావుకు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరించినట్టు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. శుక్రవారం రాత్రి సిట్ అధికారులు జూబ్లీహిల్స్ రోడ్ నెం.78లోని ఆయన ఇంట్లో సోదాలు చేశారు. ప్రణీత్‌రావు అరెస్టు తర్వాత ఈ మీడియా అధినేత అజ్ఞాతంలోకి వెళ్లినట్టు తెలిసింది. ఇతడికి ప్రణీత్‌రావుకు మధ్య జరిగిన వాట్సాప్ చాటింగ్‌కు సంబంధించిన స్క్రీన్ షాట్లు ఇప్పటికే సిట్‌కు లభించాయి. ఎన్నికల నేపథ్యంలో రాజకీయనేతల ఆర్థిక లావాదేవీలపై కన్నేసిన ప్రణీత్‌కు ఈ మీడియా అధినేత సహకరించారన్నది ప్రధాన ఆరోపణ. ఈ వ్యక్తి అప్పటి ప్రతిపక్ష నేత రేవంత్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబీకులు, వీరికి అండగా నిలుస్తున్న వారి వివరాలను తన నెట్‌వర్క్ ద్వారా సేకరించి ప్రణీత్‌కు అందించారు. అక్రమ ట్యాపింగ్ ఉపకరణాన్ని ప్రణీత్‌రావు కొన్ని రోజులు ఈ మీడియా చానల్‌లో ఉంచి కథ నడిపిట్టు ఆరోపణలు ఉన్నాయి. మరోపక్క వీరు బెదిరింపులు, వసూళ్లకు పాల్పడినట్టు సిట్ ఆధారాలు సేకరించింది.

2050 నాటికి ప్రపంచవ్యాప్తంగా నీటి సంక్షోభం ఎక్కడెక్కడ ఎలా ఉండనుందంటే...



ప్రపంచం ఇప్పటికే నీటి కొరతను ఎదుర్కొంటుండగా రానున్న రెండున్నర దశాబ్దాల్లో ఇది పెను సంక్షోభానికి దారితీసే ప్రమాదం ఉందని ప్రపంచ వనరుల సంస్థ (డబ్ల్యూఆర్ఐ) హెచ్చరించింది. 164 దేశాలకుగాను 51 దేశాలు 2050 నాటికి అధికం నుంచి అత్యధికంగా నీటి సంక్షోభాన్ని ఎదుర్కోవచ్చని పేర్కొంది. అరేబియా ద్వీపకల్పం, ఇరాన్, భారత్‌తోపాటు అల్జీరియా, ఈజిప్ట్, లిబియా తదితర ఉత్తర ఆఫ్రికా దేశాలు 2050 నాటికి అందుబాటులో ఉండే నీటిలో 80 శాతాన్ని వినియోగించే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే ఇప్పటికే నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న స్పెయిన్‌లో పరిస్థితి మరింత దిగజారనుందని.. ఫ్రాన్స్, పోలాండ్‌లలో మధ్యస్తం నుంచి ఎక్కువ స్థాయిలో నీటి ఎద్దడి ఉండే అవకాశం ఉందని డబ్ల్యూఆర్ఐ తెలిపింది. అయితే ప్రపంచ జనాభా, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆర్థిక, రాజకీయ పరిణామాల దృష్ట్యా ఈ నీటి సంక్షోభం ఏ స్థాయిలో ఉండొచ్చో కచ్చితత్వంతో అంచనా వేయలేమని తెలిపింది. 2100 నాటికి భూగోళ ఉష్ణోగ్రతలు 2.8 డిగ్రీల నుంచి 4.6 డిగ్రీల మధ్య పెరగొచ్చన్న అంచనాతోపాటు భవిష్యత్తులోనూ ప్రపంచ పరిస్థితులు ఇప్పుడున్నట్లుగానే ఉంటాయన్న అంచనాతో ఈ అధ్యయనం చేపట్టినట్లు వివరించింది. 2022లో ప్రపంచవ్యాప్తంగా 240 కోట్ల మంది ప్రజలు అత్యంత నీటి ఎద్దడికి గురయ్యే ప్రాంతాల్లో ఉన్నట్లు డబ్ల్యూఆర్ఐ తెలిపింది.

సాక్షి సెంట్రల్ డెస్క్

రూ. 8.99 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత

- ఐడీఏ బొల్లారంలో డీసీఏ, ఎక్సైజ్ అధికారుల జాయింట్ ఆపరేషన్



సాక్షి, హైదరాబాద్: డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, తెలంగాణ ఎక్సైజ్‌శాఖ అధికారుల జాయింట్ ఆపరేషన్‌లో భారీ మొత్తంలో డ్రగ్స్ పట్టుబడ్డాయి. ఇంటర్‌పోల్ అధికారుల విశ్వసనీయ సమాచారం మేరకు సంగారెడ్డి జిల్లా ఐడీఏ బొల్లారంలోని పీఎస్ఎన్ మెడికేర్ ప్రైవేటు లిమిటెడ్‌లో జరిపిన సోదాల్లో రూ.8.99 కోట్ల విలువైన 90.48 కిలోల 3-ఎంఎంసీ (3-మిథైల్ మెథ్‌క్యాథినోన్) డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఐడీఏ బొల్లారంలోని పీఎస్ఎన్ మెడికేర్ ప్రైవేటు లిమిటెడ్‌లో అక్రమంగా 3-ఎంసీసీ డ్రగ్స్‌ను తయారు చేసి వాటిని పలు యూరోపియన్ దేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు ఇంటర్‌పోల్ అధికారులు డీసీఏకు సమాచారం ఇచ్చారు. దీంతో డీసీఏ, ఎక్సైజ్ అధికారులు జాయింట్ ఆపరేషన్ చేపట్టారు. సదరు కంపెనీని ఆ కంపెనీ డైరెక్టర్ కస్తూర్‌రెడ్డి నేమ్మళ్లపూడి నడుపుతున్నట్లు గుర్తించారు. కస్తూర్‌రెడ్డి నేమ్మళ్లపూడి పేరుతోనే పలు దేశాల నుంచి ఈ డ్రగ్స్ కోసం ఆర్డర్లు రావడం, డబ్బు లావాదేవీలు కూడా జరిగినట్లు అధికారులు తేల్చారు. పట్టుబడిన 3-ఎంఎంసీ డ్రగ్‌ను తయారు చేయడం, విక్రయించడం ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం నిషేధం. ఈ డ్రగ్‌ను కస్తూర్‌రెడ్డి ఇప్పటికే పలు దేశాలకు ఎగుమతి చేసినట్లు ఆధారాలు లభించాయి. కస్తూర్‌రెడ్డి, ప్రొడక్షన్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లును అరెస్టు చేసినట్లు తెలిపారు.



తెప్పలపై శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప విహారం

తిరుమల: తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాల్లో మూడోరోజు శుక్రవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు తెప్పపై విహరించారు. సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారి ఉత్సవమూర్తుల ఊరేగింపు మొదలైంది. ఆలయ నాలుగు మాడ వీధుల గుండా పుష్కరిణి వద్దకు చేరుకుంది. స్వామి, అమ్మవార్లు ముమ్మార్లు విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. మంగళ వాయిద్యాలు, వేదపారాయణం, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సంకీర్తనల మధ్య తెప్పోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చిక్కిన మరో దొంగ

'రసూల్‌పురా' చోరీ ఘటనలో పారిపోయిన దుండగుడు



కాజీపేట రూరల్: హైదరాబాద్‌లో గురువారం కొరియర్ బాయ్‌లుగా ఒక ఇంట్లోకి వచ్చి చోరీకి యత్నించిన ఘటనలో ఒక దొంగ పట్టుబడగా.. మరో దొంగ దొరికాడు. శుక్రవారం కాజీపేట ఆర్పీఎఫ్ పోలీసులకు చిక్కాడు. ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సుశీల్‌కుమార్, మరో వ్యక్తి హైదరాబాద్ బేగంపేట రసూల్‌పురాలో ఒక ఇంట్లోకి చొరబడి తల్లీకూతుళ్లను గాయపర్చారు. తుపాకీ, కత్తితో బెదిరించి చోరీకి యత్నించారు. వారు ప్రతిఘటించడంతో పారిపోగా.. ఒక దొంగ దొరికాడు. బేగంపేట్ పోలీసుల నుంచి సమాచారం అందుకున్న కాజీపేట ఆర్పీఎఫ్ పోలీసులు రైళ్లను తనిఖీ చేసి సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దొంగను పట్టుకునేందుకు పహరా పెట్టారు. పారిపోయిన దొంగ సికింద్రాబాద్ నుంచి శాతవాహన ఎక్స్‌ప్రెస్‌లో కాజీపేట కు చేరుకొని ఉత్తరప్రదేశ్ వెళ్లేందుకు ప్లాట్‌ఫామ్‌పై వేచి ఉన్నాడు. అనుమానం వచ్చిన కాజీపేట ఆర్పీఎఫ్ ఎస్సై శ్రావణి, కానిస్టేబుళ్లు రమేశ్, సరీశ్ అతడిని స్టేషన్‌కు తరలించి దేశీ గన్‌ను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ చోరీ ఘటన అనంతరం పారిపోయివచ్చినట్లు విచారణలో గుర్తించి బేగంపేట పోలీసులకు సమాచారం అందించారు. గురువారం రాత్రి 12 గంటలకు అతన్ని అప్పగించినట్లు తెలిపారు. దొంగను చాకచక్యంగా పట్టుకున్న కాజీపేట ఆర్పీఎఫ్ పోలీసులను పోలీసు అధికారులు అభినందించారు.

టీచర్ 'బ్యాడ్ టచ్' చేశారు!

'గుడ్ టచ్-బ్యాడ్ టచ్'పై అవగాహన సందర్భంగా వెలుగులోకి.. ఉపాధ్యాయునిపై పోక్సో, అట్రాసిటీ కేసు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కామారెడ్డి జిల్లా నాగిరెడ్డి పేట మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు గుండారం ప్రవీణ్‌పై శుక్రవారం నాగిరెడ్డిపేట పోలీసులు పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పాఠశాలలో గురువారం 'షీ టీమ్'పోలీసులు 'గుడ్ టచ్-బ్యాడ్ టచ్'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థినులు ఉపాధ్యాయుడు ప్రవీణ్ చర్యలపై 'షీ టీమ్'లోని ఓ మహిళా కానిస్టేబుల్‌కు వివరించారు. ఆమె ఇచ్చిన సమాచారం మేరకు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు పాఠశాలకు చేరుకుని విచారణ జరిపారు. నిజామాబాద్ జిల్లా బోధన్ సమీపంలోని పెంటకలాన్ గ్రామానికి చెందిన గుండారం ప్రవీణ్ ఇటీవల బదిలీపై నాగిరెడ్డిపేట మండలానికి వచ్చారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు ప్రవీణ్ తరచూ ఫోన్లో అసభ్యకర వీడియోలు చూపడంతో పాటు 12 ఏళ్లలోపు వయసు కలిగిన ఇద్దరు చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు విచారణలో తేలినట్లు డీఎస్పీ తెలిపారు. పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంతో కీచక ఉపాధ్యాయుని ఘటన వెలుగులోకి రావడంతో ఉన్నతాధికారులు షీటీమ్‌ను అభినందించారు.

కొత్త కరెన్సీ కమీషన్ల కేసులో రూ. 6.57 లక్షలు జప్తు

- నోట్లరద్దు సమయంలో కమీషన్ కోసం కక్కుర్తిపడిన పోస్టల్ విభాగం అధికారి
- రూ.3.75 కోట్ల విలువైన కొత్త కరెన్సీ నోట్లను ఇచ్చేందుకు రూ.87.19 లక్షల కమీషన్ తీసుకున్న వైనం

సాక్షి, హైదరాబాద్: నోట్ల రద్దు సమయంలో పాత కరెన్సీ నోట్లు తీసుకుని కొత్త కరెన్సీ నోట్లను ప్రజలకు పంపిణీ చేయకుండా పక్కదారి పట్టించిన కేసులో నిందితుడు సీనియర్ పోస్టల్ అధికారి సుధీర్‌బాబు, ఇతర నిందితులకు చెందిన బ్యాంకు ఖాతాల్లోని రూ.6.57 లక్షల నగదును ఈడీ అధికారులు శుక్రవారం జప్తు చేశారు. నోట్ల రద్దు సమయంలో పోస్టల్ విభాగం సీనియర్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు హైదరాబాద్ సిటీ డివిజన్‌లో తన పరిధిలోని పోస్టాఫీసులలో కొత్త కరెన్సీ నోట్లను నిబంధనలకు విరుద్ధంగా కమీషన్ల కోసం ఇతరులకు చేరవేశారు. ఇలా మొత్తం రూ.3.75 కోట్ల విలువైన కొత్త కరెన్సీ నోట్లను ఇచ్చేందుకు రూ.87.19 లక్షల కమీషన్ తీసుకున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై హైదరాబాద్ సీబీఐ అధికారులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. సీబీఐ కేసు ఆధారంగా మనీలాండరింగ్ చట్టాల కింద మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు సుధీర్ బాబు బ్యాంకు ఖాతాల్లోని రూ.5.64 లక్షలు, ఇతర నిందితులు సుదర్శన్ బ్యాంకు ఖాతాలోని రూ.29 వేలు, వడ్డి నర్సింహారెడ్డి రూ.64 వేలు జప్తు చేశారు.

టెండర్లలో రిజర్వేషన్లు అమలు చేయాలి

సాక్షి, హైదరాబాద్: అన్ని రకాల ప్రభుత్వ టెండర్లలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని సెక్యూరిటీ అసోసియేషన్ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌కు కాంగ్రెస్ నేత ఇందిరా శోభన్‌తో కలిసి సెక్యూరిటీ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్ జాదవ్, సిరూర్ బాలరాజ్ వినతిపత్రం సమర్పించారు. టెండర్లలో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ యాజమాన్యాలకు జరుగుతున్న ఇబ్బందులను వివరించారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హర్కర వేణుగోపాల్ హామీ ఇచ్చారని శ్రీకాంత్ జాదవ్ తెలిపారు.



చర్మం ఒలిచి.. చెప్పులు కుట్టించి..

తల్లిపై ప్రేమను వినూత్నంగా చాటిన ఓ మాజీ గ్యాంగ్‌స్టర్

మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినికి చెందిన రౌనక్ గుర్జర్ అనే మాజీ గ్యాంగ్‌స్టర్ తన తల్లిపై ఉన్న ప్రేమను అచ్చంగా రామాయణంలో శ్రీరాముడు పేర్కొన్నట్లుగా చాటాడు. ఏకంగా తన చర్మాన్ని ఒలిచి తల్లికి చెప్పులు కుట్టించి కానుకగా ఇచ్చాడు! ఇందుకుగల కారణాన్ని అతను వివరించాడు. గతంలో నేరప్రవృత్తి కారణంగా పోలీసు కాల్పుల బారిన పడ్డ గుర్జర్ ఆ తర్వాత నిత్యం రామాయణ పారాయణంతో పూర్తిగా మారిపోయినట్లు పేర్కొన్నాడు. ముఖ్యంగా శ్రీరాముని పాత్ర నుంచి ఎంతో స్ఫూర్తి పొందానని.. తల్లికి చర్మంతో చెప్పులు కుట్టించినా ఆమె రుణం తీర్చుకొనేందుకు చాలదని శ్రీరాముడు స్వయంగా పేర్కొన్న మాట తనను ఎంతగానో ఆకర్షించిందని గుర్తుచేసుకున్నాడు. అందుకే తాను తల్లికి తన చర్మంతో చెప్పులు కుట్టించాలని నిర్ణయించుకున్నట్లు గుర్జర్ చెప్పుకొచ్చాడు. ఇంట్లో వారికి చెప్పకుండా ఆస్పత్రిలో చేరి తన కాలి తొడ చర్మాన్ని సర్జరీ చేయించి తొలగించుకున్నానని.. ఆ చర్మాన్ని చెప్పులు కుట్టే వ్యక్తికి ఇచ్చి చెప్పులు చేయించానన్నాడు.

గత వారం ఇంటి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో తన తల్లికి ఈ చెప్పులను బహూకరించగా వాటిని చూసి ఆమె కన్నీటిపర్యంతమైందని గుర్జర్ తెలిపాడు. తల్లిదండ్రుల పాదాల చెంతనే స్వర్గం ఉంటుందనే విషయాన్ని సమాజానికి చాటిచెప్పాలనే ఈ పని చేశానన్నాడు. 'తండ్రి స్వర్గానికి నిచ్చెనయితే తల్లి ఆ మార్గాన్ని చేరుకొనే వ్యక్తి' అని గుర్జర్ పేర్కొన్నాడు.

సాక్షి సెంట్రల్ డెస్క్

టీహెచ్‌సీఏఏ ఈసీ మెంబర్‌గా రూపాదేవి ఏకగ్రీవ ఎన్నిక



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ (టీహెచ్‌సీఏఏ) ఎన్నికలలో ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలిగా అల్లంపల్లి రూపాదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వాస్తవానికి ఈనెల 28న అసోసియేషన్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో హైదరాబాద్ జోన్ నుంచి పోటీలో ఎవరూ నిలబడకపోవడంతో రూపాదేవి ఎన్నిక ఏకగ్రీవమైంది. అదేవిధంగా ఈసీ సభ్యులుగా దాస్ (30 ఏళ్ల కేటగిరీ), సమీన (15 ఏళ్ల కేటగిరీ)లో ఎన్నికయ్యారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.